ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ షష్ఠి తె. 4.01 వరకు, అనంతరం సప్తమి; నక్షత్రం: విశాఖ రా. 12.40 వరకు, అనంతరం అనూరాధ; అమృతకాలం: సా. 3.40 నుండి 5.20 వరకు; వర్జ్యం: తె. 4.58 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:325 • బుధవారం 7 మార్చి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

● అటు ఆంధ్రప్రదేశ్ ఎంపీల ఆందోళనలు...



- ఈశాన్య రాష్ట్రాలకు కల్పిస్తున్న రాయితీలు ఏపీకి ఇవ్వలేం
- సెంటిమెంట్ అంశాలను ప్రస్తావించొద్దు
- ఇప్పటికే రూ.12,500 కోట్లు ఇచ్చాం.. ఐనా లెక్క చెప్పలేదు
- జీఎస్టీ రీఫండ్, ఇన్సెంటివ్ అడగవద్దని హితవు
- అదనపు రాయితీలు కుదరదు
- కేంద్ర ఆర్థికశాఖ ప్రకటన

ఏపీకి హోదా లేదు.. ప్యాకేజీనే

10

● ఇటు తెలంగాణ ఎంపీల ధర్నా, నిరసన...



- రిజర్వేషన్ల వ్యవహారంలో కేంద్రం తీరుపై తెరాస నిరసన
- గాంధీ విగ్రహం వద్ద ధర్నా
- పార్లమెంట్ గేటు వద్ద ప్లకార్డులతో ఎంపీల ప్రదర్శన
- 50శాతం మించకూడదని రాజ్యాంగంలో ఎక్కడా లేదు
- నిజామాబాద్ ఎంపీ కవిత
- సచార్ కమిటీ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు

రిజర్వేషన్ల హక్కు రాష్ట్రాలదే



టెర్రర్ త్రిపుర

- లెనిన్ విగ్రహం కూల్చివేత
- పెట్రేగిన హింస
- 144 సెక్షన్ విధింపు
- రంగంలోకి కేంద్రం
- బీజేపీ, వామపక్షాలు పరస్పర నిందలు

11

త్రిపుర సీఎంగా విప్లవ్ దేవ్

9న ప్రమాణ స్వీకారం

11



మేఘాలయ సీఎంగా కాన్రాడ్ ప్రమాణం

పీఏ సంగ్మా కుటుంబం కల నిజమైంది

11

రాష్ట్ర బడ్జెట్ లక్షా 80 వేల కోట్లు!



(ఫైల్)

- పెరిగిన వ్యయాలు
- ప్రగతి పద్దు రూ.90 వేల కోట్లు
- వ్యయాల్లోనూ పెంపు
- వ్యవసాయానికి పెద్దపీట
- సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యత
- సొంత వనరులే కీలకం
- బడ్జెట్‌కు తుదిరూపం
- సీఎం ఆమోదం కోసం వేచిచూస్తున్న ఆర్థికశాఖ

గ్రామీణ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్ ఉండబోతోంది. నీటిపారుదల రంగంతో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించనున్నారు. పెట్టుబడి పథకానికి ప్రత్యేక పద్దు కింద నిధులు కేటాయించనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. రానున్న ఎన్నికల సంవత్సరం నేపథ్యంలో పూర్తిస్థాయి బడ్జెట్ చివరి కావడం అన్నివర్గాలను ఆకట్టుకునే విధంగా, జనరంజకంగా బడ్జెట్ రూపుదిద్దుకుంటున్నట్లు సమాచారం.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల బడ్జెట్‌లో సొంత వనరుల రాబడిపై భారీ ఆశలు పెట్టుకోనుంది. 2018-19 వార్షిక ఏడాది బడ్జెట్‌లో సొంత వనరుల రాబడి లక్ష్యాన్ని 19నుంచి 20 శాతం మేర పెంచుకోనున్నారు. ఈ వార్షిక ఏడాది బడ్జెట్ దాదాపు రూ.1.80 లక్షల కోట్లకు సమీపించనున్నట్లు తెలిసింది. రాబడులు భారీగా పురోగమిస్తున్న నేపథ్యంలో వీటిపై అత్యంత భారీ అంచనాలను నిర్ధేశించుకునే అవకాశం ఉంది. పెరుగుతున్న పెట్రో, డీజిల్ ధరలతో ఖజానాకు భారీగా పన్ను రాబడి సమకూరుతోంది. దేశంలో అత్యధికంగా పన్ను రేటును తెలంగాణ రాష్ట్రం పెట్రో, మద్యం ఉత్పత్తులపై వసూలు చేస్తోంది. దీంతో ధర పెరిగిన ప్రతీసారి ఆ మేరకు ఆదాయమూ పెరుగుతోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రాబడి కూడా పుంజుకుంది. ఆశించిన లక్ష్యం కంటే దాదాపు రూ. 1000 కోట్లు అదనంగా ఈ శాఖ ఆర్జించింది. ఈనెలాఖరునాటికి మరో రూ.500 కోట్లకుపైగా రాబడి వచ్చేపరిస్థితి కనిపిస్తోంది. వ్యయాలను కూ డా అదే తీరులో పెరగనున్నాయి. రాబడికి ధీటుగా ఖర్చులు కూడా పెరగడంతో పద్దుల వారీగా పథకాలు, ప్రాజెక్టులకు కేటాయింపులు అనివార్యంగా మారాయి. ప్రధానంగా సాగునీటి పారుదల శాఖకు రూ. 25వేల కోట్లు, పెట్టుబడి మద్దతు పథకానికి రూ. 12 వేల కోట్లు, బీసి ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ. 20వేల కోట్లు, మిషన్ భగీరథకు కూడా భారీగా నిధులను కేటాయించాల్సి వస్తోంది. 2018-19 బడ్జెట్‌లో సంక్షేమ, అభివృద్ధి రంగాలకు నిధుల వ్యయం ఎక్కువ కానుంది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రెండు పడక గదుల ఇండ్లు, పించన్లు, రూ. 1,16,000లకు పెరగనున్న షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి సాయం, హాస్టళ్లకు సన్న బియ్యం, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, రుణాల రీ పేమెంట్, వడ్డీలకు భారీగా నిధుల అవసరం నెలకొననుంది.

2018-19 వార్షిక బడ్జెట్ రూ. 1.80 లక్షల కోట్లలో ప్రగతి పద్దు రూ. 88,038 కోట్లనుంచి మరో 10శాతం అదనంగా పెంచుకునేలా ప్రతిపాదనలు సిద్దమయ్యాయి. ఈ ఏడాదిలో నిర్వహణా వ్యయం రూ. 61,607కోట్లనుంచి రూ.75వేలకుపైగా ప్రతిపాదించనున్నారు. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో రెవెన్యూ మిగులు రూ. 4571కోట్లను అంచనా వేసుకున్నారు. అయితే సవరించిన అంచనాలతో వచ్చే నెలలో ఇది ఎంత మొత్తం సాధ్యమైందనే అంశం వెలుగులోకి రానుంది. రూ. 1,49,646 కోట్ల బడ్జెట్‌లో సొంత వనరుల రాబడిని రూ. 69,220కోట్లనుంచి రూ.80వేల కోట్లకుపైగా అంచనాలను నిర్ధేశించే అవకాశం కనిపిస్తున్నది. ప్రధాన రాబడి శాఖలనుంచి 3వ పేజీలో...

అసెంబ్లీ సమావేశాల తర్వాత

ఢిల్లీకి కేసీఆర్

- ప్రత్యామ్నాయ కూటమిపై కీలక వ్యూహరచన
- భేటీలకు నిర్ణయం.. కేటీఆర్‌కు రాష్ట్ర బాధ్యతలు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కెసిఆర్ కేంద్ర రాజకీయాలపై సీరియస్‌గా దృష్టిసారించారు. ఇప్పటికే పలు రాష్ట్రాలకు చెందిన నేతలు కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతించగా.. ఢిల్లీలో వివిధ పార్టీల నేతలు, వివిధ వర్గాల నిపుణులు, ప్రముఖులతో భారీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెలలోనే సిఎం ఢిల్లీ పర్యటన ఉంటుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక వారం, పదిరోజులు కెసిఆర్ ఢిల్లీకేంద్రంగానే వ్యూహ రచన, కీలక భేటీలు నిర్వహిస్తారని సమాచారం. పార్లమెంట్‌లో 3వ పేజీలో...



జీనోమ్ వ్యాలీలో ఫార్మా ఇంక్యుబేటర్

- ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బాడీ ఏర్పాటు
- స్టార్టప్స్, రీసెర్చ్‌కి ఫండ్
- మంత్రి కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: లైఫ్ సైన్సెస్ రంగంలోని పరిశోధనలకు ఊతమిచ్చేందుకు టి-హబ్ లాంటి ఇంక్యుబేటర్‌ను జినోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తామని ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ రంగంలో విజన్-2030 పేరుతో 3వ పేజీలో...



మహిళా సిబ్బందితో మాట్లాడుతున్న రైల్వే జీఎం వినోద్‌కుమార్

తొలి మహిళా రైల్వేస్టేషన్

చంద్రగిరి

- అక్కడ అందరూ పనిచేసే వారు నారీమణులే
- రాష్ట్రంలో ఇదే ప్రథమం
- ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్

2



సైనిక శక్తిలో భారత్ @ 4

మూడవ స్థానంలో చైనా

గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ నివేదిక

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచంలోని సైనికపరంగా శక్తివంతమైన తొలి ఐదు దేశాల జాబితాలో భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. 2017 గ్లోబల్ ర్యాంకింగ్స్ ప్రకారం నాలుగో స్థానంలో నిల్చింది. 133 సైనిక సామర్థ్యంగల దేశాల బలాబలాలపై గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ ప్రతి ఏటా అధ్యయనం నిర్వహిస్తుంది. 2017కి సంబంధించి అధ్యయన నివేదికను ఈ సంస్థ విడుదల చేసింది. ఆయా దేశాల సైనిక బలగాల్లో శిక్షణ పొందిన అధికారులు, సాధారణ సైనికులు మొదలుకొని శక్తివంతమైన అధునాతన ఆయుధ సంపత్తి సామర్థ్యానికి అనుగుణంగా ఈ సంస్థ ర్యాంకింగ్‌లు ప్రకటిస్తుంది. యధావిధిగా ఈ ఏడాది కూడా యునైటెడ్ నేషన్స్ తొలిస్థానంలో ఉంటే రష్యా రెండో స్థానం పొందింది. చైనా మూడో స్థానంలో నిల్చింది. భారత్ నాలుగో స్థానాన్ని ఆక్రమించింది. ఆ తర్వాత ఫ్రాన్స్ ఐదో స్థానంలో ఉంది. ఇవికాక వరుసగా యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్, టర్కీ, జర్మనీ, ఈజిప్టులు ఆరు నుంచి పదో స్థానం వరకు పొందాయి. జమ్మూకాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో భారత్‌తో సరిహద్దు తగాదాలు గల చైనాకు 22.60 లక్షల మంది సైనికులుంటే భారత్‌కు 13,62,500 మంది సైనికులు కాపలాగా ఉన్నారు. రిజర్వుడ్ దళాలతో కలిపితే చైనా కంటే భారత్‌లోనే అధికసంఖ్యలో దళాలున్నాయి. చైనా మొత్తం బలగాలు 37,12,500కాగా భారత బలగాలు 42,07,250 మంది. ఆ తర్వాత మూడో స్థానంలో 23,63,675 మందితో అమెరికా నిల్చింది. ఈ జాబితాలో పాకిస్థాన్ 13వ స్థానాన్ని పొందింది. తొలి 15 శక్తివంతమైన దేశాల జాబితాలో పాక్ స్థానం పొందడం ఇదే తొలిసారి. భారత ఎయిర్‌ఫోర్స్‌కు 2,102 యుద్ధ విమానాలు ఉన్నాయి. 606 సైనిక హెలీకాప్టర్లు ఉన్నాయి. భారత రక్షణ దళానికి 4,426 యుద్ధ ట్యాంక్‌లు ఉన్నాయి. 6,704 అధునాతన యుద్ధవాహనాలు ఉన్నాయి. 7,414 ఆధునిక యుద్ధ సామగ్రితో కూడిన వాహనాలు ఉన్నాయి. నావికాదళానికి 295భారీ నౌకలు ఉన్నాయి. 15 సబ్‌మెరైన్‌లు, మూడు యుద్ధవిమాన వాహక నౌకలు ఉన్నాయి. పాకిస్థాన్‌కు మొత్తం 2,924 సాధారణ ట్యాంక్‌లు, 2,828 ఆయుధాలతో కూడిన యుద్ధ ట్యాంక్‌లు, 426 అత్యాధునిక యుద్ధసామగ్రి గల వాహనాలు ఉన్నాయి. చైనాకైతే 6,457యుద్ధ ట్యాంక్‌లు ఉండగా, 4,788 యుద్ధ సామగ్రితో కూడిన వాహనాలు ఉన్నాయి. 1710 స్వయం నియంత్రిత ఆయుధ వాహనాలు చైనా సొంతం. భారత్ వద్ద మూడు విమాన వాహక నౌకలు ఉంటే చైనా వద్ద మాత్రం ఇలాంటిది ఒకటే ఉంది. భారత్ వద్ద 15 విధ్వంసక నౌకలున్నాయి. చైనా వద్ద ఇలాంటివి 35ఉన్నాయి. భారత్‌కు 15 సబ్‌మెరైన్‌లుంటే చైనాకు 65ఉన్నాయి. ఈ ఏడాది భారత రక్షణ రంగానికి 51బిలియన్ డాలర్ల బడ్జెట్‌ను ప్రతిపాదిస్తే చైనా ఏకంగా 161.7 బిలియన్ డాలర్లను రక్షణ రంగానికి కేటాయించింది. పాకిస్థాన్ మాత్రం కేవలం 7బిలియన్ డాలర్లతోనే సరిపెట్టుకుంది. ఇంతవరకు పాకిస్థాన్‌కు 3వ పేజీలో...



పంట ఉత్పత్తిని బట్టి ఆయా ప్రాంతాల్లో

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

- మద్దతు ధర వచ్చేలా చర్యలు
- కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయం
- 15న మరోసారి సమావేశం

2



పండుగలా మహిళా దినోత్సవం

- రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు
- వివిధ రంగాల్లో విశేష కృషిచేసిన మహిళలకు సన్మానాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రపంచ మహిళా దినోత్సవాన్ని రాష్ట్రమంతటా భారీ స్థాయిలో నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయిం చింది. రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గం స్థాయిలో సభలు సమావేశాలు, మహిళా దినోత్సవ ఉత్సవాలను నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించింది. మార్చి 8న మహిళలకు సెలవు ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన 20 మంది మహిళలను అవార్డులు ప్రధానం చేయడానికి ఎంపిక చేసింది. జిల్లా, నియోజకవర్గం స్థాయిలో కూడా సన్మానాలు, అవార్డుల ప్రధానం కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. మహిళా శిశు సంక్షేమం, సాధికారత, ఆర్థిక, సామాజిక రంగాల్లో మహిళలకు ఇస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా ప్రచారం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా దినోత్స వాలను ఘనంగా జరప డానికి ప్రత్యేకంగా ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీలో ప్రభుత్వ సలహాదారు కె.వి. రమణాచారి, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, మామిడి హరికృష్ణ, సువర్చల, సురభివాణి, రేవతి, అఖిలేశ్వరి, సూర్య ధనుంజయ తదితరులు సభ్యులుగా ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం తీసుకుంటున్న చర్యలు, శిశు సంరక్షణ చర్యలు తదితర అంశాలను ఈ సందర్భంగా ప్రచారం చేయడానికి నిర్ధిష్ట కార్యాచరణ అమలు జరపాలని సంక ల్పించారు. హైదరాబాద్‌లోని లలితకళా తోరణంలో రాష్ట్ర స్థాయి ఉత్సవాలను భారీగా నిర్వహించ బోతున్నారు. జిల్లా, నియోజక వర్గాల స్థాయిలో మహిళా దినోత్స వాలను ఘనంగా జరపడానికి అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. అన్ని చోట్ల మహాళా దినోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్ర మాలను ఉదయం ప్రారంభించి సాయంత్రం 5 నుండి 8 గంటల లోపు ముగించే విధంగా కార్యక్రమాలు రూపొందించారు. ఉత్సవాలకు వచ్చే మహిళలకు అవసరమైన సౌకర్యాలు, ఏర్పాట్లు చేయాలని జిల్లాల అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు జరిపి కేంద్రం నుండి ప్రశంసలు అందుకున్న హైదరాబాద్ జిల్లా అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. మహిళా సాధికారత కోసం నిరంతరం పాటు పడుతున్న వారిని గుర్తించి గౌరించడం జరుగుతుందని ప్రభుత్వం పేర్కొంది. బిడ్డ పుట్టింది మొదలు కొని ఉన్నత విద్యలను అభ్యసించి, ఆర్థికంగా స్థిర పడేంత వరకు ప్రభుత్వం అన్నిస్థాయిల్లో ఆర్థిక తోడ్పాటు, ప్రోత్సాహకాలు ఇస్తుంది. బిడ్డపుట్టడానే కేటిఆర్ కిట్ అందచేస్తుంది. కొద్దిగా ఎదగగానే అంగన్‌వాడీల ద్వారా పౌష్టకాహారం అందచేస్తుంది. బడీడు రాగానే గురుకులాల్లో ప్రవేశం కల్పిస్తుంది. ఉన్నత విద్యను అభ్యసించేంత వరకు, పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు, ఉద్యోగావకాశాలను అంది పుచ్చుకొనేందుకు తోడ్పాటు ఇస్తుంది. వివాహ సమయంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అంద చేస్తుంది. అదే విధంగా మహిళలకు కూడా అనేక ఆర్థిక తోడ్పాటు పథకాలను అమలు జరుపుతుంది.

మహిళలకు తెలంగాణలో పూర్తి భద్రత కల్పించే విధంగా పోలీసు వ్యవస్థలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసింది. రాజకీయంగా ఎదిగేందుకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు జరుపుతుంది. ఇప్పటికే ప్రభుత్వం ఆశించిన దానికి మించిన చైతన్యం మహిళల్లో చూస్తున్నామని, అవకాశాలను అంది పుచ్చుకో వడంలో మహిళలు ముందంజలో అధికారులు తెలియచేశారు. తమ శాఖ కార్యకలాపాలు వార్డు స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు విస్తరిం చాయన్నారు.



ఈ యేటి మహిళామణులు

కవితా దరియాని	(విద్య),
అరుణారెడ్డి	(క్రీడలు),
సత్యలక్ష్మి	(వైద్యం),
చక్రవర్తులలక్ష్మినరసమ్మ	(సాహిత్యం),
మంజులా శ్రీనివాస్	(నృత్యం),
నిత్య సంతోషి	(సంగీతం),
కవితా దేవుస్కర్	(పెయింటింగ్),
నందినిరెడ్డి	(సినిమా),
జాన్సీ	(జానపదం),
డి. రాజ్యలక్ష్మి	(పారిశ్రామిక వేత్త),
లతా జైన్	(జర్నలిజం),
బోగ్గం జయమ్మ	(వ్యవసాయం)
నాగపురి సౌమ్య	(జర్నలిజం)
ఎడునూరి పద్మ	(ఉద్యమగానం)
సుప్రియ	(మెట్రో డ్రైవర్)
సరిత	(ఆర్టీసీ డ్రైవర్)
యాప భద్రమ్మ	(మహిళా సాధికారత)
శైలజ	(కొత్తపల్లి సర్పంచ్)
గండ్ర రమాదేవి	(సామాజికసేవ)



తొలి మహిళా రైల్వేస్టేషన్ చంద్రగిరి

అక్కడ పనిచేసేవారందరూ మహిళలే..రాష్ట్రంలో ఇదే ప్రథమం

- దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్

తిరుపతి ప్రభన్యూస్ బ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందరూ మహిళా సిబ్బంది మాత్రమే పనిచేసే రైల్వే స్టేషన్‌గా ఇక్కడకు సమీపంలోని చంద్రగిరి రైల్వే స్టేషన్ మంగళవారం రూపాంతరం చెందింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని మహిళా రైల్వే స్టేషన్‌గా రూపాంతరం చెందిన చంద్రగిరి స్టేషన్‌ను దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం జైపూర్ సమీపంలోని గాంధీనగర్, ముంబయి సమీపంలోని మాతుంగ రైల్వే స్టేషన్లు మాత్రమే మహిళా రైల్వే స్టేషన్లుగా పనిచేస్తున్నా యన్నారు. ఈ నెల 8న రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని తమ జోన్ పరిధిలో అటు తెలంగాణ పరిధిలో భేగంపేట రైల్వేస్టేషన్‌ను, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రగిరి స్టేషన్‌ను మహిళా రైల్వే స్టేషన్లుగా మార్చినట్లు తెలిపారు. స్టేషన్ మాస్టర్ నుంచి పాయింట్స్ ఉమెన్, సెక్యూరిటీ, క్లీనింగ్ స్టాఫ్ వరకు మొత్తం 12 మంది మహిళలు పనిచేస్తారని తెలిపారు. ప్రయాణికుల ఒత్తిడి తీవ్రత తక్కువగా ఉండటం, తిరుపతికి సమీపంలో ఉండటం అనే అంశాల ప్రాతిపదికన చంద్రగిరి రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేసినట్లు వినోద్‌కుమార్ యాదవ్ వెల్లడించారు. అనంతరం బాధ్యతలను స్వీకరించిన చంద్రగిరి రైల్వేస్టేషన్ మహిళా సిబ్బందికి అభినందనలు తెలిపారు. స్టేషన్‌కు రాకపోకలు సాగించడానికి ఉన్న సమస్యల గురించి సిబ్బందికి చెప్పగా, త్వరలో అవసరమైన రవాణా సౌకర్యాలను కల్పిస్తామని వినోద్‌కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. రోజుకు సగటున 260 మంది ప్రయాణికులు రైలు సర్వీసులను వినియోగించుకునే చంద్రగిరి రైల్వే స్టేషన్ ఆదాయం రోజుకు రూ. 5 వేల దాకా ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ విపి సింగ్, సీనియర్ డిప్యూటి కమర్షియల్ మేనేజర్ రాకేష్, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణలు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని తిరుపతి రైల్వే స్టేషన్‌లో మహిళా ప్రయాణికుల సౌకర్యం కోసం మంగళవారం శానిటరీ నేప్ కిన్ వ్యవస్థ ప్రారంభమైంది. స్టేషన్ ఆవరణలోని మహిళల వెయిటింగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన ఆ వ్యవస్థలో భాగంగా నేప్ కిన్ అవసరమైన మహిళలు సంబంధిత యంత్రాంగానికి ఉన్న కాయిన్ బాక్స్‌లో రూ. 5 లు వేసి ఒక నేప్ కిన్ పొందవచ్చును. ఆ వ్యవస్థను ఏర్పాటు చేసిన స్థానిక రమాదేవి వైద్యశాల ప్రతినిధులు ప్రారంభించారు.

సీఎం భద్రత కట్టుదిట్టం

- అత్యంత ఖరీదైన బుల్లెట్ ప్రూఫ్ బస్సు
- మంత్రులతో పాటు కేబినెట్ ర్యాంకులో ఉన్నవారందరికీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇటీవల జరిగిన చర్ల ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం తీర్చుకుంటామని మావోయిస్టు హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇంటలిజెన్స్ వర్గాల నివేదిక మేరకు సాధారణ పరిపాలన శాఖ తగిన చర్యలు ప్రారంభించింది. ప్రొటోకాల్, సెక్యూరిటీ విభాగాల అధికారులు సంయుక్త భాగస్వామ్యంతో పటిష్టమైన భద్రతా చర్యలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు కట్టుదిట్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా సీఎం కేసీఆర్ పర్యటనల నిమిత్తం ప్రస్తుతం వినియోగిస్తున్న బస్సుకు తోడుగా అత్యాధునిక సౌకర్యాలు, పటిష్టమైన భద్రతతో కూడిన మరో బస్సును ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నారు. ఛండీగర్‌కు చెందిన జేసీపీఎల్ ఆటోముబైల్ సంస్థకు ఆ బాధ్యతలను



అప్పగించారు. పోలీసు భద్రతా ప్రమాణాల మేరకు పూర్తిగా బుల్లెట్ ప్రూఫ్ బాడీ బిల్డింగ్‌తో ఈ ప్రత్యేకమైన బస్సు గరిష్టంగా నెల రోజుల్లోనే అందుబాటులోకి రానుంది. ఇప్పటికే పదకొండు వాహనాల శ్రేణితో సీఎం పర్యటన కొనసాగుతుండగా, అందులో మరో ఖరీదైన వాహనం జత కానుంది. ప్రస్తుతం యకేసీఆర్ వాడుతున్న బుల్లెట్ ప్రూఫ్ బస్సు ఖరీదు రెండేళ్ళ క్రితం రూ.4కోట్లు. ప్రస్తుతం కొనుగోలు చేసే కొత్త బస్సు ఖరీదు ఏడున్నర కోట్ల రూపాయలుగా చెబుతున్నారు. ఇక నుంచి సీఎం ఎక్కడికి వెళ్ళాలన్నా తన వాహనశ్రేణిలో రెండు ఖరీదైన బస్సులు ఉండాల్సిందేనని హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. అలాగే మంత్రులతో పాటు కేబినెట్ ర్యాంకులో ఉన్న వారందరికీ బుల్లెట్ ప్రూఫ్ కార్లను త్వరలోనే ఇవ్వనున్నారు.

వ్యవసాయ పంచాంగం సిద్ధం

త్వరలోనే ఆవిష్కరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు అనుసరించాల్సిన విధానాలపై రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ పంచాంగాన్ని సిద్ధం చేసింది. ఏ సమయంలో దుక్కి దున్నాలి, ఏ కార్తెలో భూమిలో విత్తులు వేయాలి అనే అంశాలపై తెలుగు క్యాలెండర్ ప్రకారం కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. జ్యోతిష్కులు చెప్పిన విధంగానే 27 నక్షత్రాలు, 27 కార్తెల ఆధారంగా వ్యవసాయ పంచాంగాన్ని రైతులందరికీ అర్థమయ్యేలా తయారు చేశారు. త్వరలోనే వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈ పంచాంగాన్ని ఆవిష్కరించనున్నారు.

వైద్యవిద్యలో 27 పీజీసీట్లకు ఎంసీఐ అనుమతి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సీఎం కేసీఆర్ చొరవతో తెలంగాణ ప్రభుత్వం ఆస్పత్రుల్లో పెంచిన సదుపాయాలు, ఆధునీకికరణ కారణంగా వైద్య విద్యలో మరో 27 పీజీ సీట్లకు అనుమతినిస్తూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) ఉత్తర్వులు వెలువరిం చింది. గతంలో సీట్ల పెంపునకు అనుమతి కోరుతూ ప్రభుత్వం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లేఖ రాసింది. దీంతో ఈ సీట్లకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీట్లకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

గాంధీలో అనస్తీషియా విభాగంలో	2 సీట్లు
ఛాతీ విభాగానికి మరో	సీటు
కాకతీయ మెడికల్ కాలేజీలో చర్మ వ్యాధికి	1 సీటు
స్త్రీ చికిత్సా విభాగంలో	5 సీట్లు
రేడియాలజీ విభాగంలో	3 సీట్లు
ఈఎన్‌టీలో	1 సీటు
కంటి విభాగంలో	1
నిమ్స్ మత్తు విభాగంలో	6 సీట్లు
ఉస్మానియా స్త్రీ వ్యాధుల విభాగంలో	4 సీట్లు

ఈఎన్‌టీలో 3 సీట్లకు అనుమతులు లభించాయి.



పంట ఉత్పత్తిని బట్టి ఆయా ప్రాంతాల్లో

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

- మద్దతు ధరలను మించి రైతు లాభపడేలా కార్యాచరణ
- 15న మరోసారి భేటీ, కీలక నిర్ణయాలు ప్రకటన
- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరల హెచ్చుతగ్గులను దృష్టిలో పెట్టుకుని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ప్రతి ఏటా పండించిన పంట గిట్టుబాటు కాక తీవ్రమైన నష్టాల్లో కూరుకుపోతున్న రైతులను ఆదుకునేందుకు ప్రత్యా మ్నాయ మార్గాలను వెతకాలని సీఎం కేసీఆర్ మంత్రివర్గ ఉపసంఘాన్ని ఆదేశించారు. ఈ మేరకు గత ఆరు నెలల కాలంగా ప్రాంతాల వారీగా పండించే పంటలు, రైతుల ఆసక్తి తదితర అంశాలపై అధ్యయనం చేసిన ఉప సంఘం మంగళవారం సచివాలయంలో మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సమావేశమైంది. ఏ ప్రాంతంలో ఏ పంటను ఎక్కువగా పండిస్తారో, అందుకు సంబంధించిన ఆహార ఉత్ప త్తులను తయారు చేసే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించారు.

సమావేశం అనంతరం మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేయడమే కాకుండా రైతు పండించిన పంటకు లాభసాటి ధర అందించడానికి గతంలో మాదిరిగా మాటలతో కాకుండా చేతలతో చేసి చూపాలన్న ఆకాంక్షతో తమ ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోందన్నారు. ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు విధి విధానాలు రూపొందిస్తున్నామని, త్వరలోనే నివేదికను ముఖ్యమంత్రికి సమ ర్పిస్తామని తెలిపారు. ప్రాంతాలకు అనుగుణంగా పండే పంటల విస్తీర్ణం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిశ్రమలు, కొత్తగా అవసరమయ్యే పరిశ్రమలపై లోతుగా చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నా మన్నారు.



వ్యవసాయంతో పాటు అనుబంధంగా ఉన్న అన్ని శాఖల ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలతో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి సమావేశమై సలహాలు, సూచనలు అందిస్తారని, ప్రభుత్వం ద్వారా ఇచ్చే ప్రోత్సాహకాల గురించి వివరిస్తారని మంత్రి పోచారం వెల్లడించారు. జిల్లాల వారీగా పంటల ఉత్పత్తులపై సమాచారం సేకరించి తదనంతర నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సీఎం కేసీఆర్ ఉద్దేశాన్ని, లక్ష్యాన్ని ప్రజలకు వివరించడంతో పాటు ప్రతి రైతు లాభసాటి ధర పొందేలా చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. ఇష్టా రాజ్యంగా, అవగాహనారాహిత్యంతో పంటలను సాగు చేయకుండా శాస్త్రవేత్తల ద్వారా వారికి అవగాహన కల్పిస్తామన్నారు.

రానున్న రోజుల్లో ఏ ఒక్క రైతు మొఖంలోనూ దుఃఖం కనిపించకుండా చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందుకోసం దశల వారీగా వ్యవసాయ రంగ పురోగతికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే 24 గంటల వ్యవసాయ విద్యుత్ అందిస్తున్నామని, త్వరలోనే రెండు పంటలకు ఎకరాకు రూ.8వేల చొప్పున పెట్టుబడి రాయితీ ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. వచ్చే రెండేళ్ళలో కోటి ఎకరాలకు సాగునీరు అందించి దేశంలోనే తెలంగాణకు ఒక ప్రత్యేక స్థానం ఉండేలా చేస్తామన్నారు.

ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు శుద్ధిచేసి, ఆహార పదార్థాలుగా తయారు చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేసే చర్యలు చేపడతామన్నారు. ఈనెల 15న మరోసారి సమావేశమై విధి విధానాలు ఖరారు చేస్తామని మంత్రి పోచారం తెలిపారు. ఇప్పటి వరకు దేశంలో వ్యవసాయ రంగం, రైతుల గురించి ఇంతగా పట్టించుకున్న నాయకుడు ఎక్కడా లేడని స్పష్టంచేశారు. ఎప్పటికప్పుడు రైతుల సాధక బాధకాలు తెలుసుకుంటూ రైతు శక్తిని, వారి ఆత్మ గౌరవాన్ని పెంచి ముందుకు నడిపించడమే లక్ష్యంగా వ్యవసాయశాఖ నిర్దిష్టమైన ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. భవిష్యత్తులో ఈ రంగం మరింత అభివృద్ధి చెంది ప్రతి రైతు కుటుంబం ఆర్థికంగా స్థిరపడేలా చేస్తామన్నారు. ఈ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు హరీష్‌రావు, కేటీ రామారావు, ఇటల రాజేందర్, జూపల్లి కృష్ణారావుతో పాటు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి, కమిషనర్ జగన్మోహన్, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్‌రాంరెడ్డి, టిఎస్-ఐఐసి ఎండి వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకే సర్వాధికారాలు!

- కనుసన్నల్లో గ్రామస్థాయి సిబ్బంది
- తెలంగాణ మహిళకు మరింత సాధికారత
- పంచాయతీల్లో 50 శాతం రిజర్వేషన్లు
- పదేళ్లకోసారి రొటేషన్ పద్ధతి
- పంచాయతీరాజ్ బిల్లు సిద్ధం
- ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టబద్ధత



హైదరాబాద్, ప్రభన్యూస్: పంచాయతీరాజ్ గ్రామీణ వ్యవస్థలను సమూలంగా ప్రక్షాళన చేసిన టీఆర్ఎస్ సర్కారు వాటికి నూతన హంగులు అద్దుతొంది. పంచాయతీరాజ్ చట్టానికి కీలక సరవరణలు తీసుకోస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సర్పంచులకే సర్వాధికారాలు కట్టబెట్టేలా చర్యలు చేపడుతోంది. గ్రామ పంచాయతీలలో పాలన మొత్తం సర్పంచు కేంద్రంగానే జరగనుంది. స్థానిక స్వపరిపాలనను కొత్త పుంతలు తొక్కించి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలపాలన్న లక్ష్యంతో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ పంచాయతీరాజ్ నూతన చట్టం ముసాయిదా ప్రతిపాదనలను తనే స్వయంగా పర్యవేక్షిసున్నారు. ప్రభుత్వం కూడా ఉన్నత స్థాయిలో ఆమేరకు నూతన పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ముఖ్యమత్రి కేసీఆర్ ఆశలు , ఆశయాలకు అనుగుణంగానే నూనత పంచాయతీ రాజ్ చట్టం తుదిమెరుగులు దిద్దుకుంటున్నట్టు తెలుస్తోంది. నూనత చట్టంలో ప్రతిపాదించిన అంశాల మేరకు గ్రామ పంచాయతీలా ఇకపై సర్పంచే సుప్రీంగా మారనున్నారు. పంచాయతీ పరిధిలో నిర్ణయాలన్నీ ఇక ఆయన చేతుల్లోనే ఉండనున్నాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్వహిస్తున్న కార్యనిర్వాహణ అధికారాలన్నీ సర్పంచులకే బదిలీ చేయాలని ప్రభుత్వం నూతన పంచాయరాజ్ చట్టంలో ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. గ్రామ స్థాయిలో పనిచేసే ప్రభుత్వ సిబ్బంది మొత్తం సర్పంచు కనుసన్నల్లోనే పనిచాయాల్సి వస్తుంది. పంచాయతీరాజ్ బిల్లు రూపకల్పన కోసం ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం కూడా సర్పంచుకు సర్వాధికారాలు కట్టబెడుతూ సిఫార్సులు చేసినట్టు సమాచారం. ఇకపై చెక్‌పవర్‌ను సర్పంచులకే అప్పగించాలని నిర్ణయించింది. గ్రామాభివృద్ధికి నిధులను ఖర్చు చేసే అంశంలో కీలకమైన చెక్ పవర్ ప్రస్తుతం సర్పంచ్‌కు పంచాయతీ కార్యదర్శికి కలిపి ఉమ్మడిగా ఉంది. ఇపుడు ప్రభుత్వం సర్పంచులకే పూర్తిగా చెక్ పవర్ అప్పగించాలని నిర్ణయించింది. అంతేకాకుండా సర్పంచులు తమకు కేటాఇయంచిన విధులు సరిగా నిర్వర్తించకపోయినా, నిధుల దుర్వినియోగానికి పాల్పడినా సర్పంచుపై వేటువేసేలా బిల్లులో పొందుపరిచినట్టు తెలిస్తోంది. ఇక గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ కాలపరిమితిని కూడా పెంచాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రొటేషన్ పద్ధతిలో ప్రతి ఐదేళ్లకొకసారి రిజర్వేషన్ మారుతోంది. దీన్ని పదేళ్లకు పెంచేలా నిబంధనలు రూపొందించినట్టు సమాచారం. గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం మహిళలకు 33శాతం రిజర్వేషన్ విధానం అమల్లో ఉంది. తెలంగాణ మహిళాలోకానికి పంచాయతీరాజ్ పరిపాలనా వ్యవస్థలో మరింత సాధికారతను కల్పించేరాజకీయంగా వారు కూడా మరింత ఎదిగేందుకు అవకాశం కల్పిస్తూ మహిశా రిజర్వేషన్లను 50శాతానికి పెంచాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. రాష్ట్ర శాసనసభ సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా విడుదలైంది. ఈ నెల 12నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తుదిమెరుగులు దిద్దుకున్న పంచాయతీరాజ్ ముసాయిదా బిల్లును ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

మాది మానవీయ ప్రభుత్వం

కోదాడలో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్



కోదాడ, ప్రభన్యూస్ : ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను మూడున్నర సంవత్సరాల్లో అమలు చేయడమేకాక, ప్రజల అవసరాల దృష్ట్యా ఎన్నో పథకాలు ప్రవేశపెడుతూ వారిని ఆదుకుంటున్న మానవీయ ప్రభుత్వం మాది అని ఐటీ పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా, కోదాడలో సుమారు 1120 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు శంకుస్థాపన చేసిన మంత్రి, అనంతరం జరిగిన ప్రగతి సభలో భారీగా పాల్గొన్న ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఏ నిర్ణయం తీసుకున్న, ఏ పథకం ప్రవేశపెట్టిన అది పూర్తిగా అమలు జరిగి, ప్రజలకు చేరువయ్యేదాక పట్టువదలని దీరోధాత్తుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని ప్రశంసించారు. రాష్ట్రంలో రైతుల అభివృద్ధి కోసం కేసీఆర్ చేస్తున్న కృషిని యావత్‌దేశం ప్రశంసిస్తుందని, అలాంటి నాయకుడు కావాలని దేశం ఎదురుచూస్తుందని అన్నారు. ముదిగొండలో జరిగిన భూ పోరాటంతో రైతులను కాల్చిచంపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వంలో ఉన్ననాళ్లు ప్రజల కొంపలు ముంచి దోచుకున్న కాంగ్రెస్ నాయకులు బస్సుయాత్రతో బయలుదేరారని, వారి యాత్ర వంద ఎలకలు తిన్న పిల్లి, తీర్థయాత్రాలకు వెళ్లినట్లుగా ఉందని విమర్శించారు. 50 ఏళ్లు పాలనలో ఉండి ప్రజలకు మేలు చేయకుండా గుడ్డి గుర్రాలకు పండ్లు తోవ్వినవాళ్లుగా, మూడున్నర ఏళ్లలో ఏమీ చేశారని మమ్ములను ప్రశ్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఉత్తమ్, జానా లు జిల్లా గురించి పట్టించుకోలేదన్నారు. ఇన్‌ఛార్జి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన మండలి వైస్ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్యేలు గొంగడి సునిత, వీరేశం, భాస్కర్‌రావు, గాదరి కిషోర్, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి, పూల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సైనిక శక్తిలో భారత్ @4



(మొదటిపేజీ తరువాయి)

ఒక్కటి కూడా విమానవాహక నౌకలేదు. 10 అత్యాధునిక యుద్ధనౌకలు ఉండగా 8 సబ్‌మెరైన్‌లు ఆ దేశానికి ఉన్నాయి. ఈ సంస్థ అణ్వాయుధాల అంచనాల జోలికి మాత్రం పోలేదు. ఆయుధ సంపత్తిలో భారత్‌కంటే ముందున్న చైనా ఈ ఏడాది రక్షణ రంగానికి బడ్జెట్‌ను గత ఏడాదికంటే 8.1శాతం పెంచేసింది. అమెరికా తర్వాత చైనాయే రక్షణకు అత్యంత వ్యయం చేస్తోంది. ఈ విషయంలో రష్యా కూడా వెనుకబడి ఉంది. భారత్‌కు యుద్ధ విమాన వాహక నౌకలు ఉండడంతో ఈ ఏడాది చైనా ఇలాంటి రెండు నౌకల్ని సొంతంగా తయారు చేసుకుంటోంది. జె-20రకం యుద్ధ విమానాల్ని ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేయాలని ప్రతిపాదించింది. వీటితో పాటు అత్యాధునిక జెట్‌రకం యుద్ధ విమానాల్ని కూడా కొనుగోలు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే ఆర్థికంగా ఉన్నతస్థితికి చేరిన చైనా ఈ ఏడాది నుంచి పాతతరానికి చెందిన యుద్ధసామగ్రిని అంచెల వారీగా తొలగించాలని నిర్ణయించింది. వీటి స్థానంలో ఆధునిక ఆయుధ సంపత్తిని చేరుస్తారు. సైనికుల శిక్షణ, సదుపాయాలకు మరింతగా వెచ్చించాలని తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

రాష్ట్ర బడ్జెట్ లక్షా 80వేల కోట్లు



(మొదటిపేజీ తరువాయి)

పెరిగిన రాబడి, జీఎస్టీ లోటును కేంద్రం సర్దుబాటు చేస్తుండటం, పెట్రో, మద్యం ఉత్పత్తులపై పన్నుల వసూలు రాష్ట్రానిదే కావడంతో భారీ లక్ష్యం నిర్దేశించనున్నారు. అయితే 2016-17లో సవరించిన అంచనా మేరకు రూ. 1,12,191కోట్లు వ్యయం అవుతాయని భావించినా ఆ మేరకు సాధ్యపడలేదు. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో కూడా వ్యయంలో కోతలు పడనున్నట్లుగా ఆర్థిక శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో వాణిజ్య పన్నుల శాఖ రాబడిని రూ. 46,499కోట్లకు అంచనా కాగా జీఎస్టీ రాకతో 19శాతంగా ఉన్న వృద్ధిరేటు 16 శాతానికే పరిమితమైంది. పెట్రోల్, మద్యం ఉత్పత్తులపైనే ప్రధానంగా వాణిజ్య పన్నుల శాఖ దృష్టిసారించనుంది. ఈ ఏడాది వాణిజ్య పన్నుల లక్ష్యం రూ. 43వేల కోట్లుగా నిర్ధేశించినట్లు తెలిసింది. అబ్కారీ శాఖ లక్ష్యం రూ. 8999కోట్లనుంచి రూ.12వేలకోట్లకు చేరనుందనే అంచనాలున్నాయి. స్టాంపులు-రిజిస్ట్రేషన్లశాఖ రాబడి లక్ష్యం రూ. 3వేల కోట్లకు పరిమితం చేయగా ఈ ఏడాది అనుసరించనున్న నూతన విధానం, పెరిగిన రియల్ జోరుతో రూ. 5వేల కోట్లకు పెంచుకునేందుకు రంగం సిద్ధమైందని తెలిసింది. వాహన పన్నుల రాబడిని రూ. 3వేల కోట్లనుంచి రూ. 3500 కోట్లకు ఇతర మార్గాల్లో రూ. 36,237కోట్లను రూ. 40వేల కోట్లను ప్రభుత్వం అంచనాగా వేసుకునేందుకు లెక్కలు సిద్ధమవుతున్నాయి.

బడ్జెట్‌కు తుది రూపం
సీఎం ఆమోదం కోసం వేచి చూస్తున్న ఆర్థికశాఖ

మరో వారం రోజుల్లో శాసనసభ బడ్జెట్ సమావేశాలు మొదలవుతున్నందున 2018 -19 వార్షిక బడ్జెట్ తుది రూపం సంతరించుకుంటోంది. సీఎం కె చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖాధికారులు సిద్ధం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో కసరత్తును పూర్తి చేసి సీఎం కె చంద్రశేఖరరావు ఆమోదం పొందాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 12 నుంచి శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. 14 లేదా 15 వ తేదీలలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ 2018-19 కి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశముంది. ఈ నేపథ్యంలో బడ్జెట్ కసరత్తు పూర్తి చేసి దాని స్వరూపాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆమోదం తర్వాత ఆర్థిక మంత్రి ప్రసంగ పాఠాన్ని రూపొందించడం ఆనవాయితీ. 2017 -18 కి సంబంధించి రూ.1,49,646 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను రూపొందించిన విషయం తెలిసిందే.ఈ ఏడాది కూడా అటు ఇటుగా రూ. 1,80,000 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశముందని సమాచారం. 2019 లో శాసనసభ ఎన్నికలు రానున్న దృష్ట్యా పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా జనరంజకంగా బడ్జెట్ ఉంటుందని ఇది వరకే సీఎంతో పాటు ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కూడా చెప్పారు. ఆ దిశలో పలు పద్దులకు కేటాయింపులు జరుగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు బడ్జెట్‌ను సిద్ధం చేస్తున్నారు. గత బడ్జెట్‌లో ఈటల రాజేందర్ ప్రసంగాన్ని 47 పేజీల్లో సిద్ధం చేశారు. ఈ సారి ఆర్థిక మంత్రి ప్రసంగం ఎంత సేపు ఉంటుందనేది సీఎం ఆదేశాల మేరకు ఆర్థిక శాఖాధికారులు నిర్ణయం తీసుకుంటారు. బడ్జెట్‌కు సంబంధించిన పద్దులను కూడా పుస్తకం రూపంలో ఇవ్వాల్సి ఉన్నందున వారం రోజుల ముందే సీఎం ఆమోదంతో ఆర్థిక శాఖాధికారులు తుది రూపం ఇవ్వడం జరుగుతుంది. ఈ బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి మూడు నెలల నుంచి కసరత్తు మొదలైంది. బడ్జెట్ ఏ విధంగా ఉండాలనే విషయంపై డిసెంబర్ 27 న ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. దాదాపు 25 అంశాలపై మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ శాఖల నుంచి ప్రతిపాదనలు ఆర్థికశాఖకు చేరుకున్నాక సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి బడ్జెట్‌పై సూచనలు చేశారు. ఈ మేరకు ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషీ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు బడ్జెట్‌పై పలు దఫాలు సమీక్షలు జరిపారు. పద్దులపై కసరత్తు తర్వాత సీఎం కూడా పలుమార్లు సమీక్షించారు.

ఆయుష్మాన్‌పై ప్రధాని సమీక్ష

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన జాతీయ ఆరోగ్య రక్షణ పథకం ఆయుష్మాన్ భారత్ ఆవిష్కార సన్నాహకాలను మంగళవారం సమీక్షించారు. రెండు గంటలపాటు జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పథకం సజావుగా కొనసాగడానికి ఇప్పటిదాకా చేపట్టిన చర్యలను ప్రధానమంత్రి కార్యాలయం, ఆరోగ్య మంత్రిత్వ శాఖ, నీతి అయోగ్ అధికారులు ప్రధానికి వివరించారని ఒక అధికారిక ప్రకటన పేర్కొంది. ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు ద్వారా సమగ్రమైన ప్రాథమిక ఆరోగ్య సేవను అందించడానికి అవసరమైన సన్నాహకాలను సైతం నరేంద్ర మోడీ సమీక్షించారు. సమాజంలో పేద, బలహీన వర్గాలకు ప్రయోజనాలు చేకూర్చే దిశగా పక్కా ప్రణాళికతో లక్షిత పథకాన్ని రూపొందించే దిశగా పని చేయాలని అధికారులను ప్రధాని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య రక్షణ పథకం(ఎన్‌హెచ్‌పిఎస్) దేశ జనాభాలో 40 శాతం ఉన్న 10 కోట్లకు పైగా పేద, అణగారిన కుటుంబాలకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందించడానికి ఉద్దేశించినది.

ఈశాన్యంలో గెలుపు భావనలో మార్పు

షిల్లాంగ్: ఈశాన్య భారతంలో బీజేపీ విజయం కేవలం కాంగ్రెస్ మాత్రమే అక్కడ మనుగడ సాగించ గలదన్న భావనను మార్చివేసిందని హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విలేకరులతో మంగళవారం అన్నారు. మేఘాలయలో కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవానికి బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పాటుగా రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు.

ఎంపీలకు మోడీ,షా విందు

న్యూఢిల్లీ: ప్రధాని మోడీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా ఈ నెల తొమ్మిదవ తేదీన పార్టీ ఎంపీలతో ఇక్కడి బీజేపీ కొత్త ప్రధాన కార్యాలయంలో విందు సమావేశం కానున్నారు. మంగళవారం నాటి బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోడీ ఈ విషయాన్ని పార్టీ ఎంపీలకు చెప్పారు. మేఘాలయ కొత్త ముఖ్యమంత్రిగా కాన్రాడ్ సంగ్మా ప్రమాణ స్వీకారోత్సవానికి పార్టీ అధ్యక్షుడు అమిత్ షా వెళ్ళినందున ఆయన తరఫున విందు సమావేశం సమాచారాన్ని తాను అందిస్తున్నట్టు ప్రధాని ఎంపీలతో అన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించే అగ్రనేతలతో ముచ్చటించే అవకాశం మొత్తం 332 ఎంపీలకు ఈ రూపేణా వచ్చిందని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

త్రిపుర గెలుపు సైద్ధాంతిక విజయం

ప్రతి ఎన్నిక ముఖ్యమే: పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

- దేశం, పార్టీ మూడ్ మారింది
- ఇదే స్ఫూర్తిగా గెలుపుబాటలో ముందుకు సాగుదాం
- బీజేపీ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని నరేంద్రమోడీ పిలుపు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ త్రిపురలో వామపక్షంపై బిజేపి విజయాన్ని ఒక సైద్ధాంతిక విజయంగా వర్ణించారు. అది పార్టీ మూడ్‌ను మార్చిందని పేర్కొన్నారు. రానున్న మాసాల్లో సైతం అదే స్థితిని కొనసాగించాలని పార్టీ నేతలను కోరారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం మంగళవారం ఇక్కడ జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోడీని మన విజయ యాత్ర కొనసాగుతుంది.. ఇప్పుడిక కర్నాటక వంతు వచ్చింది అనే నినాదంతో పార్టీ నేతలు స్వాగతించారు. కొందరు విమర్శకులు బీజేపీ విజయాన్ని తక్కువ చేయడానికి త్రిపురను కేవలం రెండు లోక్‌సభ స్థానాలు కలిగిన ఒక చిన్న రాష్ట్రంగా పేర్కొన్నారని మోడీ అన్నారు.

కానీ ప్రతి రాష్ట్రం, ప్రతి ఎన్నిక అత్యంత ముఖ్యమైనదిగా ప్రధాని తెలిపారు. త్రిపురలో బీజేపీ పనితీరు చరిత్రాత్మకమైనదిగా ఆయన వర్ణించారు. గడచిన 25 సంవత్సరాలుగా మార్క్సిజానికి కంచుకోటగా త్రిపుర పేరుగాంచింది. ఇది ఒకసైద్ధాంతిక విజయం. అది పార్టీ, దేశం మూడ్‌ను మార్చింది అని మోడీ అన్నారు. కేరళ ఎన్నికల్లో ఒక అసెంబ్లీ స్థానంలో బీజేపీ విజయం పార్టీ శ్రేణులను చైతన్యపరిచిందని తెలిపారు. దేశంలో ఆశ, అంచనాలు నెలకొన్నాయి. గెలుపు బాటలో సాగడానికి పార్టీ మరింత కష్టించి పనిచేయాల్సి ఉంది అని పిలుపునిచ్చినట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ తెలిపారు.

మోడీ లెఫ్ట్‌ను లక్ష్యంగా చేసుకొని మాట్లాడుతూ దాని రాజకీయాలకు హింస, ద్వేషం అంతర్లీనంగా ఉన్నాయని, అందుకే ప్రజలు అంతటా దానిని తిరస్కరించారని అన్నారు. అది ప్రపంచమంతటా అంతమైపోయింది. ప్రస్తుతం ఒక్క కేరళ రాష్ట్రంలో మాత్రమే అధికారంలో ఉంది. ఆ లెక్కన చూస్తే భారత్‌లో అది మరుగునపడిపోవడానికి అంచులో ఉంది అని వ్యాఖ్యానించారు. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాలు ముఖ్యమైనవని, కేంద్ర ప్రభుత్వం వాటి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ప్రధాని తెలిపారు.

బీజేపీ ఎన్నికల్లో గెలిచిన ప్రతిసారీ పార్టీ విజయం నుంచి దృష్టి మళ్ళించేందుకు చిన్న అంశాలను పెద్దవిగా చేసి చూపిస్తుంటారని మోడీ నవ్వుతూ అన్నారు. కానీ ఈసారి మూడు రాష్ట్రాల్లో పార్టీ పనితీరుపైనే అందరి దృష్టి లగ్నమైందని తెలిపారు. ఈ మూడు రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన అంగవస్త్రాలను బీజేపీ ఎంపీలకు పంచిపెట్టారు. ఈశాన్య ప్రాంతానికి రక్షకురాలిగా విశ్వసించే అస్సాంలో ప్రసిద్ధి చెందిన కామాఖ్య దేవస్థానం నుంచి తెచ్చిన ప్రసాదాన్ని కూడా పంచిపెట్టారు. సమావేశంలో కేంద్ర బడ్జెట్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు.

2014లో దేశ ఆర్థిక స్థితిగతులను ప్రధానంగా చూపారు. మోడీ ప్రభుత్వ హయాంలో అది సాధించిన పురోగతిని వెల్లడించారు. నవభారత్ నిర్మాణానికి ఉద్దేశించిన బడ్జెట్ ముఖ్యాంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలని పార్టీ ఎంపీలను మోడీ కోరారు. మేఘాలయ కొత్త ముఖ్య మంత్రి కాన్రాడ్ సంగ్మాకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. త్రిపురలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల్లో మరణించిన తొమ్మిది మంది బిజెపి కార్యకర్తలకు మోడీ నివాళులర్పించారు.





పోంగ్యాంగ్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌తో దక్షిణ కొరియా జాతీయ భద్రత డైరెక్టర్ చుంగ్ యంగ్ పరస్పర కరచాలనం.

హస్తినలో జోరుగా విందు రాజకీయాలు

- 9న పార్టీ ఎంపీలకు మోడీ ఆతిథ్యం
- 13న విపక్ష నేతలకు సోనియా గాంధీ విందు






న్యూఢిల్లీ: హస్తినలో విందు రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. మూడు ఈశాన్య రాష్ట్రాల్లో సాధించిన విజయాన్ని కర్నాటకలో కొనసాగించాలనే వ్యూహానికి ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మరింత పదును పెడుతున్నారు. పార్టీ ఎంపీలకు ఇటీవల ప్రారంభించిన బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల తొమ్మిదవ తేదీన విందు సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఈశాన్యంలో మొదలు పెట్టిన విజయయాత్రను కర్నాటక దాకా కొనసాగించాలనే తమ వ్యూహానికి మరింత పదును పెట్టడానికి కమలనాథులు విందు సమావేశాన్ని వేదికగా చేసుకోనున్నారు. పార్టీ అధ్యక్షుడు మేఘాలయలో ఉన్న కారణంగా సాక్షాత్తూ ప్రధాని మోడీ విందు సమావేశానికి హాజరుకావాలని ఎంపీలను స్వయంగా ఆహ్వానించడం విశేషం. ఈ వార్త ఇలా బైటకు పొక్కిందో లేదో కాంగ్రెస్ పార్టీ కూడా తామేమీ తక్కువ తినలేదన్నట్టుగా వెంటనే రంగంలోకి దిగింది. కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ ఈ నెల 13న ఇక్కడ నిర్వహించ తలపెట్టిన విందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలను ఆహ్వానించారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్‌లో ప్రభుత్వంపై దాడికి విపక్ష పార్టీలన్నీ చేతులు కలుపుతున్న నేపథ్యంలో, విపక్షాలను బలోపేతం చేయడానికి, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఒక ఐక్య కూటమికి పునాది వేయడానికి తొలి అడుగు అన్నట్టుగా సోనియా విందుకు ఆహ్వానించారని పార్టీ నేతలు తెలిపారు. టిఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చేసిన ప్రతిపాదనతో బీజేపీయేతర, కాంగ్రెసేతర కూటమిపై చర్చోపచర్చలు సాగుతున్న తరుణంలో ప్రతిపక్షాల నేతలకు విందు ఆహ్వానం అందింది. అక్కడ జరిగేది విందు మాత్రమే అనుకుంటే పప్పులో కాలేసినట్టే. బీజేపీ అసమర్థపాలనకు వ్యతిరేకంగా ఒక కూటమిగా అవతరించే ప్రతిపక్ష పార్టీల బలప్రదర్శనకు అది ఒక వేదిక అని కాంగ్రెస్ సీనియర్లు అంటున్నారు. పలువురు నేతలు ఇప్పటికే విందుకు వస్తామని మాట ఇచ్చారని తెలిపారు. కానీ వారెవరనేది వెల్లడించడంలేదు. అయితే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ సహా ప్రతిపక్షాలకు చెందిన అగ్రనేతలందరూ విందుకు హాజరుకావాలని సోనియా గాంధీ ఆకాంక్షిస్తున్నారు. అయితే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి తాను విందుకు వచ్చేదీ లేనిదీ ఇంకా తేల్చలేదని సమాచారం. పార్లమెంట్ లోపలా,వెలుపల సమన్వయం కోసం టిఆర్ఎస్ అధినేత కేసీఆర్, డిఎంకె వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కె.స్టాలిన్‌లతో మమతా మాట్లాడారు. ఎన్‌డియే భాగస్వామ్య పక్షమైన తెలుగుదేశం పార్టీ సైతం సోనియా విందుకు హాజరవుతుందని పేరు వెల్లడి కావడానికి ఇష్టపడని విపక్ష నేత ఒకరు తెలిపారు. త్రిపుల్ తలాఖ్ అంశంపై టిడిపి కేంద్రానికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో నిరసన తెలపడంలో ప్రతిపక్షాలతో చేతులు కలిపింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీపై ప్రభుత్వంతో ఉన్న విభేదాలను సైతం టిడిపి వ్యక్తం చేసింది. పార్లమెంట్‌లో పలు అంశాలపై టిఆర్ఎస్, టిడిపి, ఎస్‌పి, బిఎస్‌పి, టిఎంసి, వామపక్షాలు, డిఎంకె ఇలా అన్ని ప్రతిపక్ష పార్టీల మధ్య మంచి సమన్వయం చోటు చేసుకుందని టిఎంసి నేత డెరెక్ ఒ బ్రెయిన్ తెలిపారు.

అసెంబ్లీ సమావేశాల తర్వాత ఢిల్లీకి కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

విభజన హామీలు, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లపై గట్టిగా పోరాడుతూనే.. బిజెపి, కాంగ్రెసేతర రాజకీయపక్షాల ఎంపీలతో మంతనాలు జరుపుతున్నారు. కెసిఆర్ వచ్చే నాటికి పలు ప్రాంతీయపార్టీల నేతలతో భేటీకి టైం ఫిక్స్ చేసే మంత్రాంగం నెరుపుతున్నారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నానని కెసిఆర్ చేసిన ప్రకటన దేశ రాజకీయాల్లో పెనుచర్చకు దారితీయగా.. తెలంగాణ సెంటిమెంట్ తరహాలో బలమైన వాదాన్ని ఎలుగెత్తేందుకు కెసిఆర్ కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే దేశరక్షణ, సరిహద్దు వివాదాలతో పాటు పలు అంశాలపై ఆర్మీ,నేవీ నిపుణులతో, దేశ ఆర్థిక రంగ నిపుణులతో, నీటిపారుదల రంగ నిపుణులతో , పారిశ్రామిక వేత్తలతో సంప్రదింపులు జరపాలని నిర్ణయించారు. ఢిల్లీ కేంద్రంగా పలు రాష్ట్రాల పర్యటనలకు వెళ్ళేందుకు కూడా సన్నాహాలు చేసుకుంటున్నారు. కెసిఆర్ పక్కా స్కెచ్‌తో కేంద్ర రాజకీయాల్లో మార్పురావడం ఖాయమని, తమ అధినేత ఏ వ్యూహం పన్నినా అది విజయవంతమైందని టిఆర్ఎస్ వర్గాలు ధీమాగా చెబుతున్నాయి. ప్రధానపార్టీల నేతల వద్దకు సిఎం స్వయంగా వెళ్ళి కలవాలని భావిస్తున్నారు. బెంగాల్‌కు చెందిన ఆర్థికరంగ నిపుణులు, పారిశ్రామిక వేత్తలు, రిటైర్డ్ ఐఎఎస్‌లతో సమావేశం ఏర్పాటుచేసుకుని, అదే సందర్భంలో బెంగాల్ సిఎం మమతాబెనర్జీని కూడా స్వయంగా కలవాలని సిఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది. బెంగుళూరు వెళ్ళి అక్కడి నిపుణులతో సమావేశంలో పాల్గొనడంతో పాటు మాజీ ప్రధాని దేవెగౌడను స్వయంగా కలిసే అవకాశం ఉందని, ఇదే క్రమంలో పలు ముఖ్యరాష్ట్రాల నేతలను, నిపుణులను ఏకకాలంలో కలిసేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నట్లు సమాచారం. మరికొద్దిరోజుల్లో పర్యటనలకు సంబంధించిన సమాచారాన్ని అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

రాష్ట్రబాధ్యతలు కెటిఆర్‌కు?



ముఖ్యమంత్రి కెసిఆర్ కేంద్ర రాజకీయాలపై దృష్టిపెట్టిన నేపథ్యంలో దాని ప్రభావం రాష్ట్రపరిపాలనపై పడకుండా బాధ్యతలను కెటిఆర్‌కు అప్పగించే అవకాశం ఉందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏప్రిల్ 27న టిఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా ప్లీనరీ నిర్వహించనుండగా.. ఆ సమయానికి కూటమి రూపకల్పన, ఎజెండాపై కెసిఆర్ స్పష్టతకు వచ్చే అవకాశం ఉందని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే క్రమంలో రాష్ట్రంలో పాలనకు ఇబ్బందులు రాకుండా భవిష్యత్ నాయకునిగా కెటిఆర్‌ను ప్రకటించ వచ్చన్న అంచనాలు పార్టీవర్గాలలో కనిపిస్తున్నాయి. జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల నేతలను ఒప్పించేందుకు, సమన్వయం చేసేందుకు చాలా నేర్పు, అనుభవమున్న నేతలు అవసరమని భావిస్తున్న కెసిఆర్ ఆదినుండీ తనకు వెన్నుదన్నుగా ఉన్న కొందరు నేతలను ఇప్పటి నుండే ఆ దిశగా సన్నద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. 2001,ఏప్రిల్ 27న టిఆర్ఎస్ జలదృశ్యంలో ఆవిర్భవించగా.. ఈ ఏడాది ఏప్రిల్ 27కు పార్టీ ఆవిర్భవించి 17ఏళ్ళు పూర్తవుతుంది. టిఆర్ఎస్ 18వ ఏట అడుగిడిన వేళ.. జాతీయ రాజకీయ ప్రవేశాన్ని, పెరిగిన పార్టీ బాధ్యతలను ఆయన ఆవిష్కరించడంతో పాటు ముఖ్యనేతలకు బాధ్యతలు పంచే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

జీనోమ్ వ్యాలీలో ఫార్మా ఇంక్యుబేటర్

(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రణాళికను రూపొందిస్తున్నామని, ఫార్మారంగంలో మరిన్ని పెట్టుబడులు వచ్చేలా ఒక ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బాడీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. లైఫ్ సైన్సెస్ అడ్వయిజరీ కమిటీతో కేటీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ మేరకు కమిటీ సభ్యులు రాష్ట్రానికి ఈ రంగంలో ఉన్న అవకాశాలు, అభివృద్ధిపైన మంత్రికి వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఇక్కడి మౌలిక వసతులు పరిశ్రమకు మరింత వృద్ధిని అందిస్తాయని, ఈ నేపథ్యంలో పరిశ్రమ కోసం ఉండాల్సిన విజన్‌పైన మంత్రితో చర్చించారు. లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత వృద్ధి సాధించేందుకు తీసుకోవలసిన చర్యలపై మంత్రితో చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ఫార్మా రంగాన్ని ఒక ప్రాధాన్యతా రంగంగా ఎంచుకుని, పరిశ్రమ అభివృద్ధికి అనేక ప్రణాళికలు రచిస్తు న్నదని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఈ అంశంలో హైదరా బాద్ ఫార్మాసిటీ ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఇటీవల నిర్వాహించిన బయో ఏసియా సదస్సులో రాష్ట్ర లైఫ్ సైన్సెస్ రంగాన్ని ఎలా అభివృద్ధి పరచాలనే అంశంపై జరిగిన చర్చలు, సలహాల మేరకు ఈ సమావేశంలో చర్చించారు.

రానున్న రోజుల్లో లైఫ్ సైన్సెస్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతో పాటు అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రానికి వచ్చేలా చూస్తామన్నారు. దీంతోపాటు ఈ రంగంలో వస్తున్న డిజిటల్ మెడిసిన్, ఫార్మారంగంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ లాంటి టెక్నాలజీ ద్వారా రానున్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, హైదరాబాద్ లైఫ్‌సైన్సెస్ ఎకో సిస్టమ్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామని కేటీఆర్ చెప్పారు. ఇందుకోసం



పరిశోధన, శిక్షణా అంశాల్లో ప్రభుత్వం మరింత చురుగ్గా పని చేస్తుందన్నారు. ఐదు వ్యాధులను ఎంచుకుని వాటిని కట్టడి చేసేందుకు అవసరమైన పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఫార్మా కంపెనీలు, విద్యా సంస్థలు, సీసీఎండి లాంటి పరిశోధనా సంస్థల మధ్య మరింత సమన్వయం పెంచేందుకు రిచ్ ప్రయత్నిస్తోందని మంత్రి చెప్పారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగంలో పరిశోధన చేసే స్టార్టప్స్, హైరిస్క్ రీసెర్చ్‌కి ప్రోత్సాహం ఇచ్చేందుకు ఒక ఫండ్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఇందుకోసం రానున్న బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్లు అడ్వయిజరీ కమిటీకి ఆయన తెలి పారు. లైఫ్ సైన్సెస్ రంగంలోని కంపెనీల భాగస్వామ్యంతో పాఠశాల స్థాయి నుంచే కెరీర్ కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని కేటీఆర్ చెప్పారు.

నూతన పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడంతో పాటు ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న పరిశ్రమల విస్తరణపై దృష్టిసారిస్తుందని ఆయన చెప్పారు. ఈ మేరకు త్వరలోనే ఇక్కడ ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని కేటీఆర్ చెప్పారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 7 మార్చి 2018

లంకలో మత చిచ్చు!

జాతుల సమస్యపై పాతికేళ్ళు పైగా సాగిన అంతర్యుద్ధంలో తీవ్రంగా నష్టపోయిన శ్రీలంకలో ఇప్పుడు మత ఘర్షణలు చోటు చేసుకోవడం దురదృష్టకర పరిణామం. దశాబ్దాలుగా ఎంతో సామరస్యంగా సహజీవనం సాగిస్తున్న ప్రజల మధ్య జాతి,మత ద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ నాయకులు పబ్బం గడుపుకోవడం అన్ని దేశాల్లోనూ ఉన్నదే. శ్రీలంకలో మెజారిటీ బౌద్ధులు కావడం వల్ల సహజంగా శాంతి ప్రియులన్న పేరుంది. తీవ్రవాదం అనేది జాతి, మతాలతో నిమిత్తం లేకుండా అన్నింటా వ్యాపించడం వల్ల బౌద్ధ సంఘాల్లో కూడా రాడికల్స్ చాలా కాలం క్రితమే ప్రవేశించారు. వారి సంఖ్య తక్కువ కావడం వల్ల ఎవరూ పట్టించుకోలేదు. సంఖ్యా బలం రీత్యా మైనారిటీ వర్గానికి చెందిన ముస్లింలు తమ వ్యాపారాలు, వ్యాపకాలు తప్ప ఇతర విషయాల్లో జోక్యం చేసుకున్న దాఖలాలు లేవు. తాజా ఘర్షణలకు ప్రేరణ ఎంజి కుమార సింఘే అనే ట్రక్కు డ్రైవర్ అనుమానాస్పద మృతి. అతడిని ముస్లిం సంఘానికి చెందిన కొందరు వ్యక్తులు కొట్టి చంపారన్నది సింహళీయుల ఆరోపణ. అతడు ప్రమాదవశాత్తు మరణించాడని పోలీసులు చెబుతున్నారు. పాత కలహాలకు ప్రతీకారం తీర్చుకోవడానికి తాజా సంఘటనలను వంకగా చూపడం అనేది అన్ని చోట్లా ఉన్నదే. కుమార సింఘే మరణానికి బాధ్యులన్న అనుమానంపై కొందరు రాడికల్స్ ముస్లింలకు చెందిన దుకాణాలపైనా, మసీదులపైనా దాడిలు చేయడంతో ఆస్తినష్టం ఎక్కువగా సంభవించింది. నిజానికి ఇది మతాల మధ్య చెలరేగిన చిచ్చు కాదు. వ్యక్తుల మధ్య కలహాలు మతాల మధ్య ఘర్షణగా కొందరు రాజకీయ నాయకులు చిత్రీకరించి ఆజ్యం పోశారు. కొలంబోకి సమీపంలోని అల్తుగావమా, బెరువాలా ప్రాంతాల్లో సింహళ రాడికల్స్‌కీ, ముస్లింలకూ తరచూ ఘర్షణలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. వీటిని చెదురుమదురు సంఘటనలుగా పరిగణించి అధికార యంత్రాంగం నిర్లిప్తంగా వ్యవహరించడం వల్లే ఘర్షణలు పెద్దవయ్యాయి. తాజా ఘర్షణల్లో మసీదులు, ముస్లింలకు చెందిన దుకాణాలను సింహళ రాడికల్స్ ధ్వంసం చేశారు. ప్రాణనష్టం పెద్దగా లేకపోయినా,ఆస్తి నష్టం ఎక్కువగా జరిగింది. పరిస్థితిని అదుపు చేయడానికి దిగానా, క్యాండీ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ విధించారు. మయన్మార్ నుంచి బంగ్లాదేశ్‌కి రొహింగ్యా ముస్లింలు శరణార్థులుగా వచ్చినట్టే, శ్రీలంకకూ వచ్చి స్థిరపడ్డారు. వారు వచ్చిన తర్వాత బలవంతపు మత మార్పిడులు జరుగుతున్నాయన్నది సింహళీయుల అనుమానం. గాలగోడ అత్తే జ్ఞాన సార నేతృత్వంలోని బోదు బేల సేన ఈ తాజా ఘర్షణల్లో చురుకైన పాత్ర వహించినట్టు సమాచారం. రొహింగ్యా ముస్లింలతో పాటు కొంతమంది ఇస్లామిక్ తీవ్రవాదులు కూడా వచ్చి తమ దేశంలో తిష్ఠ వేశారనీ, వారి వల్లే గతంలో ఎన్నడూ లేని విధంగా మత ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని జ్ఞాన సార ఆరోపించారు. ఇలాంటి పరిస్థితులను రాజకీయ పార్టీలు వినియోగించుకోవడం అన్ని చోట్లా ఉన్నదే. శ్రీలంకలో ఇటీవలి స్థానిక ఎన్నికల్లో అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన నేతృత్వంలోని శ్రీలంక ఫ్రీడమ్ పార్టీ వర్గం ఓటమి పాలైంది. మాజీ అధ్యక్షుడు రాజపక్సే వర్గం అత్యధిక స్థానాలు సాధించింది. అధ్యక్ష ఎన్నికల్లో తన ఓటమికి ముస్లిం వర్గాలే కారణమని రాజపక్సే అనుమానం. దీంతో తాజా ఘర్షణలకు రాజపక్సే వర్గీయులు ఆజ్యం పోశారన్న ఆరోపణలు వచ్చాయి. మైత్రీ పాల సిరిసేన, ప్రధాని విక్రమ సింఘే వేర్వేరు పార్టీలకు చెందిన వారైనప్పటికీ సుపరిపాలన అందించేందుకు సమన్వయంతో పని చేస్తున్నారు. వారి మధ్య సఖ్యత కొనసాగితే రాజకీయంగా తనకు నష్టమని రాజపక్సే భావిస్తున్నారు. అందువల్ల పైకి స్వల్పమైన స్థానిక సంఘటనలే కారణంగా కనిపిస్తున్నా, అంతర్గతంగా రాజకీయ ప్రత్యర్థుల మధ్య వైరమే తాజా ఘర్షణలకు ప్రధాన కారణం.

క్యాండీ,అంపారా ప్రాంతాల్లో తమిళులు ఎక్కువ మంది నివసిస్తున్నారు. వేలు పిళ్ళై ప్రభాకరన్ నేతృత్వంలో అంతర్యుద్ధం జరిగినప్పుడు ఈ ప్రాంతీయులే ఆయనకు మద్దతిచ్చారు. అంతర్యుద్ధాన్ని ఉక్కుపాదంతో అణచివేసిన రాజపక్సేపై మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలు ఇప్పటికీ నీడలా వెంటాడుతున్నాయి. రాజపక్సే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంఘాల నివేదికలు రాజపక్సేని దోషిగా నిలబెట్టాయి. అధ్యక్ష పదవి ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత తగ్గి ఉన్న రాజపక్సే స్థానిక ఎన్నికల్లో గెలుపొందడంతో దూకుడు పెంచారు. తాజా ఘర్షణల వెనుక రాజపక్సే వర్గీయుల హస్తం ఉందేమోనన్న మైత్రీ పాల వర్గం ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ చేపట్టాలి. శ్రీలంకలో అశాంతి పెరిగితే, తమిళనాడుకు మళ్ళీ శరణార్థుల తాకిడి పెరిగే ప్రమాదం ఉంది.

మంచి మాట

నేను సంతోషంగా ఉన్నానా లేదా అని తర్కించుకుంటే సంతోషం అంతర్ధానమవుతుంది.

-జాన్ స్టువర్ట్‌మిల్

మావోకి దగ్గరగా..డెంగ్‌కి దూరంగా!

చైనా అధ్యక్షుడు లీ జిన్‌పింగ్ మూడోసారి పదవిలో కొనసాగడానికి వీలుగా పార్టీ నియమావళిని చైనా కమ్యూనిస్టు పార్టీ ఇటీవల సవరించింది. కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు నియమాళిని సవరించారు.పార్టీ నియమావళి ప్రకారం ఏ వ్యక్తీ రెండు సార్లు మించి అధ్యక్ష పదవిలో కొనసాగడానికి వీలు లేదు.జిన్‌పింగ్‌కి మూడోసారి అవకాశం కల్పించడం కోసం నియమావళిని సవరించారు. ఉపాధ్యక్ష పదవికి కూడా ఈ సూత్రం వర్తిస్తుంది.పార్టీ కేంద్ర కమిటీ ఈ నిర్ణయం ఆకస్మికంగా తీసుకున్నది కాదు.గత సంవత్సరం అక్టోబర్‌లో పార్టీ మహాసభ తర్వాత పార్టీ రాజ్యాంగంలో మార్పులకు జిన్‌పింగ్ శ్రీకారం చుట్టారు. మూడోసారి పదవిలో కొనసాగాలన్న ఆకాంక్ష ఆయనకు ఉన్నట్టు అప్పుడే వెల్లడైంది. పార్టీ ప్రధాన కార్యదర్శి, మిలటరీ కమిషన్ చైర్మన్ పదవి లలో ఆయన కొనసాగవచ్చనీ, అధ్యక్ష పదవిలో తనకు బాగా విధేయుడైన వ్యక్తిని నియమించవచ్చని అప్పట్లో వార్తలు వెలువడ్డాయి.

రబ్బరు స్టాంపుగా ఉపయోగ పడే వ్యక్తిని ఆ పదవిలో కవార్చో పెట్టినా, భవిష్యత్‌లో ఎదురుతిరగవచ్చన్న అనుమానంతోనే మూడోసారి అధ్యక్ష పదవిలో తాను కొనసాగేందుకు జిన్‌పింగ్ పార్టీ నియమావళిని సవరించాలని పట్టుబట్టి ఉంటారు. ఇప్పటికే ఆయనకు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ శత్రువులు ఎక్కువయ్యారు. అవినీతికి వ్యతిరేకంగా ఆయన తీసుకుంటున్న చర్యలే ఇందుకు కారణం. పార్టీనీ, సైనిక వ్యవస్థనూ క్షాళన చేసేందుకు ఆయన చర్యలు తీసుకున్నారు. రక్షణ బడ్జెట్‌ని జిన్‌పింగ్ బాగా పెంచారు. అమెరికా తర్వాత ప్రపంచంలో రక్షణ శాఖకు ఎక్కువ నిధులు కేటాయిస్తున్న దేశంగా చైనా రెండో స్థానంలో నిలిచింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి చైనా రక్షణ శాఖకు 11లక్షల కోట్ల రూపాయలను కేటాయించింది. భారత్ రక్షణ బడ్జెట్‌తో పోలిస్తే ఇది మూడున్నర రెట్లు ఎక్కువ. గత ఏడాది చైనా రక్షణ వ్యయాన్ని 150.6 బిలియన్ డాలర్లుగా పేర్కొన్నప్పటికీ అంతకన్నా ఎక్కువే ఖర్చు చేసింది. చైనా రక్షణ వ్యయంలో అత్యధిక భాగం సరిహద్దుల్లో సేనల మోహరింపునకే అవుతోందనడంలో సందేహం లేదు. డోక్లామ్‌లో చైనా ఎన్నో హెలీ పాడ్లను నిర్మించిందనీ, సైనికుల కదలికల కోసం నేల మాళిగలలో మార్గాలను చైనా సిద్ధం చేస్తోందని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా పార్ల మెంటుకు తెలియజేశారు. చైనా సైనికులు పొరుగు దేశాల భూభాగాల్లోకి చొచ్చుకుని వచ్చి ఆక్రమణలకు పాల్పడుతున్నారన్న వార్తలు గడిచిన కొంత కాలంగా వస్తూనే ఉన్నాయి.



అవినీతి నిర్మూలన పేరిట జిన్‌పింగ్ పార్టీలోనూ, మిలటరీలోనూ తనకు ఏకుమేకవుతారనుకున్న వారందరినీ పక్కన పెట్టారు. ఛోంగ్ క్వింగ్ ప్రధాన కార్యదర్శి సన్ ఝెంగ్ కయ్ వంటి సీనియర్ నేతలను ఇప్పటికే ఆయన పక్కకు తప్పించారు. సైన్యంలో సీనియర్ అయిన గో బాక్సింగ్ వంటి వారిని కూడా ఆయన పక్కకు తప్పించారు. అన్ని స్థానాల్లో తనకు విధేయులయినవారిని నియమించారు. అధికార కేంద్రీకరణకు జిన్‌పింగ్ పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నప్పటికీ ఆయనలో అభద్రతా భావం వెంటాడుతూనే ఉంది. పార్టీ అధ్యక్ష పదవి మిలటరీ అధినేత పదవి కన్నా తక్కువ కాకుండా చూసుకునేందుకు కూడా ఆయన పలు చర్యలు తీసుకున్నారు. ప్రపంచానికి చైనా దిశా నిర్దేశం చేయాలన్నది జిన్‌పింగ్ ఆకాంక్ష. ఈ విషయాన్ని ఆయన దాచుకోకుండా, గత ఏడాది దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదికపై వెల్లడించారు. ప్రపంచీకరణను సమర్థించారు. వాతావరణ మార్పులో చైనా పాత్ర పెరగడాన్ని గురించి ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఆసియాన్ మౌలిక సదుపాయాల, పెట్టుబడుల బ్యాంకు, బ్రిక్స్ బ్యాంకులలో చైనా ప్రధాన పాత్ర వహిస్తోంది. జిన్‌పింగ్ మానస పుత్రికగా అభివర్ణితమైన మహామార్గం నిర్మాణంతో యూరప్‌తో వ్యాపార సంబంధాలను వృద్ధి చేసుకునేందుకు చైనా ఎదురు చూస్తోంది. తాను అనుకున్నవి, చేపట్టినవి అయిన ప్రాజెక్టులు పూర్తి కావడానికి మూడోసారి పదవిలో కొనసాగడం అత్యవసరమని జిన్‌పింగ్ భావిస్తున్నారు.

అందుకు అనువుగా పార్టీ నియమావళిని సవరించే కార్యక్రమాన్ని వేగిర పర్చారు.

జిన్‌పింగ్ ఎక్కువ కాలం అధికారంలో కొనసాగడంపై అంతర్జాతీయంగా ఎటువంటి వ్యాఖ్యలు, విమర్శలు వెల్లువెత్తినా, స్వదేశంలో తాను అనుకున్న కార్యక్రమాలను పూర్తి చేయడానికి మరో పర్యాయం అధికారంలో కొనసాగాలని ఆయన నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా, మావో విప్లవ ఉద్యమాలు ఇతర దేశాల్లో వ్యాప్తి కోసం సహాయ పడ్డారు. డెంగ్ దేశంలో అధికార వికేంద్రీకరణ కోసం కృషి చేశారు. ఇప్పుడు జిన్‌పింగ్ మావో మాదిరిగానే ఇతర దేశాల అంతర్గత రాజకీయాల్లోకి చొచ్చుకుని వచ్చే రీతిలో వ్యవహరిస్తున్నారు. డోక్లామ్ సరిహద్దులలో సైనికుల సంచలనాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. డెంగ్ ఇతరదేశాల వ్యవహారాల గురించి ఏనాడూ పట్టించుకోలేదు. దేశంలో సంస్కరణల అమలుపై దృష్టిని కేంద్రీకరించారు. డెంగ్‌ని గొప్పఆర్థిక సంస్కరణల కర్తగా పేర్కొంటూంటారు.

ఆయన అనుకున్నరీతిలో సంస్కరణలు అమలు కాలేదు. ఫలితంగా అభివృద్ధి కన్నా అవినీతి పెరిగింది. ఇప్పుడు జిన్‌పింగ్ స్వదేశీ, విదేశీ సంస్థల మధ్య పోటీ పెట్టడం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు ప్రణాళికలను అమలు జేస్తున్నారు. ఇందుకోసం ఆయన పరిమిత సరళీకృత విధానం, విదేశాంగ విధానంలో పిడికిలి బిగింపు పద్ధతి, అంతర్గత అసమ్మతిని అణచివేసే వైఖరితో త్రిముఖ వ్యూహాన్ని అమలు జేస్తున్నారు. జిన్‌పింగ్ అనుసరిస్తున్న విధానాలు మావో విధానాలకు దగ్గరగా ఉన్నాయని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు. డెంగ్ విధానాలను తిరగతోడటమే లక్ష్యంగా జిన్‌పింగ్ చర్యలు తీసుకుంటున్నారు.

చైనా వంటి అతి పెద్ద దేశంలో అణచివేత,పిడికిలి బిగింపు విధానాలు ఏ మేరకు విజయం సాధిస్తాయన్నది అనుమానాస్పదమేనని వారంటున్నారు. మొత్తం మీద తాను అనుకున్నది సాధించడమే ప్రధాన లక్ష్యంగా జిన్‌పింగ్ ముందుకు సాగుతున్నారు. అందులో భాగమే మూడో పర్యాయం అధ్యక్ష పదవిలో కొనసాగడానికి మార్గాన్ని సుగమం చేసుకోవడం.

-పద్మనాభస్వామి

ఆపరేషన్ గ్రీన్స్‌తో రైతుకు మేలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కర్ణాటక, యుపి సహా దేశంలోని అనేక రాష్ట్రాలలో ఉల్లి, టమోటా, బంగాళాదుంపలు సహా ఎన్నో కూరగాయల పంటలు వేసిన రైతులు ఇటీవల మార్కెట్ ధరలు దారుణంగా పడిపోయి, సరకు కొనేవారు లేక తీవ్ర కష్టనష్టాలకు గురై అప్పులపాలై కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఇంకా కళ్ళముందు మెదులుతున్నాయి. ఎంతో శ్రమకోర్చి పండించిన కూరగాయల నిల్వకు సరైన శీతల గోదాములు లేక, ఆహార శుద్ధి కర్మాగారాలు, సంఘటిత చిల్లర వర్తక కేంద్రాలు, గిరాకీ ఉన్న మార్కెటింగ్ ప్రాంతాలతో అనుసంధానం జరగక రైతులు ఎక్కడికక్కడ అతితక్కువ ధరలకు, అమ్ముకోవలసిన దుస్థితి దాపురించింది. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకలలో విరివిగా టమోటా పండించిన రైతులు సరకు కొనే వారే లేక విలవిల లాడారు. కేజీ రూపాయి ఇచ్చి కొనేవారు కరవైనారు. రాష్ట్రాల ఏలికలు, ప్రభుత్వాలు, మార్కెటింగ్ శాఖలు, వ్యవసాయ అధికారులు, మంత్రులు ఏవో కంటి తుడుపు మాటలు, ఒకటి రెండు చోట్ల ఏదో సరకు కొన్నట్లు ప్రకటించడం తప్ప రైతులకు కనీస సాగు, రవాణా ఖర్చులైనా ఇచ్చి ఆదుకునే ప్రయత్నాలు చేయకపోవడం విచారకరం. దేశంలో అతిపెద్ద రాష్ట్రం యుపిలో బంగాళా దుంపల పంట పుష్కలంగా పండించినా కొనేవారు లేక, కేజీకి రూపాయి అయినా ఇచ్చేవారు లేక రాజధాని లక్నో తదితర నగర వీధుల్లో పారేసిపోయారు. బళ్ళారిలో, అనంతపురంలో, ఆదిలాబాద్‌లో ఇతర అనేక జిల్లాల్లో టమోటా పండించిన రైతులదీ ఇదే దుస్థితి. పంట వేసే కూలీ ఖర్చు కూడా లేక గొర్రెలకు, పశువుల మేతకు తోటలను వదిలేశారు. వివిధ నగరాలు పట్టణాలకు టమోటాలు తెచ్చిన రైతులకు కనీసం బాడుగ కిరాయి ఇచ్చే వారైనా లేక వీధుల్లో రహదార్ల పక్కనే పారేసి కన్నీళ్ళు పెట్టుకుని, గుండె చెదరి పల్లె చేరి అన్నదాతలు అప్పుల బాధతో కుమిలిపోతున్నారు.

ఇన్నేళ్ళుగా దేశంలో సేద్యపురంగం, గ్రామీణ దుస్థితి తీవ్రమవుతున్నా పట్టించుకోని కేంద్ర పాలకులు, కమలనాథులు, లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో అన్నదాతలను ఆదుకోకపోతే పుట్టి మునగడం ఖాయమని గ్రహించి, 2018 -19 బడ్జెట్‌లో అరకొరగా అయినా దిద్దుబాటు చర్యలు చేపట్టారు. గతంలో పాలవెల్లువ తరహాలో సహకార రంగం ద్వారా కూరగాయల రైతులను ఆదుకోవడానికి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఆపరేషన్ గ్రీన్స్‌ను రూ.500 కోట్ల ప్రారంభ నిధిని ప్రకటించారు. ఆ తర్వాత బెంగళూరులో నిర్వహించిన పరివర్తన్ (మార్పు) యాత్రలో రైతులకు అగ్రతర (టాప్, టమోటో, ఆనియన్, పొటేటో) ప్రాధాన్యమిస్తామని ప్రకటించారు. గతంలో ఏ దేశంలో పాడిపరిశ్రమ అభివృద్ధి ద్వారా తెచ్చిన క్షీరవిప్లవం ద్వారా దేశంలో పాల ఉత్పత్తి దశనే మార్చి, ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందనీ, 2016 - 17 లో మనదేశం 16.4 కోట్ల పాల ఉత్పత్తి సాధించిందనీ ప్రధాని చెప్పారు. పరస్పర సహకార పద్ధతిలో చిన్న, సన్నకారు రైతులతో అమృత తరహాలో ఏర్పాటుచేసిన పాల ఉత్పత్తి దార్ల సంఘాలను సమర్థంగా, లాభదాయకంగా నిర్వహించడం వల్లనే క్షీరవిప్లవం విజయవంతమైందనీ, పాల వినియోగదార్లు చెల్లించే ధరలో దాదాపు 80 శాతం రైతులకు అందిందనీ అదే విజయరహస్యమనీ ప్రధాని మోడీ గుర్తు చేశారు. ఆ నమూనాను, విజయగాథను పండ్లు కూరగాయలకు కూడా వర్తింప జేస్తామని, టమోటా, ఉల్లి, బంగాళా దుంపలతో అలాంటి సేకరణ పంపిణీ కేంద్రాలు ప్రారంభిస్తామనీ ప్రధాని హామీ ఇచ్చారు.



పండ్లు, కూరగాయల ధరల్లో సంభవిస్తున్న తీవ్ర హెచ్చుతగ్గులను నివారించి, సుస్థిరప్రాతిపదిక పై రైతులకు ఆదాయం అందేలా సహాయ పడటం, అదే సమయంలో వినియోగదార్లకు కూడా కూరగాయలు - పండ్లు, సరసమైన ధరలకు లభించేలా చూడటం ఉత్పత్తిదార్లు - వినియోగదార్లు, ఇద్దరినీ సంతృప్తి పరచడమే ఆపరేషన్ గ్రీన్స్ లక్ష్యమని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. ఈ పంట ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటకుండా అదేవిధంగా దారుణంగా పడిపోకుండా, రైతులు రోడ్లపై పండ్లు - కూరగాయలు పారేసిపోయే దుస్థితి రాకుండా నివారించడమే లక్ష్యం. దేశంలో ఉల్లి తదితర కాయగూరల ధరలు విపరీతంగా పెరిగినపుడు కేంద్రం ఎగుమతులను నిషేధించడం నిల్వలపై పరిమితి విధించడం, వ్యాపారులపై ఆదాయపు పన్ను అధికారులతో దాడులు చేయించడం వంటి చర్యలు తీసుకుంటోంది.

మనదేశం ఏటా 18 కోట్ల టన్నులకూరగాయలను పండిస్తూ ప్రపంచ ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉంది. భారత్ కంటే చైనా 4 రెట్లు అధికంగా కూరగాయలు పండిస్తుండటం గమనార్హం. మనదేశంలో కూరగాయల ఉత్పత్తిని పరిశీలిస్తే, పాలవిప్లవం, హరిత విప్లవంలో గోధుమ ఉత్పత్తిలా కాకుండా ఉల్లి - బంగాళాదుంప ఉత్పత్తే సగముంది. 2003 -04 లో 2 కోట్ల 80 లక్షల టన్నులున్న బంగాళా దుంపల ఉత్పత్తి 2017- 18 నాటికి 4 కోట్ల 90 లక్షల టన్నులకు, ఉల్లిగడ్డల ఉత్పత్తి ఇదేకాలంలో 63 లక్షల టన్నుల నుండి 2 కోట్ల 10 లక్షల టన్నులకు, టమోటా ఉత్పత్తి 81 లక్షల టన్నుల నుండి 2 కోట్ల 20 లక్షల టన్నులకు పెరిగినట్లు గణాంకాలు ఘోషిస్తున్నాయి.

అయితే ఈ పంటల ఉత్పత్తి పెరిగినపుడల్లా వాటి ధరలు దారుణంగా పడిపోయి అన్నదాతలకు కన్నీరు తెప్పిస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తుండటం విచారకరం. దేశంలో ఉత్పత్తి కేంద్రాలకు సమీపంలో ఈ పచ్చిసరకును నిల్వ చేసే ఆధునిక శీతల గోదాములు లేక పోవడం, పంటను ఎప్పటికప్పుడు ఆహార శుద్ధి ఉత్పత్తి కేంద్రాలకు, సంఘటిత చిల్లర విక్రయ దార్ల చెంతకు చేర్చే వ్యవస్థ లేక పోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణం.

ఫలితంగా ప్రధాన నగరాల్లో వినియోగదార్లు చెల్లించేధరలో 4వ వంతు, కొండొకచో పదోవంతు కూడా రైతులకు అందడంలేదు. ఈ పరిస్థితి మారాలి. వినియోగదార్లు చెల్లించే ధరలో 60 శాతమైనా రైతులకు దక్కేలా చూడాలి. పాలకు సంబంధించి వాడకందారు చెల్లించే ధరలో 75 శాతం ఉత్పత్తిదారుకు చేరుతోంది. అందువల్ల పాలసహకారసేకరణ కేంద్రాల నమూనాలో కూరగాయల సేకరణ - విక్రయ వ్యవస్థను నెలకొల్పి రైతులకు మేలు చేకూర్చాలి. అందుకు మొదట చేయవలసింది ఉత్పత్తి కేంద్రాలు - వాడకం కేంద్రాల మధ్య దళారీల సంఖ్యను కనిష్ట స్థాయికి తగ్గించాలి. రైతులను సమీకరించి, ఉత్పత్తిని పెంచడం సులువే. వారి ఉత్పత్తుల విక్రయాలకు అనువైన మార్కెట్‌లను కనుగొని వారి సుస్థిర ప్రాతిపదికపై గిట్టుబాటు ధరలు లభించేలా చూడటమే కీలకమని దేశంలో పాల విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్ చెప్పిన మాటలు సదా గుర్తుంచుకోవాలి. అందువల్ల ప్రతిపంట ఉత్పత్తి కేంద్రాలను వాటి ప్రధాన వినియోగ కేంద్రాలు - రిటైల్ విక్రయ కేంద్రాలతో అనుసంధానించాలి. రైతులను రైతుల ఉత్పత్తి సంఘాల (ఎఫ్‌పిఓ) ద్వారా సంఘటితం చేయాలి. నాబార్డు, చిన్న రైతుల అగ్రి బిజినెస్ కన్సార్టియంల ద్వారా కనీసం 3 వేల రైతు ఉత్పత్తి సంఘాల నేర్పరచి, నాణ్యత వారీగా వేర్వేరుగా బార్‌కోడ్‌ల ద్వారా ప్యాకింగ్ చేసి విక్రయ కేంద్రాలకు తరలిస్తే రైతుకు మేలు. రైతు ఉత్పత్తి సంఘాల నుండి నేరుగా ఇలా సరకు కొనడానికి వీలుగా వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీ (ఎపిఎమ్‌సి) చట్టాన్ని సవరించాలి. పాల కేంద్రాల వలె పండ్లు, కూరగాయల ఉత్పత్తి నిల్వ - పంపిణీలో పాల్గొనే సంఘాలు, ప్రైవేట్ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలకు, ఇలాంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలివ్వాలి. సరకు వృథాను అరికట్టేందుకు ఆధునిక గోదాములు నిర్మించాలి. అలాంటి గోదాములుంటే ఉల్లిలో వృథాను 10 శాతానికి తగ్గించవచ్చంటున్నారు. రైతు పొలాల్లో నిల్వ పద్ధతుల్లో 30 శాతం నష్టం వాటిల్లుతోంది. బంగాళాదుంపల నిల్వకు యుపిలో సౌర గోదాములు నిర్మించవచ్చు. సంఘటిత రిటైలింగ్ ద్వారా కనీసం నాలుగో వంతు పంటనైనా ఆహార శుద్ధి పరిశ్రమ ఉత్పత్తి కేంద్రాలకు చేరేలా చూడాలి. ఆగ్నేయాసియా దేశాలతో పోలిస్తే మనం వెనుకబడి ఉన్నాం. నిర్జలీకరించిన ఉల్లి, టమోటా గుజ్జు, బంగాళాదుంపల చిప్స్ ధరను మరింత తగ్గిస్తే సాధారణ ప్రజలు సైతం వాడితే వినియోగం పెరుగుతుంది. కేంద్ర బడ్జెట్‌లో ఆహార శుద్ధి పరిశ్రమకు కేటాయింపులు పెంచడం హర్షణీయమే. వాటిని ఆపరేషన్ గ్రీన్స్‌తో అనుసంధానించాలి. పంట ఉత్పత్తి, నిల్వ వినియోగ, ఆహార శుద్ధి కేంద్రాలను అనుసంధానిస్తే అనేక విధాలా నష్టాలను తగ్గించడమేగాక, వినియోగదారు చెల్లించే డబ్బులో రైతుకు కనీసం 60 శాతం దక్కేలా చూడొచ్చు.అంతేగాక వాడకం దార్లకు సరసమైన ధర లభిస్తుంది. ఆపరేషన్ గ్రీన్స్ అమలుకు దీక్షా, దక్షత, ఓర్పు, నేర్పు, రైతులు ప్రజల పట్ల సేవా నిబద్ధత గల నేతలు, అధికారులు అవసరం. కేంద్ర రాష్ట్ర పాలకులు ఈ నమూనా అమలుకు గట్టి ప్రయత్నాలు చేస్తే రైతులకు ప్రజలకు మేలు చేకూరుతుంది.

-పతకమూరు దామోదర్ ప్రసాద్, 9440990381

కొత్త వేతన సవరణ కమిషన్ వేయండి...!

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిలా ఉద్యోగులు వారి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 10 సంవత్సరాలకు ఒకసారి, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు 5 సంవత్సరాలకు ఒకసారి వేతనాలను ఆయా కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక, వస్తు వినిమయాన్ని మార్కెట్ ధరలను అంచనా వేయుటకు వేతన (స్థిరీకరణ) సవరణ సంఘాన్ని నియమించి గడువును విధించాల్సి ఉంది. ఆలోపు పిఆర్‌సి (పే రివిజన్ కమిషన్) వారు సమకాలీన ఆర్థిక, స్థితిగతులకు మారిన ధరలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వం వేతనాల స్థిరీకరణకు పూనుకుంటుంది. ఇంకా పదో పిఆర్‌సి బకాయిలనే ఈ ఏడాది డిసెంబర్ వరకు 18 దఫాలుగా నిర్ణయించారు. ధనిక రాష్ట్రంలో కూడా బకాయిలతో కాలం వెళ్ళదీస్తున్నారు. వాస్తవంగా 2018 జులై 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 11వ పిఆర్‌సి అమలు కావాల్సి ఉంది.

నేటికి కొత్త పిఆర్‌సి కమిషన్ వేయకపోవడం బాధాకరం. గతంలో ఉద్యోగులు తాము నష్టపోయిన వివరాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని పోవాలని భావిస్తున్నారు. 1974 పిఆర్‌సి లో 60 నెలలు, 1978లో 13 నెలలు, 1986 లో 30 నెలలు, 1993లో 30 నెలలు, 1999లో 21 నెలలు, 2005లో 23 నెలలు, 2010లో 21 నెలలు, 2015లో 13 నెలలు, ఇలా 1958 నుండి నేటివరకు 211 నెలలు అంటే సుమారు 3 పిఆర్‌సిలకు పైగా ఆర్థిక పరమైన నష్టాన్ని భరిస్తున్న వాస్తవాన్ని కాదనగలరా!

స్నేహ పూర్వక ప్రభుత్వం అంటూనే పిఆర్‌సి వేయడానికి, ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కాలయాపన చేయడం వలన ఆయా వర్గాలు అభద్రతకు లోనవుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాలనలో భారతదేశంలోనే మొదటి స్థానం (ముందంజ)లో వెళ్లడాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చెప్పడం అభినందనీయం. దీనికి ప్రధాన కారకులైన ఉద్యోగుల వేతన సవరణ (స్థిరీకరణ) సంఘాన్ని వేయడాన్ని ఎందుకు కాలయాపన చేస్తున్నారు. జనవరి 2018 లోనే పిఆర్‌సి నియామకమంటూ కమిషనర్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు వార్తలు రావడం, పత్రికల వారి అత్యుత్సాహమా! పాలకుల లీకులా! ఇలా కాలయాపన చేయడాన్ని ఎలా భావించాలి.

ఉద్యోగ సంఘాల నాయకుల నోళ్లు మూయించడమా! వారి మధ్య అనైక్యత, ఆధిపత్య ధోరణులు పాలకులకు సాకుగా మారింది నిజం కాదా! ఇలా సంఘాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉద్యోగుల సమస్యలను గాలికొదిలేసి వారి స్వార్థ ప్రయోజనాల కోసం మౌనం వహిస్తే? నష్టపోవలసింది సగటు ఉద్యోగులు మాత్రమే. ఈ విధానం మారాలి. సంఘాలు మౌన దీక్షవీడరా! ఉద్యోగుల పక్షాన ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనమండలి సభ్యులు మౌనం వీడండి. మీకు పదవులు కట్టబెట్టిన ఉద్యోగుల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించండి. మీ ఉదాసీన వైఖరుల వలన మూడు పిఆర్‌సిలకు పైగా ఆర్థిక నష్టంతోపాటు, సమస్యలు చాంతాడులా పెరిగిపోతున్నాయి.

30 సంవత్సరాలకు పైగా ఉద్యోగ సేవలనందించిన సగటు ఉద్యోగి కనీసం ఒక సొంత ఇల్లును కట్టుకోలేని స్థితిలో జీవితాలను వెళ్లదీస్తుంది నిజం కాదా! ఉద్యోగులకు సొంత ఇంటికల కలగానే మిగిలింది కాదనగలరా! ఉద్యోగులకు గతంలో ఇచ్చిన మాటలకు కట్టుబడి వాటిని పరిష్కరిస్తూ 11 పిఆర్‌సి వెంటనే వేసి కాలయాపన జరగకుండా ఐఆర్ ప్రకటించి 2018 జులై 1 ప్రామాణికంగా ముందుకెళ్లి గత పాలకుల్లా కాలం వృధా చేయరాదని ఆశిస్తున్నారు. ఉద్యోగుల హక్కులను తీర్చి అవసరాలను పరిష్కరించినప్పుడే (ఫ్రెండ్లీ గవర్నమెంట్) ఉద్యోగులలో స్నేహ పూర్వక ప్రభుత్వమని కొనియాడ బడుతుందని గమనించండి. నూతనంగా రాష్ట్రం ఏర్పడి ఆత్మగౌరవ పాలనలో అభివృద్ధి పథాన నడుస్తున్న సందర్భంగా కొత్తగా వేసే 11వ పిఆర్‌సి పైన ఉద్యోగుల కుటుంబాలు పాలకులపై సంపూర్ణ విశ్వాసంతో సానుకూల నిర్ణయాలు వస్తాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

-మేకిరి దామోదర్
9573666650

పోరాట యోధుడే ఆదివాసీలకు దైవం

నేటి నుంచి పగడిద్దరాజు జాతర

ఆదివాసీల ప్రతిఘటనకూ సింహస్వప్నం. ఆదివాసీల తిరుగుబాటుకు తిరుగులేని సాక్ష్యం. సమ్మక్క సారక్కలు, మేడారం జాతర, ఆదివాసీల స్వయం పాలనకోసం కాకతీయులపై కత్తులు దూసి కదనరంగ రంగంలో అమరులు అయినా సమ్మక్క భర్త పగడిద్దరాజు జాతరనూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో వేపలగడ్డ గ్రామంలో వైభవంగా అరెం వంశీయులు నిర్వహిస్తారు. పోరుబిడ్డల జాతర పగడిద్దరాజు జాతరగా ఆదివాసీలు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. ఆధిపత్యాన్ని ధిక్కరించి ఈటెలతో, బల్లేలతో కలబడి నిలబడిన కోయరాజు పగడిద్దరాజు. పగడిద్దరాజు నాయకత్వంలో కాకతీయులపై ఆదివాసీలు యుద్ధం చేయగా రాజుతో పాటుఆయన కూతుర్లు అయిన సారలమ్మ, నాగులమ్మ, కొడుకు జంపన్న, అల్లుడు గోవిందరాజులు అసువులు బాయగా భార్య సమ్మక్క యుద్ధం చేస్తూ చిలకలగుట్ట ప్రాంతంలో అదృశ్యమై కుంకుమ భరణి రూపంలో దర్శనమిచ్చింది. ఏది ఏమైనా రాజ వంశానికి చెంది రాజుతోపాటు మొత్తం కుటుంబం మరో రాజ్యకాంక్షతో భాగంగా చంపబడ్డారు. అసలు ఈ మారణకాండకూ కారణం ఏమిటని ప్రశ్నించుకుంటే ఆధిపత్యంతో అంగబలంతో సామ్రాజ్యవాద విస్తరణతో మరో ప్రాంత రాజ్యంపై దండెత్తడమని ఆక్రమించడమని తెలుస్తుంది. లొంగనివారిని నయానో, భయానో చెరబట్టడమని తెలుస్తుంది సామంతులుగా చేసుకొని బలవంతంగా కప్పం వసూలు చేయడమని ఓ రాజకీయ పరిభాషగా చెప్పవచ్చు. ఈ రాజకీయ పరిభాషా అర్థమైతే కప్పం కట్టేవారి ప్రజాస్వామిక హక్కులన్నీ హరించడమే అవుతుంది. వరసగా కరవు కాటకాలు, ఆదివాసీల పక్షాన నిలబడటం గుర్తించబడని ప్రజాస్వామిక వ్యవస్థ మనది అంటే ఆదివాసీల వైపు నీతి, నిజాయితీ ఉంది అని, కాకతీయులవైపు అధర్మం ఉందని తెలుస్తుంది. మధ్యభారత దేశంలోని యావత్ ఆదివాసీ సమాజానికి మూలం సమ్మక్క సారలమ్మలు చందవంశం ఆడబిడ్డ అయిన ఆ సమ్మక్క భర్త పగడిద్దరాజు కోయరాజుగా ప్రసిద్ధి చెంది ఆనాటి కాకతీయుల యుద్ధంలో కీలకపాత్ర



పోషించాడు. వీరమరణం చెందాడు. పగడిద్దరాజు అరెం వంశానికి చెందినవాడు. ఆదివాసీ స్వయం పాలనకూ మార్గదర్శి పగడిద్దరాజు కాలంలో ఆదివాసీలు అత్యంత స్వేచ్ఛా వాయువులతో నీతి, నిజాయితీ ధర్మంలో జీవించారు. అలాంటి పగడిద్దరాజు కోయరాజుగా కాకతీయులపై దండెత్తి దండు నడిపించాడు. మేడారంలో జరిగే సమ్మక్క సారక్క మహా జాతరకూ భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని యాపలగడ్డకూ అవినాభావ సంబంధం ఉంది. ఈ ప్రాంతానికి చెందిన అరెం వంశీయుల పగడిద్దరాజు మేడారం చేరుకుంటేనే జాతర ప్రారంభం అవుతుంది. అందుకు చారిత్రక నేపథ్యం ఉంది. పగడిద్దరాజునూ అరెం వంశీయులు పెళ్లికొడుకుగా ముస్తాయి చేస్తారు. అందులో భాగంగానే 7.3.2018న బుధవారం సాయంత్రం 6 గంటలకూ పగడిద్దరాజును గుట్టనుండి తీసుకొని వస్తారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు శ్రీ పగడిద్దరాజు సమ్మక్కలకూ ఎదిరిల్లు ఇస్తారు. ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహిస్తారు. 8.3.2018న గురువారం ఉదయం 11 గంటలకూ వనదేవతలనూ గుడికి తీసుకొని వస్తారు. సాయంత్రం 4 గంటలకూ జోగుకు తీసుకొని వస్తారు. ఆరోజు రాత్రి 12 గంటలకూ దేవతలనూ గంగా స్నానానికి తీసుకొని వెళతారు. రాత్రి 3 గంటలకూ గుడిలో ప్రతిష్టిస్తారు. రాత్రి 4 గంటలకూ దేవతలకూ హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 9.3.2018న భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. 10.3.2018న శనివారం ఉదయం 10 గంటలకు దేవతలు వన ప్రవేశం చేయిస్తారు. అత్యంత వైభవంగా వడ్డెలు ఈ కార్యక్రమాలని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. పగడిద్దరాజునూ ఒక పోరాటయోధునిగా స్మరిస్తూనే ఒక దైవంగా నేడు ఆదివాసీలు కొలుస్తారు. వీరత్వంలో నుండే దైవత్వం పుట్టిందని ఆదివాసీలు భావిస్తారు. ఈ పగడిద్దరాజు జాతరకూ ఆదివాసీలు, ఆదివాసేతరులు వరంగల్ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుండి అధిక సంఖ్యలో ఆదివాసీలు హాజరవుతారు.

(ఈ నెల 7, 8, 9, 10 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేపలగడ్డ గ్రామంలో పగడిద్దరాజు జాతర సందర్భంగా)

-పూకె రామకృష్ణ దొర
9866073866

కాంగ్రెస్, బీజేపీ
దేశాన్ని భ్రష్టుపట్టించాయ్



వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : స్వాతంత్ర్యం వచ్చిన తారువాత దేశాన్ని పాలించిన కాంగ్రెస్ భారతీయ జనతా పార్టీలు అవినీతి అక్రమాల ద్వారా దేశాన్ని భ్రష్టు పట్టించాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆరోపించారు. కాంగ్రెస్ బీజేపీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. వ్యవస్థప్రక్షాలనకు దేశంలో మార్పు అవసరమని కాంగ్రెస్ బీజేపీలకు ప్రత్యామ్నాయం ఏకైక మార్గమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నాడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కడియం మాట్లాడుతూ వ్యవసాయం రైతు సంక్షేమం, పేదరిక నిర్మూలన ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో తృతీయ ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెస్తున్నారని ప్రజలంతా పూర్తి మద్దతు ఇచ్చి ఆయన వెంట నిలవాలని కోరారు. తెలంగాణ రాక ముందు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు తెలంగాణ వచ్చిన తరువాత మూడున్నర సంవత్సరాలు జరిగిన మార్పులపై ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కరెంటు లేక రైతులు రోడ్లెక్కిన సందర్భాలు ఉన్నాయని టీఆర్ఎస్ అధికారం చేపట్టిన తరువాత 24 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నామని ఇలాంటి పరిస్థితులు దేశ వ్యాప్తంగా ఎందుకు రాకూడదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ కార్య క్రమాలకు దేశ వ్యా ప్తంగా అన్ని రాష్ట్రాల నుండి విశేష ఆధరణ లభించిందని దేశ మంతా తెలంగాణ వైపు చూసున్నారని శ్రీహరి అన్నారు. తృతీయ ప్రత్యామ్నాయ అవసరాన్ని తెరపైకి తెచ్చారని దేశ వ్యాప్తంగా కేసీఆర్ నిర్ణయానికి మద్దతు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే
రూ.3వేల నిరుద్యోగ భృతి

- కేంద్రం, ఓవైసీతో కేసీఆర్ మిలాఖత్
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నిర్మల్, ప్రభన్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు మాటల, మాయల గారడికి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పి ఇంటికి సాగనంపాలని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం జన చైతన్య బస్సు యాత్ర నిర్మల్‌కు చేరుకున్న సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీ దొంగల పార్టీ అని, అందులో ఉన్నది ఉద్యమ సమయంలో ద్రోహం చేసిన వారిని అందలం ఎక్కించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతో మంది అమరులయ్యారని, వారి కుటుంబాలను ఆదుకోవడంలో కేసీఆర్ విఫలం చెందారని ఆరోపించారు. వెయ్యి మంది యువకుల ఆత్మబలిదానాలను గుర్తించి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని, ఈ మాయల గారడి కేసీఆర్ తన మాటలతో ప్రజలను పక్కదోవ పట్టించి సాధ్యం కాని హామీలిచ్చి అధికారం చేజిక్కించుకుందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో 33 లక్షల సీలింగ్ భూములను పేదలకు తమ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేయడం జరిగిందని, అందులో 4.50 లక్షల భూములను జిల్లాలో కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ, విద్యార్థులకు ఫీజు రీయిం బర్స్ మెంట్ ఇవ్వ డంలో విఫ లంచెం దిందని, ప్రభు త్వాన్ని కొన సాగే అర్హత కేసీఆర్ కోల్పోయాడని దుయ్యబట్టారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు 7 లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉంటే యేడాదికి లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఏ ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకే ఇటీవలె సీఎం కేసీఆర్ ఢిల్లీకి పంటి నొప్పి పేరిట బయల్దేరి అక్కడ నరేంద్రమోడీ, ఓవైసీతో చీకటి ఒప్పందం చేసుకుని ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారని , ఒక పక్క జనచైతన్య యాత్రకు ప్రజల నుండి వస్తున్న విశేష స్పందనను చూడలేక ప్రజల చూపును మళ్లించేందుకు కొత్త నాటకానికి మాయలగారడి కేసీఆర్ తెరలేపారని ఆరోపించారు 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి ఎంపీ సీట్లు జీరో అని, ఫెడరల్ ఫ్రంట్ అంటూ సాధించేది ఏమీ లేదని, ఆయన వెనుక ఎవరు లేరని, కేవలం కొన్ని ప్రధాన పత్రికలను తన ప్రాద్భలంతో సొంత ప్రచారాలను రాయి స్తున్నా డని దుయ్య బట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ, డ్రాఫ్ ఇన్సురెన్సు, ప్రీమియంను ప్రభుత్వమే భరిస్తుందని, వరి, మొక్క జొన్న, సజ్జలకు కనీస మద్దతు ధర రూ.2వేల వరకు ఉండేవిధంగా పత్తికి రూ.6వేల మద్దతు ధర , ఎర్రజొన్న రూ.3వేలు, సోయాకు రూ.3,500లు, మిర్చి, పసుపుకు రూ.10వేల మద్దతు ధరను కల్పిస్తామని ఈ సందర్భంగా హామీనిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో 6 లక్షల డ్వాక్రా సంఘాలున్నాయని, అందులో 4.50 లక్షల మంది గ్రామీణ ప్రాంతాల్లో, 1.5 లక్షల సంఘాలు పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయని, ఒక్కొక్క సంఘానికి రూ. 10 లక్షల రెవలింగ్ ఫండ్‌ను అందించడంతో పాటు అభయహస్తం పథకాన్ని తిరిగి ప్రారంభిస్తామని, రూ.10లక్షల వడ్డీ లేని రుణాలు ప్రతీ గ్రూపునకు అందజేస్తామన్నారు. 4,200ల మంది సమన్వయ సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్నారు. ఈ సమావేశంలోసీఎల్‌పీ నేత జానారెడ్డి, రాష్ట్ర నాయకులు షబ్బీర్ అలీ, ఇంద్రారెడ్డి, దానం నాగేందర్, శ్రీధర్‌బాబు, సురేశ్ రెడ్డి, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షులు తయారందన్, మాజీ ఎంపీ అజారొద్దిన్, వి.హన్మంత్‌రావు, డీసీసీ అధ్యక్షులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

12 శాతం రిజర్వేషన్ మైనార్టీలను మభ్యపెట్టేందుకే : అజారొద్దిన్..

తెలంగాణ సర్కార్ మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్‌లను కల్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తూతూ మంత్రంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టి కేంద్రానికి పంపడం వెనుక మైనార్టీ ప్రజలను మభ్యపెట్టేందుకేనని మాజీ పార్లమెంట్ సభ్యులు , క్రికెట్ కెప్టెన్ అజహరొద్దిన్ ఆరోపించారు. మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

బస్సుయాత్రకు ' కుంతియా ' దూరం

టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్రకు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా హాజరుకాకపోవడంపై కాంగ్రెస్‌లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గాంధీభవన్‌లో ఏ చిన్న కార్యక్రమం జరిగినా , టీ పీసీసీ అనుబంధ విభాగల సమావేశాలకు సైతం హాజరయ్యే కుంతియా.. బస్సుయాత్రకు దూరంగా ఉండటంపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారెడ్డితో కుంతియాకు మధ్య చెలిమి చెడిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్రను గత నెల 26న రంగారెడ్డి జిల్లా చేవెళ్ల అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. బస్సుయాత్ర ప్రారంభం రోజున పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ కుంతియాతో పాటు రాష్ట్రానికి చెందిన ముఖ్యనేతలందరూ హాజరయ్యారు. కాగా వేదికపైకి కుంతియాతో పాటు రాష్ట్రానికి చెందిన ముఖ్య నాయకులందరిని ఆహ్వానించారు. అయితే కుంతియాకు వేదికపైన కుర్చీ కరువైంది. కొద్దిసేపు వేదికపైన నిలబడినా .. ఏ ఒక్క నాయకుడు కూడా పట్టించుకోకపోవడంతో మనస్థాపం చెందారు.

సోనియాకు ప్రజలు రుణపడి ఉండాలి



తెలంగాణ ఉద్యమ సమయంలో వెయ్యి మంది అమరులు బలిదానం చేసుకోవడంతో చలించి సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన విషయాన్ని ప్రజలు గుర్తుంచుకుని 2019 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని అసెంబ్లీ పక్షనేత కె.జానారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జన చైతన్య బస్సు యాత్ర నిర్మల్‌కు చేరుకుంది. అందులో భాగంగా పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది బలిదానాలు తెలంగాణ కోసం చేసుకుంటే వారికి సహాయ పడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని, త్వరలో జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో తోడళ్లుని కొడుకు సంతోష్‌రావును అభ్యర్థిగా ఎంపిక చేయడం జరిగిందని, ఉద్యమకారులు గుర్తుకు రాలేదా అని కేసీఆర్‌ను నిలదీశారు. కుటుంబ పాలనలో రాష్ట్ర ప్రజలు అతలాకుతలం అవుతున్నారని దుయ్యబట్టారు.



ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిస్తే మంత్రిగా మహేశ్వర్‌రెడ్డి: షబ్బీర్‌అలీ

2019లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మహేశ్వర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రిగా నిర్మల్ ప్రజలు చూస్తారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఎప్పుడు ప్రజల పక్షాన ఉన్న మహేశ్వర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలు గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి లభిస్తుందని పేర్కొన్నారు. మైనార్టీలకు టీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ప్రభుత్వ తీరుపై ఆయన దుయ్యబట్టారు.

ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించడంలో విఫలం: బలరాంనాయక్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీలకు అదనంగా రిజర్వేషన్ కల్పిస్తామని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో రాష్ట్ర సర్కార్ విఫలం చెందిందని మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్ ఆరోపించారు. ఎస్టీలకు 1/3 రిజర్వేషన్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించే వీలు ఉన్నప్పటికి కేంద్రంపై ఎక్కువ చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో ఎస్టీల ఓట్లను రాబట్టుకుని ఇప్పుడు కులాల చిచ్చు పెట్టి ఆదివాసులు, లంబాడాల మధ్య రగడ రాలేసి చోద్యం చూస్తున్నారని కేసీఆర్ తీరుపై ఆయన మండిపడ్డారు.

దేవాదాయ మంత్రి చేపడితే మళ్లీ ఎమ్మెల్యే కాలేడు



రాష్ట్ర చరిత్రలో దేవాదాయ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన వారు తిరిగి ఎమ్మెల్యేగా గెలిచిన దాఖలాలు ఇప్పటి వరకు లేవని, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డి విజయం తథ్యమని కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం జనచైతన్య బస్సు యాత్రలో భాగంగా పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఒకపక్క దేవాదాయ, న్యాయ, గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉంటూ నిర్మల్ నియోజకవర్గానికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేసింది శూన్యమని, ఇప్పటి వరకు జిల్లాలో డబుల్‌బెడ్‌రూంలు నిర్మించకపోవడం సిగ్గుచేటన్నారు.

ధనిక రాష్ట్రంలో ఆర్థిక ఆంక్షలా?
తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత నెల రోజుల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఆంక్షలను అమలు చేస్తోందని, ధనిక రాష్ట్రంలో ఈ ఆంక్షలు ఎందుకు విధిస్తున్నారో అర్థం కావడం లేదని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆర్థిక ఆంక్షలతో ఆసరా పెన్షన్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు మధ్యాహ్న భోజన పథకానికి నిధులు ఆపేశారని ఆయన ఆరోపించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు ఫ్లెక్సీల్లో కనిపిస్తుండగా, మూడెకరాల భూమి పంపిణీ కాగితాలకే పరిమితమైందని మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన దుయ్యబట్టారు. ఆర్థిక ఆంక్షలు విధిస్తూ మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పుకుంటున్న పథకాలకు నిధులు విడుదల కావడం లేదని ఆయన చెప్పారు. ఒకవైపు ధనిక రాష్ట్రమని చెప్పుకుంటున్నప్పటికీ మరోవైపు అప్పుల భారం పెరిగిపోతోందని, చిన్న చెల్లింపులను కూడా ఎందుకు ఆపుతున్నారని ఆయన ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడం, రుణమాఫీ కాకపోవడంతో అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైఫల్యాలన్ని కప్పిపుచ్చుకునేందుకు సీఎం కేసీఆర్ తెలివిగా రాజకీయ చర్చలకు తెర లేపుతున్నారని రావుల మండిపడ్డారు.గత నాలుగేళ్ళలో రూ.5 లక్షల కోట్ల బడ్జెట్ ఆమోదించగా, సాగునీటి ప్రాజెక్టులకు గత ఏడాది రూ.25వేల కోట్లు కేటాయించి రూ.16,200 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ ఏడాది రూ.10 కోట్లు కూడా ఖర్చు కాలేదని రావుల ఆరోపించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



హైదరాబాద్, ప్రభన్యూస్: దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న కంపల్సారీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఎన్జీవోల సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ కారం రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఎన్జీవోల కేంద్ర కార్యాలయంలో తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి, ఈ నెల 25న నిర్వహించనున్న సకల ఉద్యోగుల మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దుతో పాటు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం మార్చి 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సకల ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

అంధత్వం కమ్మేస్తోంది



హైదరాబాద్,ఆంధప్రభ: దేశంలో అంధత్వ సమస్యలు పెరిగిపోతున్నాయని ఇండియన్ విట్రో రెటినో సైసైటీ ఆందోళన వెలిబుచ్చింది. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సొసైటీ కార్యదర్శి డా.రాజానాయుడు మాట్లాడుతూ దేశంలో ఆరుకోట్లమంది మధుమేహ రోగులు ఉన్నారని అందులో 2 కోట్ల మంది రెటీనా సమస్యలతో బాధపడే రెటినోపతులే ఉన్నారన్నారు. రెటీనా జబ్బు ముదిరితే పూర్తిగా అంధత్వానికి గురవుతారన్నారు. ఈ జబ్బురాకమందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేశంలో అంధత్వం బారిన పడుతున్న వారిసంఖ్య 2020నాటికి 15మిలియన్లకు చేరుకోనుందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రముఖ నేత్రవైద్యులు డా.రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ ఇతర కంటి జబ్బులతో పోల్చినపుడు చూపు మందగించటం రెటీనా సమస్య ద్వారానే సంభవిస్తుందన్నారు.

యూనిఫైడ్ సైబర్ ఒలింపియాడ్‌లో
నేషనల్ టాపర్‌గా నారాయణ స్కూల్స్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ స్థాయిలో యూనిఫైడ్ కౌన్సిల్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే యూనిఫైడ్ సైబర్ ఒలింపియాడ్ ఎగ్జామ్-2018లో నారాయణ విద్యార్థులు విజయబావుటా ఎగురవేశారు. మంగళవారం విడుదలైన రెండవ దశ పరీక్షలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతో పాటు 2,3,4,5,6,7,8,9,10 వంటి 10లోపు 33 టాప్ ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. అలాగే 50లోపు 179 ర్యాంకులు, 100లోపు 321 ర్యాంకులు, 500లోపు 2257 ర్యాంకులు సాధించి తమ సత్తాచాటారని నారాయణ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ పి. సింధూర నారాయణ పేర్కొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా తెలంగాణ
శాసనసభా స్పీకర్ సిరికొండ మధుసూదన చారి

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : గత పాలకులు ఏడాదికి ఒక్క పని చేసినా ఎంతో అభివృద్ధి జరిగేదని కానీ ఆ ప్రయత్నం చేయలేదని శాసన సభా స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తరువాత 50 ఏళ్లలో జరుగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ మూడున్నర సంవత్సరాలలో సాధ్యం అయిందన్నారు. మంగళవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రిని రాఘవరెడ్డి పేట వాగుపై వంతెనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డా. లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పడిన సభలో స్పీకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు ప్రజల జీవన ప్రమాణాల్లో ఊహించని మార్పు తెచ్చాయన్నారు. అభివృద్ధి అంటే ఎరుగని పల్లెలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చిందని సమాజంలోని ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచి అన్ని రాష్ట్రాలకు ఆదర్శమైందన్నారు. ప్రజలు కోరుకున్న పాలన ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ద్వారా సాధ్యమవుతుందని అన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఊహించిన అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గత పాలనలో భూపాలపల్లి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ చల్లని చూపుతో ఉప ముఖ్యమంత్రి శ్రీహరి ప్రత్యేక శ్రద్ధతో తన నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు అమలు జరుగుతున్నాయన్నారు.

బస్ భవన్ ఎదుట ఆర్టీసీ కార్మికుల ధర్నా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మోటారు వాహనాల చట్టం సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ రవాణా రంగ సమాఖ్యలు ఇచ్చిన పిలుపు మేరకు ఆర్టీసీలోని ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘం ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు అనుబంధ సంఘం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌ల అధ్వర్యాన ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్ భవన్ ఎదుట రవాణా రంగ కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజిరెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు వి.ఎస్. రావు తదితరులు ప్రసంగించారు.

రైల్వే సిబ్బంది సమస్యలపై ఆందోళన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైల్వే సిబ్బందిపై పని భారం తగ్గించాలని భారత రైల్వేల జాతీయ సమాఖ్య ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య డిమాండ్ చేశారు. రైల్వే బోర్డు గతంలో అంగీకరించిన అంశాలను అమలు జరపడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని, తప్పని పరిస్థితిలో ఉద్యమ బాట పట్టేందుకు వెనుకాడబోమని పేర్కొన్నారు. ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ కమిటీ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాఘవయ్య విలేకరులతో మాట్లాడారు. రైల్వే సిబ్బందిపై పని భారం తగ్గించే విధంగా ఖాళీలను భర్తీ చేయాలని గత మూడు సంవత్సరాలుగా చేస్తున్న పోరాటాల ఫలితంగా రైల్వే బోర్డు ఇటీవలి కాలంలో ఉద్యోగ నియామకాలను నోటిఫికేషన్ జారీ చేసిందని వివరించారు. అన్ని స్థాయిల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నామని వెల్లడించారు.

ఒల్వేల ప్రైవేటీకరణను అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే కొన్ని రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని రైల్వేలో ప్రోత్సహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వేల విస్తరణ, బలోపేతం చేసే అంశాల్లో బోర్డుకు తమ మద్దతు ఉంటుందన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆందోళన ఫలితంగా సికింద్రాబాద్‌లోని ప్రింటింగ్ ప్రెస్ మూసివేత ప్రతిపాదనను విరమించుకున్నారని రాఘవయ్య తెలిపారు. సేఫ్టీ సూపర్‌వైజర్ సిబ్బంది ట్రేడ్ యూనియన్‌లలో ఆఫీస్ భేరర్లుగా ఉండరాదనే నిర్ణయాన్ని కూడా రైల్వే బోర్డు విరమించుకుందని తెలిపారు.

విద్యాహక్కు చట్టం అమలుపై వివరాలివ్వండి
ఏపీ,తెలంగాణ ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) నిబంధనల మేరకు దారిద్ర్య రేఖకు దిగువ నున్న పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్ల కేటాయింపును ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడంపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. ప్రతివాదులైన కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ, తెలంగాణ, ఏపీ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆర్టీఈ చట్టం,2007లో అమల్లోకి వచ్చినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో సక్రమంగా ఎందుకు అమలు చేయడంలేదని హైకోర్టు ప్రశ్నించింది. ప్రైవేటు/అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హైకోర్టు నిలదీసింది. నిరుపేదలకు ప్రయోజనం చేకూర్చే వ్యవహారంలో అక్రమాలు జరుగుతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలు సమర్పించాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను ఆదేశించింది.


దళిత స్త్రీశక్తి కృషి అభినందనీయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సమాజాన్ని మార్చడంలో దళిత స్త్రీ శక్తి చేస్తున్న కృషి అభినందనీయమని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కె. రాములు అన్నారు. సమాజాన్ని చైతన్య పరచడానికి నిజాయితీగల నాయకులు చాలా అవసరమన్నారు.దళిత స్త్రీ శక్తి 12వ రాష్ట్ర మహసభను మంగళవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా జరిగింది. సభకు దళితస్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీగెడ్డం అధ్యక్షత వహించగా, విశిష్ట అతిథిగా జాతీయ ఎస్సీసీ కమిషన్ సభ్యుడు కె. రాములు,ముఖ్య వక్తలుగా ఐఏఎస్ అధికారి మురలీ, బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ తారాచంద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆలోచనా విధానాముతో ఎస్సీ కమిషన్ నడవాలనే తపనతో పనిచేస్తున్నామన్నారు.

మహిళలను అవమానిస్తున్న తెరాస

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా అవకాశం ఇవ్వకుండా తెరాస ప్రభుత్వం మహిళలను అవమానిస్తోందని తెలుగుదేశం పార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి మండిపడ్డారు. ఒక మహిళకు కేబినెట్‌లో అవకాశం ఇచ్చేవిధంగా ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. తెలుగు మహిళా అధ్యక్షురాలిగా బండ్రు శోభారాణి అధ్యక్షతన తెలుగు మహిళా విభాగం మంగళవారం ఎన్‌టిఆర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు.ఎన్‌టిఆర్ భవన్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో తెదెపా టీఎస్ నాయకులను ఆహ్వానించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో తెలుగు మహిళా విభాగం నేతలు అంజలీ గౌడ్, పద్మా బాదం, కె.లక్ష్మీబాయి, ప్రమీల, ఝాన్సీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీవర్గీకరణపై కేసీఆర్ స్పందించాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు మాదిగలను మోసం చేస్తున్నారని తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ అన్నారు. ఫెడరల్ ఫ్రంట్ కోసం రాత్రికి రాత్రే వివిధ పార్టీలకు చెందిన నేతలతో మాట్లాడిన కేసీఆర్.. 24 ఏళ్లుగా సాగుతున్న వర్గీకరణ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదానికి ఎందుకు చొరువ తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 13న వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఇచ్చిన బంద్‌కు తెలంగాణ ఇంటి పార్టీ పూర్తి మద్దతిస్తున్నదని ఆయన తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మంగళవారం తెలంగాణ ఇంటి పార్టీ కార్యాలయంలో చెరుకు సుధాకర్‌గౌడ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ వర్గీకరణపై టీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షాన్ని ప్రధాన మంత్రి వద్దకు తీసుకుపోవాలన్నారు. సీఎం కేసీఆర్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడాని థర్డ్ ఫ్రంట్ నాకటం ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ధర్నాచౌక్‌ను ఎత్తివేసిన ఘనత కేసీఆర్‌కే దక్కకుతుందన్నారు.

మహిళలు సవాళ్లను అధిగమించాలి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : నిత్యజీవితంలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలను అధిగమించడంలో మహిళలు సమయ స్ఫూర్తితో వ్యవహరించాలని ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్ (ఇన్వెస్టిగేషన్స్) జనరల్ నీనా నిగం అన్నారు. మహిళలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచేందుకు కృషి జరగాలన్నారు. మహిళల సాధికారతతో దేశాభివృద్ధి అనే అంశంపై మంగళవారం ఇక్కడ ఫ్యాప్సీలో జరిగిన మహిళల సదస్సులో ఆమె కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ , ఒడిషా రాష్ట్రా ల ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న నీనా నిగం మాట్లాడుతూ, ఒకప్పుడు ఇళ్లల్లో అమ్మాయిల పట్ల చిన్నచూపు ఉండేదని, అది క్రమంగా ముగిసిన అధ్యాయం అవుతోందన్నారు. రాజస్తాన్‌లో పుట్టి పెరిగిన తాను మహిళగా ఎదుర్కొన్న సమస్యలను ఆమె వివరించారు. ఇంట్లో తన తల్లి , తండ్రి తన ఇద్దరు సోదరులతో పాటు సమానంగా చూసేవారని అది తన అదృష్టమన్నారు.





హావెల్స్ వాటర్ ప్యూరిఫయర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హావెల్స్ ఇండియా గ్రూప్ సరికొత్తగా రూపొందించిన వాటర్ ప్యూరి ఫైయర్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ప్రజా రోగ్య పరిరక్షణలో అత్యంత ప్రాముఖ్యత గల తాగు నీటిని నాణ్యమైన తరహాలో శుద్ధిచేసి అందించ డమే లక్ష్యంగా ఈ పరికరాన్ని తయారు చేసినట్లు ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శశాంక్ శ్రీవాత్సవ్ తెలిపారు. తాగునీటిలో సమతుల్యమైన లవణాలు ఉండే విధంగా హావెల్స్ వాటర్ ప్యూరిఫైయర్‌ను అనేక పరిశోధనల తర్వాత ఆవిష్కరించినట్లు చెప్పారు. ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్రతి చిన్న కుటుంబం కూడా వాటర్ ప్యూరిఫైయర్‌ను విని యోగించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తమ అధ్యయనంలో వెల్లడైందన్నారు. హావెల్ వాటర్ ప్యూరిఫైయర్ గరిష్ట అమ్మకపు ధర రూ.10వేలుగా నిర్ణయించామన్నారు.

ప్రత్యేకంగా ఈ ప్యూరిఫైయర్‌ను తయారు చేసేందుకు రూ.150 కోట్ల వ్యయంతో ప్లాంట్‌ను నెలకొల్పామన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్ల వ్యాపార లావాదేవీలు లక్ష్యంగా హావెల్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ మార్కెట్‌లోకి అడుగు పెట్టిందన్నారు. వచ్చే ఏడాది ఈ వృద్ధిరేటు రెండు రెట్లు ఉంటుందని ఆశిస్తున్నామన్నారు.





సుప్రీంలో కార్తికి చుక్కెదురు

• ముందస్తు బెయిల్ తిరస్కరణ

న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా మనీలాండరింగ్ కేసులో కార్తి చిదంబరానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. కార్తి ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణను మార్చి 8వ తేదీకి వాయిదా వేసింది. కార్తి ముందస్తు బెయిల్ నిరాకరణకు ప్రధాన కారణం ఈడీ విచారణకు అడ్డంకులు కలుగుతాయన్న ఉద్దేశంలో బెయిల్ నిరాకరించినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. కార్తీ తన బెయిల్ పిటిషన్‌లో ఈడీ తన తండ్రి పి చిదంబరం పేరు ప్రతిష్టను అపఖ్యాతిపాలు చేయడానికి కంకణం కట్టుకుందని, ఈడీ అసలు కేసుకు సంబంధించిన అంశాలపై కాకుండా ఇతర అంశాలపై తనను విచారిస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. సీబీఐ విచారణ పూర్తి కాకుండానే ఈడీ దర్యాప్తు ఎలా చేస్తుందని వాదించారు. మద్రాసు హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి సీబీఐ తనను చెన్నై విమానాశ్రయంలో అరెస్టు చేసిందని పేర్కొన్నారు. అయితే సీబీఐ తనను ఏ కేసుకు సంబంధించి అరెస్టు చేస్తున్నారో అనే విషయం కూడా చెప్పలేదని తన పిటిషన్‌లో వివరించారు. తనపై ఈడీ మోపిన పీఎంఎల్ఏ కేసును ఉపసంహరించాలని కోరారు. కాగా ఎయిర్‌సెల్ - మాక్సిస్, ఐఎన్ఎక్స్ మీడియాల నుంచి 2006, 2007లో కార్తి లంచాలు తీసుకున్నారని ఆయనపై ఈడీ కేసునమోదు చేసింది. కార్తి తరపున కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబాల్ వాదించారు.

గీతాంజలి గ్రూప్ వైస్‌ప్రెసిడెంట్ అరెస్టు

ముంబై: గీతాంజలి గ్రూపు ఆఫ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ విపుల్ చితాలియాను సీబీఐ మంగళవారం అరెస్టు చేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) మోసం కేసు విచారణలో భాగంగా ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు అధి కారులు తెలిపారు. కాగా చితాలియాను ముంబై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకొని సీబీఐ కార్యాలయానికి తీసుకొచ్చి ప్రశ్నించారు. అయితే దీనిపై వివరాలు ఇవ్వడానికి సీబీఐ అధికార ప్రతినిధి నిరాకరించారు. నీరవ్ మోడీతో పాటు ఆయన మేనమామ గీతాంజలి జెమ్స్ చైర్మన్ మెహుల్ చోక్సీలు ఇద్దరు కలిసి పీఎన్‌బీని రూ.12వేల కోట్ల వరకు మోసం చేసిన విషయం తెలిసిందే.

కోలుకుంటున్న భారత ఆర్థిక వ్యవస్థ

• వచ్చే ఏడాది వృద్ధిరేటు 7. 1 శాతం

• కొటక్ ఎకనమిక్ రీసెర్చి నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ : భారత ఆర్థికవ్యవస్థ క్రమంగా పుంజుకుంటోందని, వచ్చే ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి లేదా జీడీపీ 7.1 శాతం నమోదయ్యే అవకాశాలున్నాయని కొటక్ ఎకనమిక్ రీసెర్చి తాజా నివేదికలో పేర్కొంది. జీఎస్టి ఇబ్బందుల నుంచి క్రమంగా కోలుకుంటోందని.. వినియోగం కూడా పెరిగిందని నివేదికలో వివరించింది. గత రెండు సంవత్సరాల నుంచి ఎదుర్కొన్న ఇబ్బందులు పెద్దనోట్ల రద్దు, జీఎస్టిల సంక్షోభాల నుంచి దేశం గట్టెక్కినట్లు తెలిపింది. కాగా వినియోగం పెరిగింది... ఉద్యోగులకు ఏడవ వేతన కమిషన్ సిఫారసులను అమలు చేస్తుండటంతో వచ్చే ఆర్థికసంవత్సరం జీడీపీ వృద్ధిరేటు క్రమంగా 7.1 శాతానికి ఎగబాకే అవకాశం ఉందని కొటక్ ఎకనేమిక్ రీసెర్చి నోట్ పేర్కొంది. దీంతో పాటు గ్లోబల్ వృద్ధిరేటు కూడా పుంజుకోవడంతో కూడా కలిసొచ్చే అంశమని తెలిపింది. ప్రైవేట్ పెట్టుబడులు కూడా క్రమంగా పుంజుకోవడంతో కూడా వృద్ధిరేటు పుంజుకోవడానికి కలిసొచ్చే అంశాలని తెలిపింది. ఇదిలా ఉండగా ఈ కేలండర్ సంవత్సరం మొదటి సగభాగం వరకు సెంట్రల్ బ్యాంకు వడ్డీరేట్ల జోలికిపోదని స్పష్టం చేసింది.

సేల్స్ రంగంలో కొలువులే కొలువులు

• వచ్చే మూడేళ్లలో 25 లక్షల ఉద్యోగాలు

• టీమ్‌లీజ్ అంచనా

TeamLease™
Staffing Solutions

న్యూఢిల్లీ : ఉపాధి అవకాశాల్లో దేశంలో సమూలమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు వ్యవసాయ రంగంలో ఎక్కువ శాతం ఉద్యోగాలు లభించేవి. కాలనుగుణంగా వ్యవసాయేతర రంగాల్లో ఉద్యోగాలు పెరిగిపోయాయి. వచ్చే మూడు సంవత్సరాల కాలంలో సేల్స్ విభాగంలో 25 లక్షల మంది ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయని టీమ్‌లీజ్ అంచనా వేస్తోంది. టీంలీజ్ విశ్లేషణ ప్రకారం సంఘటిత రిటైల్ రంగం నుంచి సేల్స్ రంగంలో 50 శాతం ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయని తేల్చి చెప్పింది. మొత్తానికి వచ్చే మూడు సంవత్సరాల కాలంలో సేల్స్ విభాగంలో 25 లక్షల మంది ఉద్యోగాలు లభిస్తాయన్నది టీంలీజ్ అంచనా. అయితే నిర్మాణాత్మకమైన సంస్కరణలు ప్రభుత్వం తీసుకొస్తే వచ్చే మూడేళ్లలో సుమారు పది మిలియన్‌లు అంటే కోటి ఉద్యోగాలు సృష్టించుకోవచ్చునని పేర్కొంది. సూక్ష్మ ఆర్థిక వ్యవస్థతో పాటు వ్యూహాత్మకంగా సాంకేతికపరంగా చూస్తే .. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీఎస్టి, ఎఫ్‌డీఐ, డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ల ద్వారా పెద్దమొత్తంలో ఉద్యోగాలు సృష్టించుకునే సత్తా భారత్‌కు కలిగి ఉందని టీమ్‌లీజ్ నివేదికలో పేర్కొంది.

ప్రభుత్వం జీఎస్టీని విజయవంతంగా అమల్లోకి తెచ్చింది. దీంతో కొన్ని రంగాల్లో అదనంగా 12 శాతం సేల్స్ ఉద్యోగాలు సృష్టించవచ్చునని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)ద్వారా సుమారు 50 శాతం వరకు అదనంగా సేల్స్ ఉద్యోగాలు సృష్టించమ్చునని తెలిపింది. సంప్రదాయ రంగాలు తప్పించి కొత్త కొత్త వ్యాపారాలు కూడా పుట్టుకొచ్చాయి. ప్రభుత్వం డిజిటల్ ఇండియావైపు దృష్టి పెట్టడంతో ఈ రంగంలో వందలాది ఉద్యోగాలు సృష్టించవచ్చునని పేర్కొంది. మొబైల్ బ్యాంకింగ్, ఈ -పేమెంట్స్ ద్వారా అదనంగా కొత్త కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని తెలిపింది.

ప్రభుత్వం జీఎస్టిని అమల్లోకి తేవడంతో పాటు నిబంధనలు సరళతరం చేయడం, దేశం కూడా డిజిటల్ టెక్నాలజీ వైపు మరలడం, దేశంలోకి పెద్దమొత్తంలో ఎఫ్‌డీఐ రావడంతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోంది. కంపెనీలు దీన్ని అవకాశంగా మలచుకొని తమ ఉత్పత్తులను పెంచుకోవడానికి ప్రయత్నిస్తాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ సహ వ్యవస్థాపకుడు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రితుపర్న చక్రవర్తి తెలిపారు. సేల్స్ విభాగంతో పాటు ఇతర రంగాలు ఉదాహరణకు ఇంజినీరింగ్, డిజైన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మార్కెటింగ్, అకౌంట్స్ అండ్ అకౌంటింగ్, మానవ వనరుల విభాగంలో కూడా ఉద్యోగాలు మరింత పెరిగే అవకాశాలున్నాయని ఆయన అన్నారు.

నీరవ్‌కు రుణాలివ్వలేదు

చందా కొచ్చర్, శిఖాశర్మలకు సమన్లు

• ఎస్ఎఫ్ఐఓ ముందు యాక్సిస్ ఎగ్జిక్యూటివ్‌ల వివరణ

• రెండు గంటలపాటు విచారించిన అధికారులు

• మొత్తం 31 బ్యాంకులకు నోటీసులు • 31 బ్యాంకుల కన్సార్టియం తరఫున ఐసీఐసీఐ బ్యాంక్ రూ. 6, 800 కోట్లు గీతాంజలి జెమ్స్‌కు రుణం



చందా కొచ్చర్


శిఖాశర్మ

ముంబై : యాక్సిస్ బ్యాంకు సీనియర్ అధికారులు మంగళవారం నాడు సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) ముందు హాజరయ్యారు. పంజాబ్‌నేషనల్ బ్యాంకుకు నీరవ్‌మోడీ, మెహుల్ చోక్సీలు రూ.12వేల కంటే పెద్దమొత్తంలో మోసం చేసిన కేసులో లోతుగా దర్యాప్తు చేయడానికి దేశంలోని 31 బ్యాంకు అధికారులను ఎస్ఎఫ్ఐఓ పిలిపించింది. కాగా మోడీ కంపెనీకి యాక్సిస్ బ్యాంకు రుణాలు ఇచ్చిందా అని ప్రశ్నించింది. యాక్సిస్ బ్యాంకు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ వి శ్రీనివాసన్‌తో పాటు వాణిజ్య రవాణా విభాగాలకు చెందిన ఎగ్జిక్యూటివ్‌లు విచారణ ఏజెన్సీ ముందు హాజరయ్యారు. దర్యాప్తులో తమకు సహకరించాలని ఎస్ఎఫ్ఐఓ కోరినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఈ ఇద్దరు అధికారులు ఎస్ఎఫ్ఐఓ కార్యాలయంలో సుమారు రెండుగంటలపాటు ఉన్నారని, చోక్సికి చెందిన గీతాంజలి జెమ్స్‌తో పాటు నీరవ్‌మోడీకి చెందిన వ్యాపారాలతో యాక్సిస్ బ్యాంకు సంబంధాల గురించి అడిగినట్లు చెబుతున్నారు. యాక్సిస్ బ్యాంకే కాకుండా ఇతర బ్యాంకులు ఐసీఐసీఐ బ్యాంకుల అధికారలను కూడా పిలిపించి విచారించినట్లు విశ్వసనీయవర్గాలు చెప్పాయి. కార్పొరేట్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఎస్ఎఫ్ఐఓ సుమారు 31 బ్యాంకులకు లేఖలు రాసి.. ఈ బ్యాంకులు నీరవ్‌మోడీతో పాటు చోక్సీ కంపెనీలు రుణాలు ఇచ్చాయా అని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఎస్ఎఫ్ఐఓతో పాటు సీబీఐ, ఈడీలు పీఎన్‌బీలో జరిగిన రూ.12వేల కోట్ల కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్నాయి. పీఎన్‌బీలోని ముంబై బ్రాంచీ అధికారులు పీఎన్‌బీ చీఫ్‌తో కుమ్మక్కయి ఎల్ఓయులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా యాక్సిస్ బ్యాంకు మాత్రం గీతాంజలి జెమ్స్‌లో ఎలాంటి రుణాలు ఇవ్వలేదు. అయితే పీఎన్‌బీ నీరవ్‌మోడీకి జారీ చేసిన ఎల్ఓయులు (బ్యాంకు గ్యారంటీ)గా చెప్పుకోవచ్చు. ఎల్ఓయుల ద్వారా మోడీ యాక్సిస్ బ్యాంకు విదేశీ బ్యాంకు బ్రాంచీల నుంచి డబ్బు తీసుకున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఐసీఐసీఐ బ్యాంకు విషయానికి వస్తే 31 బ్యాంకుల కన్సార్షియానికి లీడ్ బ్యాంకర్.. ఈ 31 బ్యాంకుల కలిసి గీతాంజలి జెమ్స్‌కు రూ.6,800 కోట్ల వరకు రుణాలు ఇచ్చాయి. అయితే నీవర్‌మోడీకి చెందిన కంపెనీలకు మాత్రం నేరుగా రుణాలు మాత్రం ఇవ్వలేదు. చోక్సీతో పాటు నీరవ్‌మోడీలు ఇద్దరు కలిసి మోసపూరితంగా పీఎన్‌బీ నుంచి ఎల్ఓయులు తీసుకొని భారతీయ విదేశీ బ్రాంచీల నుంచి రూ.12,636 కోట్లు రుణాలు తీసుకున్నారు. ఈ స్కాం వెలుగుచూస్తుందని తెలియడంతో వీరిద్దరు మామ, అల్లుడు కలిసి కుటుంబాలతో విదేశాలకు జారుకున్నారు. కాగా నీరవ్‌మోడీ, చోక్సీలకు ఐసీ ఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు మీడియాలో పెద్దెత్తున వార్తలు రావడంతో ఐసీఐసీఐ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో చందాకొచ్చార్‌తో పాటుయాక్సిస్ బ్యాంకు సీఈవో, ఎండీ శిఖాశర్మను తమ ముందు హాజరు కావాలని ఎస్ఎఫ్ఐఓ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు స్టాక్ ఎక్స్చేంజీలు కూడా రెండు బ్యాంకులను ఇదే అంశంపై వివరణ కోరింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఐసీఐసీఐ షేరు బీఎస్ఈలో 2.64 శాతం క్షీణించి రూ.295.10 వద్ద యాక్సిస్ బ్యాంకు 1.31 శాతం క్షీణించి రూ.516.80 వద్ద ముగిసింది.

అదానీ అతిపెద్ద ఎన్‌పీఏ కళాకారుడు



బడా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల నుంచి వేలాది కోట్ల రూపాయలు రుణం తీసుకొని ఎగ్గొట్టి విదేశాలకు చెక్కేస్తున్నారు. వారిలో లిక్కర్‌కింగ్ విజయ్ మాల్యా, నీరవ్‌మోడీ, మెహిల్ చోక్సీలున్నారు. వీరంతా చిన్న చేపలని.. పెద్ద పెద్ద తిమంగలాలు కూడా ఉన్నాయని బీజేపీ పార్లమెంటు సభ్యుడు సుబ్రహ్మణ్యం స్వామి బాంబు సోమవారం నాడు బాంబు పేల్చారు. వారంతా ఒకసారి అలా తెరపై తళుక్కున మెరిసి అటు తర్వాత మాయం అవుతారని పేర్కొన్నారు. ఇంతకు స్వామి ఎవరిపై గురి పెట్టారనే విషయానికి వస్తే మోడీ మిత్రుడు కూడా అయిన స్వామి గుజరాత్‌కు చెందిన అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీని దృష్టిలో ఉంచుకొని ఈ వ్యాఖ్యాలు చేశారు. పీఎస్‌యు బ్యాంకుల్లో అతి పెద్ద ఎన్‌పీఏ కళాకారుడు గౌతమ్ అదానీ అని, ఆయనను ప్రస్తుతం బాధ్యుడిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేదంటే ప్రజాప్రయోజన వ్యాజ్యం వేస్తానని హెచ్చరించారు.

ఇంతకు అదానీ అతి పెద్ద డిఫాల్టరా కాదా అనేది మాత్రం తెలియదు.. అయితే అదానీ గ్రూపు బ్యాంకులకు పెద్దమొత్తంలో బకాయి పడ్డారని బ్లూమ్‌బర్గ్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. సెప్టెంబర్ 2017 చివరి నాటికి అదానీపవర్ మొత్తం అప్పులు రూ.47, 609.43 కోట్లు, అదానీ ట్రాన్స్‌మిషన్ మొత్తం అప్పుటు సెప్టెంబర్ 2017 నాటికి రూ.8,356.07 కోట్లు, అదానీ ఎంటర్‌ప్రైజెస్ అప్పులు సెప్టెంబర్ 2017 చివరి నాటికి రూ.22, 424.44 కోట్లు, అదానీపోర్ట్స్ మొత్తం అప్పులు సెప్టెంబర్ 2017 నాటికి రూ.20,791.15 కోట్లు. కాగా ఈ రుణాలు బ్యాంకుల నుంచే కాకుండా ఇతర ఆర్థిక సంస్థల నుంచి కూడా తీసుకొన్నవి.

అయితే అదానీ గ్రూపు స్వామి ప్రకటనకు స్పందించి వివరణ ఇచ్చింది. తమ గ్రూపు దీర్ఘకాలిక రుణాల కోసం ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుందని.. మొత్తం రుణాల్లో పీఎస్‌యు బ్యాంకుల నుంచి రూ.34వేల కోట్ల వరకు ఉంటుందని.. ఈ మొత్తాన్ని తాము వాడుకుంటూ దానికి తగ్గట్లు వడ్డీలు చెల్లిస్తూ ఆ ఖాతాలు కొనసాగిస్తుంటామని వివరణ ఇచ్చింది. కాగా భారత్‌లో అతి పెద్ద ప్రాజెక్టులను చేపట్టిందని.. రూ.1,10,000 కోట్ల ఆస్తులు నిర్వహిస్తోందని తెలిపింది. లిస్టెడ్ కంపెనీల విలువ రూ.40వేల కోట్ల వరకు ఉంటుందని తెలిపింది. పన్నులు వడ్డీలు చెల్లించిన తర్వాత నికరలాభం రూ.24వేల కోట్లని కంపెనీ ప్రకటనలో పేర్కొంది. గత 20 సంవత్సరాల నుంచి అదానీ గ్రూపు ప్రపంచ స్థాయి ప్రాజెక్టులను చేపట్టిందని తెలిపింది. పోర్టు, లాజిస్టిక్, విద్యుత్ ఉత్పత్, ఆగ్రి బిజినెస్, గనులు, పునరుత్పాదక విద్యుత్ రంగాల్లో వ్యాపారాలు చేస్తోందని, తమ కంపెనీ ప్రత్యక్షంగా 11వేల మందికి ఉపాధి కల్పిస్తోందని.. దేశ ఆర్థిక వ్యవస్థకు తన వంతు సహకరిస్తుందని తెలిపింది. కాగా గౌతమ్ అదానీ కుటుంబం ఆస్తి 2017 చివరి నాటికి 1100 కోట్ల డాలర్లుగా నిలిచింది. దేశంలో అత్యంత సంపన్నుల్లో 10వ స్థానంలో ఉన్నారు.

శ్యాంసంగ్ గెలాక్సీ ఎస్9ప్లస్

• ధర 57,900 పైమాటే! • 16 నుంచి మార్కెట్లోకి..

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ దిగ్గజం శ్యాంసంగ్ మంగళవారం నాడు దేశీయ మార్కెట్లో స్మార్ట్‌ఫోన్స్ గెలాక్సీ ఎస్9, ఎస్9ప్లస్‌ను మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.57,900ల పైమాటే. కాగా శ్యాంసంగ్ ప్రీమియం గెలాక్సీ ఎస్ రేంజి స్మార్ట్‌ఫోన్లను రెండురోజుల క్రితమే స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఆవిష్క రిం చింది. అటు తర్వాత భారత్ మార్కెట్లో విడుదల చేసింది. ఇక ఫోన్ ఫీచర్ల విషయానికి వస్తే.. స్లోమో షన్ వీడియోలో తీసు కోవ చ్చు.. ఈ ఫోన్ ఆపిల్‌కు చెం దిన హైఎండ్ స్మార్ట్‌ఫోన్ ఐఫోన్ ఎక్స్, గూగు ల్ ఫిక్సెల్ 2 సీరీస్‌కు పోటీ ఇస్తుంది. దీంతో పాటు అదనపు ఫీచర్ విషయానికి వస్తే డ్యూయెల్ స్టీరియో స్పీకర్, డాల్బీ అట్‌మోస్ సరౌండ్ సౌండ్ కెపబిటిలిని కూడా ఉంచారు. గెలాక్సీ ఎస్9, గెలాక్సీ ఎస్ 9 ఫ్లస్ ఫోన్ల ధరలు వరుసగా రూ.57,900, రూ.64, 900. అదే 64 జీబీ వెరియెంట్ అయితే రూ.65,900, 256 జీబీ వెరి యెంట్ అయితే రూ.72,900గా నిర్ణయించింది. మార్కెట్లో ఈ ఫోన్లు మార్చి 16 నుంచి అందుబాటులోకి వస్తాయి.



భారతి ఎయిర్‌టెల్, రిలయన్స్‌జియోతో భాగస్వామ్యం చేపట్టామని శ్యాంసంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మొబైల్ బిజినెస్ ఆసిమ్ వార్షి చెప్పారు. గెలాక్సీ ఎస్9, ఎస్9ఫ్లస్ డేటాస్పీడ్‌ను గతంలో మీరు ఎప్పుడు చూసి ఉండరని ఆయన అన్నారు. ఈ ఫోన్ల డేటా స్పీడ్ 250ఎంబీపీఎస్ అని, సాధారణ స్మార్ట్‌ఫోన్‌తో పోల్చుకుంటే 2.5 రెట్లు వేగంగా పనిచేస్తుందన్నారు. గెలాక్సీ ఎస్ 9 విషయానికి వస్తే 5.8 అంగుళాల డిస్‌ప్లేతో పాటు 4జీబీ ర్యామ్, 12 ఎంపీ రెయిర్, 8ఎంపీ ఫ్రంట్ కెమెరాతో 3,000 ఎంఎహెచ్ బ్యాటరీ ఉం టుందని తెలిపారు. గెలాక్సీ ఎ9 ఫ్లస్ విష యానికి వస్తే 6.2 అంగు ళాల డిస్‌ప్లే 6జీబీర్యామ్, 12ఎంపీ రెయిర్, ఫ్రంట్ కెమెరాలు, 3,500 ఎంఎహెచ్ బ్యాటరీ, ఈ రెండు స్మార్ట్‌ఫోన్లను 400 జీబీ వరకు ఎక్స్‌టెండెడ్ మెమురీ పెంచుకోవచ్చు.

కాగా కౌంటర్‌పాయింట్ రీసెర్చి సంస్థ ఒక నివేదికలో స్మార్ట్‌ఫోన్ మార్కెట్ ఏడాదికి 20 శాతం చొప్పున వృద్ధి చెందుతోందని, గతేడాది 28 శాతం వృద్ధి కనిపిం చిందని వివరించింది. దీంతో పాటు రూ.10వేలు, రూ. 15వేల విలువ చేసే స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు కూడా జోరం దుకుంటాయని తెలిపింది. ప్రీమియం బ్రాండ్‌లలో ఆపిల్, వన్‌ప్లస్, శ్యాంసంగ్‌లదే 94 శాతం వాటా అని పేర్కొంది.



రోల్స్‌రాయిస్ పాంథామ్ విడుదల

• ధర రూ. 11. 35కోట్లు

న్యూఢిల్లీ : లగ్జరీకార్ల తయారీ కంపెనీ రోల్స్ రాయిస్ మోటార్‌కార్స్ మంగళవారం నాడు కొత్త మోడల్ పాంథామ్‌ను ఉత్తరాది మార్కెట్ల కోసం విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.9.50 కోట్ల నుంచి రూ.11.35 కోట్లుగా నిర్ణయించారు. ఇంజిన్ ఫీచర్ల విషయానికి వస్తే 6.75 లీటర్ల ట్విన్ టర్బోచార్జ్‌డ్ వీ12 ఇంజిన్ బిగించారు. 0-100 కిలోమీటర్ల వేగాన్ని 5.3 సెకన్లలో అందుకుం టుంది. సాటిలైట్ ఎయిడెడ్ ట్రాన్స్‌మిషన్ సదుపాయం ఉంటుందని కంపెనీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. న్యూఢిల్లీ కోసం ప్రత్యేకంగా సెలెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌ను మాత్రమే అధీ కృత డీలర్‌గా ఎంపిక చేసింది. రోల్స్ రాయిస్ మోటార్ కార్స్ ఆసియా పసిఫిక్ రీజినల్ డైరెక్టర్ పాల్ హారీస్ మాట్లా డుతూ.. తమ కంపెనీకి భారత్ కీలకమైన మార్కెట్ అని, ఇతర దేశాలతో పోల్చుకుంటే భారత్ వృద్ధిరేటులో దూసుకుపోతోందని, దీంతో ప్రజలు కూడా లగ్జరీ వస్తువుల కొనుగోల పట్ల ఆసక్తి చూపుతున్నారని అన్నారు.


అయితే కారుకు ప్రత్యేకంగా ఫ్లాగ్‌బేరర్ - అనే స్టీరియో కెమెరా సిస్టమ్‌ను విండ్‌స్క్రీన్‌కు అనుసంధానం చేశారు. దీన్ని బట్టి ముందు రోడ్డు ఎలా ఉంటుందో పసిగట్టి దాని ప్రకారం సస్పెన్షన్‌ను కారు సర్దుబాటు చేసుకుంటుంది. హెడ్‌లైట్స్ లేజర్ లైట్ టెక్నాలజీతో రూపుదిద్దబడ్డాయి. రాత్రిపూట 600 మీటర్ల దూరం వరకు రోడ్డు స్పష్టంగా కనిపిస్తుంది. కాబట్టి రాత్రిపూట కూడా సురక్షితంగా ప్రయాణించవచ్చు. ఇక పాంథమ్ స్టాండర్డ్ వీల్‌బేస్ వెరియెంట్ ధర రూ.9.50 కోట్లు, పాంథామ్ ఎక్స్‌టెండెడ్ వీల్‌బేస్ ధర రూ.11.35 కోట్లు నిర్ణయించింది. ఈ ధరలోనే నాలుగు సంవత్సరాల పాటు సర్వీస్ ప్యాకేజితో పాటు రిజినల్ వారెంట్ కూడా దీనిలో కలిసి ఉందని ప్రకటనలో వివరించింది.

కుప్పకూలిన మార్కెట్లు

అమ్మకాల ఒత్తిడి - సెన్సెక్స్ 430 పాయింట్లు ఢమాల్

ముంబై : స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు భారీగా కుప్పకూలాయి. సెన్సెక్స్ 430 పాయింట్లు క్షీణించి మూడు వారాల కనిష్టానికి 33,317 మార్కుకు దిగివచ్చింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. దీనికి ప్రధాన కారణం పంజాబ్‌నేషనల్ బ్యాంకుల్లో చోటు చేసుకున్న భారీ స్కాం నేపథ్యంలో ఇతర బ్యాంకర్లను ఎస్ఎఫ్ఐఓ విచారణకు పిలిపించింది. దీంతో బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. మార్కెట్లు చివరగా డిసెంబర్ 14వ నాటి స్థాయికి దిగివచ్చాయి.

కాగా మంగళవారం నాడు బ్యాంకింగ్ రంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, ఎస్‌బ్యాంకులు 2.77 శాతం వరకు నష్టపోయాయి. దీంతో పాటు రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా సోమవారం నాడు యాక్సిస్ బ్యాంకుతో పాటు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులకు వరుసగా రూ.3 కోట్లు, రూ.2 కోట్లు జరిమానా విధించడం కూడా సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ రెండు బ్యాంకులు ఎన్‌పీఏ క్లాసిఫికేషన్ నిబంధనలతో పాటు కైవైసీ నిబంధనలు ఉల్లంఘించాయని ఆర్‌బీఐ వివరణ ఇచ్చింది. కాగా మంగళవారం నాటి ట్రేడింగ్ సరళిని గమనిస్తే.. మార్కెట్ ప్రారంభంలో లాభాలతోనే 34,047.43 పాయింట్ల వద్ద మొదలై 34,060.13పాయింట్లకు ఎగబాకింది. దీనికి తోడుగా ఆసియా మార్కెట్లు లాభాలతో ట్రేడ్ కావడంతో సెంటిమెంట్ మరింత బలపడింది. ట్రేడింగ్ చివరి గంటలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో సూచి క్రమంగా తగ్గముఖం పడుతూ వచ్చి చివరకు 429.58 పాయింట్ల వద్ద ముగిసింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్‌లలో సూచి 1129 పాయింట్ల వరకు నష్టపోయింది. ఇక నిఫ్టీ విషయానికి వస్తే కీలకమైన 10,400 మార్కును దాటి 10,441.35 పాయింట్లను దాటిపోయింది. అటు తర్వాత నెగెటివ్ జోన్‌కు 10,215.90 మార్కు దిగివచ్చి అటు తర్వాత 10,249.25 మార్కు వద్ద స్థిరపడింది.



మొత్తానికి చూస్తే నిఫ్టీ 109.60 పాయింట్లు నష్టపోయింది. బ్యాంకులకు మొండిబకాయిల సెగతో పాటు బాండ్ ఈల్డింగ్ పెరగడంతో బ్యాంకులకు నిధులు ఖరీదైన వ్యవహారంగా మారిపోతాయి. ఇలాంటి సమయంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు కొనుగోలు చేయడానికి వెనుకంజ వేస్తారు. మార్కెట్లకు అనుకూలంగా ఉండే వార్త గురించి ఎదురు చూస్తుంటారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు ఎస్ఎఫ్ఐఓ నీరవ్‌మోడీతో పాటు మెహుల్ చోక్సీ కంపెనీలతో వ్యాపార సంబంధాల గురించి 31 బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌లను పిలిపించి ప్రశ్నించింది. వారిలో ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకుఎగ్జిక్యూటిలు చందా కొచ్చార్, శిఖాశర్మలను కూడా పిలపించింది. వీరిద్దరిని సాధారణంగా పిలిపించారని చెబుతు న్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో గీతాంజలి జెమ్స్ 5 శాతం క్షీణించింది బీఎస్ఈలో 52 వారాల కనిష్ఠానికి రూ.18.35కు దిగివచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు 2.30 శాతం క్షీణించి రూ.97.75 వద్ద ముగిసింది. కన్స్యూమర్ డ్యూరబల్స్ తప్పించి మిగిలిన అన్నీ రంగాలకు చెందిన సూచిలు రియల్టీ, బ్యాంకింగ్, ఆటో, క్యాపిటల్‌గూడ్స్, పీఎస్‌యుల రంగానికి చెందిన షేర్లు 2.21 శాతం వరకు నష్టపోయాయి. భారీగా నష్టపోయిన షేర్ల విషయానికి వస్తే సన్‌ఫార్మా, ఎంఅండ్ఎం, మారుతి సుజుకి, టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, టాటా మోటార్స్, విప్రో, పవర్‌గ్రిడ్; ఐటీసీ లిమిటెడ్, రిల్, బజాజ్‌ఆటో, ఎల్‌అండ్‌టి, ఇన్ఫోసిస్, హెచ్ యూఎల్, డాక్టర్‌రెడ్డీస్, ఏషియన్ పెయింట్స్, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీలు 2.95శాతం వరకు నష్టపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంకు ఒక్కటే 1.21శాతం లాభపడింది.

రూ.4.30 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్లు వరుసగా గత ఐదు ట్రేడింగ్ సెషన్‌ల నుంచి నష్టాల్లో మునిగిపోతుంటే.. మదుపరుల సొమ్ముకు గత ఐదు రోజుల నుంచి రూ.4.30 లక్షల కోట్లు ఆవిరైంది. కాగా మంగళవారం నాడు ఒక్క రోజే రూ.1.54 కోట్ల మదుపరుల సంపద కరిగిపోయింది. ఇదిలా ఉండగా బీఎస్ఈలో మంగళవారం నాడు లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,44,20,606 కోట్లకు దిగిరాగా.. సోమవారం నాడు రూ.1,45,75,054.23 కోట్లుగా నమోదైంది. మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో గత ఐదు ట్రేడింగ్ సెషన్‌లలో సూచి 1129 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.1, 44,20,606 కోట్ల నుంచి రూ.4, 30,042.5 కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది.

మావోలపై పోలీసు వ్యూహం విఫలం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇటీవల తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేతలు తప్పించుకోవడంతో మళ్లీ పోలీసు తూటా గురి తప్పిందా? అన్న అనుమానాలకు బలం చేకూరినట్లవుతోంది. గతంలో ఏవోబీలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో సైతం మావోయిస్టు అగ్రనేతలు తప్పించుకున్న సంగతి విదితమే. ఎప్పటికప్పుడు మావో అగ్రనేతల కోసం భద్రతాదళాలు యత్నిస్తున్నా ఆ ప్రయ త్నాలు ఫలించిన దాఖలాలు లేవనే చెబుతున్నారు. అగ్రనేతలను మట్టుబెట్టడం ద్వారా మావోల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయవచ్చన్న భద్రతాదళాల వ్యూహం ఫలిం చకపోగా ఎప్పటికప్పుడు బెడిసికొడుతుందనే అంటున్నారు. మావోల అణిచివేతకు పోలీసులు ప్రయత్నాలు ఓవైపు కొనసాగుతున్న తరుణంలో మావోలు తమ వ్యూహా లకు అంతేస్థాయిలో పదును పెడుతూ తమ బలాన్ని పెంచుకునే రీతిలో భారీ స్థాయిలో రిక్రూట్‌మెంట్లు చేపడుతున్నట్లు తెలుస్తోంది. అందివచ్చిన అవకాశాలను ఏదీ మావోలు వదులుకోవడం లేదని భద్రతాదళాల వ్యూహాలకు చెక్ పెడుతూనే చాపకింద నీరులా తమ పని తాము చేసుకుపోతున్నట్లు సమాచారం. పోలీసు ఇన్ ఫార్మర్లు ఎవరో గుర్తిస్తూ వారిని మట్టుబెట్టేందుకు మావోలు ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలుస్తోంది. అటు భద్రతాదళాలు సైతం మావోలకు కొరియర్లుగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.

మావోల ప్రతీకారేచ్ఛ - ఆర్టీసీ బస్సు దగ్ధం..

ఇదిలా ఉండగా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన బారీ ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం తీర్చుకునే పనిలో పడ్డారు మావోయిస్టులు. గత రాత్రి హైదరాబాద్ నుంచి జగ్దల్‌పూర్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సును సుకుమా జిల్లా దోర్నపాల్ సమీపాన కుర్తి గ్రామం సమీపంలో బస్సును ఆటకాయించి ప్రయాణీకులను దించివేసి, బస్సును దగ్ధం చేశారు. డీజిల్ ట్యాంకును పగలగొట్టిన మావోయిస్టులు, ఆయిల్‌ను చల్లి నిప్పంటించారు. ఆపై అదే దారిలో వస్తున్న ఓ ప్రైవేటు బస్సును, టిప్పర్‌ను, ఓ ట్రాక్టర్‌ను తగులబెట్టారు. బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువకుడిని కానిస్టేబుల్ అన్న అనుమానంతో ప్రయాణీకుల ముందే అతడ్ని కాల్చి చంపారు. ఆపై మావోయిస్టులు సమీపంలోని అడవుల్లోకి పారిపోగా, ప్రయా ణీకులు, డ్రైవర్లు దగ్గరలోనే ఉన్న సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు చేరుకున్నారు. ఈ నెల 1న జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే.

'ముందస్తు సమాచారం లేకుండా పర్యటనలు చేయొద్దు'

ఇదిలా ఉండగా, జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో భద్రతాదళాలు మరింత అప్రమత్తమయ్యాయి. మరోవైపు ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న భయంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పల్లెవాసులు భయం గుప్పిట్లో విలవిలలాడుతున్నారు. ఈ నేపథ్యంలో భద్రతాదళాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజా ప్రతినిధులు ఎవరైనా సరే తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలాంటి పర్యటనలు చేపట్టరాదని హెచ్చరిస్తున్నాయి. ఇటు తెలంగాణలో ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, జయశంకర్-భూపాలజిల్లాల నేతలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు. అటు ఏపీలోని ఏవోబీ పరిసర ప్రాంతాలతో పాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని నేతలను సైతం భద్రతా దళాలు హెచ్చరిస్తున్నాయి.

పాండాను విడుదల చేయకపోతే వైద్య విద్యార్థిని చంపేస్తాం.

● ఒడిశా సర్కార్‌కు మావోల అల్టిమేటం

భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ విద్యార్థి సాహిల్ అజీజ్ అదృశ్యం కేసు కొత్త మలుపు తిరిగింది. పోలీసులకు పట్టుబడి ప్రస్తుతం జైల్లో ఉన్న మావోయిస్టు నేత సవ్యసాచి పండాను వెంటనే విడుదల చేయాలని, లేకుంటే తాము కిడ్నాప్ చేసిన వైద్య విద్యార్థిని హతమారుస్తామని మావోయిస్టుల పేరిట ఓ పోస్టర్ వెలవడం కలకలం రేపుతోంది. భువనేశ్వరలోని బర్ముండా బస్టాండ్‌లో ఈ పోస్టర్ కనిపించగా, ఏడు రోజుల్లో సవ్యసాచిని విడుదల చేయాలని, లేకుంటే విద్యార్థిని చంపేస్తామని మావోలు హెచ్చరించారు. ఆపై ఈ నెల 11న భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌ను, బస్టాండును బాంబులేసి నేలమట్టం చేస్తామని కూడా లేఖలో ఉంది. కాగా, ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ చదువుతున్న సోయిల్ అజీజ్ రెండు వారాల క్రితం అదృశ్యం కాగా రాష్ట్ర పోలీసులు కేసును విచా రిస్తున్నారు. ఈ పోస్టర్‌ను మావోలే రాశారా? లేక ఎవరైనా ఆకతాయిల పనా? అన్న విషయాన్ని ఇప్పటికిప్పుడు స్పష్టం చేయలేమని నగర కమిషనర్ వైబీ ఖురానియా వెల్లడించారు.

9న మావోయిస్టుల రాష్ట్రబంద్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని అటవీ ప్రాంతంలో గత శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈనెల 9న (శుక్రవారం) రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తూ మావోయిస్టు పార్టీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మావోయిస్టులపై బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడ్డారని.. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విదానాలను చేపడుతున్నారన్నారు. బంగారు తెలంగాణ పేరుతో కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. బంద్‌ను విజయవంతం చేయాలని మావోయిస్టులను ప్రజలను కోరారు.

కొడుకు చేయి నరికిన తండ్రి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మొబైల్‌లో అశ్లీల దృశ్యాలు వీక్షిస్తున్నాడని కొడుకు చేయిని నరికేశాడు ఓ తండ్రి. వివరాల్లోకి వెళితే.. పహాడీషరీఫ్ జల్‌పల్లి ప్రాంతంలో ఉండే ఖయ్యుం ఖురేషి మాంసం వ్యాపారి. చెడు సావాసాలు చేస్తున్న తన పెద్ద కుమారుడు మహ్మద్ ఖాలెద్ ఖురేషీ(18)ని బాధ్యతగల పౌరుడిగా తీర్చిదిద్దాలనుకున్నాడు. దీంతో స్థానిక కేబుల్ టీవీ కార్యాలయంలో పనికి కుదిర్చాడు. బుద్ధిగా పని చేసుకోవాలని సూచించాడు. అయితే అస్తమానం మొబైల్ ఫోన్లో అశ్లీల దృశ్యాలు చూస్తుండటాన్ని గుర్తించిన తండ్రిఖాలెద్‌ను మందలించాడు. బుద్ధిగా పనిచేసుకోవాలని పదే పదే సూచించాడు. తండ్రి మాటలు పెడచెవిన పెట్టమే కాకుండా.. పనిమానేసి అశ్లీల దృశ్యాలు చూస్తుం డటంతో కొడుకు నుంచి ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశాడు. దీంతో తండ్రి చేయి కొరికి, ఫోన్ తీసుకుని ఖాలెద్ పారిపోయాడు. ఆ రోజు నుంచి వారింట్లో గొడవ జరుగుతూనే ఉంది. అయినప్పటికీ మనసు మార్చుకోని ఖాలెద్ మళ్లీ అదే పని చేస్తున్నాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఖయ్యూం పక్కనే ఉన్న మాంసం నరికే కత్తితో కుమారుడు కుడి చేతిని నరికేశాడు. ఖయ్యుం నేరుగా పోలీ స్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు.

భర్తకు విషం ఇచ్చిన భార్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మద్యానికి బానిసై అప్పులు చేస్తున్న భర్తను విషంతో వదిలించుకుందో ఇల్లాలు. వివరాల్లోకి వెళితే.. వరంగల్‌కు చెందిన డీఎస్ మూర్తి, ఆయన భార్య రమ ఢిల్లీలోని రాజాబజార్‌లో నివాసముంటున్నారు. రమ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని కాగా, మూర్తి ఓ స్థిరాస్తి సంస్థలో పనిచేస్తున్నారు. గత నెల 26న రోడ్డు పక్కన అనుమానాస్పదంగా పడి ఉన్నారంటూ మూర్తిని ఓ మహిళ ప్రభుత్వాసుపత్రిలో చేర్చి వెళ్లిపోయింది. రెండు రోజుల తర్వాత మూర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. దీంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆయన డీఎస్ మూర్తిగా గుర్తించారు. అనంతరం రమకు సమాచారం అందించారు. తర్వాత దర్యాప్తులో రమే ఆయనను ఆసుపత్రిలో చేర్చినట్లు గుర్తించారు. రమపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కేసు పోలీసుల దర్యాప్తులో ఉంది.

స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో అగ్ని ప్రమాదం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మేడ్చల్ జిల్లా కాప్రా సర్కిల్ ఏఎస్‌రావు నగర్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. హోటల్‌లోని ఓ అంత స్తులో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇదే భవనం కింద పలు వాణిజ్య సము దాయాలు ఉండటంతో వారంతా తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని హోటల్‌లో ఉన్న సిబ్బంది, అతిథులను బయటకు తీసుకొచ్చారు. రెండు అగ్నిమాపక వాహనాలతో మంట లను ఆర్పివేశారు. హోటల్‌లో ఉన్న వారందరినీ అగ్నిమాపక సిబ్బంది బయ టకు తీసుకొచ్చిన క్రమంలో కొందరు అస్వస్థతకు లోనయ్యారు. వారిని అంబు లెన్స్ లలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పట్టపగలు భారీ దోపిడి

మారణాయుధాలతో బెదిరించి 5కిలోల బంగారం దోచేశారు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ పాతబస్తీలో పట్టపగలు సినీ ఫక్కీలో భారీ దోపిడీ సంభవించింది. పాతబస్తీ మూసాబౌలీలోని ఓ బంగారు నగల తయారీ దుకాణంలో మారణాయుధాలతో జొరబడ్డ సుమారు 12 మంది దుండగులు సదరు దుకాణంలో ఉన్న వారిని బెదిరించి సుమారు 5 కిలోల బంగారం ఆభరణాలు అపహరించి ఉడాయించారు. మంగళవారం మధ్యాహ్నం 12-30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దుకాణంలో చొరబడ్డ 12 మంది దుండగులు కత్తులతో బెదిరించారు. కొందరిని కాళ్లు, చేతులు కట్టేసి ఐదు కిలలో బంగారు ఆభరణాలను ఊడ్చేశారు. ఇంత భారీ స్థాయిలో దుండగులు బీభత్సం సృష్టిస్తున్న సమయంలో దుకాణంలో 25 మంది సిబ్బంది ఉన్నా వారిని ప్రతిఘటించేందుకు సాహసించలేదు. దీంతో ఈ ఘటనలో దుకాణ సిబ్బంది ప్రమేయం ఏదైనా ఉందా? ఆ సమయంలో దుండగులు గాల్లోకి కాల్పులు జరిపారన్న వార్తలు వెలువడ్డా పోలీసులు మాత్రం కాల్పులు జరపలేదని స్పష్టం చేస్తున్నారు. దుండగులు ఘటనపై దుకాణదారుడు చార్మినార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదునందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆసాంతం సినీ ఫక్కీలో ఘటన చోటు చేసుకుందనే చెప్పవచ్చు. బంగారం అపహరించిన తర్వాత అక్కడ సీసీ కెమెరాల వైర్లను సైతం దుండగులు కత్తిరించినట్లుగా చెబుతున్నారు. కాగా, చోరీకి పాల్పడింది ముంబై గ్యాంగ్ అయి ఉండవచ్చని తెలుస్తోంది. మరోవైపు ఇది పాత నేరస్తుల పనే అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పరిసరాల్లోని సీసీకెమెరాల ఫుటేజీలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఏదేమైనా పట్టపగలు భారీ దోపిడీకి దుండగులు తెగబడటంతో బంగారం నగల తయారీదారుల దుకాణదారుల్లో భయాందోళనలు అలుముకున్నాయి. కాగా, దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి ఇక్కడికి వచ్చి ఆయా దుకాణాల్లో పనిచేసేవారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని ఓ పరిశీలన ద్వారా తేలు తోంది. దీంతో, ఈ భారీ దోపిడీకి ఎవరూ పాల్పడ్డా రన్న దానిపై పోలీసులు ఎటూ తేల్చు కోలేకపోతున్నారు. అయితే, దోపిడీకి సంబం ధించి విలువైన సమాచారం తమకు అందుతోందని, అతిత్వరలో ఈ దోపిడీకి పాల్పడ్డ నిందితులను అరెస్టు చేసి తీరుతామని సౌత్ డీసీపీ సత్యనారాయణ మీడి యాకు తెలిపారు. హైదరాబాద్ సేఫ్ సిటీ అని.. ఇక్కడ ఎలాంటి ఘటనలు జరగవని పోలీసు ఉన్నతా ధికారులు పదే పదే వల్లె వేసే మాటలకు.. నగరంలో జరిగే ఘటనలకు ఎక్కడా పొంతన కుదరడం లేదని దోపిడీ ఘటనపై స్థానికులు తీవ్రస్థాయిలో పోలీసులు పనితీ రుపై ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోవైపు ఘటనకు సంబంధించి దుకాణ సిబ్బంది ప్రమేయం తప్పక ఉండి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అదే క్రమంలో కొంత మంది సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. జరిగిన ఈ దోపిడీ ఘటన మాత్రం ముమ్మాటికీ పోలీసుల వైఫల్యంగానే చెప్ప వచ్చునని స్థానిక ప్రాంత వాసులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

వీడిన రుద్రారం హత్యకేసు మిస్టరీ



సిద్దిపేట టౌన్, ప్రభన్యూస్ : సిద్దిపేట జిల్లా, మిరుదొడ్డి మండల పరిధిలోని రుద్రారం గ్రామ శివారులోని వ్యవసాయ స్థలంలో అనుమానస్పదస్థితిలో మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని చెట్లగాడి సుహాసిని హత్య కేసు మిస్టరీని పోలీసులు నాలుగు రోజుల్లో ఛేధించారు. మంగళవారం సిద్ది పేటలో ఏసీపీ నర్సింహారెడ్డి నిందితున్ని విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మెదక్ జిల్లా, పెద్దనిజాంపేట గ్రామానికి చెందిన గరిగుల అశోక్(27) తండ్రి ఎల్లయ్యగా గుర్తించారు. రుద్రారం గ్రామానికి వెళ్లగా సుహాసిని పొలం వద్దకు వెళ్ళిందని తెలుసుకుని అక్కడ ఒంటరిగా ఉన్న సుహాసినిని తనను తప్ప వేరే ఎవరితో మాట్లాడవద్దని చెప్పగా దానికి ఆమె వినకపోవడంతో వాగ్వాదానానికి దిగారు. తన కోరిక తీర్చాల్సిందిగా బలవంతం చేయగా ఆమె ప్రతిఘటించి అశోక్ మొఖం పై కొట్టడంతో తీవ్ర ఆగ్రహా ఆవేశాలకు గురై సుహాసిని గొంతు నులిమి చంపి అక్కడే ఉన్న డబ్బాలోని కిరోసిన్ ఒంటిపై పోసి గుర్తు పట్టకుండా చేద్దామని ప్రయత్నించానని పోలీసుల విచారణలో తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నగరంలోని రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఓ హాస్టల్‌లోని మూడవ అంతస్తుపై నుంచి దూకి విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. టీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థి విక్రమ్ ఫోర్త్ ఇయర్ చదువుతున్నారు. 20 బ్యాక్‌లాగ్స్ ఉండటంతో మనస్తాపానికి గురై ఈ ఘటనకు పాల్పడ్డాడు. మంచిర్యాలకు చెందిన విద్యార్థిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు పోలీసుల దర్యాప్తులో ఉంది.

తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

ఫైల్ నెం.జి2/894/2018 తేది : 06-03-2018
గెజిట్ ఆర్.ఆర్.నెం.44 తేది : 06-03-2018

ఫారం-సి

(చట్టం యొక్క సెక్షన్ 11 క్రింద 10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు)
(రూల్ 6/12 చూడుడు)

ప్రాథమిక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వం / కలెక్టరు వారు ప్రజా ప్రయోజనార్థం అనగా **ఎన్‌హెచ్ఎఐ** కొరకు రంగారెడ్డి జిల్లా, చేవెళ్ళ మండలం, నాంచేరి గ్రామంలో మొత్తం ఎ.**5-33**గుం.ల భూమి అవసరమై ఉన్నదని భావించుచున్నారు.
కావున పైన తెలిపిన సదరు ప్రాజెక్టు నిమిత్తం రంగారెడ్డి జిల్లా, చేవెళ్ళ మండలం యొక్క నాంచేరి గ్రామములో ప్రామాణిక కొలత యొక్క ఎ.**5-33**గుం.ల కొద్దిగ ఎక్కువ లేదా తక్కువ భూమిని నోటిఫై చేయడం జరిగినది. స్వాధీనతకు ప్రతిపాదించిన దాని యొక్క వివరణాత్మక వివరం దిగువ తెలుపబడినది.

క్రమ సంఖ్య	సర్వే నెం.	టైటిల్ రకం	భూమి రకం	సేకరణ విస్తీర్ణం (ఎ. లలో)	ఆసక్తిగల వ్యక్తి పేరు & చిరునామా	సరిహద్దులు ఉ	తూ	ప	ద	చెట్లు రకం	సంఖ్య	నిర్మాణాలు రకం	విస్తీర్ణం	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
1	58	పట్టా	మెట్ట	0-05	గొటూరి గాలయ్య	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	-
2	58	పట్టా	మెట్ట	0-01.5	గొటూరి లత	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
3	58	పట్టా	మెట్ట	0-04	టి. మాదురి	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
4	58	పట్టా	మెట్ట	0-01.5	అంతారం అంజయ్య	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
5	58	పట్టా	మెట్ట	0-02	కొండ రాధిక రెడ్డి	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
6	58	పట్టా	మెట్ట	0-03	ఎండి. రియాజ్	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
7	58	పట్టా	మెట్ట	0-00.5	రోడ్డు	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
8	58	పట్టా	మెట్ట	0-01.5	సామ వెంకట్‌రెడ్డి	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
9	58	పట్టా	మెట్ట	0-01	గొటూరి రాజేందర్	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
10	58	పట్టా	మెట్ట	0-01	గొటూరి రాములు	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
11	58	పట్టా	మెట్ట	0-03	సురేందర్ రెడ్డి చెన్నయ్య, ఆశోక్	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
12	58	పట్టా	మెట్ట	0-01.5 ఆర్‌సిసి ఇల్లు	వడ్ల సావిత్రి	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
13	58	పట్టా	మెట్ట	0-00.5 ఓపెన్ ప్లాట్	గొటూరి మల్లేష్	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
14	58	పట్టా	మెట్ట	0-00.5	రోడ్డు	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
15	58	పట్టా	మెట్ట	0-03	బి. మహిపాల్ రెడ్డి కె. అరుణ	58	ఆలూర్ II	రోడ్డు	రోడ్డు	-	-	-	-	
16	56	పట్టా	మెట్ట	0-00.5	ఊతకంటి వెంకటయ్య	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
17	56	పట్టా	మెట్ట	0-01 ఆర్‌సిసి ఇల్లు	గడమీది పెంటమ్మ	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
18	56	పట్టా	మెట్ట	0-01 ఆర్‌సిసి ఇల్లు	గడ్డమీది శివ రాములు	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
19	56	పట్టా	మెట్ట	0-00.5 ఆర్‌సిసి ఇల్లు	సిద్దులూరి రతన	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
20	56	పట్టా	మెట్ట	0-01 ఆర్‌సిసి ఇల్లు	సిద్దులూరి శంకరయ్య	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
21	56	పట్టా	మెట్ట	0-01 ఆర్‌సిసి ఇల్లు	సిద్దులూరి శంకరయ్య	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
22	56	పట్టా	మెట్ట	0-01 ఆర్‌సిసి ఇల్లు	గడ్డమీది నారాయణ	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
23	56	పట్టా	మెట్ట	0-01 ఆర్‌సిసి ఇల్లు	గడ్డమీది పెంటయ్య	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
24	56	పట్టా	మెట్ట	0-01	రోడ్డు	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
25	56	పట్టా	మెట్ట	0-01 ఓపెన్ ప్లాట్	జి. మల్లేష్	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
26	56	పట్టా	మెట్ట	0-01 ఓపెన్ ప్లాట్	పి. దయానందం	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
27	56	పట్టా	మెట్ట	0-01 ఆర్‌సిసి ఇల్లు	గొటూరి పెంటయ్య	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు		-	-	-	-	
28	56	పట్టా	మెట్ట	0-00.5	గొటూరి పెంటయ్య	రోడ్డు	57	గ్రామ సరి హద్దు నాయి చెరువు	56	-	-	-	-	
29	57	పట్టా	మెట్ట	0-00.5	గొటూరి పెంటయ్య	రోడ్డు	59	56	57	-	-	-	-	
30	57	పట్టా	మెట్ట	0-00.5	గొటూరి పెంటయ్య	59	56	57	59	-	-	-	-	
31	57	పట్టా	మెట్ట	0-01 ఆస్‌బెస్టాస్ తో ఇల్లు	మామిడిపల్లి పెంటయ్య	59	56	57	59	-	-	-	-	
32	57	పట్టా	మెట్ట	0-01 ఆర్‌సిసి ఇల్లు	నక్కలపల్లె విఠలయ్య	59	56	57	59	-	-	-	-	
33	57	పట్టా	మెట్ట	0-01.5	రోడ్డు	59	56	57	59	-	-	-	-	
34	57	పట్టా	మెట్ట	0-02.5 ఓపెన్ ప్లాట్	ప్రభు, సత్తి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి	59	56	57	59	-	-	-	-	
35	57	పట్టా	మెట్ట	0-00.5 ఓపెన్ ప్లాట్	అమరేందర్	59	56	57	59	-	-	-	-	
36	57	పట్టా	మెట్ట	0-01	రోడ్డు	59	56	57	59	-	-	-	-	
37	57	పట్టా	మెట్ట	0-00.5	అంతారం అనురాధ	59	56	57	59	-	-	-	-	
38	59	పట్టా	మెట్ట	0-00.5	అంతారం అనురాధ ఎసిసి చికెన్ షాప్	రోడ్డు	61	57	59	-	-	-	-	
39	59	పట్టా	మెట్ట	0-07.5	అంతారం నర్సింలు	రోడ్డు	61	57	59	-	-	-	-	
40	59	పట్టా	మెట్ట	0-12	గొటూరి పెంటయ్య	రోడ్డు	61	57	59	-	-	-	-	
41	59	పట్టా	మెట్ట	0-13	రేణుక దేవి	రోడ్డు	61	57	59	-	-	-	-	
42	59	పట్టా	మెట్ట	0-12	గొటూరి శంకరయ్య పెంటయ్య, మల్లేష్	రోడ్డు	61	57	59	-	-	-	-	
43	59	పట్టా	మెట్ట	0-19	పి. గండయ్య	రోడ్డు	61	57	59	-	-	-	-	
44	59	పట్టా	మెట్ట	0-01	రోడ్డు	రోడ్డు	61	57	59	-	-	-	-	
45	59	పట్టా	మెట్ట	0-17.5	గొటూరి పెంటయ్య, గొటూరి చంద్రయ్య	రోడ్డు	61	57	59	-	-	-	-	
46	61	పట్టా	మెట్ట	0-18	రాజ లింగం గౌడ్	రోడ్డు	62	59	61	-	-	-	-	
47	61	పట్టా	మెట్ట	0-19	అంతారం అంజయ్య అంతారం విఠలయ్య	రోడ్డు	62	59	61	-	-	-	-	
48	62	పట్టా	మెట్ట	0-11	ఖాజ జమాల్ షరీఫ్	రోడ్డు	మీర్జా గూడ	61	62	-	-	-	-	
49	62	పట్టా	మెట్ట	0-05	చెనుపాటి వేణు మాదవ్	రోడ్డు	మీర్జా గూడ	61	62	-	-	-	-	
50	62	పట్టా	మెట్ట	0-13	మహ్మద్ ముర్తజా	రోడ్డు	మీర్జా గూడ	61	62	-	-	-	-	
51	62	పట్టా	మెట్ట	0-28	ఎం.డి. [illegible]	రోడ్డు	మీర్జా గూడ	61	62	-	-	-	-	
52	62	పట్టా	మెట్ట	0-03	రోడ్డు	రోడ్డు	మీర్జా గూడ	61	62	-	-	-	-	

మొత్తం ఎ.5-33 గుం.లు

భూసేకరణలో పారదర్శకం, న్యాయబద్ధమైన నష్టపరిహారం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ యొక్క హక్కు సెక్షన్ 11 (1) క్రింద మరియు భూసేకరణలో పారదర్శకం, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంటు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017) ప్రకారం సంబంధించిన వారందరికీ తెలియచేయడమైనది.

భూమి యొక్క ప్లాను జిల్లా కలెక్టర్ & రంగారెడ్డి జిల్లా వారి కార్యాలయములో ఏదేని పని దినమున కార్యాలయ వేళలయందు పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్ -కమ్-సరియగు ప్రభుత్వం సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు పేర్కొన్నట్లుగా వారి పనిని సరిగా నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే, ఏదేని భూమి యొక్క లెవెల్స్ చేపట్టుటకు, త్రవ్వుటకు లేదా సబ్‌సాయిల్ లోకి బోరు వేయుటకు మరియు ప్రవేశించుటకు రెవెన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ళ డివిజన్ మరియు అతని సిబ్బందికి అధికారం మిచ్చియున్నారు.

చట్టం యొక్క సెక్షన్ 11 (4) క్రింద కలెక్టరు యొక్క ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి అటువంటి భూములపై ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏవేని లావాదేవీ లేదా భూమి యొక్క ఏదేని లావాదేవికి కారణం అగుటకు అనగా అమ్మకం / కొనుగోలు మొ॥ లేదా ఏవేని తాకట్టు రుణభారాలను చేయరాదు.

సేకరణకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తిగల/ప్రభావిత వ్యక్తులందరి నుండి క్లెయింలను జిల్లా కలెక్టర్/ అధీకృత అధికారి వారి సమక్షంలో చట్టం యొక్క సెక్షన్ క్రింద ఇవ్వబడిన విధంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (అరవై రోజులు) లోపు భూమిలో ఆసక్తిగల వ్యక్తులచే దాఖలు చేసుకోవచ్చును.

రెవిన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ళ డివిజన్, రంగారెడ్డి జిల్లా | జాయింట్ కలెక్టర్, రంగారెడ్డి జిల్లా | కలెక్టర్, రంగారెడ్డి జిల్లా

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు

● చెత్తను కాల్చివేస్తూ చేతులు దులుపుకుంటున్న పంచాయతీలు

● రాష్ట్రవ్యాప్తంగా ఇదే తంతు ● పూర్తికాని డంపింగ్ యార్డులు ● పట్టించుకోని సంబంధిత అధికారులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: చెత్తను ఎట్టి పరిస్థితుల్లోనూ తగలబెట్టరాదనే గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను రాష్ట్రంలోని పలు పంచాయతీలు బేఖాతరు చేస్తున్నాయి. అక్కడికక్కడే వాటిని కాల్చివేస్తూ పంచాయతీలు చేతులు దులుపుకుంటున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై చాలాసార్లు ఫిర్యాదులు అందినా సంబంధిత శాఖ అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో టన్నుల కొద్దీ పేరుకుపోతున్న చెత్తను తొలగించడం దానిని కాల్చి వేయడం ఒకటే పరిష్కారంగా పంచాయతీ పాలకవర్గాలు భావిస్తున్నాయి.



శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు

పర్యావరణానికి ప్రజల ఆరోగ్యాలకు తీవ్ర విఘాతం కలిగించే ఇలాంటి చర్యలపై అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెత్త సమస్యను పరిష్కరించే పద్దతులపై రాష్ట్ర స్థాయిలో ప్రణాళికను తయారుచేసి పంపాలంటూ గ్రీన్‌ట్రిబ్యునల్ చేసిన సూచనకూడా ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. చెత్తన కాల్చి చేసినప్పుడు వెంటనే వెలువడే వాయువులు పరిసర ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. దీనివల్ల శ్వాసకోశ వ్యాధులతో పాటు కళ్లకు సంబంధించిన సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వ్యవసాయ వర్సిటీలో క్రీడా పోటీలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా, సాంస్కృతిక, సాహితీ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ పరిధిలోని 13 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి, అతిథులకు గౌరవవందనం సమర్పించారు. అలాగే విద్యార్థులను ముఖాముఖిగా కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా సుధీర్ కుమార్ మాట్లాడుతూ, క్రీడలలో గెలుపోటములతో ప్రమేయం లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో విద్యతోపాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. చదువుతోపాటు క్రీడలలోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. అన్ని పాలిటెక్నిక్‌లలోనూ క్రీడల కోసం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సుధీర్‌కుమార్ చెప్పారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలలో ఆరు విభాగాలలో బాలురకు, ఐదు విభాగాలలో బాలికలకు పోటీలు నిర్వహిస్తారు. అలాగే ఆరు విభాగాలలో అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నారు. 260 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొంటారు.ఈ కార్యక్రమంలో కంప్ట్రోలర్ డాక్టర్ కేవీఎస్ మీనాకుమారి, డీఎస్ఏ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ పాలిటెక్నిక్ డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల చిల్లర రాజకీయం

మండిపడ్డ టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: బిజెపి రాష్ట్రనేతలు చిల్లర రాజకీయం చేస్తున్నారని.. తెలంగాణలో బిజెపి క్షుద్ర రాజకీయాలు నడవవని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. మోడీ వచ్చాక అచ్చేదిన్ కాకుండా జనం చచ్చేదిన్ వచ్చిందన్నారు. కెసిఆర్, మోడీలలో ఎవరి పాలన బాగుందో.. ప్రజలకు తెలుసునన్నారు. ప్రగతిభవన్‌ను కాదని.. ఏడుమండలాలు ఎపిలో కలిపిన ప్రధాని ఇంటిముందు ధర్నా చేయాలన్నారు. తెలంగాణలో బిజెపికి పుట్టగతులుండవన్నారు.

పొత్తుతో లాభపడింది తెదేపానే

భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సుధీష్ రాంబొట్ల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తమతో పొత్తు కారణంగానే ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా అధికారంలోకి రాగలిగిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సుధీష్ రాంబొట్ల వ్యాఖ్యానించారు. అయినప్పటికీ ఆ పార్టీ నేతలు మిత్ర ధర్మం పాటించకుండా భాజపాపై నిందలు వేయడం దారుణమన్నారు.మంగళవారం నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధీష్‌రాంభొట్ల మాట్లాడుతూ, ఏపీకీ ప్రత్యేక హోదాగా సమానంగా ప్యాకేజీని ప్రకటించినప్పటికీ తెలుగుదేశం పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. 14వ ఆర్థిక సంఘం వచ్చిన తరువాత ఏ రాష్ట్రా నికి ప్రత్యేక హోదా కల్పించలేమని కేంద్రం స్పషం చేసిందన్నారు. ఇది వరకే ప్రత్యేక హోదా పొందిన రాష్ట్రా లు ప్రస్తుతం ఆయా రాష్ట్రా ల్లో జరుగుతున్న అభివద్ధి పనులను ఆటంకం కలుగుకుండా చూడాలని నీతిఆయోగ్‌ను కోరాయన్నారు. దీనికి సబ్‌గ్రూప్ ఆఫ్ చీఫ్ మినిస్టర్స్ కమిటీ కూడా రికమండ్ చేసిందన్నారు. కానీ తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యేక హోదా స్థానంలో అనేక విజ్ఞప్తులు చేసిందని.... వాటిని నెరవేర్చడానికి కేంద్రం ఇప్పటికీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు కూడా కేంద్రం నుంచి నిధులు కావాలని కోరడం తగదన్నారు.

'ప్రజల్ని మోసం చేస్తున్న కేసీఆర్'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భాగ్యనగరంలో రోడ్లపై పడిన గుంతలను పూడ్చలేని ముఖ్యమంత్రి కేసీఆర్.....దేశాన్ని ఎలా ఉద్దరిస్తాడని భాజపా ప్రశ్నించింది. నాలుగేళ్ళ తెరాస పాలనలో రాష్ట్రా నికి ఒరిగిన ప్రయోజనం ఏమిటో కేసీఆర్ ముందుగా చెప్పాలని డిమాండ్ చేసింది.మంగళవారం నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి, మీడియా కమిటీ కన్వీనర్ సుధాకర్‌శర్మ తదితరులు మాట్లాడుతూ, కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. పూటకో మాట మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్ కొత్తగా థర్డ్ ఫ్రంట్ పల్లకిని మోస్తున్నారని వ్యంగ్యాస్త్రాలను సంధించారు. వామపక్షాల కుంచుకోటల్లో సైతం భాజపా పాగా వేస్తూ.....అన్ని రాష్ట్రా ల్లో విజయం కమలం సాధిస్తున్న విజయాలను చూసి కేసీఆర్ భయం పట్టుకున్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు పుత్రోత్సాహం ఎక్కువై....కేటీఆర్‌ను సిఎం కుర్చీలో కూర్చోపెట్టుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ మోదీ సర్కార్‌పై లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేస్తూ.... కేంద్రం అధికారాలను ప్రశ్నిస్తే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. రాజ్యాంగం రాసిన అంబేద్కర్ కంటే కేసీఆర్ గొప్పవాడా? అని వారు ప్రశ్నించారు. పైగా చైనాను ఆదర్శంగా తీసుకుని భారత్‌ను అభివృద్ధి చేస్తామని కేసీఆర్ చెబుతుంటే...విస్మయం కలుగుతోందన్నారు. అక్కడ ఉన్న రాజకీయ పరిస్థితులు వేరు...ఇక్కడ వేరన్న విషయాన్ని కేసీఆర్ గుర్తు పెట్టుకోవాలన్నారు. చైనాను ఆదర్శంగా చేసుకునే ఇందిరాపార్కు వద్ద ఉన్న ధర్నాచౌక్‌ను ఎత్తివేశారా? అలాగే గిట్టుబాట ధరల కోసం ఆందోళన చేసిన రైతులకు బేడీలు..మల్లన్నసాగర్ ప్రాజెక్టు భూనిర్వాసితులను జైళ్ళకు పంపారా? అని ప్రశ్నించారు.

మోడల్ స్కూళ్లలో సీట్ల కోసం పోటీ

ఏప్రిల్ 15తేదిన ప్రవేశ పరీక్ష

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని మోడళ్ల స్కూళ్లలో సీట్ల కోసం విద్యార్థులు పోటీపడుతున్నారు. గతంలో ప్రభుత్వ స్కూళ్లంటే ఆమడదూరంలో ఉండే పిల్లల తల్లీదండ్రులు ప్రస్తుతం మోడల్ సూళ్ల రాకతో వాటిపై మొగ్గు చూపుతున్నారు. మోడళ్ల స్కూళ్లలో ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలతో పాటు అక్కడ బోధించే విధానం ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ఉందని పలు రాష్ట్రాలు సైతం కితాబునిచ్చాయి. దీంతో ఈ పాఠశాలలకు తమ పిల్లలను పంపించాలని తల్లీదండ్రులు క్యూ కడుతున్నారు. గడిచిన రెండేళ్లలో వందలసంఖ్యలో కొత్తగురుకులాలు వచ్చినా మోడల్ స్కూళ్లకు ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. 2018-19 సంవత్సరానికి గాను ఖాళీ సీట్ల కోసం ఏకంగా 1,12,097 మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణలో మొత్తం 194 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో వంద పాఠశాలల్లో కేవలం బాలికలకు మాత్రమే వసతి సౌకర్యం ఉంది. మిగిలిన పాఠశాలలు డే స్కాలర్‌గా కొనసాగు తున్నాయి. 2018-19 సంవత్సరానికి గాను జనవరి 23 వ తేదీ నుంచి ఆన్‌లైన్లో విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

ఉద్యమ మహిళలందరికీ న్యాయం

టీఆర్ఎస్ మహిళావిభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న మహిళానేతలందరికీ న్యాయం జరుగుతుందని, ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వెలుగొందుతున్నారని టిఆర్ఎస్ మహిళావిభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి అన్నారు. మంగళవారం టిఆర్ఎస్ మహిళావిభాగం ఆధ్వర్యంలో తెలంగాణభవన్‌లో మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించగా ఆమె అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణభవన్‌లో మహిళలకు పలు ఆటలపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కరీంనగర్ జడ్పీచైర్‌పర్సన్ తుల ఉమ, బొంతు శ్రీదేవి, మూల విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూలే స్కాలర్‌షిప్ పథకం పొడిగించాలి

మంత్రికి బీసీ సంఘం వినతి పత్రం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మహాత్మాజ్యోతిభా పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద మంజూరుచేస్తున్న రూ.20 లక్షల సహాయ పథకాన్ని సంతృప్తి స్థాయిలో (స్యాచురేషన్) పద్ధతిని వర్తింపచేయాలని మంత్రి జోగురామన్నకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని మంగళవారం అందించినట్టు ఓ ప్రకటనలో ఆ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ పథకం బీసీ విద్యార్థులకు వరం లాంటిదన్నారు. 2016-17 సంవత్సరంలో ప్రభుత్వం ఈ పథకం ప్రారంభించిందన్నారు. గత సంవత్సరం ఈ పథకంపై సరైన ప్రచారం లేకపోవడం వలన 150 మంది విద్యార్థులు మాత్రమే దీనికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. 2017-18 సంవత్సరానికి ఇప్పటికే 350 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, మరికొంతమంది దీని కోసం క్యూలో ఉన్నారని ప్రభుత్వం తేదీని పొడిగిస్తే మరింత మంది విద్యార్థులకు అవకాశం లభిస్తుందన్నారు.

హైదరాబాద్-నర్సాపూర్ -కాకినాడకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ - నర్సాపూర్, హైదరాబాద్ - కాకినాడ మధ్యన నాలుగు ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ - నర్సాపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 9న 18.50 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నర్సాపూర్‌లో 11వ తేదీన 19.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 06.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ ప్రత్యేక రైళ్లను నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, బీమవరం, పాలకొల్లు స్టేషన్‌లలో నిలుపుదల చేయడం జరుగుతుంది. హైదరాబాద్ - కాకినాడ ప్రత్యేక రైలు ఈ నెల 7వ తేదీన 18.50 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07.45 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 9వ తేదీన కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుండి 18.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ ప్రత్యేక రైళ్లను నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, బీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌లలో నిలుపుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

మరో 24 చెరువులు మంజూరు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : మిషన్‌కాకతీయ-4వ దశ ద్వారా మరో 24చెరువులు మంజూరుచేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కరీంనగర్ జిల్లాలో 17, ఖమ్మం జిల్లాలో 2, జనగాం జిల్లాలో 4, వరంగల్ జిల్లాలో 1 చెరువు మంజూరుచేస్తూ నీటిపారుదల శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

నీటివిడుదలకు కేఆర్ఎంబీ ఉత్తర్వులు

తెలంగాణకు 24.46, ఏపీకి 9.3 టిఎంసీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నాగార్జునసాగర్, శ్రీశైలంలో ఉన్న నీటిని త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ఆధారంగా రెండు రాష్ట్రాలకు కృష్ణా నదీయాజమాన్యబోర్డు ఉత్తర్వులు జారీచేసింది. మంగళవారం కెఆర్ఎంబి సభ్య కార్యదర్శి పరమేష్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు 9.3టిఎంసిలు, తెలంగాణకు 24.46టిఎంసిలు కేటాయిస్తూ ఉత్తర్వులలో పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలకు కలిపి 33.77టిఎంసిల విడుదలకు బోర్డు అంగీకరించింది. రెండు రాష్ట్రాల్లో ఉన్న నీటి అవసరాల ఆధారంగా ఈ విడుదల జరిగిందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. తెలంగాణ ఆగస్టు వరకు అవసరాల కోసం 46టిఎంసిలు కోరగా, ఎపి మే చివరి వరకు ఉండే అవసరాల కోసం 30.38టిఎంసిల నీటి విడుదల కోరింది. నీటి లభ్యత, ఇది వరకు జరిగినవాడకం దృష్టిలో పెట్టుకుని 66:34పద్దతిలో కేటాయింపులు చేశారు.

ఇంటర్ పరీక్షల్లో 18 మంది మాల్ ప్రాక్టీస్

24,103 మంది విద్యార్థుల గైర్హాజరు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 18 మంది మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడి పట్టుబడ్డారని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పరీక్షలకు 5,17,055 మంది విద్యార్థులకు గాను 4,92,952 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 24, 103 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. సెట్ సీ ప్రశ్నాపత్రాన్ని దీనికోసం ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. పరీక్షల నిమిత్తం వివిధ ప్రాంతాలకు అబ్జర్వర్లను పంపిందన్నారు. మంచిర్యాల-01, పెద్దపల్లి-01, కరీంనగర్-01, మహబూ బాబాద్-03, ఖమ్మం-01, నిజామాబాద్ -02, కామారెడ్డి-01, సూర్యాపేట-03, నాగర్‌కర్నూల్-05 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్లాస్టిక్ జెండాలు వాడొద్దు

ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: ప్లాస్టిక్‌తో తయారు చేసిన త్రివర్ణ పతాకాలను వాడొద్దన్న ప్రభుత్వ ఉత్తర్వు లను తుచ తప్పకుండా అమలు జేయాలని రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల కు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.ఈ మేరకు హైకోర్టు వెబ్‌సైట్ లో ఒక పబ్లిక్ నోటీసును విడుదల చేసింది. దాంతో పాటు జనవరిలో ప్రభుత్వం జారీ చేసి న ఉత్తర్వును కూడా పొందు పర్చింది. జనవరి 9వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అడ్వయిజరీని విడుదల చేసింది. త్రివర్ణ పతాకం కోట్లాది ప్రజల ఆశలూ, ఆశయాలకు ప్రతీక అని గౌరవించడం ప్రతిపౌరుని బాధ్యత అని పేర్కొంది.

అసోంలో ప్రమాదం.. ఇద్దరు హైదరాబాదీల మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అస్సాంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. భానుప్రకాష్ కెనరా బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అతని కుమారుడు వంశీతో పాటు మరో ముగ్గురితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో తండ్రీ, కుమారుడు అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా.. మరో ముగ్గురు గాయపడ్డారు.

బాచుపల్లిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రగ్స్‌రహిత నగరంగా తీర్చిదిద్దాలని ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా అవి ఫలించడం లేదు. పైపెచ్చు డ్రగ్స్ తయారీ, అమ్మకాలకు భాగ్యనగరం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. నగరంలోని బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌వోటీ పోలీసులు భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెంజిల్ సైనైడ్, 400 కేజీల అల్ప్రాజోలంను స్వాధీనపర్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. మత్తుపదార్థాలను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

ఫైల్ నెం.జి2/780/2018 తేది : 06-03-2018
గెజిట్ ఆర్.ఆర్.నెం.43 తేది : 06-03-2018

ఫారం-సి

(చట్టం యొక్క సెక్షన్ 11 క్రింద 10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు)
(రూల్ 6/12 చూడుడు)

ప్రాథమిక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వం / కలెక్టరు వారు ప్రజా ప్రయోజనార్థం అనగా **ఎన్‌హెచ్ఎఐ** కొరకు రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం, సజ్జనపల్లి గ్రామంలో మొత్తం విస్తీర్ణం ఎ.**00-38**గుం.ల భూమి అవసరమై ఉన్నదని భావించుచున్నారు.
కావున పైన తెలిపిన సదరు ప్రాజెక్టు నిమిత్తం రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం యొక్క సజ్జనపల్లి గ్రామములో ప్రామాణిక కొలత యొక్క ఎ.**00-38**గుం.ల కొద్దిగ ఎక్కువ లేదా తక్కువ భూమిని నోటిఫై చేయడం జరిగినది. స్వాధీనతకు ప్రతిపాదించిన దాని యొక్క వివరణాత్మక వివరం దిగువ తెలుపబడినది.

క్రమ సంఖ్య	సర్వే నెం.	టైటిల్ రకం	భూమి రకం	సేకరణ విస్తీర్ణం (చ.గ లలో)	ఆసక్తిగల వ్యక్తి పేరు & చిరునామా	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు రకం	సంఖ్య	నిర్మాణాలు రకం	విస్తీర్ణం	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
1	13	పట్టా	మెట్ట	00-38	1. పెరుమంచి శ్రీధర్ వర్మ తండ్రి నరసరాజు 2. మహ్మద్ అల్తాఫ్ హుస్సేన్ తండ్రి హరి హుస్సేన్	గ్రామ సరి హద్దు సజ్జన పల్లి	12	గ్రామ సరి హద్దు కనక మామిడి	గ్రామ సరి హద్దు కనక మామిడి	-	-	-	-	-

మొత్తం ఎ.00-38 గుం.లు

భూసేకరణలో పారదర్శకం, న్యాయబద్ధమైన నష్టపరిహారం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ యొక్క హక్కు సెక్షన్ 11 (1) క్రింద మరియు భూసేకరణలో పారదర్శకం, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంటు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017) ప్రకారం సంబంధించిన వారందరికీ తెలియచేయడమైనది.

భూమి యొక్క ప్లాను జిల్లా కలెక్టర్ & రంగారెడ్డి జిల్లా వారి కార్యాలయములో ఏదేని పని దినమున కార్యాలయ వేళలయందు పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్ -కమ్-సరియగు ప్రభుత్వం సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు పేర్కొన్నట్లుగా వారి పనిని సరిగా నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే, ఏదేని భూమి యొక్క లెవెల్స్ చేపట్టుటకు, త్రవ్వుటకు లేదా సబ్‌సాయిల్ లోకి బోరు వేయుటకు మరియు ప్రవేశించుటకు రెవెన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ళ డివిజన్ మరియు అతని సిబ్బందికి అధికారం మిచ్చియున్నారు.

చట్టం యొక్క సెక్షన్ 11 (4) క్రింద కలెక్టరు యొక్క ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి అటువంటి భూములపై ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏవేని లావాదేవీ లేదా భూమి యొక్క ఏదేని లావాదేవికి కారణం అగుటకు అనగా అమ్మకం / కొనుగోలు మొ॥ లేదా ఏవేని తాకట్టు రుణభారాలను చేయరాదు.

సేకరణకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తిగల/ప్రభావిత వ్యక్తులందరి నుండి క్లెయింలను జిల్లా కలెక్టర్/ అధీకృత అధికారి వారి సమక్షంలో చట్టం యొక్క సెక్షన్ క్రింద ఇవ్వబడిన విధంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (అరవై రోజులు) లోపు భూమిలో ఆసక్తిగల వ్యక్తులచే దాఖలు చేసుకోవచ్చును.

రెవిన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ళ డివిజన్, రంగారెడ్డి జిల్లా | జాయింట్ కలెక్టర్, రంగారెడ్డి జిల్లా | కలెక్టర్, రంగారెడ్డి జిల్లా

తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

ఫైల్ నెం.జి2/779/2018 తేది : 06-03-2018
గెజిట్ ఆర్.ఆర్.నెం.42 తేది : 06-03-2018

ఫారం-సి

(చట్టం యొక్క సెక్షన్ 11 క్రింద 10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు)
(రూల్ 6/12 చూడుడు)

ప్రాథమిక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వం / కలెక్టరు వారు ప్రజా ప్రయోజనార్థం అనగా **ఎన్‌హెచ్ఎఐ** కొరకు రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం, చెన్నషాపూర్ గ్రామంలో మొత్తం విస్తీర్ణం ఎ.**03-02**గుం.ల భూమి అవసరమై ఉన్నదని భావించుచున్నారు.
కావున పైన తెలిపిన సదరు ప్రాజెక్టు నిమిత్తం రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం యొక్క చెన్నషాపూర్ గ్రామములో ప్రామాణిక కొలత యొక్క ఎ.**03-02**గుం.ల కొద్దిగ ఎక్కువ లేదా తక్కువ భూమిని నోటిఫై చేయడం జరిగినది. స్వాధీనతకు ప్రతిపాదించిన దాని యొక్క వివరణాత్మక వివరం దిగువ తెలుపబడినది.

క్రమ సంఖ్య	సర్వే నెం.	టైటిల్ రకం	భూమి రకం	సేకరణ విస్తీర్ణం (చ.గ లలో)	ఆసక్తిగల వ్యక్తి పేరు & చిరునామా	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు రకం	సంఖ్య	నిర్మాణాలు రకం	విస్తీర్ణం	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
1	26	పట్టా	మెట్ట	0-26.5	కొండ ప్రవీణ్ రెడ్డి	గ్రామ సరి హద్దు చినషా పూర్	12	27	గ్రామ సరి హద్దు కనక మామిడి	-	-	-	-	-
2	26	పట్టా	మెట్ట	0-03.5	కంకర్ శ్రీధర్ రెడ్డి తండ్రి కె. ప్రభాకర్ రెడ్డి	గ్రామ సరి హద్దు చినషా పూర్	రోడ్డు	27	గ్రామ సరి హద్దు కనక మామిడి	-	-	-	-	
3	26	పట్టా	మెట్ట	0-30	కంకర్ జయంతి రెడ్డి తండ్రి ప్రదీప్ రెడ్డి	గ్రామ సరి హద్దు చినషా పూర్	రోడ్డు	27	గ్రామ సరి హద్దు కనక మామిడి	-	-	-	-	
4	27	పట్టా	మెట్ట	0-22	సుశీల్ డి. కపాడియా తండ్రి దీరజ్ లాల్ కపాడియా	గ్రామ సరి హద్దు చినషా పూర్	రోడ్డు	28	26	-	-	-	-	-
5	28	పట్టా	మెట్ట	01-00	సుశీల్ డి. కపాడియా తండ్రి దీరజ్ లాల్ కపాడియా	గ్రామ సరి హద్దు చినషా పూర్	రోడ్డు	గ్రామ సరి హద్దు కనక మామిడి	27	-	-	-	-	-

మొత్తం ఎ.03-02 గుం.లు

భూసేకరణలో పారదర్శకం, న్యాయబద్ధమైన నష్టపరిహారం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ యొక్క హక్కు సెక్షన్ 11 (1) క్రింద మరియు భూసేకరణలో పారదర్శకం, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంటు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017) ప్రకారం సంబంధించిన వారందరికీ తెలియచేయడమైనది.

భూమి యొక్క ప్లాను జిల్లా కలెక్టర్ & రంగారెడ్డి జిల్లా వారి కార్యాలయములో ఏదేని పని దినమున కార్యాలయ వేళలయందు పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్ -కమ్-సరియగు ప్రభుత్వం సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు పేర్కొన్నట్లుగా వారి పనిని సరిగా నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే, ఏదేని భూమి యొక్క లెవెల్స్ చేపట్టుటకు, త్రవ్వుటకు లేదా సబ్‌సాయిల్ లోకి బోరు వేయుటకు మరియు ప్రవేశించుటకు రెవెన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ళ డివిజన్ మరియు అతని సిబ్బందికి అధికారం మిచ్చియున్నారు.

చట్టం యొక్క సెక్షన్ 11 (4) క్రింద కలెక్టరు యొక్క ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి అటువంటి భూములపై ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏవేని లావాదేవీ లేదా భూమి యొక్క ఏదేని లావాదేవికి కారణం అగుటకు అనగా అమ్మకం / కొనుగోలు మొ॥ లేదా ఏవేని తాకట్టు రుణభారాలను చేయరాదు.

సేకరణకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తిగల/ప్రభావిత వ్యక్తులందరి నుండి క్లెయింలను జిల్లా కలెక్టర్/ అధీకృత అధికారి వారి సమక్షంలో చట్టం యొక్క సెక్షన్ క్రింద ఇవ్వబడిన విధంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (అరవై రోజులు) లోపు భూమిలో ఆసక్తిగల వ్యక్తులచే దాఖలు చేసుకోవచ్చును.

రెవిన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ళ డివిజన్, రంగారెడ్డి జిల్లా | జాయింట్ కలెక్టర్, రంగారెడ్డి జిల్లా | కలెక్టర్, రంగారెడ్డి జిల్లా

మేం అధికారంలోకి వస్తే

ఏపీకి ప్రత్యేక హోదా

● కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటన ● మోడీపై అందరం కలిసి ఒత్తిడి తెద్దాం ● హోదా వచ్చే వరకూ పోరాటం.. రఘువీరారెడ్డి ● పార్లమెంట్ స్ట్రీట్‌లో కాంగ్రెస్ ఆత్మగౌరవ దీక్ష సంఘీభావం తెలిపిన వామపక్షాలు, ఆప్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తాము అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. ప్రత్యేక హోదాకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. మంగళవారం పార్లమెంటు స్ట్రీట్ లో ఏపీ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షకు హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో తమ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారు. ప్రత్యేక హోదాకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రత్యేక హోదా కోసం అందరూ కలిసి కట్టుగా పోరాడి, మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదాను అమలు చేయాలని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వలేమని, పారిశ్రామిక రాయితీలు ఇవ్వలేమని రాజ్యసభలో కేంద్రం ఇచ్చిన సమాధానంలో తేల్చి చెప్పడం అనేది ద్రోహానికి పరాకాష్ట అని అన్నారు. నాలుగేళ్ళుగా జరుగుతున్న ద్రోహం పతాక స్థాయికి చేరిందన్నారు. యుటిలైజేషన్ సర్టిఫికెట్లు కూడా ఇప్పటివరకు ఇవ్వలేదంటే ఇది ప్రభుత్వమా లేక ప్రైవేట్ కంపెనీనా అర్థం కావట్లేదన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేమని తేల్చి చెప్పిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వంలో కొనసాగడం కరెక్ట్ కాదని చెప్పారు. ప్రాంతీయ పార్టీలతో ప్రత్యేక హోదా సాధ్యంకాదని, జాతీయపార్టీలతోనే ప్రత్యేకహోదా సాధ్యమని స్పష్టం చేశారు.ప్రత్యేక హోదా వచ్చే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారుకాంగ్రెస్ పార్టీ ఆందోళనకు వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. టీడీపీ, బీజేపీలు తోడు దొంగలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు.బస్సు యాత్రనా, మరోటా అన్నది అందరూ ఆలోచించాలని అన్నారు ప్రత్యేక హోదాపై చిత్తశుద్ధి ఉంటే, చంద్రబాబు అసెంబ్లీ సమావేశాలు వాయిదావేసి ఢిల్లీకి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. జగన్, పవన్ కళ్యాణ్ కూడా ఢిల్లీకి వచ్చి ఉద్యమించాలన్నారు. అందరూ కలిసి కట్టుగా మోడీని కలిస్తేనే ప్రత్యేక హోదా వస్తుందన్నారు. అరుణ్‌జైట్లీతో జరిగిన మీటింగ్‌కు అమిత్‌షా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. చలో పార్లమెంటు పేరుతో అందరూ అరెస్టయి జైలు కెళ్లి ఉద్యమిద్దామని అన్నారు. ధర్నాకు ఆమ్ ఆద్మీ పార్టీ నేత ఎమ్మెల్యే సోమనాథ్ భారతి హాజరై తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ధర్నాకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు పల్లంరాజు, సుబ్బరామిరెడ్డి, నాదెండ్ల మనోహర్, బాలరాజు, శైలజానాథ్, గిడుగు రుద్రరాజు, పనబాక కృష్ణయ్య తదితరులు హాజరయ్యారు.

కేంద్ర ప్రభుత్వం - ఆంధ్రప్రదేశ్ మధ్య

లెక్కల గోల!



పొంతనలేని అంకెలతో జనం తికమక

భిన్న వ్యూహాలు... భిన్న వాదాలతో వట్టిపోతున్న ఉద్యమం

హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: సాధారణ ఎన్నికలకు గడవు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ఉద్యమం ఊపందు కుంటోంది. గతెన్నికలకు ముందు సాగిన సమైఖ్య ఉద్యమం తరహాలో ఇప్పుడు హోదా కోసం అన్ని పక్షాలు పోరాటానికి నడుం కట్టాయి. అయితే ఇందులో ఎవరికి వారు పరస్పర నిందలేస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కోరకంగా లెక్కలు చెబుతున్నారు. ఎవరికి తోచింది వారు మాట్లాడేస్తున్నారు. దీంతో అసలేం జరుగుతోందో తెలీని అయోమయ స్థితి సాధారణ ప్రజల్లో నెలకొంది. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, వివిధ వర్గాలు చేస్తున్న ప్రకటనల్లో వాస్తవమెంతో తెలీక సామాన్యుడు సతమతమౌతున్నాడు. ఢిల్లీకెళ్ళిన ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు 16వేల కోట్ల రెవెన్యూ లోటుకు గాను 2,020కోట్లు మాత్రమే కేంద్రం నుంచొచ్చిందంటూ ప్రకటించారు. పవన్ అధ్యక్షతన జనసేన నియమించిన నిజనిర్ధారణ కమిటీ గత నాలుగేళ్ళ నిధుల విడుదలపై అధ్యయనం జరిపి రాష్ట్రానికి కేంద్రం నుంచి 70వేల కోట్లు రావాలంటూ తేల్చిచెప్పింది. మరోవైపు బిజెపి నాయకులు ఇప్పటికే రాష్ట్రానికి కేంద్రం నుంచి 15వేల కోట్లు వచ్చాయంటూ ప్రకటనలిస్తున్నారు. ఈ మొత్తం వినియోగానికి సంబంధించి ధృవీకరణ పత్రాలనందించడంలో రాష్ట్రం విఫలమైన కారణంగానే నిబంధనల మేరకు అదనపు నిధులు జారీ కావడంలేదంటూ స్పష్టం చేస్తున్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే జాతీయ రహదార్ల కోసం లక్ష కోట్లు ఇస్తున్నామన్న కేంద్ర ఉపరితరల రవాణాశాఖ మంత్రి ప్రకటన ఒట్టిపోయిందంటూ తెలుగుదేశం నాయకులు విమర్శిస్తున్నారు. వాస్తవానికి ఇందులో ఒక్క రూపాయి కూడా ఇంతవరకు రాష్ట్రానికి రాలేదంటూ తేల్చిచెబుతున్నారు.

ఇలా ఎవరికి వారు ఒక్కొక్కరు ఒక్కో మొత్తాన్ని ప్రకటిస్తుండడంతో అసలు రాష్ట్రానికి చట్టం మేరకు రావాల్సిందెంత ? ఎంతొచ్చింది ? ఇంకా వస్తుందా ? లేదా ? ఎందుకోసం ఈ ఉద్యమం చేయాలి ? అన్నదానిపై ప్రజల్లో స్పష్టత కొరవడింది. హోదా ఉద్యమం ఊపందుకున్న తరుణంలో బిజెపి సరికొత్త పల్లవందుకుంది. ఇంతవరకు చట్టం అంటూ సాకు చెప్పిన ఆ పార్టీ నాయకులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల ప్రధాని మోడీ చిత్తశుద్ధితో ఉన్నారంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. పార్లమెంట్‌లో చెప్పినా.. చెప్పకపోయినా.. చట్టంలో ఉన్నా.. లేకున్నా.. అప్పటి ప్రధాని ప్రకటన చేసినా.. చేయకపోయినా రాష్ట్రాన్ని ఇతర అభివృద్ధి చెందిన ప్రాంతాల్తో సరిసమాన స్థాయికి తెచ్చేవరకు ఆర్థికంగా ఆదుకోవాలన్న నిబద్ధత మోడీలో ఉందంటూ బిజెపి నాయకులు స్పష్టం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్రం ఆశించిన ప్రయోజనం ఏ మేరకు చేకూరుతుందన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. పరిస్థితి చూస్తే రాజకీయ పార్టీలన్నీ వచ్చే ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాలకనుగుణంగానే వ్యూహాలు అమలు చేస్తున్నట్లు తేటతెల్లమౌతోంది. పార్టీలన్నీ తమ జెండాల్ని పక్కనపెట్టి ఏకతాటిపైకొచ్చిరాష్ట్ర ప్రయోజనాల సాధనే ఏకైక అజెండాగా ఉద్యమిస్తే తప్ప ఆశించిన ప్రయోజనం నెరవేరదంటూ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రెవెన్యూ లోటు మీద ఎవరి గణాంకాలు వారివి
జాతీయ రహదారి నిధుల మీదా భిన్నస్వరాలు
రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు తలోదారి
ఏకైక ఎజెండాతో ఏకతాటి మీదికి రావాలి
మోడీని దారికి తెచ్చే ఉమ్మడి వ్యూహం ఉండాలి
లేకుంటే ప్రజలకు పార్టీలే జవాబుదారీ
మోడీని చిల్లరగా విమర్శిస్తే చివరికి చేటే

తెలంగాణా రాష్ట్రం కోసం అక్కడి రాజకీయ పార్టీలు అనుసరించిన వ్యూహాల్ని అధ్యయనం చేసి ఇక్కడా అమలు చేయాల్సిన ఆవశ్యకతుందని పేర్కొంటున్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం టిఆర్ఎస్ ఉద్యమానికి శ్రీకారం చుట్టినప్పటికీ ఆ రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఇందులో భాగస్వామ్యం వహించాయి. జెండాల్ని పక్కనపెట్టి తెలంగాణాయే అజెండాగా ముందుకురికాయి.

అందుకే సోనియా దిగిరాక తప్పలేదు. ఎందరు వ్యతిరేకించినా తెలంగాణాను ప్రకటించాల్సొచ్చింది. ఇలాంటి వ్యూహాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయలేని పక్షంలో అత్యంత శక్తివంతుడైన మోడీని లొంగదీసి ప్రయోజనాలు సాధించడం అసాధ్యమేనని వీరు పేర్కొంటున్నారు. సహజంగానే మోడీ చాలా మొండి వ్యక్తి. తాననుకున్నది తప్ప మరేదీ చేయడు. ఆషామాషీ వ్యక్తులకు తలొగ్గరు. చిన్నా చితకా వ్యూహాలకు చలించరు. మోడీ నైజం ఇప్పటికే దేశానికి తెలిసొచ్చింది. ఇందుకుతగ్గట్లే వ్యూహాలు సిద్ధం చేసి అమలు చేయాలని లేనిపక్షంలో మరో ఉద్యమం నిర్వహించినప్పటికీ ఆశించిన ఫలితాల్ని సాధించలేక భవిష్యత్‌లో రాష్ట్ర ప్రజలకు జవాబుదారీ కావాల్సిన పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరిస్తున్నారు. ఇటీవల తెలుగుదేశం పార్టీకి చెందిన చిన్నాచితక నాయకులు కూడా ప్రధాని మోడీని విమర్శిస్తూ ఫ్లెక్సీలేర్పాటు చేస్తున్నారు. ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. దీంతో రాజకీయ వాతావరణం కలుషితమౌతోంది. ఇలా వ్యక్తిగత ఆరోపణలకు దిగుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్న సాకుతో మోడీ రాష్ట్రంపై కక్షగట్టే ప్రమాదముంది. తమ పార్టీ చోటామోటా నాయకుల్ని అధినేత చంద్రబాబు అదుపు చేసి పరిస్థితి శృతిమించకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని వీరు సూచిస్తున్నారు.

ఒంటరి పోరుకు

సిద్ధమవ్వండి!

తెలంగాణ బీజేపీ శ్రేణులకు అమిత్‌షా సూచన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్, శాసనసభా పక్షనాయకుడు జి. కిషన్‌రెడ్డి తదితరులు మంగళవారం ఢిల్లీలో కలిసి చర్చలు జరిపారు. ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు....ముఖ్యమంత్రి కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్ దిశగా అడుగులు వేస్తున్న వైనంపై కూడా చర్చినట్లుగా తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో నెలకొన్న విభేదాల నేపథ్యంలో భాజపాతో తెదేపా తెగతెంపులు చేసుకునేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో..... తెలంగాణలోఒంటిరిగానే ఎన్నికలకు సిద్ధం కావాలని అమిత్‌షా వారికి దశా, దిశానిర్దేశం చేశారని తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేసుకుంటూనే....మరోవైపు అధికార తెరాస అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలపై పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు పార్టీకి మరింత చేరువుగా తీసుకెళ్ళడంతో పాటు కేంద్రంలో మోదీ సర్కార్ వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు కేంద్రం అందిస్తున్న సంపూర్ణ సహకారాలను కూడా ప్రజలకు వివరించే విధంగా కార్యచరణ ప్రణాళికలను రూపొందించాలని అమిత్‌షా వారికి స్పష్టం చేశారు. అలాగే త్వరలోనే తాను కూడా తెలంగాణలో పర్యటిస్తానని లక్ష్మణ్, కిషన్‌రెడ్డిలకు ఆయన వివరించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ఒక కార్యచరణ ప్రణాళిను రూపొందించాలని సూచించారు. తెలుగుదేశంతో కటీఫ్ అవుతున్న నేపథ్యంలో తెలంగాణలో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకోనున్నాయి....ఆ పార్టీతో జతకట్టే అవకాశమున్న రాజకీయ పార్టీలేవీ.....? తదితర అంశాలపై కూడా కూలంకషంగా చర్చించినట్లుగా తెలుస్తోంది.

మాకూ గొర్రెలు కావాలి

● ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి సచివాలయానికి తరలివచ్చిన గొల్ల, కుర్మలు ● సముదాయించి భరోసా ఇచ్చిన మంత్రి తలసాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశానికే ఆదర్శంగా నిలిచిన ప్రతిష్టాత్మకమైన సబ్సిడీ గొర్రెల పథకం ద్వారా తమకూ లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉమ్మడి మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లాకు చెందిన వందలాది మంది గొల్ల, కుర్మ సామాజిక వర్గానికి చెందినవారు మంగళవారం సచివాలయానికి తరలివచ్చారు. జిల్లానుంచి ప్రాతి నిధ్యం వహిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను కలిశారు. తెలంగాణ ప్రభుత్వం గొల్ల, కుర్మలకు సబ్సిడీపై అందజేస్తున్న గొర్రెలను తమకు కూడా ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం గొర్రెలను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ తాము కాంగ్రెస్ నాయకుల మాటలను విని గొర్రెలను తీసుకునేందుకు ఆసక్తి చూపలేదని, తమ తప్పిదాన్ని మన్నించి గొర్రెలను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కుల వృత్తులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఈ ప్రత్యేక పథకం లక్ష్యాలను వివరించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని తలసాని వారికి భరోసా ఇచ్చారు. వారందరినీ సముదాయించి ఒప్పించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ, తమ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి ఒక్క గొల్ల, కుర్మ కులస్తునికి గొర్రెలను పంపిణీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గొర్రెల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. గ్రామీణ కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేయూత ఇస్తూ ప్రోత్సహిస్తుందని ఆయన తెలిపారు. అందులో భాగంగానే రూ.5వేల కోట్ల ఖర్చుతో గొల్ల, కుర్మలకు గొర్రెల పంపిణీ చేస్తున్నదని, ఇప్పటి వరకు 47 లక్షలకుపైగా గొర్రెలను పంపిణీ చేసినట్లు వివరించారు. గొర్రెల పంపిణీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారిపట్ల ప్రభుత్వం చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అంతేకాకుండా జీవాల వద్దకే వైద్యం తీసుకువచ్చేందుకు 100 సంచార పశు వైద్య శాలలను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. 45 ఏళ్ళు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చేయలేని అభివృద్ధిని తెలంగాణ ప్రభుత్వం నాలుగేళ్ళలో చేసిందని చెప్పారు. పేద ప్రజల పిల్లలకు ఉన్నతమైన, నాణ్యమైన విద్యను అందించేందుకు గురుకుల విద్యాలయాలను ప్రారంభించిందని, మీ పిల్లలను అందులో చేర్పించి విద్యావంతులను చేయాలని సూచించారు.



టెక్నాలజీతోనే ప్రగతి సాధ్యం

కార్పొరేట్ దిగ్గజాలతో లోకేష్ మంతనాలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్దఎత్తున ఉపయోగిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు కార్పొరేట్ దిగ్గజాలు సంసిద్ధత వ్యక్తం చేశాయని రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం రాత్రి 11 గంటలకు ఢిల్లీ చేరుకున్న లోకేష్ మంగళవారం మారియట్ హోటల్‌లో వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు.

ఉ. 7 గంటలకు డెటాయిట్ ప్రతినిధులతో భేటీ

మొదట ఉదయం 7.30 గంటలకు డెలాయిట్ గ్లోబల్ సీఈవో పునీత్ రెంజెన్, డెలాయిట్ బృందంతో లోకేష్ సమావేశమయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం తక్కువగా ఉందని వారికి వివరించారు. కేవలం మూడున్నరేళ్లోనే సమస్యలను అధిగమించి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామని చెప్పారు. లక్ష్యాలు సాధించాలంటే 15 శాతం వృద్ధి సాధించాలి... ప్రస్తుతం 12 శాతం వృద్ధి సాధించామని చెప్పారు. పేపర్‌లెస్ గవర్నమెంట్‌ను అమలు చేస్తున్నామని లోకేష్ అన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించగలుగుతున్నామని, ఇంటర్నెట్ ప్రజలకు ప్రాథమిక హక్కుగా మారబోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జిన్‌పింగ్‌కు అపరిమిత పాలనాధికారాలు

భారత్‌కు అగ్నిపరీక్ష

● యూరేసియా దేశాలకు సరికొత్త సంక్లిష్ట సవాళ్లు ● సినో ఆర్థిక ఉచ్చులో ఇండియా పొరుగు దేశాలు ● డ్రాగన్ దూకుడుతో భారత్‌పై అదనపు ఒత్తిళ్లు ● అంతర్జాతీయ రాజకీయ ఆర్థిక నిపుణుల విశ్లేషణ

న్యూఢిల్లీ: అధ్యక్ష పదవికి పోటీచేయడంపై ఉన్న పరిమితిని తొలగిస్తూ చైనా కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం, ఆసియాలో భౌగోళిక రాజకీయాలను ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. తాజా చర్య చైనాతో సరిహద్దు పంచుకుంటున్న దేశాలను కలవరపాటుకు గురిచేస్తున్నది. జిన్‌పింగ్ హయాంలో పొరుగు దేశాలతో డ్రాగన్ దురుసుగా, దూకుడుగా వ్యవహరించడమే ఇందుకు ప్రధాన కారణం. అధ్యక్ష పదవికి ఎన్నిసార్లయినా పోటీచేసే అవకాశం కల్పించడం, నియంతృత్వ పోకడలకు దారితీస్తుందన్నది విశ్లేషకుల వాదన. అదే జరిగితే, ఇప్పటికే శక్తివంతమైన నేతగా ఎదిగిన జిన్‌పింగ్ వ్యవహారశైలి యుద్ధోన్మాదాన్ని ప్రేరేపించొచ్చు. మావో జెడాంగ్, డెంగ్ జియోపింగ్ తరహాలో జిన్‌పింగ్ ఒంటెద్దు పోకడలు పెచ్చుమీరే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, చైనా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బెల్ట్ రోడ్ ప్రాజెక్టు, చైనా-పాక్ ఆర్థిక నడవ విస్తరణ కార్యకలాపాలు వేగం పుంజుకునేందుకు తాజా పరిణామం ఊతం ఇస్తుంది. ఈ చర్య భారత్‌కు మరింత అసౌకర్యంగా మారనుంది. విదేశీ, రక్షణ విధానాలు, ఇండో - పసిఫిక్, హిందూ మహాసముద్రంపై పెత్తనం లేదా వాస్తవాధీన రేఖ విషయాల్లో వెనక్కితగ్గేది లేదంటూ జిన్‌పింగ్ ఇస్తున్న సంకేతాలు ఇండియాకు భద్రతాపరమైన సవాళ్లను విసురుతున్నాయి. మావో జెడాంగ్ బాటలో జిన్ పింగ్ వేస్తున్న అడుగులు యూరేసియా దేశాల్లో భౌగోళిక రాజకీయాలను మార్చివేసే పరిస్థితులు ఉన్నాయి. ఆ సినో-ఇండియా పోరు మిగతా ఆసియా దేశాలకు విస్తరిస్తాయన్న భయాలు లేకపోలేదు. దేశ అధ్యక్షుడిగా, సెంట్రల్ మిలటరీ కమిషన్‌కు చైర్మన్‌గానూ వ్యవహరిస్తున్న జిన్‌పింగ్ సైన్యాన్ని ఆధునిక యుద్ధశక్తిగా తీర్చిదిద్దే చర్యలు వేగవంతం చేయనున్నట్లు తెలుస్తోంది.

ఆసియా-యూరప్ దేశాల్లో నిర్మించ తలపెట్టిన కీలక మౌలిక ప్రాజెక్టులతో చైనా అర్థ బలాన్ని ప్రపంచం ముందు ప్రదర్శిస్తున్నది. ఈవిధమైన మెగా ప్రాజెక్టులను ఏ ఒక్కదేశమో చేపట్టడం సరైనది కాదంటూ అంతర్జాతీయ సమాజం అభ్యంతరాలు లేవనెత్తుతున్నది. ప్రతిపాదిత దేశంలో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారా ఆ దేశాన్ని రుణగ్రస్తురాలిని చేస్తున్నది. అంతేకాదు ఇది భద్రతాపర సమస్యలకు కారణం అవుతోందని ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. భారత సార్వభౌమత్వాన్ని అతిక్రమిస్తూ, బీఆర్ఐ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న చైనా-పాక్ ఆర్థిక నడవ కొత్త సవాళ్లను సృష్టిస్తోంది అని మనదేశం ఇప్పటికే గగ్గోలు పెడుతోంది. జిన్‌పింగ్ హయాంలో, సినో-పాక్ సంబంధాలు మరింత మెరుగయ్యే చాన్స్ ఉంది. చైనా ఆర్థి కసాయంపై ఆధారపడే క్రమంలో పాక్ సామంత దేశంగా మారే ప్రమాదం లేకపోలేదు.2018లో భూటాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాలు జాతీయ ఎన్నికలకు వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ యేడాది ఇండియాకు దౌత్యపరంగా సంక్లిష్టమే. ఇంకోవైపు మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ వ్యవహారశైలి కొత్త తలనొప్పులు సృష్టిస్తున్నది. ఆసియాపై పడగ విప్పుతున్న డ్రాగన్, ఆఫ్రికా, యూరప్ దేశాల్లోనూ ఇదేవిధమైన దూకుడు ప్రదర్శించాలని చూస్తోంది.ఇప్పటి వరకు పెత్తందారీ ధోరణుల వ్యాప్తిని నియంత్రించడంలో భారత్ కీలకంగా వ్యవహిస్తున్నది. ఇకపై భారత్ ప్రాధాన్యతను పరిమితం చేస్తూ, ఆధిపత్యం చెలాయించేందుకు చైనా తనవంతు ప్రయత్నాలు చేస్తుందన్నది విశ్లేషకుల అభిప్రాయం.

భారత్‌కు కొత్త సవాళ్లు

మావో బాటలో జిన్‌పింగ్ అడుగులు...

దౌత్య సంబంధాల్లో కీలక మలుపు?

జిన్‌పింగ్ మరింత కాలం అధికారంలో కొనసాగడం, ఆసియా భౌగోళిక పరిణామాలపై ప్రభావం చూపుతుంది. బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న ఇండియాకు ఇది మరింత ప్రతిబంధకం అయ్యే ప్రమాదం ఉంది.

ఇండో-చైనా పోటీ ఆసియాలోని మిగతా దేశాలకూ విస్తరించే అవకాశం లేకపోలేదు.

సెంట్రల్ మిలటరీ కమిషన్ చైర్మన్‌గా జిన్‌పింగ్ నేతృత్వంలో, యుద్ధ సామగ్రి విషయంలో ఆర్మీ మరింత సాంకేతికతను సంతరించుకుంటుందని అంచనా.

సీపీఈసీ, బీఆర్ఐపై ఆందోళనలు

బెల్ట్ రోడ్ మౌలిక ప్రాజెక్టుల (బీఆర్ఐ) పేరుతో ఆసియా, ఆఫ్రికా, యూరప్ దేశాల్లో చేపట్టిన ప్రాజెక్టు పనులకు ఊతం.

ఇండియా సార్వభౌమత్వానికి ఇబ్బంది కలిగించే, బీఆర్ఐ కింద నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక చైనా-పాకిస్తాన్ ఆర్థిక నడవ ప్రాజెక్టు మనకు సవాల్ కానుంది.

ఇరుగు... పొరుగు సంబంధాలపై ప్రభావం

జిన్‌పింగ్ అపరిమిత అధికారం వల్ల, భారత్‌కు పొరుగున ఉన్న దేశాలతో లోతైన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నం చైనా చేస్తుంది.

భూటాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో ఈ యేడాది జాతీయ ఎన్నికలు జరగనున్నాయి. అందువల్ల 2018 ఇండియాకు సంక్లిష్ట సంవత్సరం.

మాల్దీవుల రూపంలో భారత్‌కు కొత్త చిక్కు వచ్చిపడింది. ఆ దేశ అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ తన వైఖరి మార్చుకునే ప్రసక్తే లేదన్న సంకేతాలిచ్చారు.

చైనా-పాక్ సంబంధాల విస్తరణ కోసం జిన్‌పింగ్‌కు మరొక అవకాశం లభించింది. ఈ రెండు దేశాల సంబంధాలు ఇప్పటికే భారత్‌కు ప్రమాదకర హెచ్చరికలు చేస్తున్నాయి.

ప్రపంచ నలుమూలల నుంచి కమోడిటీస్ సేకరణకు చైనా దూకుడు పెంచే వీలుంది. ముఖ్యంగా, ఆఫ్రికా, యూరోసియా దేశాల్లో తన ప్రాబల్యాన్ని పెంచుకుంటుంది.



ఆగ్నేయాషియా... భారత్ విస్తృత స్నేహ సంబంధాలు కలిగివున్న ప్రాంతం. తద్వారా ఈ ప్రాంతంలో అధికార శక్తులను సమతూకంగా ఉంచేందుకు కృషిచేస్తున్నది. చైనా అధ్యక్ష పదవి కాలపరిమితి పెంపు నిర్ణయం మూలంగా, భారత్ ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది.

రిజర్వేషన్ల హక్కు రాష్ట్రాలదే

- రిజర్వేషన్ల వ్యవహారంలో కేంద్రం తీరుపై తెరాస నిరసన
- గాంధీ విగ్రహం వద్ద ధర్నా
- పార్లమెంట్ గేటు వద్ద ప్లకార్డులతో ఎంపీల ప్రదర్శన
- 50శాతం మించకూడదని రాజ్యాంగంలో ఎక్కడా లేదు: నిజామాబాద్ ఎంపీ కవిత
- సచార్ కమిటీ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయించుకునేలా రాజ్యాంగ సవరణ చేయాలంటూ తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీలు వరుసగా రెండో రోజు ఆందోళన కొనసాగించారు. సోమవారం కేవలం సభ లోపల ప్లకార్డులతో నిరసన చేపట్టిన ఎంపీలు, మంగళవారం పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. రిజర్వేషన్ల పెంపునకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం కల్పించాలన్న నినాదాలతో కూడిన ప్లకార్డులు పట్టుకున్నారు. లోక్‌సభా పక్షనేత జితేందర్ రెడ్డి నేతృత్వంలో ఎంపీలు కవిత, వినోద్, సీతారాం నాయక్, మల్లారెడ్డి, బూర నర్సయ్య గౌడ్ తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. సభ ప్రారంభమయ్యే సమయానికి లోపలికి వెళ్తూ పార్లమెంటు 1వ నెంబర్ గేట్ వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. అనంతరం సభ లోపలా మిగతా ఎంపీలతో కలిసి ఆందోళనలో పాల్పంచుకున్నారు. వెల్ లోపలకి దూసుకెళ్లి నినాదాలతో హోరెత్తించారు. టీఆర్ఎస్ ఎంపీలకు మద్ధతుగా ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా తెరాస నేతల ప్లకార్డు చేతబట్టి నిలబడ్డారు.

50 శాతం మించొద్దని రాజ్యాంగంలో ఎక్కడా లేదు: ఎంపీ కవిత

రిజర్వేషన్ల వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళన చేపట్టిన టీఆర్ఎస్ నేతల్లో ఎంపీ కవిత మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్లు మొత్తం 50 శాతం మించకూడదని రాజ్యాంగంలో ఎక్కడా లేదని అన్నారు. అయితే సుప్రీం కోర్టు మాత్రమే ఒక తీర్పులో 50 శాతం మించరాదని చెప్పిందని, అదే తీర్పులో ప్రత్యేక పరిస్థితుల్లో అవసరమైనప్పుడు 50 శాతం మించి ఇవ్వవచ్చని కూడా పేర్కొందని ఆమె గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో దళితుల కంటే కూడా అత్యంత వెనుకబడిన పరిస్థితుల్లో కొన్ని మైనారిటీ వర్గాలున్నాయని సచార్ కమిటీ నివేదిక చెబుతోందని అన్నారు. అందుకే ఆ సామాజికవర్గాలకు బీసీ రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఎస్టీ జనాభా ఎక్కువున్నందున ఎస్టీ రిజర్వేషన్ల శాతాన్ని పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసిందని ఆమె తెలిపారు. ఇవి మతపరమైన రిజర్వేషన్లు కావని, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలనుకుందని కవిత చెప్పారు. ఈ క్రమంలో రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ కల్పిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 16ను సవరించాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అలాగే విభజన చట్టంలో తెలంగాణకు హిమాచల్ ప్రదేశ్ తరహాలో పారిశ్రామిక రాయితీలు కల్పించే విషయం గురించి ప్రస్తావించారని, దీనిపైనా తాము పోరాడతామని ఆమె తెలిపారు.

రెండోరోజు దద్దరిల్లిన పార్లమెంటు

- వేర్వేరు అంశాలపై వివిధ పార్టీలు ఆందోళన
- ఉభయ సభలు వాయిదా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: విపక్షాల ఆందోళనతో రెండో రోజు పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చించాలని వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపాయి. రిజర్వేషన్ల కోటా పెంచాలని టిఆర్ఎస్, ఏపీ విభజన చట్టం హామీలు అమలు చేయాలని టీడీపీ, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్సిపి, కావేరి నదీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. ప్రశ్నోత్తరాల సమయం జరగకుండా అడ్డుకున్నారు. సభ కార్యకలాపాలు సాగేందుకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ పదే పదే విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు పట్టించుకోకపోవడంతో సభను మధ్యాహ్నం 12గం.లకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన అనంతరం కూడా అదే పరిస్థితి కొనసాగింది.కాంగ్రెస్ పార్టీ ప్రస్తావించిన బ్యాంకు కుంభకోణాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గందరగోళం మధ్య కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ తెలిపారు. చర్చ జరగకుండా సభను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. రూల్ 193 కింద ఇచ్చిన నోటీసుపై చర్చను ఇప్పటికే అనుమతించినా, ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగారు. బ్యాంకు కుంభకోణాలు యూపీఏ హయాం నుంచే కొనసాగుతున్నాయని, ఈ అంశాలన్నింటిపైనా తాము చర్చించేందుకు రెడీగా ఉన్నామన్నారు. అయితే చర్చను రూల్ 52కింద జరపాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. బ్యాంకులు దోపిడీ చేసి విదేశాలకు పారిపోతున్న వారిని ఎందుకు పట్టుకోవడం లేదని ప్రశ్నించారు. తినను, తిననివ్వను అంటున్న ప్రభుత్వం ఆచరణలో విఫలమైందన్నారు. విపక్షాల సభ్యులు తమ అంశాలపై పెద్ద పెట్టున నినాదాలు చేస్తుండడంతో సభ కార్యకలాపాలు ముందుకు సాగలేదు. దాంతో సభను బుధవారానికి వాయిదా వేశారు.

ఇటు రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళన కొనసాగించాయి. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని పార్లమెంటరీ వ్యవహారాల సహాయమంత్రి విజయ్‌గోయల్ చెప్పారు. చర్చ నుంచి కాంగ్రెస్ పారిపోతుందని అన్నారు. ఫైనాన్స్ బిల్లుపై చర్చించాల్సిన అవసరం ఉందని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు ,సభను సజావుగా నడిపించేందుకు సహకరించాలని రాజ్యసభ ఛైర్మన్ పదే పదే వెంకయ్య నాయుడు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఎగువ సభ ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. సభ్యులు తమ స్థానాలకు వెళ్లాలని, ప్లకార్డులు ప్రదర్శించవద్దని విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో సభను పదేపదే వాయిదా వేయాల్సి వచ్చింది. తిరిగి మధ్యాహ్నం సభ ప్రారంభమైన తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగింది.

హోదా లేదు.. ప్యాకేజీనే

- ఈశాన్య రాష్ట్రాలకు కల్పిస్తున్న రాయితీలు ఏపీకి ఇవ్వలేం
- సెంటిమెంట్ అంశాలను ప్రస్తావించొద్దు
- ఇప్పటికే రూ. 12,500 కోట్లు ఇచ్చాం.. ఐనా లెక్క చెప్పలేదు
- జీఎస్టీ రీఫండ్, ఇన్సెంటివ్ అడగవద్దని హితవు
- అదనపు రాయితీలు కుదరదు
- కేంద్ర ఆర్థికశాఖ ప్రకటన



న్యూఢిల్లీ/హైదరాబాద్/అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ విషయంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ చేతులెత్తేసింది. ఏపీ కోరివన్నీ ఇస్తూపోతే మిగతా రాష్ట్రాలు ఊరుకుంటాయా అంటూ పాత పాటనే మళ్ళీ పాడింది. తనను కలిసిన ఏపీ టిడిపికి చెందిన ప్రత్యేక బృందానికి ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ ఖరాఖండిగా తేల్చిచెప్పేసింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ గతంలో చెప్పినట్లే రెవెన్యూ లోటు, ఈఏపీ మాత్రమే ఇవ్వగలమని జిఎస్టీ రీఫండ్, ఇన్సెంటివ్స్ వంటి అడగనే వద్దని చెప్పింది. ఏపీకి అదనపు రాయితీలు ఇవ్వడం కుదరని పని అని, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని జైట్లీ స్పష్టత ఇచ్చినట్టు సమాచారం. తమ రాష్ట్ర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, అర్థం చేసుకుని ప్రత్యేక రాష్ట్రంగా పరిగణించి నిధులు ఇవ్వాలని ఏపీ తెదేపా ఎంపీలు చేస్తున్న డిమాండ్‌ను కేంద్రం తోసిపుచ్చింది. ఇప్పుడు మీకు ఇస్తే మిగతా రాష్ట్రాలు కూడా అడుగుతాయి, రాష్ట్రాలు అడిగినవన్నీ ఇచ్చుకుంటూ పోతే కేంద్రం దగ్గర మిగిలేదీ ఏమీ ఉండదని కేంద్ర ఖజానా ఖాళీ అయితే రక్షణ వ్యవస్థకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించినట్టు సమాచారం.

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చని కేంద్ర ఆర్థికశాఖ వర్గాలు తేల్చిచెప్పాయి. ప్రత్యేక హోదాకన్నా గతంలో ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ అమలే ఉత్తమమని ఆ వర్గాలు వెల్లడించాయి. ప్యాకేజీని మాత్రమే అమలుచేసి మిగిలిన హామీలు అమలు చేయడం సాధ్యం కాదన్న విషయాన్ని కుండబద్ధలు కొట్టాలని ఆ వర్గాలు ఒక అంచనాకు వచ్చినట్టు సమాచారం. సోమ వారం రాత్రి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీతో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన కేంద్ర సహాయ మంత్రి సత్య నారాయణ చౌదరి, ఏపీ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావు సమావేశమై రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఇవ్వాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంతో పాటు విభజన చట్టంలోని అనేక కీలక ప్రతిపాదనలపై ఏపీకి చెందిన ప్రజా ప్రతినిధులు జైట్లీతో చర్చించారు. ఈ చర్చలు అసంపూర్తిగా ముగిసిన నేపథ్యంలో కేంద్ర ఆర్థికశాఖ మంగళవారం సాయంత్రం ప్రత్యేక హోదాతో పాటు మిగిలిన అంశాలపై మీడియాకు లీక్‌లను ఇచ్చింది. హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీకే ఆర్థికశాఖ మొగ్గు చూపుతోందని ఆ లీక్ సారాంశం. ఈశాన్య రాష్ట్రాలకు కల్పిస్తున్న రాయితీలు ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఇస్తే వెనకబడిన రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రా లకు కూడా ఇవ్వవలసి ఉంటుందని ఆర్థికశాఖ తెలిపింది.

ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నేతలు తెలుగువారి ఆత్మ గౌరవమంటూ రాజకీయ వేడిన రగులుస్తున్నారని ఇలాంటి సెంటిమెంట్ అంశాలకు లొంగితే తమిళనాడు, కేరళ రాష్ట్రాలు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించే అవకాశం ఉందని కేంద్రం భావిస్తున్నట్టుగా ఆర్థికశాఖ అధికారులు తెలిపారు. హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని పన్ను రాయితీలు ఇవ్వడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. రక్షణ శాఖకు కూడా అన్ని డబ్బులు ఎందుకని అడుగుతారని కూడా ఆర్థికశాఖ తెలిపింది. ఇప్పుడేమీ యుద్ధాలు జరగడం లేదు కదా రక్షణకు అన్ని నిధులు ఎందుకని అడుగుతారంటూ ఆర్థికశాఖ ఘాటుగా వ్యాఖ్యానించినట్టు సమాచారం. ఏపీ కొత్తగా అడుగుతున్న రాయితీలు ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చునని స్పష్టంచేసింది. ప్యాకేజీకే పరిమితమవుతామని మిగిలినవి సాధ్యం కాకపోవచ్చునని తెలిపింది. ఈ నాలుగేళ్ళలో పోలవరం, రెవెన్యూ లోటు భర్తీతో పాటు పలు పద్దుల కింద ఏపీకి రూ.12,500 కోట్లు కేంద్రం ఇచ్చిందని ఇంతవరకు నిధుల వినియోగానికి సంబంధించి లెక్కలు చెప్పలేదని కనీసం ఆ లెక్కలను చూపలేదని కేంద్ర ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు.

'ప్రత్యేక కేటగిరి రాష్ట్రాలకు ట్యాక్స్ రిఫండ్'

ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాల్లోని పరిశ్రమలు చెల్లించే ట్యాక్స్‌ను జీఎస్టీ అమల్లోకి వచ్చాక వాపస్ చేస్తున్నట్టు ఆర్థిక శాఖ సహాయ మంత్రి ప్రతాప్ శుక్లా రాజ్యసభలో ప్రకటించారు. మంగళవారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా ఇలా జవాబిచ్చారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ (డీఐపీపీ) 2017 అక్టోబర్ 5న జారీ చేసిన ప్రకటనకు అనుగుణంగా ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాల్లో గతంలో సెంట్రల్ ఎక్సైజ్ సుంకం మినహాయింపునకు అర్హత పొందిన పరిశ్రమలన్నింటికీ ఈ వెసులుబాటు కల్పించినట్లు ప్రతాప్ శుక్లా తెలిపారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక ఆయా పరిశ్రమలు సెంట్రల్ ట్యాక్స్, ఇంటిగ్రేటెడ్ ట్యాక్స్ కింద చెల్లించే మొత్తాలలో కొంత శాతాన్ని బడ్జెట్ మద్దతు ద్వారా వాపసు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు అప్పటివరకు కల్పిస్తున్న పన్ను ప్రోత్సాహ కాలను పొడిగించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందా అన్న ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదని వెల్లడించారు.

హోదా ఆందోళన ఉధృతం

- గాంధీ విగ్రహం ముందు తెదేపా, కాంగ్రెస్ ఎంపీల నిరసన
- పార్లమెంట్ గేట్ వద్ద వైకాపా ఎంపీల నిరసన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా ఆందోళనలు పార్లమెంటులో మరింత ఉధృతమయ్యాయి. తెలుగుదేశం పార్టీకి తోడుగా కాంగ్రెస్ ఎంపీలు జతకలిసి ధర్నాల్లో స్వరం కలిపారు. నిరసన గళం వినిపించారు. వారికి ఎదురుగా పార్లమెంటు గేట్ నెం 1 వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. తెలుగు రాష్ట్రాల ఎంపీలకు తోడుగా వేర్వేరు అంశాలపై ఇతర రాష్ట్రాల ఎంపీలు, జాతీయ పార్టీల ఎంపీలు అదే సమయంలో గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టడంతో పార్లమెంట్ ఆవరణ నినాదాలతో హోరెత్తింది. తొలుత కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఒక్కొక్కరుగా పార్లమెంటులోని మహాత్మ గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. సరిగ్గా అదే సమయంలో తెలుగుదేశం ఎంపీలు కూడా అక్కడికొచ్చారు. తాము రోజూ నిలబడే చోట కాంగ్రెస్ ఎంపీలను చూసిన టీడీపీ ఎంపీ సీఎం రమేశ్, తమకు చోటివ్వాలని అడిగారు. దీనికి కాంగ్రెస్ ఎంపీ అహ్మద్ పటేల్ స్పందిస్తూ.. తమతోపాటు వచ్చి ఆందోళనలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించారు. అయితే తమ పోరాటం రాష్ట్ర సమస్యలపైనేనని, బీజేపీకి వ్యతిరేకంగా కాదని చెబుతూ కాంగ్రెస్ ఎంపీల వెనుకాల గాంధీ విగ్రహం ఎదుట బైఠాయించారు. ఆయనతో పాటు టీడీపీ ఎంపీలు కే. రామ్మోహన్ నాయుడు, ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి) కూడా నేలపై కూర్చుండిపోయారు. ఇది గమనించిన కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు వెంటనే వారి బృందం వేరుగా వచ్చి తెలుగుదేశం ఎంపీల వెనుక నిలబడ్డారు. దీంతో కేవీపీని అనుసరిస్తూ మరో ఎంపీ రేణుకా చౌదరి, మాజీ ఎంపీ జేడీ శీలం కూడా వచ్చి ఆయన పక్కన నిల బడ్డారు. అప్పటికి ఒక్కొక్కరుగా మిగతా తెలుగుదేశం పార్టీ ఎంపీలు కూడా ఆ ప్రదేశానికి చేరుకున్నారు. అందరూ ముక్త కంఠంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ నినదించారు. సరిగ్గా పార్లమెంట్ ఉభయ సభలు ప్రారంభమయ్యే సమయానికి అన్ని పార్టీల ఎంపీలు లోపలికి వెళ్లి, సభ లోపలా ఆందోళన కొనసాగించారు.

జైట్లీతో చర్చల్లో పురోగతి లేదు: రామ్మోహన్ నాయుడు

ధర్నాలో పాల్గొన్న యువ ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ సోమవారం రాత్రి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో జరిగిన చర్చల్లో ఎటువంటి పురోగతి లేదని అన్నారు. జైట్లీతో చర్చించిన తెదేపా నేతల బృందంలో ఆయన ఉన్న విషయం తెలిసిందే. జైట్లీతో ప్రధానంగా ప్రత్యేక హోదా గురించే చర్చించామని, అలాగే కాగ్ లెక్కల ప్రకారం అంచనా వేసిన రెవెన్యూ లోటు గురించి కూడా చర్చించామని తెలిపారు. ''మేం ఏం చెప్పినా సరే ఆయన పట్టించుకునే పరిస్థితిలో లేరు. ఆయన వాదన చెప్పడం తప్ప తెలుగు ప్రజల మనోభావాలను గుర్తించడం లేదు. వాళ్ల ప్రతిపాదనలకు మేం ఒప్పుకునేదే లేదు. ఈశాన్య రాష్ట్రాలకు, హిమాలయ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా అన్న పేరు లేనప్పటికీ ఏదో ఒక రూపంలో పన్ను మినహాయింపులు, పారిశ్రామిక రాయితీలను కొనసాగిస్తున్నారు. ఆ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌ను ఎందుకు చేర్చడం లేదని మేం ప్రశ్నిస్తున్నాం. ఏపీని ప్రత్యేక దృష్టితో చూడాలని మేం పట్టుబడుతున్నాం'' అన్నారు. రాష్ట్ర విభజన తాము కోరుకోకపోయినా చేశారని, ఆ సమయంలో ఇచ్చిన హామీలకు కూడా దిక్కులేకపోతే రాష్ట్ర ప్రజల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా మిత్రధర్మాన్ని పాటిస్తూ సహనంతో వేచి చూశామని, మిత్రపక్షంగా బీజేపీకి అన్ని విధాలుగా సహకరించామని రామ్మో హన్ నాయుడు అన్నారు. అయినా సరే ఏమాత్రం గౌరవం లేకుండా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్రం తప్పుదోవ పట్టించింది: గల్లా జయదేవ్

అరుణ్ జైట్లీ తమను చర్చలకంటూ పిలిచి, చెప్పిందే చెప్పి ఒప్పించాలని చూస్తున్నారని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. ప్రత్యేక హోదా అడుగుతుంటే కుదరదు అని చెబుతున్నారు. ఎందుకు అడుగుతున్నామో ఆలోచించడం లేదు. హోదాపై మమ్మల్ని తప్పుదోవపట్టించి, హోదాలో ఉండేవన్నీ ఇస్తామని 2016లో ప్రకటించారు. ఆ తర్వాత ఏమీ ఇవ్వలేదు. అందుకే మేం హోదానే ఇవ్వాలని అడుగుతున్నాం'' అని జయదేవ్ అన్నారు.

ఆశయం సిద్ధించే వరకు పోరాటం: ఎంపీ కేవీపీ

తెలుగుదేశం పార్టీ ఎంపీలతో పాటు ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు డా. కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ, ప్రత్యేక హోదా కోసం తాను గత మూడున్నరేళ్లుగా రాజ్యసభలో ప్రతి సందర్భంలో పోరాడుతూనే ఉన్నానని అన్నారు. తమ పార్టీ అధినేత రాహుల్ గాంధీ సైతం గుంటూరు సభలో హోదా గురించి మాట్లాడారని, సభలోనూ అనేక రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. ప్రత్యేక హోదా సహా విభజన హామీలన్నీ అమలయ్యే వరకు, ఆశయం సిద్ధించేవరకు తన పోరాటం కొనసాగుతుందని కేవీపీ తెలిపారు.

ఎన్టీఆర్ వేషధారణలో శివప్రసాద్

ప్రతి సందర్భంలోనూ చిత్ర, విచిత్ర వేషధారణతో వివిధ కళారూపాలతో తన నిరసన తెలియజేసే చిత్తూరు ఎంపీ ఎన్. శివ ప్రసాద్, మంగళవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వేషధారణలో పార్లమెంటుకు వచ్చారు. గాంధీ విగ్రహం వద్ద కారు దిగి నేరుగా ధర్నాలో పాల్గొన్నారు. నాటి ఎన్టీఆర్ హావభావాలను, ఉచ్చారణను అనుకరిస్తూ, ఆయనే దిగివస్తే ఏం మాట్లాడతారో తెలిపేలా ఒక స్కిట్ ప్రదర్శించారు. తిరుపతి వెంకన్న సాక్షిగా, బెజవాడ కనక దుర్గమ్మ సాక్షిగా చేసిన వాగ్దానాలు మర్చిపోయారా అంటూ ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి అన్నారు. నాడు ఇందిరా గాంధీ, ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుణ్ణి చేసినప్పుడు తెలుగు ప్రజలు ఎలా ఉద్యమించారో తెలుసుకోండి అంటూ హితవు పలికారు. ''మరోసారి తెలుగువాడి దెబ్బ రుచి చూపించమంటారా? తెలుగు ప్రజల ఆగ్రహాన్ని చూడాలనుకుంటే మీ ఇష్టం'' అంటూ శివప్రసాద్ ప్రధానిపై విరుచుకుపడ్డారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో ఏపీకి అన్యాయం

హస్తినలో వామపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విభజన హామీలు, ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదాపై వామపక్ష పార్టీలు మండిపడ్డాయి. ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలంటూ పార్టీ సీనియర్ నాయకులు, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలతో ఢిల్లీలోని సంసద్ మార్గ్‌లో ఆందోళన నిర్వహించాయి. అడ్డగోలు విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం జరిగిందని సీనియర్ నేత మధు ఆరోపించారు. చట్టంలో పొందు పరి చిన ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజీ ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధి లేక ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. మరోవైపు కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ వ్యాఖ్యలపై సీపీఎం జాతీయ నాయకుడు రాఘవులు స్పందించారు. దేశంలో ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా థర్డ్ ఫ్రంట్ అవసరమన్న వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. కాంగ్రెస్, బీజేపీలపై దేశ ప్రజలకు అసహనం పెరిగిపోయిందని అభిప్రాయపడ్డారు. అయితే థర్డ్ ఫ్రంట్ దేశం కోసం ఏం చేస్తుందో, వారి లక్ష్యమేంటో వివరించాలని రాఘవులు అన్నారు.

ద్వంద్వప్రమాణాలు..దొంగనాటకాలు

వైకాపా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా కోసం పోరుబాట పట్టిన వైకాపా ఎంపీలు పార్లమెంటు ఆవరణలో 1వ నెంబర్ గేట్ వద్ద ధర్నా చేపట్టారు. సోమవారం పార్లమెంట్ స్ట్రీట్‌లో మహాధర్నా చేపట్టి నందున పార్లమెంటు ఆవరణలో ధర్నా చేయ ని వైకాపా ఎంపీలు, మంగళవారం మాత్రం ఆందోళన కొనసాగించారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, ఎంపీలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాద్, మిథున్ రెడ్డి పాల్గొన్నారు. హోదా అంశంపై చర్చించాలంటూ వైవీ సుబ్బారెడ్డి లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. ఈ సందర్భంగా వైకాపా రాజ్యసభ సభ్యులు విజయ సాయి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన పార్టీ డబుల్ గేం ఆడుతోందని విమర్శించారు. ఓవైపు ప్రత్యేక హోదా కావాలంటూ, మరోవైపు ప్యాకేజీ కోసం రాయబారాలు సాగిస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. హోదాయే కావాలి అనేవారు ప్యాకేజికి ఎందుకు అంగీకరించారని విజయసాయి ప్రశ్నించారు.

మనది నిత్యం అవిశ్వాసమే

- రాష్ట్ర సమస్యలే నా శత్రువులు, వాటిపైనే నా పోరాటం
- సైన్స్ అండ్ టెక్నాలజీలో ఏముంది?
- విమాన శాఖ బడ్జెట్ ఎంత?
- వాజ్‌పేయ్ ఆరు మంత్రి పదవులు ఇస్తానన్నా తీసుకోలేదు
- హక్కులు కాపాడుకోవడంలో రాజీలేదు: టీడీఎల్పీ సమావేశంలో చంద్రబాబు



అమరావతి/హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర సమస్యలే తన శత్రువని వాటిపైనే తన పోరాటం కొనసాగుతుందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. ఆర్థిక లోటున్న ఏపీని ఆదుకోమంటే రక్షణ శాఖకు కేటాయించిన నిధులు కూడా ఏపీ అడుగు తుందేమోనని కేంద్ర ఆర్థికశాఖ లీక్ ఇవ్వడంపై చంద్రబాబు మండిపడ్డారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీపై జరుగుతున్న పరిణామాలను చర్చించేందుకు మంగళవారం సాయంత్రం శాసనసభలోని కమిటీ హాలులో తెలుగుదేశంపార్టీ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాలపై ఆయన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏపీ హక్కులను సాధించడంలో, కాపాడుకోవడంలో రాజీలేని పోరాటం చేస్తామని చెప్పారు. కేంద్రంతో తాడోపేడో తేల్చుకునే అంశంలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఆదుకోమంటే రక్షణ శాఖను, సైనికులను, యుద్ధాలను గుర్తు చేస్తున్నారని అసలు యుద్ధానికి, రాష్ట్రాన్ని ఆదుకోడానికి ఏమైనా సంబంధం ఉందా అని చంద్రబాబు ప్రశ్నించారు. కేంద్రంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసంపై చంద్రబాబు మాట్లాడుతూ, ప్రతిరోజూ మనది అవిశ్వాసమేనని గుర్తుచేశారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే 50 మంది ఎంపీల సంతకం కావాలని చెప్పారు. రాష్ట్రానికి మరింత ప్రయోజనం చేకూరుతుందన్న ఉద్దేశంతోనే కేంద్రంలో చేరామని పదవుల కోసం ఏనాడూ వెంపర్లాడలేదని గుర్తుచేశారు. వాజ్‌పేయ్ ప్రధానమంత్రిగా ఉన్నపుడు ఆయన ఆరు మంత్రి పదవులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని, తాను ఆ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించానని చెప్పారు. రాష్ట్రంనుంచి కేంద్రంలో ఇద్దరు మంత్రులు ఉన్నారని సుజనా చౌదరి సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రిగా, అశోక గజపతిరాజు విమానయాన శాఖకు కేబినెట్ మంత్రిగా పనిచేస్తు న్నారని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ వల్ల ప్రయోజనం ఏం ఉంటుందని, విమాన శాఖ బడ్జెట్ ఎంతో అందరికీ తెలిసిందేనని చెప్పారు. గతంలో లాగా గ్రామీణాభివృద్ధి శాఖనైనా కేటాయించి ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో బోర్లను వేయించుకునే వారమని గుర్తుచేశారు. సమస్యలను పరిష్కరించాలన్నదే తెదేపా డిమాండ్ అని అన్నారు. రాష్ట్రాన్ని ఆదుకోవాలని తాను 29సార్లు ఢిల్లీ వెళ్ళి ప్రధానిని, కేంద్రాన్ని కోరానని, వైకాపా అధ్యక్షుడు ఒక్కసారైనా ఢిల్లీ వెళ్ళారా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి సంబంధించిన హక్కులను కాపాడు కోవడంలో రాజీలేని పోరాటం చేద్దామని కష్టమొచ్చినా, నష్టమొచ్చినా భరిద్దామని చెప్పారు. మన గమ్యంలో స్పష్టత ఉందని మనలను ఎవరూ తప్పుబట్టారని ఆయన వ్యాఖ్యానించారు. హోదాకు సమానంగా అంటేనే ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించామని కేంద్ర ప్రభుత్వం ఐదుకోట్ల మంది ప్రజలను వ్యతిరేకం చేసుకోవడం మంచిది కాదన్నారు. మనం ఓపిక పట్టినా ప్రజలు ఓపిక పట్టే పరిస్థితిలో లేరని చెప్పారు. యుద్ధం లేదు కదా అని సైన్యానికి కేటాయించిన నిధులు అడుగుతారా అంటూ కేంద్ర ఆర్థికశాఖ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఇలా అనడం ఏమాత్రం సరికాదని చెప్పారు. సమస్యను కేంద్రం ఇంకా ఎందుకు జటిలం చేస్తుందో తనకు అర్థం కావడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. కొంతకాలం వేచి చూద్దామా? లేదా పోరాటం కొనసాగిస్తూ ఒత్తిడిని పెంచుదామా అని ఆయన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కోరగా తెగతెంపులు చేసుకునేలా తక్షణమే కీలక నిర్ణయం తీసుకుందామని మెజారిటీ సభ్యులు అన్నట్టుగా తెలుస్తోంది. ఇకపోతే మరికొంత కాలం వేచి చూద్దామని ఆరుగురు సభ్యులు చెప్పినట్టు సమాచారం. కష్టమైనా, నష్టమైనా అంతా మీ వెనకే ఉంటామని నేతలంతా చంద్రబాబుతో చెప్పారు. కేంద్ర సహకారం లేకుండా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు లేవా? ముఖ్యమంత్రి అవుతున్న వారు లేరా? మనం రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం చేస్తున్నాం.. అందుకు ప్రజల దీవెనలు ఉన్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. కాంగ్రెస్ వార్‌రూమ్ పెడితే యుద్ధ విమానంలో విభజన బిల్లు పంపించారని ఎద్దేవా చేశారు. విభజన చట్టంలోని 19 అంశాలు, అప్పటి ప్రధాని ఇచ్చిన ఆరు హామీలను కేంద్రం యథాతథంగా అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. బలం, బలహీనతలు అనేవి సమయాన్ని బట్టి మారుతుంటాయని తెలుగుదేశం పార్టీ వచ్చేదాకా కాంగ్రెస్ పార్టీ ఎంతో బలంగా ఉందని ప్రస్తుతం ఆ పార్టీ రెండు రాష్ట్రాలకు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలకు పరిమితమైందని చెప్పారు.



త్రిపురలో టెర్రర్

- లెనిన్ విగ్రహం కూల్చివేత
- బీజేపీ, లెఫ్ట్ పరస్పర ఆరోపణలు
- రాష్ట్రంలో పలు చోట్ల హింసాత్మక ఘటనలు
- దక్షిణ త్రిపుర జిల్లాలో నిషేధాజ్ఞలు
- రంగంలోకి కేంద్రం
- సీఎస్, డీజీపీకి రాజ్‌నాథ్ ఫోన్



త్రిపురలో ఎన్నికల ఫలితాల అనం తరం హింసాత్మక ఘటనలు పతాక స్థాయికి చేరుకున్నా యి. దక్షిణ త్రిపుర జిల్లాలో కమ్యూనిస్టు దిగ్గజం లెనిన్ విగ్రహాన్ని కొందరు ఆగంతకులు జేసీబీ మెషిన్‌తో కూల్చివేశారు. దీనిపై బీజేపీ, లెఫ్ట్‌నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. జేసీబీ డ్రైవర్‌ను అరెస్టు చేసి, బెయిల్‌పై విడుదల చేసినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. హింసాత్మక ఘటనలపై కేంద్ర హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలను ఆరాతీశారని మంత్రిత్వ శా ఖ తెలిపింది. హింసను అరికట్టి, శాంతి, భద్రతల పరిరక్షణకు తగిన సంఖ్యలో కేంద్రీయ భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీసులు ఉన్నారని వెల్లడించింది. వేలాదిగా దేవాలయాలు కూల్చివేతకు గురైనప్పుడు స్పందించని వారు లెనిన్ విగ్రహం కూల్చివేతపై తీవ్రంగా స్పందించడం విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యానించారు. నాలుగు విగ్రహాలు కూల్చినంతమాత్రాన కమ్యూనిస్టులు పలాయనం చిత్తగిస్తారని భావించవద్దని బీజేపీ-ఆర్ఎస్ ఎస్‌కు కేరళ సిఎం పినరయి విజయన్ హితవు పలికారు.

అగర్తల: కమ్యూనిస్టు దిగ్గజం లెనిన్ విగ్రహాన్ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు. దక్షిణ త్రిపుర జిల్లాలో బెలోనియా వద్ద సోమవారం ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు మంగళవారం తెలిపారు. జేసీబీ మెషిన్‌తో విగ్రహం కూల్చివేతకు బీజేపీ కార్యకర్తలు బాధ్యులని సిపిఎం నిందించింది. ఇక్కడకు దాదాపు 110 కి.మీ.లదూరంలో బెలోనియాలో కాలేజ్‌స్క్వేర్ వద్ద ఐదు అడుగుల లెనిన్ ఫైబర్ గ్లాస్ విగ్రహాన్ని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ కొద్ది మాసాల క్రితం ఆవిష్కరించారని త్రిపుర సిపిఎం జిల్లా కార్యదర్శి తపస్ దత్తా తెలిపారు. రాష్ట్రంలో లెఫ్ట్ కూటమి అధికారం కోల్పోయిన కొద్ది రోజుల తర్వాత కొందరు బీజేపీ కార్యకర్తలు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేశారని ఆరోపించారు. అనంతరం వారు భారతమాతాకీ జై అని నినాదాలు చేశారని దత్తా చెప్పారు. జేసీబీ మెషిన్ నడిపిన డ్రైవర్‌ను అరెస్టు చేసి, అనంతరం బెయిల్‌పై విడుదల చేసినట్టు దక్షిణ త్రిపుర జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ మోంచక్ ఇప్పెర్ తెలిపారు. విగ్రహాన్ని బెలోనియా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు మంగళవారం అందజేస్తున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా ఎన్నికల ఫలితాల అనంతరం హింస్మాతక ఘటనలు చోటు చేసుకుంటున్న దరిమిలా పశ్చిమ త్రిపుర జిల్లాలోని శ్రీనగర్, లెపుంగా, మందాయి, అమ్‌తాలి, రాధాపూర్, అరుంధతీనగర్, జిరానియా, మోహన్‌పూర్, తదితర ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించినట్టు జిల్లా మేజిస్ట్రేట్ మిలింద్ రామ్‌టెకె తెలిపారు. ఈ నెల మూడవ తేదీన ఎన్నికల ఫలితాలు ప్రకటితమైన అనంతరం బీజేపీ, ఐపీఎఫ్‌టి అనూహ్యమైన హింసకు పాల్పడుతున్నాయని సిపిఎం మంగళవారం నిందించింది. 514 మంది పార్టీ కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలకు చెందిన 1,539 ఇండ్లపై దాడి జరిగిందని, 196 ఇండ్లు అగ్నికి ఆహుతి అయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ తెలిపారు. 134 పార్టీ కార్యాలయాలపై దాడి జరిగింది. లూటీకి గురయ్యాయి. 64 పార్టీ కార్యాలయాలు అగ్నికి ఆహుత య్యాయి. వేర్వేరు ప్రజా సంఘాలకు చెందిన కనీసం 90 కార్యాలయాలను బీజేపీ- ఐపి ఎ ఫ్‌టి మద్దతుదారు లు ఆక్రమించు కున్నా రని ఆరోపించారు. ఈ హి ం స న ం ఆపాలనిరాష్ట్ర పాలనా యంత్రాంగం, పాల క పక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ మార్పు సర్వసా ధారణం. కానీ ఇంత దారుణంగా హింసను ప్రజలు ఏ మాత్రం అంగీకరించరు అని ధర్ తెలిపారు.

ఆదివారం రాత్రి నుంచి రాష్ట్రంలో పలు చోట్ల ఎన్నికల అనంతర హింసపై ఫిర్యాదులు వచ్చాయని పోలీసులు మంగళవారం చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విప్లవ్ దేవ్ శాంతిని పాదుగొల్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా హింసకు పాల్పడినపక్షంలో వారిని ఉపేక్షించేది లేదని ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబల్ భౌమిక్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిపిఎంను వీడి వచ్చిన కొందరు గుర్తు తెలియని బీజేపీ మద్దతుదారులు రాష్ట్రంలో పలు చోట్ల అశాంతి సృష్టిస్తున్నా రని తెలిపారు. హింసను పాల్పడినవారిని వెంటనే పార్టీ నుంచి బహిష్కరి స్తామ ని, వారిపై న్యాయ పరమైన చర్య తీసు కుంటామని చెప్పా రు. సిపిఎం కార్య కర్తలు 49 మంది బీజేపీ మద్దతు దా రులపై దాడి చేయగా, వారిలో 17 మంది ఆస్పత్రి పాలయ్యారని ఆయన ఆరోపించారు.

కొత్త ప్రభుత్వం ఏర్పడే లోగా శాంతిని నెలకొల్పాలి

త్రిపురలో హింసాత్మక చర్యలను అరికట్టడానికి తగినంత కేంద్రీయ, రాష్ట్ర పోలీసు బలగాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం తెలిపింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ- ఐపీఎఫ్‌టి కూటమి గెలుపొందిన అనంతరం హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో కేంద్రం పై ప్రకటన చేసింది. శాంతి, భద్రతలు పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ కూడా కోరింది. కేంద్ర హోమ్ శాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజీవ్ రంజన్, పోలీస్ డైరెక్టర్ జనరల్ ఎ.కె.శుక్లాలతో మాట్లాడారని ఆయన చెప్పారు. హోమ్ మంత్రి రాజ్‌నాథ్ త్రిపుర గవర్నర్ తథాగత రాయ్, డిజిపిలతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేం తవరకు హింసాత్మక చర్యలను అరికట్టి, శాంతి, భద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు.



దేవస్థానాల కూల్చివేతపై స్పందించరే..?



త్రిపురలో 25 ఏళ్ళ వామపక్ష పాలనతో అణగారి పోయిన ప్రజలు కమ్యూనిస్టు దిగ్గజం లెనిన్ విగ్రహాన్ని కూల్చి వేసి ఉండవచ్చని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. భారతీయజనతాపార్టీ, దాని భావజాలం హింసను ప్రేరేపించదు. కానీ వామపక్షం అలాంటి పనిచేస్తుంది అని బీజేపీ నేత చెప్పారు. వామపక్ష పాలనలో అనేకమంది ప్రజలు అణగారిపోయారు. వారిలో కొందరికి ప్రతీకారేచ్ఛ ఉండి ఉండవచ్చు అని సింగ్ తెలిపారు. విగ్రహం కూల్చివేతకు బాధ్యులను కాలమే వెల్లడిస్తుందని చెప్పారు. కేరళ లాంటి చోట్ల వామపక్ష పాలనలో అనేక మంది హతులైపోతున్నారని ఆరోపించారు. విగ్రహం కూల్చివేతపై ఆగ్రహంగా స్పందించిన బీజేపీ ప్రత్యర్థులను ఎద్దేవా చేస్తున్నట్టుగా.. కాశీ, మథుర, అయోధ్య లాంటి చోట్ల గతంలో వేలాది దేవస్థానాల కూల్చివేతపై వారి స్పందనను నేను ఎన్నడూ విన్నది లేదు అని సింగ్ చెప్పారు

విగ్రహాలు కూల్చివేస్తే కమ్యూనిస్టులు పారిపోతారా?



తిరువనంతపురం: జాతీయ స్థాయి లో కమ్యూనిస్టులు లక్ష్యంగా పన్నిన ఒక కుట్రలో భాగంగానే త్రిపురలో ఎల్‌డిఎఫ్ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం ఆరోపించారు. కేవలం నాలుగు విగ్రహాలు కూల్చివేస్తే కమ్యూనిస్టులు నిష్క్రమిస్తారని బీజేపీ-ఆర్ఎస్ఎస్ అనుకోవద్దని విజయన్ అన్నారు. దాడులను తీవ్రంగా ఖండించారు. కమ్యూనిస్టులు వారి జీవితాలను పణంగా పెట్టయినా సరే ప్రజాస్వామ్యం, లౌకికవాదం పరిరక్షణకు కట్టుబడి ఉంటారని విజయన్ ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు.



తమిళనాడులో పెరియార్ విగ్రహం ధ్వంసం

వెల్లూరు, తమిళనాడు: జిల్లాలోని తిరుపత్తూరులో పెరియార్‌గా పేరొందిన హేతువాద నేత ఇ.వి.రామసామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారిద్దరూ మద్యం మత్తులో విగ్రహాన్ని ధ్వంసం చేశారని జిల్లా పోలీసు సీనియర్ అధికారి తెలిపారు. అరెస్టయినవారిని ముత్తురామన్, ఫ్రాన్సిస్‌లుగా గుర్తించారు. ముత్తురామన్‌ను బీజేపీ కార్యకర్తగా అనుమానిస్తున్నామని, ఫ్రాన్సిస్ సిపిఐ కార్యకర్త కావొచ్చని పోలీసులు తెలిపారు. త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చివేత తర్వాతి వంతు పెరియార్ విగ్రహాలదేనని బీజేపీ నేత హెచ్.రాజా చేసిన వ్యాఖ్యలపై వివాదం నెలకొన్న నేపథ్యంలో పెరియార్ విగ్రహంపై దాడి జరిగింది. ద్రవిడ ఉద్యమ వ్యవస్థాపకుడైన దివంగత రామసామిపై ఫేస్‌బుక్ పోస్టుపై రాష్ట్రంలో పలు రాజకీయ పక్షాలు నిరసన వ్యక్తం చేయడంతో రాజా ఆ పోస్ట్‌ను తొలగించారు. అది రాజా వ్యక్తిగత అభిప్రాయమని చెప్పడం ద్వారా బీజేపీ రాష్ట్ర శాఖ తనకేమీ పట్టనట్టుగా ఉండిపోయింది.

త్రిపుర సీఎంగా విప్లవ్ దేవ్

9న ప్రమాణ స్వీకారం



అగర్తల: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి గవర్నర్ తథాగత రాయ్ తనను ఆహ్వానించారని త్రిపుర బిజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే విప్లవ్ దేవ్ మంగళవారం తెలిపారు. కొత్త మంత్రుల ప్రమాణస్వీకార కార్యక్రమం ఈ నెల 9న ఉంటుందని చెప్పారు. గవర్నర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనను నియమించినట్టు దేవ్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, బీజేపీ పాలక రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆహ్వానిస్తా మని చెప్పారు. అంతకు మునుపు ఇక్కడ జరిగిన ఒక సమావేశం బీజేపీ శాసనసభా పక్షనేతగా దేవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పార్టీ కేంద్రీయ పరిశీలకునిగా ఆ సమావేశానికి హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రిగా జిష్ణు దేవ్‌వర్మ పేరును సైతం ఆయన ప్రకటించారు.

సార్క్ పునరుద్ధరణపై పాక్ ప్రధాని చర్చ



ఖాట్మండు: నేపాల్ పర్యటనలో భాగంగా పాక్ ప్రధాని షాహిద్ అబ్బాసీ, సీపీఎన్(మావోయిస్ట్ సెంటర్) ఛైర్ పర్సన్ ప్రచండతో భేటీ అయ్యారు. ఇరువురు నేతలు సౌత్ ఆసియన్ అసోసియేషన్ ఫర్ రీజినల్ కోఆపరేషన్ (సార్క్) పునరుద్ధరణపై చర్చించారు. ఇరుదేశాల సంబంధాలపై నేతలిద్దరూ చర్చించుకున్నారు. సమావేశం అనంతరం ప్రచండ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తమ మధ్య ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు గురించి చర్చ జరిగిందన్నారు. నలభై ఐదు నిమిషాలుపాటు జరిగిన ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య వర్తక వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు తీసుకోవాలసిన చర్యలు గురించి చర్చించామన్నారు. తమ మధ్య సార్క్ సదస్సు పునరుద్ధరించవలసిన ఆవశ్యకతపై చర్చించామన్నారు. ఇందుకు సార్క్ సభ్య దేశాల అధినేతలు కూడా తమ ప్రయత్నం చేయాలన్నారు. నవంబర్, 2016లో పాకిస్థాన్‌లో జరిగిన 19వ సార్క్ సదస్సును భారతదేశం బహిష్కరించిన సంగతి విదితమే అన్నారు. అప్పట్లో యురి ఉగ్రవాద దాడుల ఘటనలో పాకిస్థాన్ హస్తం ఉందని ఆరోపిస్తూ భారత్ 19వ సార్క్ సదస్సును బహిష్కరిస్తున్నట్టు వివరణ ఇచ్చిందన్నారు. దీంతో ముగ్గురు సార్క్ సభ్య దేశాలు భారత్‌కు మద్దతు పలకటంతో ఆ సదస్సు రద్దు అయిందన్నారు. కాగా పాక్ ప్రధాని అబ్బాసీ సార్క్ పునరుద్ధరణపై నేపాల్ అధ్యక్షుడు బిద్యాదేవి భండారితోనూ, ఇతర నేపాల్ నేతలతో సార్క్ పునరుద్ధరణ ఆవశ్యకతపై చర్చించారు.

మేఘాలయ సీఎంగా

కాన్రాడ్ ప్రమాణం



షిల్లాంగ్: నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పిపి) అధ్యక్షుడు కాన్రాడ్ సంగ్మా మేఘాలయ ముఖ్యమంత్రిగా మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ గంగా ప్రసాద్ సంగ్మాతో ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్‌భవన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ 11 మందితో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్, బిజెపి జాతీయ అధికార ప్రతినిధి నళిన్ కోహ్లీ కార్యక్రమానికి హాజరయ్యారు. సంగ్మా ప్రస్తుతం తురా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

సంగ్మా కుటుంబ కల నిజమైంది

తమ కుటుంబం కల నిజమైందని సరోదిని కె సంగ్మా అన్నారు. తన కుమారుడు కన్రాడ్ సంగ్మా ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకార వేడుకను వీక్షించే నిమిత్తం మంగళవారం ఆమె రాజ్‌భవన్ ప్రాంగణానికి విచ్చేశారు. అతిథులు, కాన్రాడ్ కుటుంబ సభ్యులు, స్నేహితులతో పాటుగా 2,000 మందికి పైగా సభికులు 12వ సిఎంగా సంగ్మా ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సరోదిని కె సంగ్మా మాట్లాడుతూ తాను కాస్త భావోద్వేగానికి గురైనట్టు తెలిపారు. తన కుమారుడు ఈ స్థాయికి ఎదిగితే చూడాలనుకున్న దివంగత తండ్రి పూర్ణో ఎ సంగ్మా కన్న కల నిజమైందని ఆమె చెప్పారు. దేవుడు దయామయుడని సరోదిని తెలిపారు. కాన్రాడ్ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను ముందుకు తీసుకువెళతారని ఆశిస్తున్నట్టు చెప్పారు. పూర్ణో ఎ సంగ్మా కేంద్ర మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్. ఆయన 1988 నుంచి 1990 మధ్యకాలంలో మేఘాలయ ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు.

తండ్రి చాటు నుంచి సిఎం దాకా

తన తండ్రి నీడలో పిన్నవయస్సులోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన కాన్రాడ్ కె సంగ్మా మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో సొంత పార్టీ ఎన్‌పిపిని విజయపథంలో నడిపించడంలోనూ, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేయడంలోనూ తనదైన నాయకత్వ పటిమ ప్రదర్శించారు. 40 ఏళ్ళ కాన్రాడ్ సంగ్మా లోక్‌సభ మాజీ స్పీకర్ పి.ఎ.సంగ్మా కుమారు డు. తండ్రి మరణానంతరం 2016, మార్చిలో నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పిపి) పగ్గాలు చేపట్టారు. రాష్ట్రాన్ని పదేళ్ళపాటు పాలించిన కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా పార్టీని నిలబెట్టా రు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌పిపి 32 స్థానాల్లో పోటీ చేసింది. కేవలం రెండింటిని దక్కించుకుంది. పార్టీకి నమోదైన ఓట్లు 10 శాతం లోపే. కడకు కాన్రాడ్ సైతం భారీ తేడాతో ఓటమిపాలయ్యారు. కానీ 2016లో తురా లోక్‌సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో కాన్రాడ్ విజేత కావడంతో ఎన్‌పిపి దశ తిరిగింది. కాన్రాడ్ సంగ్మా అప్పటి ముఖ్యమంతి ముకుల్ సంగ్మా సతీమణి దిక్కంచి డిషైరాపై దాదాపు రెండు లక్షల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. నాలుగు దశాబ్దాలుగా తన తండ్రి ఖాతాలో ఉన్న ఆ స్థానాన్ని కనీవినీ ఎరుగని ఓట్ల ఆధిక్యతతో తిరిగి దక్కించుకున్నారు. ఆయన తండ్రి పూర్ణో ఎ సంగ్మా తొమ్మిది పర్యాయాలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. 1988 నుంచి 1990 మధ్య కాలంలో మేఘాలయ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

మేఘాలయ రాష్ట్రానికి 12వ ముఖ్యమంత్రిగా మంగళవారం అవతరించిన కాన్రాడ్ సంగ్మా 1999లో తన తండ్రికి ప్రచార మేనేజర్‌గా రాజకీయాల్లో తొలి పాఠం నేర్చుకున్నారు. అదే సమయంలో పి.ఎం.సంగ్మా కాంగ్రెస్ పార్టీని వీడారు. శరద్ పవార్ నేతృత్వంలోని నేషనల్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)తో సన్నిహితంగా మెలిగారు. 2013లో ఎన్‌పిపి ఏర్పాటు కోసం ఎన్‌సిపితో తెగదెంపులు చేసుకున్నారు.

లండన్ యూనివర్శిటీ నుంచి ఎంటర్‌ప్రెన్యూరియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఫైనాన్స్‌లో పట్టభద్రుడైన కాన్రాడ్ 2008లో తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగారు. రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. దొంకుపర్ రాయ్ నేతృత్వంలోని కాంగ్రెసేతర ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. 2010 నుంచి 2013దాకా అసెంబ్లీలో విపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు.ఈ ఏడాది మార్చి మూడవతేదీన వెలువడిన ఎన్నికల ఫలితాల్లో 51 స్థానాలకు పోటీ చేసిన పార్టీ 19 చోట్ల గెలుపొందడంలో కీలక పాత్ర పోషించారు. గడచిన రెండు దశాబ్దాల కాలంలో మరే ఇతర ప్రాంతీయ పార్టీ సాధించలేని ఘనతను ఎన్‌పిపికి దక్కించారు. మొత్తం పోలైన ఓట్లలో 26 శాతం ఓట్లను పార్టీకి అందించారు. అంతకుమునుపు, అంటే 1972లో ఆల్ పార్టీ హిల్స్ లీడర్స్ కాన్ఫరెన్స్ సొంతంగా 32 స్థానాల్లో గెలుపొందింది. ఇతర ప్రాంతీయ పార్టీలు, బిజెపి, స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో మేఘాలయాలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. పశ్చిమ గెరో జిల్లాలోని గరో హిల్స్ డివిజన్‌కు ప్రధాన కేంద్రమైన తురాలో కాన్రాడ్ సంగ్మా జన్మించారు. అక్కడి నుంచే ఆయన లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

కూచిభొట్ల హత్య కేసు నిందితుడు

నేరాంగికారానికి సిద్ధం?

వాషింగ్టన్: గత ఏడాది ఫిబ్రవరిలో కాన్సాస్ సిటీలోని ఒక బార్‌లో భారత్‌కి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కూచిభొట్ల శ్రీనివాస్ ని హత్య చేసిన నౌకాదళ మాజీ ఉద్యోగి ఆదమ్ పుర్లింగ్టన్ తన నేరాన్ని ఒప్పుకోవచ్చని సమాచారం. అతడికి యావజ్జీవఖైదు, లేదా మరణ శిక్ష పడే అవకాశంఉంది. గత ఏడాది కాన్సాస్‌లోఒక బార్‌లో కూచిభొట్ల శ్రీనివాస్ తన మిత్రుడు అలోక్ మదసానితో మాట్లాడుకుంటుండగా, పుర్లింగ్టన్ జాతి విద్వేషంతో తూలనాడి కాల్పులు జరపగా, శ్రీనివాస్అక్కడికక్కడే మరణించాడు. అలోక్ గాయపడ్డాడు,తనను వెంటాడిన ఇయాన్ గిర్‌లోట్‌పై కూడా పుర్లింగ్టన్ కాల్పులు జరిపాడు. ఈ కేసు విచారణ కాన్సాస్ కౌంటీ కోర్టు లో మేలో విచారణకు రావల్సి ఉంది కానీ,మార్చి ఆరుకి ముందుకు జరిపారు. ప్రాథమికవిచారణలో తాను నిర్దోషినని పుర్లింగ్టన్ వాదించాడు.అయితే, అతడికి వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాలు ఉండటంతో తప్పు ఒప్పుకునే అవకాశంఉందని సమాచారం అందింది.

ఏప్రిల్‌లో ఉభయ

కొరియా నేతల భేటీ

సియోల్: తమ దేశానికి భద్రతా పరమైన హామీలను ఇస్తే అణ్వస్త్రాలను వదులుకునేందుకు సిద్ధమేనని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించినట్టు దక్షిణ కొరియా ప్రకటించింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జాయెఇన్ భద్రతా వ్యవహారాల సలహాదారు చుంగ్ యీ యోంగ్ నేతృత్వంలో ఒక ప్రతినిధి వర్గం సోమవారం ప్యాంగ్యాంగ్‌లో కిమ్‌ని కలుసుకుని చర్చలు జరిపింది. ఉత్తరకొరియా అధ్యక్షునితో తమ భద్రతా వ్యవహారాల సలహాదారు జరిపినచర్చలు ఫలించాయని దక్షిణ కొరియా ప్రకటించింది. వచ్చే నెలలో ఉభయ కొరియాల సరిహద్దుల్లో శిఖరాగ్ర చర్చలకు కిమ్ సంసిద్ధతను ప్రకటించినట్టు దక్షిణ కొరియా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.ఉభయ కొరియాల మధ్య శిఖరాగ్ర చర్చలు2000లోఒకసారి, 2007లో మరో సారి జరిగాయి. వచ్చే నెలలో జరగనున్నది మూడవ శిఖరాగ్ర చర్చలు. ఉభయ కొరియాల మధ్య ఏ భై ఏళ్ళుగా వైరం ఉన్నప్పటికీ, ప్రజల మధ్య సంఘీభావం ఉన్నట్టు పలు సందర్భాల్లో రుజువైంది.ఇటీవల జరిగిన వింటర్ ఒలింపిక్స్‌లో ఉభయ కొరియాల క్రీడాకారులు ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా పాల్గొన్నారు.ఆ స్ఫూర్తితోనే ఇప్పుడు శిఖరాగ్ర చర్చల ఏర్పాటుకు మార్గం సుగమం అయిందని సమాచారం.ఉభయ కొరియాల అధ్యక్షుల కమ్యూనికేషన్ హాట్‌లైన్‌లో సంభాషణలు జరిపేందుకు అంగీకారం కుదిరినట్టు దక్షిణ కొరియా ప్రకటించింది.

పాక్‌లో ఓట్ల కొనుగోలుపై దర్యాప్తు?

ఇస్లామాబాద్:పాకిస్తాన్ పార్లమెంటులో ఎగువ సభలోని 54 సీట్లకు రాష్ట్రా ల అసెంబ్లీల నుంచి గత వారం జరిగిన ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓట్ల కొనుగోలు జరిగినట్టు ఆరోపణ లు వచ్చాయి.ఈ ఆరోపణలపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లింలీగ్‌తో సహా అన్ని పార్టీలూ డిమాండ్ చేశాయి. ఈ ఎన్నికల్లో షరీఫ్ నేతృ త్వంలోని ముస్లింలీగ్ 15సీట్లు సాధించి పెద్ద పార్టీగా అవతరించింది. దిలావల్ భుట్టో నేతృత్వంలోని పీపుల్స్ పార్టీ రెండో స్థానాన్ని సాధించింది. ఎంక్యూఎం, తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ వంటి పార్టీలకు అసెంబ్లీలలో ఉన్న బలాబలాల కన్నా ఎక్కువ సీట్లు ఎగువ సభలో లభించాయనీ, పెద్ద ఎత్తున ఓట్ల కొనుగోలు జరగడం వల్లనే ఇది సాధ్యమైందని షరీఫ్ పార్టీ కూడాఆరోపించింది. ఈ వ్యవహారంపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని అన్ని పార్టీలూ డిమాండ్ చేశాయి.

చర్చలతోనే అయోధ్యకు పరిష్కారం



బెంగళూరు: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ ముస్లిం నేతలతో రామజన్మభూమి వివాద పరిష్కా ర దిశగా మరోసారి చర్చించారు. మంగళ వారం ఆయన ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపిఎల్‌బి) నేతల తో మాట్లాడుతూ రామజన్మభూమి వివా దం కోర్టు వెలుపల పరిష్కారం పొందెం దుకు సహకరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ రవిశంకర్ మాట్లాడుతూ వివాదం న్యాయస్థానంలోగానీ, చట్టసభల్లోగానీ పరిష్కారమయితే పెద్ద ఎత్తున మత కలహాలు చెలరేగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం పర్సనల్ లా బోర్డును ఉద్దేశించి బహిరంగ లేఖను రాశారు. రామజన్మ భూమి వివాదం కోర్టుద్వారా పరిష్కరించుకుంటే హిందు, ముస్లిం ఇరు వర్గాలకు నష్టమే అన్నారు. కోర్టు వెలుపల ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఇరువర్గాల మత విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని నేతలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే దేశంలో అంతర్యుద్ధం చెలరేగే అవకాశం ఉందన్నారు. వివాద పరిష్కారానికి ఆయన మార్గాలు సూచించారు. వివాద స్థలాన్ని కోర్టు ముస్లింలకు కేటాయించకూడదన్నారు. రామజన్మభూమి ప్రాంతాన్ని హిందువులకే ఇవ్వాలన్నారు. అలహాబాద్ హైకోర్టు తీర్పు ప్రకారం ఎకరం స్థలంలో మజీద్ నిర్మించాలన్నారు. మిగిలిన 60 ఎకరాలను మందిర నిర్మాణానికి వినియోగించేలా పార్లమెంటులో శాసనం చేయాలన్నారు.

జపాన్ నౌకాదళంలో..
తొలి మహిళా కమాండర్ నియామకం



టోక్యో: జపాన్ నౌకాదళం తమ అత్యంత ప్రతిష్ఠాత్మక యుద్ధనౌక విభాగంలో మొదటిసారిగా ఓ మహి ళను కమాండర్ స్థాయి అధికారి ణిగా నియమించింది. జపాన్ నౌకాదళ ప్రతినిధులు ఈ సందర్భంగా మాట్లా డుతూ ర్యోకో అజుమా(44) నాలుగు యుద్ధనౌకలకు సంబంధించి 1000 మంది సిబ్బందికి కమాండర్‌గా వ్యవ హరిస్తారన్నారు. ఒక మహిళను ఇంత పెద్ద స్థాయి అధికారిణిగా నౌకాదళంలో నియమించటం ఇదే ప్రథమం అన్నారు. అయితే కేవలం ఆమె మహిళ అయినందువల్లనే ఈ నియామకం జరగలేదన్నారు. జపాన్ నౌకాదళంలోనే పెద్దదైన ఈ యుద్ధనౌకలో హెలీకాప్టర్ కూడా వినియోగించే సౌకర్యం ఉందన్నారు. ఈ నియామక కార్యక్రమంలో సుమారు 400మంది సిబ్బంది పాల్గొని ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కమాండర్‌గా నియమితులైన అజుమా విలేఖరులతో మాట్లాడుతూ నన్ను నమ్మి ఇంతపెద్ద బాధ్యతను అప్పగించారని, చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా నా విధులు నిర్వహిస్తాను అన్నారు. నేను మహిళ అనే విషయానికి ప్రాధాన్యం ఇవ్వనని విధి నిర్వహణలో యువ అధికారిణులకు నేను ఒకస్ఫూర్తిదాయకంగా నిలవాలనేది నా అభిమతం అన్నారు. జపాన్ సైన్యంలో సుమారు 14,000మంది మహిళలు మాత్రమే పనిచేస్తున్నారు. జపాన్ దేశవ్యాప్తంగా ఉన్న మహిళల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే ఇది కేవలం 6శాతం మాత్రమే. ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పరిశీలిస్తే పురుషులతో మహిళలు సమానత్వ విషయంలో జపాన్ ఇంకా వెనుకబడే ఉంది.

శ్రీలంకలో ఎమర్జెన్సీ

- బౌద్ధులు- ముస్లింల మధ్య మత ఘర్షణలు
- 10 రోజులు అత్యాయిక పరిస్థితి విధింపు

కొలంబో: శ్రీలంకలో మళ్లీ మత ఘర్షణలు చెలరేగాయి. క్యాండీ జిల్లాలో బౌద్ధులు, ముస్లింలు పరస్పర దాడులకు దిగారు. మెజార్టీ, మైనార్టీ వర్గాల మధ్య దాడులు హింసాత్మక పరిస్థితులకు దారితీశాయి. ఈ ఘర్షణల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ముస్లింలకు చెందిన అనేక మసీదులు, ఇళ్లు ధ్వంసం అయ్యాయి. ఈ అల్లర్లు మిగతా ప్రాంతాలకు విస్తరించకుండా ముందస్తు జాగ్రత్తగా, పది రోజుల పాటు దేశవ్యాప్తంగా అత్యాయిక పరిస్థితి విధించారు. ఆ దేశ అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన కేబినెట్ సమావేశం నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ సమావేశ వివరాలను సామాజిక సాధికార మంత్రి ఎస్‌బీ దిస్సనాయకే మీడియాకు వివరించారు. పరిస్థితి మరింత విషమించకుండా, ముందస్తు చర్యల్లో భాగంగానే ఎమర్జెన్సీ విధించిన ట్లు చెప్పారు. క్యాండీలో కర్ఫ్యూ విధించామని, అదనపు బలగాలను మోహరిం చడం జరిగిందని, పొరుగు ప్రాంతాలైన దెల్దెనియా, పల్లెకెల ప్రాంతా లకు సైన్యాన్ని, పోలీసు కమెం డోలను తరలించామని చెప్పారు. 2011 ఆగస్టు తర్వాత, ఇక్కడ మత ఘర్షణలు చోటుచేసుకోవడం ఇదే తొలిసారి. పరిస్థితిని నియంత్రణలోకి తెచ్చేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, అల్లర్లకు కారణ్మమెన వారిపై గట్టి చర్యలు తీసుకుం టామని సీనియర్ మంత్రి రవూఫ్ హకీమ్ చెప్పారు. కాగా, 10 మసీదులు, 75 దుకాణాలు, 32 ఇళ్లను సింహళీయులు ధ్వంసం చేశారని ముస్లింలు ఆరోపించారు. 2.10 కోట్ల శ్రీలంక జనాభాలో మూడొంతులు బౌద్ధులే ఉన్నారు. ముస్లింలు 10శాతంగా ఉన్నారు.



అల్లర్లకు కారణం..

ఓ ప్రైవేటు వివాదంలో భాగంగా బౌద్ధవ్యక్తి ముగ్గురు ముస్లింలపైదాడి చేశాడు. దీంతో ఆగ్రహించిన ముస్లింలు ప్రతిదాడికి దిగారు. సదరు బౌద్ధవ్యక్తిని చితగ్గొట్టారు. తీవ్రగాయాలతో ఫిబ్రవరి 22న ఆసుపత్రిలో చేరిన అతడు, చికిత్స పొందుతూ మార్చి 3న మరణించాడు. ఈఘటనకు బాధ్యులైన వారిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. గతేడాది నవంబర్‌లోనూ దక్షిణ శ్రీలంక ప్రాంతంలో అల్లర్లు చెలరేగాయి. నాటి ఘటనలో ఒకరు మరణించగా, పదుల సంఖ్యలో వాహనాలు దగ్ధమయ్యాయి. 2014లో బౌద్ధులు-ముస్లింల మధ్య ఘర్షణల్లో నలుగురు మరణించారు.



క్రీడాప్రభ

శ్రీలంకలో ఎమర్జెన్సీ కొనసాగిన మ్యాచ్



కొలంబో: మ్యాచ్ ప్రారంభానికి ముందు మతకల్లోలం చెలరేగడంతో శ్రీలంకలో ఎమర్జెన్సీ విధించడం జరిగింది. ఆ సమయంలో మ్యాచ్ కొనసాగడంపై అనుమానాలు వ్యక్తమ య్యాయి. అయితే అల్లర్లు చెలరేగిన క్యాండీ అనే ప్రాంతం మ్యాచ్ జరిగే కొలంబో కు దూరంగా వుందనీ.. ఆటకు ఎలాంటి ఇబ్బందీ ఎదురవ్వదని శ్రీలంక అధికారులు భరోసా ఇవ్వడంతో మ్యాచ్ కొనసాగింది. . ఈ గొడవలు బౌద్ధమతస్థులకు, ముస్లిములకు మధ్య జరిగినట్టు తెలుస్తోంది. శ్రీలంకలో బౌద్ధులు దాదాపు 75 శాతం ఉండగా.. ముస్లిములు 10 శాతం, హిందువులు 13 శాతం వరకూ ఉన్నారు.

ఫిక్సింగ్ చేయలేదు
అయినా నిషేధం తప్పదు

- క్యూరేటర్ పాండురంగ్ పై 6 నెలలు నిషేధం
- గత తీర్పునే ఖరారు చేసిన ఐసీసీ

దుబాయ్: మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ మైదానం పిచ్ క్యురేటర్ పాండురంగ్ సాల్‌గోవాంకర్‌పై మ్యాచ్ ఫిక్సింగ్‌లో ప్రమేయముందని నేరంమోపి ఆరునెలల సస్పెన్షన్‌ను కూడా విధించిన ఐసీసీ శిక్ష అమలు మరో నెలలో పూర్తవుతుండగా పాండురంగ్‌పై మోపిన ఆరోపణలకు ఎలాంటి సాక్ష్యాలు లేవని స్పష్టం చేసింది. అయితే బుకీలు తన వద్దకు వచ్చిన విషయాన్నిపై అధికారులకు, ఐసీసీకి తెలుపలేదని తప్పుబడుతూ ఆయనకు ఆరునెలల శిక్షను కొనసాగించాల్సిందేనని ఐసీసీ మంగళవారం స్పష్టం చేసింది. అక్టోబర్ 2017లో పుణెలో జరిగిన భారత్-న్యూజిలాండ్ మ్యాచ్ సందర్భంగా బుకీలుగా అవతారమెత్తిన పాత్రికేయులు జరిపిన స్టింగ్ ఆపరేషన్‌లో పిచ్ క్యురేటర్ పాండురంగ్ సాల్‌గోవాంకర్ తన ప్రమేయం లేదని, తాను అమాయకుడనని చెపుతున్నా ఐసీసీ ఆయనపై ఆరునెలల సస్పెన్షన్‌ను అక్టోబర్ 25న విధించింది. ఈ నిషేధం ఏప్రిల్ 25న పూర్తి కానుంది. మహారాష్ట్ర మాజీ పాస్ట్ బౌలర్‌ను కలవాలని తన వద్దకు వచ్చిన బుకీలను ఆ బౌలర్ వద్దకు తీసుకెళ్లాడు. అయితే వారు బుకీలని తనకు తెలియదని వారితో తనకు సంబంధం లేదని పాండురంగ్ తెలిపాడు. మంగళవారం ఐసీసీ అవినీతి నిరోధక శాఖ జీఎం అలెక్స్ మార్షల్ దీనిపై వివరణనిస్తూ.. 'ఈ వ్యవహారంపై భారత బోర్డు పూర్తి సమాచారా న్నందించింది. పాండురంగ్‌కు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలు లేనప్పటికి తనను బుకీలు కలిసిన విషయాన్ని పై అధికారులకు తెలపాల్సిన బాధ్యత పాండురంగ్‌పై ఉందని' అన్నాడు. ఐసీసీ నిబంధన 2.4.4 ప్రకారం ఇది నేరంకిందికే వస్తుందని పేర్కొంటూ గతంలో ఆయనపై విధించిన నిషేధాన్ని కొనసాగించాలని తీర్పు చెప్పాడు.

దేవదర్ ట్రోఫీ ఫైనల్లో కర్నాటక



దర్మశాల: దేవదర్ ట్రోఫీలో కర్నాటక తన ఆధిక్యతను కొనసాగిస్తూ ఫైనల్లోకి ప్రవేశం చింది. మంగళవారం జరిగిన వన్డే మ్యాచ్‌లో ఇండియా ఎ జట్టుపై కర్నాటక 65 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఫైనల్లో కర్నాటక శ్రేయాస్ అయ్యర్ నేతృత్వం లోని ఇండియా బి జట్టుతో తలపడ నుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఇండియా బి జట్టుపై6 పరుగుల తేడాతో విజయం సాధించిన కర్నాటక తదుపరి మ్యాచ్‌లోను తన జోరును కొనసాగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కర్నాటక 50 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 339 పరుగులు చేయగా, అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన ఇండియా ఎ జట్టు 39.5 ఓవర్లలోనే 274 పరుగులు చేసి ఆలౌటయింది.

సంక్షిప్త స్కోర్లు: కర్నాటక 339/4 (50 ఓవర్లు) (రవికుమార్ సమర్థ్ 85, పవన్ దేశ్‌పాండె 95, విసిఎం గౌతం 49), ఇండియా ఎ: 274 ఆలౌట్(39.5 ఓవర్లు), (ఉన్ముక్త్ చాంద్ 81, ఇశాన్ కిషన్ 73) బౌలింగ్ కృష్ణప్ప గౌతం 4/52

కొరియాపై భారత్ రెండో విజయం

- మహిళల హాకీ

ఐదు మ్యాచ్‌ల సరీస్‌లో భారత్ 2-0తో ముందంజ

ఇంచియాన్: దక్షిణా కొరియాలో పర్యటిస్తున్న భారత మహిళా హాకీ జట్టు మంగళవారం జరిగిన ఆతిథ్య జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఐదు మ్యాచుల సిరీస్‌లో భాగంగా భారత్ రెండు మ్యాచులు గెలిచి సిరీస్ కైవసం చేసుకునే దిశలో కదులుతోంది. రెండో మ్యాచులో దక్షిణా కొరియా క్రీడాకారిణులు భారత్‌పై దాదాపుగా గెలిచినంత పనిచేశారు. చివరికి వారి పోరాటం రెండు గోల్స్‌కే పరిమితమైంది. సోమవారం జరిగిన మ్యాచులో భారత్ 1-0 తేడాతో గెలిచింది. అయితే భారత మహిళలు ఏదో గాలివాటుగా గెలిచారని విమర్శకులు అనుకుంటున్న నేపథ్యంలో మంగళవారం మ్యాచ్‌లో కూడా భారత్ గెలుపొంది వారి నోళ్లు మూయించింది.

ధావన్ దంచికొట్టినా...
సరిపోలేదు

- 5 వికెట్ల తేడాతో భారత్ పరాజయం
- లంకను గెలిపించిన పెరీరా ద్వయం
- కుశాల్ పెరీరా అర్ధశతకం
- ఆఖర్లో మెరిసిన తిసార పెరీరా
- ధావన్ సెంచరీ మిస్
- భారత్174/5,లంక 175/5

ధావన్ అదరగొట్టాడు. కానీ స్కోరు బోర్డుపరుగు పెట్టలేదు. కష్టం మీద 170 పరుగులు దాటింది భారత్. అవతల లక్ష్య ఛేదనలో కుశాల్ పెరీరా స్కోరు బోర్డుపరుగు పెట్టించాడు. అయినా భారత్‌కు గెలుపు అవకాశాలు కనిపించాయి. అయితే అంతవరకూ ఎప్పటికప్పుడు వికెట్లుతీసిన యువ బౌలర్లుఆఖర్లోచేతులెత్తేశారు. భారత అనుభవ లేమిని ఆసరాగా చేసుకుని టోర్నీలో తొలి మ్యాచ్ ను శ్రీలంక కైవసం చేసుకుంది.

కొలంబో: 175 పరుగుల లక్ష్య ఛేదనను లంక ధాటిగా ఆరంభించింది. ఓపెనర్ జీవన్ మెండిస్ రెండు ఫోర్లతో ఎదురుదాడికి దిగి లంక ఉద్దేశ్యాన్ని తెలియజెప్పాడు. అయితే కెప్టెన్ రోహిత్ శర్మ స్పిన్ వ్యూహంతో జీవన్ మెండిస్ (6 బంతుల్లో 11; 2 ఫోర్లు) ను బోల్తా కొట్టించాడు. రెండో ఓవర్‌లోనే వాషింగ్టన్ సుందర్‌కు బంతినిస్తే అది సత్ఫలితాన్ని ఇచ్చింది. అయితే ఆ ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. మూడో స్థానంలో బ్యాటింగ్ కు దిగిన కుశాల్ పెరీరా భారత బౌలర్ల మీద ఎదురుదాడికి దిగాడు. పెరీరా (37 బంతుల్లో 66 పరుగులు; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధాటికి 5 ఓవర్లు ముగిసే సరికి లంక స్కోరు 70 కి చేరింది. పవర్ ప్లే ముగిసే సరికి రెండు వికెట్ల నష్టానికి 75 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. ఆ తర్వాత 9 ఓవర్‌లో గుణతిలక వికెట్ సమయానికి 98 పరుగులతో మ్యాచ్ 15 ఓవర్లలో ముగించేలా కనిపించింది. పిమ్మట 13 ఓవర్‌లో 127 పరుగుల వద్ద పెరీరా స్టంప్ ఔట్ అవ్వడం ద్వారా నాలుగో వికెట్‌గా వెనుదిరిగే సమయానికి లంక విజయం నల్లేరు మీద నడకే అనే పరిస్థితి. అయితే మరో రెండు ఓవర్ల పాటూ నిలదొక్కుకునే ప్రయత్నం చేసిన తరంగ వికెట్ చేజార్చుకోవడం భారత్‌ను మరోసారి రేసులో నిలిపింది. చివర్లో టెయిలెండర్‌ల ను నిలువరించడమే అప్పటికి భారత బౌలర్ల ముందున్న సవాల్. అయితే తిసార పెరీరా(10 బంతుల్లో 22 పరుగులు; 2 ఫోర్లు, 1 సిక్స్), శనక(18 బంతుల్లో 15; 1 ఫోర్) లు భారత్‌కు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. 15 ఓవర్‌లో ఉపుల్ తరంగదే చివరి వికెట్. తర్వాత రెండు ఓవర్ల పాటూ బంతులు వృధా చేసిన తిసార పెరీరా.. 18వ ఓవర్ ఆరంభంలో 18 బంతులకు 24 పరుగులు చేయాల్సిన దశలో రెండు ఫోర్లు, ఒక సిక్స్‌లతో భారత్ కు మ్యాచ్‌ను దూరం చేశాడు.

ధావన్ వన్ మ్యాన్‌షో

అంతకు ముందు టాస్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్‌లోనే మెండిస్ అద్భుత క్యాచ్‌కు రోహిత్ శర్మ(0) బలయ్యాడు. మిడ్ ఆన్ లో వున్న మెండిస్ వెనక్కి పరిగెత్తుతూ క్యాచ్ పట్టే సమయానికి భారత్ స్కోరు కేవలం 1 పరుగు మాత్రమే. ఆ పరుగు కూడా వైడ్ రూపంలో వచ్చిందే. ఆ తర్వాత ఓవర్‌లోనే లెగ్ సైడ్ కు వెళ్లి బంతిని ఆన్ సైడ్ తరలించాలనుకున్న రైనా(1) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన పాండే(35 బంతుల్లో 37 పరుగులు; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి శిఖర్ ధావన్(49 బంతుల్లో 90 పరుగులు; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. ధాటిగా ఆడుతున్న ధావన్‌కు పాండే నుంచి చక్కటి సహకారం లభించింది. వీరిద్దరు కలిసి 12 ఓవర్లు ముగిసే సరికి స్కోరు బోర్డును 100 పరుగులు దాటించారు. ఆ తర్వాత ఓవర్లో వీరిద్దరి 93 పరుగుల భాగస్వామ్యానికి పాండే వికెట్‌తో తెరపడింది. మెండిస్ వేసిన 13వ ఓవర్‌లో మూడో బంతికి ముందుకు వచ్చి స్టంప్ ఔట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న పాండే... ఆ తర్వాతి బంతికి మరోసారి ముందుకు వచ్చి ఆడిన షాట్ బౌండరీ వద్ద గుణతిలక చేతిలో పడడంతో వెనుదిరిగాడు. పాండే వికెట్ తర్వాత ధావన్ మరింత రెచ్చిపోయాడు. సిక్సర్లు, ఫోర్లతో సెంచరీకి చేరువయ్యాడు. అయితే ధాటిని కొనసాగించే క్రమంలో 18 ఓవర్ చివరి బంతికి పెరీరాకు క్యాచ్ ఇచ్చి సెంచరీ చేజార్చుకున్నాడు. రెండు వరుస బౌండ రీలకు తోడు రిషబ్ పంత్(23 బంతుల్లో 23; 1 సిక్స్, 1 ఫోర్) క్రూడా బౌండరీ బాదడంతో నిర్ణీత ఓవర్లలో భారత్ 174 పరుగుల స్కోరు చేయగలిగింది.





స్కోరు వివరాలు

ఇండియా: రోహిత్ శర్మ (సి) జీవన్ మెండిస్ (బి) చమీరా 0, ధావన్ (సి) ఫెర్నాండో (బి) గుణతిలక 90, రైనా (బి) ఫెర్నాండో 29, పాండే (సి) గుణతిలక (బి) ఫెర్నాండో, రిషబ్ పంత్ (సి) ఫెర్నాండో (బి) చమీరా 23, కార్తీక్ 13 (నాటౌట్);
మొత్తం: 20 ఓవర్లలో 174/5
వికెట్ల పతనం: 1-1(రోహిత్ శర్మ, 0.4 ఓ), 2-9(రైనా,1.6ఓ), 3-104(మనీశ్ పాండే, 12.4 ఓ), 153-4(శిఖర్ ధావన్, 17.6ఓ), 5-174(రిషబ్ పంత్, 19.6)

శ్రీలంక: గుణతిలక (సి) రిషబ్ పంత్ (బి) ఉనద్ కత్ 19, మెండిస్ (సి) ధావన్ (బి) వాషింగ్టన్ సుందర్ 11, చండిమాల్ (బి) చాహల్ 14. ఉపుల్ తరంగ (బి) చాహల్ 17, కుశాల్ పెరీరా (స్టం) కార్తీక్ (బి) వాషింగ్టన్ సుందర్ 66, శనక(15 నాటౌట్), తిసార పెరీరా (22 నాటౌట్);
మొత్తం: 18.3 ఓవర్లలో 175/5
వికెట్ల పతనం: 1-12(కుశాల్ మెండిస్, 1.3ఓ), 2-70(గుణతిలక, 4.6ఓ), 3-98(చండిమాల్,8.5ఓ), 4-127(కుశాల్ పెరీరా, 12.3ఓ), 5-136(ఉపుల్ తరంగ, 14.4ఓ)

'అజాన్‌షా' హాకీకప్
భారత్ ఆశలు ఆవిరి

ఆసీస్ చేతిలో 4-2 తేడాతో ఓటమి

ఇపో(మలేసియా): అజ్లాన్ షా హాకీ టోర్నీలో భారత్ పేలవమైన ఆటను ప్రదర్శించింది. మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 4-2 తేడాతో ఓడి ఫైనల్ చేరే అవకాశాలకు నీళ్లొదులుకుంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచుల్లో భారత్ రెండింటిని ఓడగా, ఇంగ్లాండ్‌తో ఆడిన మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మూడో మ్యాచ్‌లో రమణ్‌దీప్ చేసిన రెండు గోల్స్ కారణంగా భారత్ వైట్ వాష్‌ను తప్పించుకుంది. ప్రపంచ ర్యాంకుల్లో అగ్ర స్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా తన స్థాయికి తగ్గట్టుగా ఆడుతూ ఆట 28వ నిమిషంలోనే వచ్చిన అవకాశాన్ని మార్క్ నొవల్స్ గోల్ చేసి ఆ జట్టుకు తొలి గోల్ సాధించిపెట్టాడు. 35వ నిమిషంలో అరన్ జాలెవ్‌స్కి మరో గోల్ చేసి ఆస్ట్రేలియా ఆధిక్యాన్ని 2-0కు తీసుకెళ్లాడు. 38వ నిమిషంలో డేనియర్ బియేలే, 40వ నిమిషంలో బ్లేక్ గోవర్స్ నాలుగో గోల్ చేసి జట్టుకు తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించిపెట్టారు. ఆట చివరి క్వార్టర్‌లో భారత ఆటగాళ్లు పుంజుకుని ఆసీస్ గోల్ పోస్ట్‌పై దాడిని కొనసాగించారు. ఆట 52, 53 నిమిషాల్లో రమణ్‌దీప్ వరుసగా రెండు గోల్స్ చేసి ఆస్ట్రేలియా ఆధిక్యాన్ని 4-2కు తగ్గించాడు. అనంతరం చివరి నిమిషాల్లో కూడా భారత ఆటగాళ్లు దాడిచేసి ఒక పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని పొందినప్పటికి బంతిని గోల్ చేయలేకపోయింది. నేడు మలేసియాతో భారత్ నాలుగో మ్యాచ్ ఆడనుంది.



కొట్టుకోవద్దు బాసూ...
కావాలంటే బీర్ కొట్టండి

- వార్నర్, డికాక్‌లకు షేన్ వార్న్ సలహా



సిడ్నీ: వార్నర్, డికాక్ ల మధ్య వివాదానికి లెజెండరీ స్పిన్నర్ షేన్ వార్న్ ఆసక్తికర పరిష్కారం చెప్పాడు. జరిగిన విషయాలన్నీ పక్కనపెట్టి ఇద్దరూ కలిసి బీర్ తాగితే అంతా సర్దుకుంటుంది అని వార్న్ తన ట్విట్టర్ ద్వారా సలహా ఇచ్చాడు. అసలు ఆస్ట్రేలియా-సౌతాఫ్రికా మధ్య టెస్టు సిరీస్ అంటేస్లెడ్జింగ్ చాలా మామూలు విషయం అని.. దాన్ని ఇంక వదిలెయ్యండి అని జనాలకు కూడా ఉచిత సలహా ఇచ్చాడు. అయితే వార్న్ ట్వీట్ లకు ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ ఆండ్రూ స్ట్రాస్ మరో రకంగా స్పందించాడు. -కరెక్టే వార్నీ. కాకపోతే సదరు వ్యక్తికి ఇదే మొదటిసారి కాదు. ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు సమాధానం చెప్పాల్సిందే- అని డేవిడ్ వార్నర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. సౌతాఫ్రికా-ఆస్ట్రేలియా మొదటి టెస్టులో వార్నర్, క్వింటన్ డికాక్ ల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై మ్యాచ్ రెఫరీ ఇంకా చర్యలు తీసుకోవాల్సి వుంది.

కోహ్లీ, పుజారా ర్యాంకులు పదిలం

దుబాయ్: ఐసీసీ మంగళవారంనాడు ప్రకటించిన టెస్టు ర్యాంకుల్లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ, సీనియర్ బ్యాట్స్‌మన్ చటేశ్వర్ పుజారాల స్థానాలు మారలేదు. కోహ్లీ రెండవ స్థానంలో ఉండగా, పుజారా ఆరవ స్థానంలోనే కొనసాగుతున్నాడు. తొలి స్థానంలో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ కొనసాగుతున్నాడు. మూడో స్థానంలో ఇంగ్లండ్‌కు చెందిన జోరూట్ ఉన్నాడు. బౌలింగ్ విభాగంలో రవిచంద్రన్ అశ్విన్ ఆరవ స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియన్ స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ తన కెరియర్ బెస్ట్ ఐదవ స్థానంలోకి వచ్చాడు. డర్బన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవడం స్టార్క్‌కు కలిసివచ్చింది. ఆ మ్యాచ్‌లో స్టార్క్ 109 పరుగులకు 9 వికెట్లు చేజిక్కించుకున్నాడు. దీంతో దక్షిణాఫ్రికా బౌలర్లు మోర్నె మోర్కెల్, వీమోన్ ఫిలాండర్‌లను వెనక్కు నెట్టి ఐదో స్థానానికి ఎగబాకాడు. బౌలింగ్‌లో తొలి స్థానంలో ఇంగ్లండ్ బౌలర్ జేమ్స్ అండర్సన్ ఉన్నాడు. దక్షిణాఫ్రికాకు చెందిన రబాడా రెండో స్థానంలో, భారత్‌కు చెందిన రవీంద్ర జడేజా మూడో స్థానంలో ఉన్నాడు. నాలుగో స్థానంలో ఆస్ట్రేలియాకు చెందిన హేజిల్‌ఉడ్ ఉన్నాడు. 2016 డిసెంబర్‌వరకు స్టార్క్ ఆరవ స్థానంలో ఉన్నాడు. స్టార్క్ బ్యాటింగ్‌లో 74వ స్థానం పొందినప్పటికి, ఆల్‌రౌండర్ల జాబితాలో టాప్ 5లో ఉన్నాడు. ఆల్‌రౌండర్ విభాగంలో తొలిస్థానంలో బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ షాకిబ్ అల్ హసన్ ఉండగా, రెండో స్థానంలో రవీంద్ర జడేజా, మూడో స్థానంలో అశ్విన్ ఉన్నాడు. బ్యాటింగ్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు షువాన్ మార్ష్ 16వ స్థానంలో, మర్‌క్రమ్ 19వ స్థానంలో, ఎబి డివిల్లియర్స్ 12వ స్థానంలో డికాక్ 22వ స్థానంలో ఉన్నారు. భారత బౌలర్ కేశవ్ మహారాజ్ 18వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు.

క్రీడా పర్యాటకం

- భారతీయుల కొత్త మంత్రం



ఈ మధ్య కాలంలో భారతీయ స్పోర్ట్ టూరిస్టులు తెగ పెరిగిపోతున్నారంట. ప్రపం చంలో ఏమూలైనా ఏ ఆటైనా ఆడుతున్నారో తెలుసుకు ని మరీ ఫ్లైటెక్కి చెక్కేస్తున్నా రంట. మాస్టర్ కార్డ్ సంస్థ అధికారులు ఇదే విషయాన్ని ఓ స్టడీ చేసి మరీ చెప్తున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, టెన్నిస్ లాంటి ఆటలకే భార తీయుల తొలి ప్రాధాన్యం అని మాస్టర్ కార్డ్ సంస్థ తెలిపింది. టూరిజం అంటే ఏదో సరదాకి అలా ఊర్లు చుట్టేయడం కాకుండా అలా ఒక ప్రయోజనం కోసం భారతీయులు ప్రయాణాలు చేస్తున్నారని సంస్థ తెలిపింది. పెరుగుతున్న ఆదాయాలే ఈ నయా ట్రెండ్‌కు కారణం అని సంస్థ అభిప్రాయపడింది. అలాగే నోట్లరద్దు ద్వారా దేశంలో స్పోర్ట్స్ వేర్ అమ్మకాలు పెరిగినట్టు సంస్థ చెప్తోంది.



గోల్డెన్ గర్ల్

- షూటింగ్ ప్రపంచకప్‌లో మనుకు రెండో స్వర్ణం
- మిక్స్‌డ్ ఈవెంట్లో ఓంప్రకాశ్‌తో కలిసి పతకం కైవసం

న్యూఢిల్లీ: హర్యానా షూటర్ 16 ఏళ్ల మను భాకర్ మరో స్వర్ణ పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. సోమవారం 10మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణంను చేజిక్కించుకున్న మను మంగళవారం జరిగిన 10మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీం ఈవెంట్లో కూడా మెరిసింది. మెక్సికోలోని గ్వాడాలజరాలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ పోటీల్లో మిక్స్ డ్ షూటింగ్ 10మీ. ఎయిర్ పిస్టల్ పోటీలో మను, ఓమ్ ప్రకాశ్ మిథర్వాల్‌తో కలసి పాల్గొని మరో స్వర్ణంను భారత్‌కు అందించింది. నిండా 16ఏళ్లు కూడా పూర్తికాని మెరుపుతీగ సీనియర్ ప్రపంచకప్ షూటింగ్ ఈవెంట్లో పాల్గొని అతిపిన్న వయసులో స్వర్ణ పతాకాలు గెలుపొందిన రికార్డును తన సొంతం చేసుకుంది. ఈ రికార్డును జాతీయ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఆర్ఏఐ) ఇంకా గుర్తించలేదు.

ఇతర క్రీడల్లో కూడా మనుకు పతకాలు

టోర్నమెంట్లోనే సెన్సేషనల్‌గా నిలిచింది. హర్యానా, జజ్జార్ జిల్లాలోని గోరియా గ్రామంలో యూనివర్సల్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో 11వ తరగతి చదువుతోంది. మను క్రీడల్లోకి అడుగుపెట్టడం రెండేళ్ల క్రితం పాఠశాల స్థాయిలోనే జరిగింది. షూటింగ్ శిక్షణకోసం ఆమె ప్రతీ రోజు 22 కిలోమీటర్లు ప్రయాణించి ఐదు గంటల పాటు ప్రాక్టీస్ చేస్తున్నది. ఇది ఆమెకు షూటింగ్‌మీద ఉన్న అమితమైన మక్కువను తెలుపు తోంది. ప్రొఫెషనల్ షూటింగ్‌లోకి అడుగుపెట్టడానికి ముందు మను పలు రకాల క్రీడల్లో పాల్గొంది. స్కేటింగ్‌లో రాష్ట్ర స్థాయిలో చాంపియన్ గా నిలిచింది. అంతేకాక అథ్లెటిక్స్‌లో మను పతకాలను సాధించింది. మణిపురి మార్షల్ ఆర్ట్ తంగాతాలో స్వర్ణంను, కరాటేలో జాతీయ స్థాయిలో పతకాన్ని గెలుచుకుంది. షూటింగ్‌లోకి ప్రవేశించిన తర్వాత, మూడు కేటగిరీల్లో మను జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది. 2017 డిసెంబర్‌లో జరిగిన జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలో ఏకంగా 15 పతకాలు సాధించి తన ప్రతిభను చాటింది.

తదుపరి లక్ష్యం?



త్వరలో కామన్వెల్త్ క్రీడలు, ఆసియన్ గేమ్స్‌లో మను పతకాలను సాధించడమే లక్ష్యంగా సాగుతోంది. ఒక పక్క షూటింగ్‌లో కొనసాగుతూనే మను భవిష్యత్తులో డాక్టర్ కావాలని కోరుకుంటోంది. రెండు స్వర్ణాలు ఎలా సాధించావు అన్న ఒక ప్రశ్నకు మను బదులిస్తూ..' అది అలా జరిగింది. నేను కూడా ఊహించలేదు. ఆ సమయం లో రికార్డులు కూడా నాకు తెలియదు' అని మనసులోని భావాలను వెల్లడించింది. నా వెనుక వుండి నిరంతరం నన్ను ప్రోత్సహించి, తప్పులను సవరిస్తూ సలహాల నిచ్చిన కోచ్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు అని మను పేర్కొంది. గత ఏడాది కేరళలోని తిరువనంతపురంలో జరిగిన 61వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో హీనా నెలకొల్పిన జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. ఈ పోటీల్లో మను 9 స్వర్ణ పతకాలతో కలిపి మొత్తం 15 పతకాలు గెలుచుకుంది. 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన దీపక్ కుమార్, మెహులి ఘోష్ కాంస్య పతకాన్ని చేజిక్కించుకుని దేశానికి ఆరో పతకాన్ని అందించారు. దీపక్, మెహులీ జంట ఫైనల్స్‌లో 435.1 పాయింట్లతో పూర్తి చేయగా, రొమేనియన్ జంట అలిన్ మోలొడొవియాను, లారా గొర్గెటా కొమన్ జంట 498.4 పాయింట్లతో రజత పతకాన్ని గెలుచుకుంది. చైనాకు చెందిన గ్జుహాంగ్, చెన్ కెడుయో జంట 502.0 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



ఆమె అంతిమ లక్ష్యం ప్రజలకు న్యాయం చేయడం... అందుకోసం ఎంతవరకైనా వెళ్తుంది. మానవ అక్రమ రవాణా విషయంలో దేశ రాజధాని హస్తినలో ఆమె నేతృత్వంలో జరిగిన దాడులు ఓ సంచలనం... అలాగని ఆమె కరుడుగట్టిన పోలీస్ ఆఫీసర్ కాదు. స ంప్రదాయ దుస్తులు ధరిస్తే ఆరణాల తెలుగు ఆడపడుచు.. ఖాకీ డ్రెస్ వేస్తే,.మానవత్వం మూర్తీభవించిన మహిళా పోలీసు అధికారి. ఆమె మాటల్లోను చేతల్లోను స్మార్ట్ నెస్ కనిపిస్తుంది. ఖాకీ బట్టల కరుకుదనం కనిపించదు.అంతెందుకు.. ప్రపంచంలో భారతీయ ఔన్నత్యానికి మూలం కుటుంబ వ్యవస్థ. ఆ కుటుంబ వ్యవస్థకు మూలం స్త్రీ!! భారతదేశ అభివృద్ధి మహిళతో ముడిపడి ఉంది. అందుకే స్త్రీలు ఎప్పుడు అబలలు కాదు....సబలలే! సామాజిక పరిస్థితులు ఆమెను అలా మార్చాయి అంతే!....వాళ్లకు మేమున్నామన్న భరోసా ఇస్తే చాలు అన్ని రంగాల్లోనూ దూసుకెళ్తారు...అంటూ తాను దూసుకెళ్తూ... సమాజంలోని సాటి మహిళలు సబలలు అని నిరూపించేందుకు తన శక్తి వంచన లేకుండా కృషిచేస్తోంది.... డైనమిక్ లేడీ పోలీస్ ఆఫీసర్, నార్త్ జోన్ డీసీపీ బడుగుల సుమతి! పోలీస్ అధికారిగా శాంతి భద్రతల కోసం కృషిచేస్తూనే....సాటి మనిషిగా తన పరిధిలో ప్రజల కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలకుగాను ఆమెను ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ (ఫిక్కీ) అవార్డు వరించింది. స్మార్ట్ పోలీసింగ్ విభాగంలో ఆమెకు ఈ అవార్డు దక్కిందంటే ఆమెలోని ప్రజా కోణమే అందుకు నిదర్శనం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డీసీపీ సుమతిని ఆంధ్రప్రభ లైఫ్ పలుకరించింది. వివరాలు ఆమె మాటల్లోనే...!

ఆమె...సబల!

> పోలీసులు ప్రజలకు ఇవ్వాల్సింది భరోసా.. భయపెట్టడం కాదు..అప్పుడే ప్రజలు పోలీసులకు సహకరిస్తారు. ప్రజల సహకారం లేకుండా శాంతిభద్రతలు కాపాడడం సాధ్యంకాదు..
> - నార్త్ జోన్ డీసీపీ బడుగుల సుమతి

కడుపుకూటి కోసం పడుపు వృత్తిలో దిగేవారు కొందరైతే.. విలాసాలకు అలవాటు పడి శరీరాన్ని అమ్ముకునేవారు మరికొందరు. బలవంతంగా రెడ్ లైట్ ఏరియాలోకి అక్రమంగా రవాణా చేయబడేవారు కొందరు. ఎవరైనా విధి వంచితులే. అందుకే 2008లో సిటీక్రైం ఎస్పీగా ఉన్నప్పుడు రెడ్‌లైట్ ఏరియాల్లో మగ్గుతున్న మహిళల విముక్తికోసం పూనే,ఢిల్లీలో..స్థానిక పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించాము. స్థానిక ఎన్జీవో ద్వారా పక్కాసమాచారంతో దాడులు జరిగాయి. స్థానికంగా మానవ హక్కుల పేరుతో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది.అయినా వెనుకడుగు వేయకుండా ఆ రాత్రికి వారందరిని ఏపీ భవన్‌లో బసచేయించి, మరుసటి రోజు ఉదయం... ఢిల్లీ కోర్టులో హాజరు పరిచాము. కోర్టులోను లాయర్ల నుంచి వ్యతిరేకత... వారి శరీరం వారు అమ్ముకుంటారు. మీరెవరు దౌర్జన్యంగా తీసుకెళ్లడానికి,...ఇది మానవ హక్కుల ఉల్లంఘన.. అంటూ వాదించారు. అయితే ప్రభుత్వం తరపున శాశ్వత పునరావాసం కల్పిస్తామని... నేను కోర్టుకు హామీ ఇచ్చి మరీ.. వారిని కస్టడీలోకి తీసుకుని..ప్రత్యేక రైలు బోగీలో హైదరాబాద్‌కు తీసుకువచ్చాము.. అందరికి పునరావాసం కల్పించాము. ఇందులో ఒక్కొకరిది ఓ దీన గాథ. ఆంధ్రప్రదేశ్‌లోని మదన పల్లికి చెందిన మహిళ..తాను ఢిల్లీలో ఏదో ఉద్యోగం చేస్తున్నానని చెప్పి, ఈ వృత్తిలో డబ్బు సంపాదించి... .పిల్లలను చదివించుకుంటున్నానని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఇంటికి వెళ్లాలని, నా బిడ్డల చదువు ఏమి కావాలంటూ .. రోదించిన ఘటన గుండెల్ని పిండేసింది. పదిమంది రేప్ చేసి తనను బలవంతంగా ఇందులోకి దించబడిన ఓ యువతి చెప్పిన తీరు హృదయాన్ని కలిచివేసింది.ఇలా ఒక్కొకరిది ఒక్కో దీన గాథ.. అయితే వారికి సంఘంలో గౌరవంగా ఎలా బతకవచ్చో వివరించి, వారిని ఒప్పించి హైదరాబాద్‌కు తీసుకువచ్చాము. దేశరాజాధాని హస్తినలో దాడులు జరిపినప్పుడు అదో సంచలనం. నాకు మాత్రం 200 మంది మహిళలకు పునరావాసం కల్పించామన్న తృప్తి మిగిలింది.

విజయం సాధించిన వికల్ప

నార్త్ జోన్ పరిధిలోని సికింద్రాబాద్ ఏరియాలో దశాబ్దాలుగా వ్యభిచారం విచ్చలవిడిగా సాగేది. రైల్వేస్టేషన్ కారణంగా వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరెవరో గుర్తించడం కష్టం.అందుకే ఇది వ్యభిచారానికి అడ్డాగా మారిందని చెప్పాలి. నేను బాధ్యతలు తీసుకున్న తర్వాత 20 సంవత్సరాల పాత కేసులు బయటకు తీసి స్టడీ చేశాను. ఈ దందాకు ఆటో డ్రైవర్లు, రిక్షావాలాలు మీడియేటర్లుగా ఉండేవారు. వాళ్లను పట్టుకుని ఈ దందా ఆపరేట్ చేసే గ్రూపులను ట్రేస్ అవుట్ చేశాను. వారిని అరెస్ట్ చేసి, వారిచ్చిన సమాచారంతో లాడ్జిలపై దాడులు నిర్వహించి 200మందికి పైగా వ్యభిచారం చేస్తున్న మహిళల్ని అదుపులోకి తీసుకున్నాము. ఒక లాడ్జిని సీజ్ చేశాము. వారికి మెడికల్ టెస్ట్ చేయిస్తే ఎక్కువ మందికి హెచ్ఐవీ ఉందని తేలింది. ఇదే విషయాన్ని కోర్టుకు సమర్పించి, ఫైన్‌తో వదిలేయకుండా శిక్షలు పడేలా చేశాము. అంతటితో ఆగకుండా స్వచ్ఛంద సంస్థసాయంతో వికల్ప అనే కౌన్సిలింగ్ కేంద్రం ఏర్పాటు చేశాము. మూడు పోలీసు టీంలు ఏర్పాటు చేసి, రైల్వే స్టేషన్లలో అనుమానాస్పదంగా తిరిగే మహిళలు,యువతులను అదుపులోకి తీసుకుని విచారించి...కౌన్సిలింగ్ కేంద్రంలో అప్పగించేవాళ్లం. వారు కౌన్సిలింగ్ ఇచ్చిన తర్వాత.. వారిని స్వస్థలాలకు పంపేస్తున్నాము. ఇక్కడ మరో క్రైం కోణం ఉంది. కొందరు మహిళలు నలుగురు,ఐదుగురు యువకులతో జతకట్టి..విటులను దోచుకునేవారు. సదరు మహిళ విటుల్ని ఆకర్షించి, రాత్రికి ఇంతా అని మాట్లాడుకుని, రూంకు తీసుకెళ్లేది. ఆ తర్వాత తమ గ్రూపుకు చెందిన యువకులు రంగంలోకి దిగేవారు. విటునితో గొడవపడి కొట్టడం అతని వద్ద ఉన్న డబ్బు,నగలు దౌర్జన్యంగా లాక్కొనేవారు. ఘర్షణ ఎక్కువైతే అతన్ని మర్డర్ చేసి పరారయ్యేవారు. ఇలాంటి మర్డర్లు ఏటా 16 వరకు జరిగేవి. నేను వచ్చిన సంవత్సర కాలంలో ఆ కేసులు 3కు పడిపోయాయి. ప్రస్తుతం అలాంటి కేసులు జీరో! వికల్ప కౌన్సిలింగ్ కేంద్రం నిర్వహణతో సికింద్రాబాద్ పరిధిలో వ్యభిచారం పూర్తిగా తగ్గిపోయింది.

రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కలిసి ఉంటే కలదు సుఖం

నేను నార్త్ జోన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత...జోన్ పరిధిలో చిన్నచిన్న తగాదాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు ఇస్తున్న.. కుటుంబ కలహాల కేసుల వివరాలను సమీక్షించాను. అందులో ప్రేమ పెళ్లిళ్లు చేసుకుని గొడవపడి వచ్చేవారు, కుదిర్చిన పెళ్లిళ్లు చేసుకుని వివాదాలతో వచ్చేవారు.. చదువుకున్న వారు, ఇద్దరుఉద్యోగస్తులు, ఇలా ఆరు రకాలుగా వర్గీకరించి చూస్తే.. ఎక్కువగా చదువుకున్న దుపతులే గొడవపడి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకుంటున్నారన్న సంగతి అర్థమైంది. మై ఛాయిస్ అనే ఎన్జీవో సహకారంతో కౌన్సిలింగ్ కేంద్రం ఏర్పాటు చేశాము. చిన్న చిన్న గొడవలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారి ఫిర్యాదులు స్వీకరించి, రికార్డు చేసి, కేంద్రానికి పంపేవాళ్లం. ఇక్కడ కూడా పోలీసులది రికార్డు చేసుకునే పాత్రే. కౌన్సిలింగ్ నిర్వహించేది ఎన్జీవోలే. కాకపోతే కౌన్సిలింగ్ వివరాలు రికార్డు చేసి మాకు అందిస్తారు. ఈ కేంద్రం ఏర్పాటు చేసిన తర్వాత.. 1500 ఫిర్యాదులు అందితే అందులో 552 కేసులను పరిష్కరించి..చిన్నచిన్న కలహాల కారణంగా స్టేషన్ మెట్లెక్కిన భార్యాభర్తలను ఒకటి చేశాము. అంతేకాదు పది జంటలకు ఒక సైకాలజిస్టును ఏర్పాటు చేసి, వారందరిని ఒకచోట చేర్చి కలసి ఉంటే కలదు సుఖం అనే పేరుతో భారీ సమావేశం ఏర్పాటు చేశాము. వారి చేతనే ప్రజలకు మెసేజ్ ఇప్పించాము. నిజంగా నాకు ఇది చాలా సంతోషాన్నిచ్చింది.వందల కుటుంబాల్లో సంతోషం నింపానన్న సంతృప్తి మిగిలించింది.



దగాపడిన మహిళలకు భరోసా

కేసు నమోదు చేయించుకోవడానికి ఓ పంజాబ్ మహిళకు మూడు సంవత్సరాలు పట్టిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నేను చార్జ్ తీసుకున్న తర్వాత కేసు నాదృష్టికి వచ్చింది. దానిని టేకప్ చేశాను. కేసు వివరాల్లోకి వెళితే....పంజాబ్‌కు చెందిన మహిళ బతుకు తెరువుకోసం హైదరాబాద్‌కు వచ్చి.. బేగంపేట ఏరియాలో (ప్లేస్ పేరు మార్చబడింది) నివాసం ఉండేది. ఆమె భర్త పంజాబ్ నుంచి ఆరు మాసాలకు ఒకసారి వచ్చివెళ్లేవారు. ఇదే అదనుగా చూసుకుని స్థానికంగా ఉండే ఓ కామాంధుడు ఆమెను బలవంతంగా లొంగదీసుకున్నాడు. చివరకు భర్తకు నిజం తెలిసి నిలదీస్తే. ఆమెదే తప్పని చెప్పాడు.మరో పక్క .. భర్తకు విడాకులిస్తే..తాను రెండో పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. విడాకులు ఇచ్చిన తర్వాత ముఖం చాటేశాడు. దీంతో న్యాయం కోసం ఆమె మూడు సంవత్సరాలు పోరాడింది. ప్రస్తుతం ఆతన్ని అరెస్ట్ చేసి ఆమెకు న్యాయం జరిగేలా చూస్తున్నాము. ఇలా మహిళలు అడుగడుగునా మగాళ్ల దాష్టీకాలకు మహిళలు బలవుతున్నారు. కాని కొందరు పంజాబి మహిళలాగా పోరాడి గెలుస్తున్నారు., అలాంటి మహిళలను స్టేషన్‌కు ఐదుగురిని గుర్తించి, వారితో కాలనీలలో షి ఈజ్ సబల ...పేరుతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాము. తద్వారా అన్యాయం జరిగినప్పుడు న్యాయం కోసం పోరాటం చేయాలనే చైతన్యాన్ని మహిళల్లో తీసుకువస్తున్నాము.

> ప్రజలు పోలీస్ స్టేషన్‌కు రాకపోవడానికి కారణం వారికి న్యాయం జరుగుతుందన్న భరోసాలేకపోవడమే.

న్యాయం పక్షాన నిలబడితే..

పోలీసు న్యాయం పక్షాన నిలబడితే.. ప్రజలు పోలీసుల పక్షాన నిలబడతారన్నది నిజం.. నేను వరంగల్‌లో డిస్పీగా పనిచేసినప్పుడు... క్లబ్‌లు కుటుంబాలను ఛిద్రం చేసేవి. మహిళలు వచ్చి ఫిర్యాదు చేస్తే.. క్లబ్‌లపై దాడులు చేసి,దొరికిన వారిచేత బహిరంగ పెరేడ్ చేయించినప్పుడు హ్యూమన్ రైట్స్‌ను తెరమీదికి తెచ్చారు. కాని బాధిత మహిళలు పోలీసుల పక్షాన నిలవడంతో వెనుకడుగు వేశారు. వరంగల్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే స్థానికులు కొందరు వ్యతిరేకించారు. కాని అప్పుడు ఆటోవాలాలు మాపక్షాన నిలిచారు. అంటే మేం న్యాయం పక్షాన నిలిచాము. ప్రజలు మా పక్షాన నిలిచారు. నేను పోలీసు బాధ్యతలు చేపట్టిన కొత్తలో జరిగిన ఇలాంటి ఘటనలు నాకు స్పూర్తినిచ్చాయి.అదే స్పూర్తితో ముందుకు సాగుతున్నా...మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలతో ..నేను చెప్పేది ఒక్కటే.. మహిళలు అబలలు కాదు సబలలు...అన్యాయం జరిగినప్పుడు.... ధైర్యంగా ముందుకు వస్తే ..పోలీసులు, సమాజం మీకు అండగా నిలుస్తుంది!

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

- హస్తినలో రేప్ రోకో ఉద్యమం
- సారథ్యం వహిస్తున్న స్వాతి మలివాల్
- 40 రోజులుగా కార్యాలయానికే పరిమితం
- అండగా నిలుస్తున్న మహిళాలోకం

రేప్‌లపై స్వా(స)త్యాగ్రహం!

ఢిల్లీ...
మహానగరం...
మాయానగరం...

భారతదేశ ప్రథమ పౌరుడు, దేశాన్ని నడిపే ప్రధాని, కేంద్ర మంత్రులు కొలువుదీరే గొప్ప కేంద్రం.చట్టాలు పురుడుపోసుకునే, రాజ్యాంగాలు రాజ్యమేలే చోటు. నేనున్నానంటూ కోట్ల మందిని అమ్మలా అక్కున చేర్చుకునే అభయహస్తం. ఇన్ని విశిష్టతలున్న ఈ మహానగరంలో మృగాళ్లకూ అంతేలేదు. అడ్డేలేదు. ముఖ్యంగా కొవ్వెక్కి కన్నూ, మిన్నూ కానకుండా కొట్టుకుంటున్న కామాంధులకు. గత అక్టోబర్‌లో 11 నెలల పాలబుగ్గల చిన్నారిపై అఘాయిత్యం దారుణాన్ని మర్చి పోకముందే జనవరిలో మరో కామపిశాచి వీరంగం. ముక్కు పచ్చలారని 8 నెలల చిట్టితల్లిపై బంధువే అత్యాచారానికి ఒడిగట్టాడు. తీవ్రగాయాలపాలైన ఆ బంగారు తల్లికి 3 గంటల పాటు ఆపరేషన్ చేసిన వైద్యులే కన్నీళ్లు పెట్టుకున్నారు. దేశ రాజధాని అభద్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని, అఘాయిత్యాలకు అకృత్యాలకు మారు పేరని స్వయంగా ఢిల్లీ మహిళా కమిషన్ చైర్ పర్సనే ఒప్పుకున్నారు. ఈ పోస్టులో ఉన్న నేనూ ఆడదాన్నే. నాకు కూడా రక్షణ లేదని చెప్పుకొచ్చారు. 8 నెలల పసికందుపై జరిగిన పైశాచికత్వాన్ని చూస్తూ కూర్చోలేమని, మా తలరాత ఇంతేనంటూ సరిపెట్టుకోలేమంటూ రేప్ రోకో పేరుతో ఆమె సత్యాగ్రహానికి పూనుకున్నారు. లైంగిక దాడులకు పాల్పడే వారికి ఆరు నెలల్లో కఠిన శిక్షలు అమలయ్యేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్య ఎక్కడుందో పరిష్కారాన్నీ అక్కడే వెదుకుదామంటూ ఆమె తన సైన్యంతో క్షేత్రస్థాయిలో అడుగుపెట్టారు.

ఆజాద్ భవన్‌లోని ఢిల్లీ మహిళా కమిషన్ భవన్‌లోనే ఉంటూ, ఆదివారాలు సెలవు రోజులు, పండుగ రోజుల్లోనూ పనిచేస్తూ రేప్‌రోకో ఉద్యమం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడానికి రాత్రిం బవళ్లు తనవంతు కృషి చేస్తున్నారు. వీధి నాటకాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఫోన్ నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇస్తే చాలు సాయమందించడానికి రెక్కలు కట్టుకుని వాలతామంటూ ప్లకార్డులు పట్టుకుని మహిళలు, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హోలీ రోజున రేప్‌రోకో అంటూ అతి పెద్ద రంగోలీ వేసి జనాల్లోకి విషయాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. రేప్‌రోకో సత్యాగ్రహ ఉద్యమంలో అనేకమంది మహిళలు, విద్యార్థులు, ప్రజలు, విద్యా, వైద్య, న్యాయ, ఇతర సంఘాలు భాగస్వా ములయ్యా యి. దాదాపు 40 రోజులుగా సాగుతున్న ఈ వరుస కార్యక్రమాలు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకూ రాజధానిలోని పలు ప్రాంతాల్లో జరగనున్నాయి. 33 ఏళ్ల వయసు లోనే ఎన్నో సవాళ్లతో కూడిన ఢిల్లీ మహిళా కమిషన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న స్వాతి మలివాల్ జైహింద్ ఆంధ్రప్రభతో తన అభిప్రాయాలు పంచుకున్నారు.



★ రేప్‌రోకో ఉద్యమం చేపట్టడానికి మిమ్మల్ని ప్రభావితం చేసిన అంశాలేంటి..?

నేను మహిళా కమిషన్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన ఈ రెండున్నరేళ్లలో లైంగిక దాడికి గురైన ప్రతి చిన్నారిని వెళ్లి చూశాను. ఆసుపత్రిలో బాధతో కూడిన వారి అరుపులు, కేకలు విని చలించిపోయేదాన్ని. ఈమధ్య 8 నెలల పాప అత్యాచారానికి గురైంది. అయినా ప్రభుత్వం ఉలుకూ పలుకూ లేదు. ఆ పాపను చూసి వచ్చాక సత్యాగ్రహం చేయాలని నిశ్చయించుకున్నా. జనవరి 31 నుంచి నా పోరాటాన్ని మొదలుపెట్టా.ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదు. అయినా వెనక్కి తగ్గేదే లేదు. ఆఫీసులోనే పడుకుంటున్నాం. ఇక్కణ్నుంచే అన్ని కార్యక్రమాలు చేపడుతున్నాం. ఢిల్లీ పోలీసుల నివేదిక ప్రకారం 2012-14 వరకు 31,446 నేరాలు నమోదయ్యాయి. అందులో 150 కేసులు మాత్రమే రుజువయ్యాయి. దేశ రాజధాని రేప్‌ల రాజధానిగా మారింది. ఏ కేసునైనా 6 నెలల కాలంలో పూర్తిచేసి, శిక్షలు పడేలా చూడాలి. అలాగైతే నేరం చేయడానికి కూడా ఎవరైనా భయపడతారు. ఇది అమలు జరగాలంటే అదనపు పోలీసు బలగాలు, న్యాయ సిబ్బంది, ఇతర నిపుణులు కావాలి. దురదృష్టకరమైన విషయమేంటంటే చట్టబద్ధంగా మహిళల భద్రత, శ్రేయస్సుకు సంబంధించిన పనులు కూడా జరగట్లేదు. దీనికోసం మేమెన్ని ప్రయత్నాలు చేసినా, రాజకీయ నాయకులు, పోలీసులను కలిసినా పనులు జరగట్లేదు. ఈ పరిస్థితి ఢిల్లీకి మాత్రమే పరిమితం కాలేదు. యావత్ భారతదేశమంతటా ఇలాగే ఉంది. ఎంతచేసినా ఫలితం లేదు. ఇక లాభం లేదని నేరుగా జనాన్ని రంగంలోకి దింపాము. మొదటి వారంలో వచ్చిన బ్లాక్ లెటర్లను ప్రధానమంత్రికి పంపాము. కొత్త చట్టాలు తీసుకు రావాలి. మహిళల రక్షణకు సంబంధించి ప్రజల్లోకి వెళ్లి చర్చలు జరపాలి. అవగాహన కల్పించడం వల్ల ఈ పరిస్థితులను కొంతవరకైనా అధిగమించవచ్చు.

★ ఈ సత్యాగ్రహంతో మీరేం సాధించారనుకుంటున్నారు...

నేను సామాజిక కార్యకర్తను. 12 ఏళ్లుగా కార్యకర్తగా పని చేస్తున్నాను. పాజిటివ్ రిజల్ట్ కోసం చూస్తే పనిచేయలేము. ప్రతి రోజు ఓ కొత్త పోరాటంలా భావిస్తూ ముం దుకు సాగాలి. రేప్ రోకో చాలా ప్రభావవంతంగా ఉంది. అది జనం ఆలోచనా విధానాన్ని మారుస్తుంది. ఉదాహరణకు ఇటీవల లజ్‌పత్‌నగర్ ప్రాంతంలో ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని రేప్ రోకో క్యాంపెయిన్ చేస్తున్నారు. అక్కడికి వచ్చిన ముగ్గురు అబ్బాయిలు మీ డ్రెస్సులను బట్టి చూస్తే మీమీద కూడా కచ్చితంగా రేప్ జరుగుతుందని ఎగతాళి చేశారు. అక్కడే ఉన్న మహిళలు, కొందరు పురుషులు వచ్చి వారికి తగిన గుణపాఠం చెప్పారు. ఇలాంటి చిన్నచిన్న సంఘటనలే రేప్ రోకో ఉద్యమ విజయాలు.

★ పటిష్టమైన చట్టాలతో మార్పు వస్తుందంటారా? ..

మంత్ర దండంతో ఇలాంటి మార్పును ఆశించలేము. చట్ట నిబంధనలు, ప్రవర్తన మార్పులు రెండూ అవసరమే. తప్పు చేయాలనే ఆలోచన వచ్చిన వారిలోనూ కఠినశిక్షల ద్వారా భయం పుట్టించవచ్చు. తప్పు చేస్తే తిప్పలు తప్పవనే భయం ఉండాలి. పెంపకం ఎంత బాగా ఉన్నా చట్టాల భయం కూడా ఉండాలి.

★ మహిళల భద్రతకు మీరెలాంటి చర్యలు చేపడుతున్నారు?

హైదరాబాద్‌లో నడుస్తున్న షీ టీమ్స్ గురించి విన్నాను. చాలా మంచి ప్రయత్నం. ఇలాంటివి భారతదేశమంతటా అమలవ్వాలి. పిల్లలపై అత్యాచారాలు అన్నిచోట్లా జరుగుతున్నాయి. నేను ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టాక ఒక్క ఏడాదిలోనే 12 వేల నేరాలు జరిగాయి. మాకు 3 లక్షల 16 వేల ఫోన్ కాల్స్ వచ్చాయి. వేశ్య వృత్తి నుంచి బయటపడ్డ జీబీ రోడ్ రెడ్‌లైట్ ఏరియా బాధితులు 5,500 మందికి సహకరించాము. దాదాపు 2 వేల కౌన్సిలింగ్ సెషన్స్ నిర్వహించాము. వివిధ ప్రాంతాలకు 750 విజిట్స్ చేశాము. ప్రభుత్వం నుంచి 55 సవరణలు తెచ్చాము. ఇదంతా ఒక్క ఏడాది సాధించిన పురోగతే.



★ మహిళా సమస్యలపై మీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటి?

ఇంత చేసినా ఏమీ సాధించలేకపోయాము అనిపిస్తుంది. అలాగని సమస్యలను వదిలేయలేము. అందుకే మా కార్యక్రమాలకు ధర్నా రూపం ఇవ్వాల్సి వచ్చింది. ఉదయం నిద్రలేవగానే న్యూస్‌పేపర్‌లో వచ్చిన 8 నెలల చిన్నారి ఉదంతాన్ని మర్చిపోలేను. అదే నన్ను సత్యాగ్రహం వైపు నడిపించింది. ఆర్భాటంగా ప్రపంచ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాము. నిర్భయ నిధులు ఖర్చు కాకుండా అలాగే ఉన్నాయి. ఈ సమస్యలన్నింటిని ప్రధాని దృష్టికి తీసుకెళ్తాను. నా ఒక్కదాని అరుపులు, కేకలు ఆయనకు వినిపించకపోవచ్చు. కానీ ఐక్యంగా లెటర్స్ ద్వారా విషయాన్ని ఆయన వరకూ తీసుకెళ్తే కదలిక ఉండవచ్చు.

★ మహిళల అక్రమ రవాణా చట్టం తెస్తే మార్పు వస్తుందంటారా?

కొత్త చట్టాలు మంచివే. ఇప్పటికే చాలా చట్టాలు ఉన్నాయి. కానీ వాటి అమలే సరిగాలేదు. పోక్సో చట్టం ప్రకారం ఒక్క ఏడాదిలో నేరాలను రుజువు చేయాలి. యావజ్జీవ కారాగార శిక్ష వేయాలి. కానీ అది జరగట్లేదు. నేరానికి-శిక్షకు మధ్య చాలా గ్యాప్ వస్తోంది. రక్షణ కల్పించాలంటే పోలీసులకు అదనపు బలగాలు కావాలి. రాజకీయ నాయకులకు భద్రత కల్పిస్తారు గానీ సగటు మహిళలకు మాత్రం కల్పించలేరు.

★ ఈ పదవి మీకు సంతృప్తినిస్తోందా?

ఈ చిన్నారి ఉదంతంతో నేను చాలా ఆగ్రహంతో ఉన్నాను. నేనొక సామాజిక కార్యకర్తగా ఎన్నో చూశాను. ఇతరులకు సహాయం చేయడానికి ఎంతో శ్రమించాను. ఒక చిన్న రేషన్ కార్డు సంపాదించడానికి కూడా ఎంతో కష్టపడాల్సి వచ్చింది. ప్రస్తుతం నా చేతుల్లో అధికారం ఉంది. దీని ద్వారా ఎక్కువ మందికే సాయపడగలుగుతున్నాను. నా అధికారం, నా మాటలు, పర్యటనల ద్వారా ఇది సాధ్యమవుతోంది. నేను సమాజం కోసం పోరాడుతున్నాను. దేనికైనా నేను సిద్ధమే.

★ మీరు మహిళలకు ఇచ్చే సందేశమేంటి...?

ప్రతి ఒక్కరి జీవితంలో పోరాటమనేది తప్పదు. మీరు మహిళా కమిషన్ చీఫ్ కావచ్చు. ఓ కంపెనీకి సీఈఓ కావచ్చు. ఓ ఉద్యోగి కావచ్చు, గృహిణి కావచ్చు. ప్రతి ఒక్కరికీ సవాళ్లు తప్పవు. సమస్యలకు భయపడకుండా ఎదుర్కొంటూ ధైర్యంగా ముందుకు సాగడమే.

-స్వరూప పొట్లపల్లి, న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ

కర్మఫలమే జన్మ

ఒక శరీరంతో చేసిన పాప పుణ్యాలు అదే శరీరంతో అనుభవించటం లేదు. మరో శరీరంతో అనుభవిస్తున్నారు. ఒకరు ఈ జన్మలో ఎన్ని పాపాలు చేసినా పూర్వ జన్మ పుణ్యం వల్ల సుఖాలను అనుభవిస్తూ ఉంటాడు. అతడు ఈ జన్మలో ఎన్ని పుణ్యాలు చేస్తున్నా, పూర్వ జన్మలో చేసిన పాప ఫలితం ఈ జన్మలో అనుభవిస్తూంటాడు. ఇదే పునర్జన్మలున్నాయన్న దాన్ని తెలుపుతుంది.

జీవుడు తన జీవ పరిణామదశలో అనేక జన్మలెత్తుతూ ఉంటాడు. మానవ జన్మలలో స్త్రీగాను, పురుషునిగాను జన్మిస్తుంటాడు. ఇక జంతు జన్మల్లో పశు పక్ష్యాది జన్మలు కూడా ఎత్తవచ్చును. కర్మ ఫలితాలను బట్టి చర్యకు ప్రతిచర్యగా ఈ జన్మలు ఏర్పడుతుంటాయి. ఆధునిక పరిభాషలో చెప్పాలంటే కిందటి జన్మ యాక్షన్‌కు రియాక్షనే ఈ జన్మ. స్త్రీ జన్మ ఎత్తితే వారికి సంబంధించిన ధర్మాలు, పురుషునిగా జన్మిస్తే ఆ ధర్మాలు ఆచరించాల్సి ఉంటుంది. ఈ రెండు వర్గాల వారికి శారీరక ధర్మాలు కూడా వేరుగా ఉంటాయి. పునర్జన్మ అంటే సూక్ష్మ శరీరం కొనసాగుతూ స్థూల శరీరాన్ని మరల మరల తెచ్చుకోవడం. **పునరపి జననం పునరపి మరణం** అనగా మళ్ళీ మళ్ళీ పుట్టడం, మళ్లీ మళ్ళీ మరణించడం. పుణ్య కర్మల వల్ల సుఖాలు, పాపాల ఫలితంగా దుఃఖాలు వస్తాయన్న విషయం తెలిసిందే. అయితే అందుకు విరుద్ధంగా పుణ్యం చేసేవారికి బాధలు, పాపాలు చేసే వారికి సుఖాలు కలగడం అక్కడక్కడ చూస్తుంటాం. పుట్టుకతో అంధుడైన వ్యక్తి, ఆగర్భ శ్రీమంతునిగా జన్మించిన వ్యక్తి ఆ జన్మలో ఎప్పుడు పుణ్యంగాని, పాపంగాని చేసి ఉండదు కదా అనే ప్రశ్న వస్తుంది. దానికి సమాధానం చెప్పేదే పునర్జన్మ సిద్ధాంతం. **పూర్వ జన్మ కృతం పాపం వ్యాధి రూపేణ, పూర్వ జన్మ కృతం పుణ్యం భోగరూపేణ** అంటారు. అంటే పూర్వ జన్మలో చేసిన పాపం రోగ రూపంలోను, గత జన్మలో చేసిన పుణ్యం ఈ జన్మలో సుఖాలకు కారణమవుతుందని దీని అర్థం. ఒక శరీరంతో చేసిన పాప పుణ్యాలు అదే శరీరంతో అనుభవించటం లేదు. మరో శరీరంతో అనుభవిస్తున్నారు. ఒకరు ఈ జన్మలో ఎన్ని పాపాలు చేసినా పూర్వ జన్మ పుణ్యం వల్ల సుఖాలను అనుభవిస్తూ ఉంటాడు. అతడు ఈ జన్మలో ఎన్ని పుణ్యాలు చేస్తున్నా, పూర్వ జన్మలో చేసిన పాప ఫలితం ఈ జన్మలో అనుభవిస్తూంటాడు. ఇదే పునర్జన్మలున్నాయన్న దాన్ని తెలుపుతుంది.

పురాణేతిహాసాల్లోను పునర్జన్మల ప్రస్తావన ఉంది. అర్జునుడు కన్నప్పగాను, భీముడు మధ్వాచార్యులుగాను జన్మించారని చెప్పేవారున్నారు. గజేంద్ర మోక్షంలోని గజేంద్రుడు గత జన్మలో ఒక మహారాజు. 3,4 సంవత్సరాల వయస్సు పిల్లలు పూర్వ జన్మ విషయాలను వెల్లడించిన సందర్భాలు ఉన్నాయి. షిరిడీ సాయి బాబా ఒక చోట పాము - కప్పల వైరాన్ని వారి పూర్వ జన్మకు సంబంధించినదిగా పేర్కొనడం, రెండు బల్లులు కలిసినప్పుడు అవి గత జన్మలో అక్కా చెల్లెళ్లు అని చెప్పడం గమనార్హం. కర్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం తెలిసిన వాడు రాబోయే జన్మలలో మరింత సుఖ భోగాలుండేలాగున అనేక పుణ్య కార్యాలు చేయవచ్చును. మనం చేసే ప్రతి పనిలోని (కర్మ) స్పందనలు వాయు మండలంలో నిక్షిప్తమవుతాయి. వాయు మండలంలో బాధామయ స్పందనలు, ఆనందమయ స్పందనలు జనిస్తాయి. దుష్కర్మల వల్ల బాధలు జనిస్తాయి. ఈ రకంగా కర్మ ఫలితం చర్యకు ప్రతిచర్య రూపం దాలుస్తుంది. క్షమాగుణం కలిగిన వారు కర్మ చక్రాన్ని ఆపగల శక్తి కలిగి ఉంటారు. పుణ్య కర్మల చేత దేవతలుగా, మిశ్రమ కర్మలచేత మానవులుగా, పాప కర్మల చేత పశు పక్షి క్రిమి కీటకాదులుగా పుట్టడం జరుగుతూంటుందనేది స్థూలంగా కర్మ సిద్ధాంతం. కర్మ వల్లనే పుట్టడం, పెరగడం, మరణించడం జరుగుతోంది. కర్మయే ఈ సృష్టికి కారణమని తెలుస్తోంది. పుణ్యకర్మలు చేసిన వారు దైవ గుణాలు, పాప కర్మలు చేసే వారు ఆసురీ గుణాలు కలిగి ఉంటారు. మానవుడు పూర్వ జన్మల్లో చేసిన కర్మలు వ్యర్థం కావు. దైవ గుణాలు సంసార బంధం నుంచి విడుదలకు హేతువు అవుతాయి. ఆసురీ గుణాలు జనన మరణాలకు కారణమైన కర్మ బంధాన్ని పటిష్టం చేస్తుంటాయి. ఒక జన్మలో ఒకరు ఒక విషయంలో పొందిన శిక్షణ మరు జన్మలో అతని గుణంగా రూపాంతరం చెందుతుంది.



ఆసురీ గుణాలు

కామం

అన్ని రకాల దేహేంద్రియ భోగ సంబంధమైన కోరికలను కామం అంటారు.

క్రోధం

క్రోధం అంటే కోపం. దీని వల్ల మనిషి గొప్పతనం సన్నగిల్లుతుంది. బ్రతుకు దుర్భరమవుతుంది. విపరీతమైన కోపం వచ్చిన వానికి పిచ్చి వానికి తేడా ఉండదు. ఆరోగ్యం క్షీణిస్తుంది.

లోభం

లోభం కలవాడు తనకు ఉన్న దానిని ఎవ్వరికీ ఇవ్వడానికి ఇష్టపడడు, అనగా అతనికి దాన గుణం ఉండదు.

మోహం

మోహం అంటే పుత్ర మిత్ర కళత్రాదులందు, ధన ధాన్య వస్తు వాహనాదుల పట్ల మిక్కుటమైన ప్రేమ. యుక్తాయుక్తాలు ఎరుగని చిత్త వృత్తి.

మదం

ఇది ఎనిమిది విధాలు. అవి కలం, బలం, ధనం, రూపం, యౌవ్వనం, విద్య, రాజ్యం, తపస్సు.

మాత్సర్యం

ఎందులోనైనా తన కంటె ఇతరులు ఎక్కువగా ఉండటాన్ని ఓర్వలేక పోవటమే మత్సరం.

రాగము

ఎదుట వారి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ఇతరులపై కలిగే ఇష్టం రాగం.

ద్వేషం

ఒకరు తనకు అపకారం చేశారని మరల వారికి అపకారం చేయాలనే చిత్త వృత్తి.

ఈర్ష్య

తనకు మాత్రమే కష్టాలు కలుగుతున్నాయని, ఇతరులకు ఎందుకు కలగటంలేదని వారిపై ఏర్పడే కోపమే ఈర్ష్య.

అసూయ

తనకు మాత్రమే సుఖం కలగాలని ఇతరులకు ఆ సుఖం రాకూడదనే చిత్తవృత్తి.

దంభము

తను చేసే పనులను ఇతరులు మెచ్చుకోవాలనే చిత్తవృత్తిని దంభము అంటారు.

దర్పం

నేను సర్వ విషయాల్లో సమర్థుడనని తనకు సాటి అయిన వాడు ఎక్కడా లేడని భావించే చిత్తవృత్తి (అదే గర్వం)

అహంకారం

అకారణంగా ఇతరులను శిక్షించాలనే తమో గుణాన్ని చిత్తవృత్తి గలవారిని అహంకారులు అంటారు

ఆసురీ గుణాల్ని తొలగించేందుకు సాధన చేయాలి. అప్పుడు ఆ అజ్ఞానం వీడుతుంది. సాధనలకు గురువు సహకారం అవసరం. శాస్త్రాలు కూడా ఏది చేయాలో, ఏది చేయకూడదో నిర్దేశించాయి. ఇక్కడ శాస్త్ర ఆదేశా నుసారం కర్మ చేయాలి.

- శ్రీహయగ్రీవ జ్యోతిష పరిశోధనా కేంద్రం
9949514583

చింతన

విష్ణువు అవతారాలలో నరసింహావతారం ఒకటి. తెలుగు నాట నవ నారసింహ క్షేత్రాలు, పంచ నారసింహ క్షేత్రాలు ప్రసిద్ధి. పంచ నారసింహ క్షేత్రాలు కృష్ణా జిల్లాలో ఉన్నాయి. అవి వాడపల్లి, మట్టపల్లి, వేదాద్రి, కేతవరం, మంగళగిరి. ఈ పంచ నారసింహ క్షేత్రాలలో వేదాద్రి క్షేత్రానికి చరిత్ర ప్రసిద్ధి ఉంది. కవిత్రయంలో ఒకరైన ఎర్రాప్రగడ ఈ క్షేత్రంలో మూడు రోజుల పాటు స్వామిని సేవించి కృతార్థులయ్యారు. అలాగే వాగ్గేయ కారులైన నారాయణ తీర్థులు ఇక్కడ కొంత కాలం ఉండి స్వామి వారి పేర తరంగములు రచించి స్వామి వారికి ప్రీతి పాత్రులయ్యారని చరిత్ర చెబుతోంది.

ఇక్కడి స్థల పురాణం ప్రకారం సోమకాసురుడు బ్రహ్మ దేవుని దగ్గరున్న వేదాలను దొంగిలించాడు. (దొంగిలించడానికి వేదాలు పుస్తకాలలో రాసి ఉండవు.

సాధురూప నరసింహుడు



ఇక్కడ దొంగిలించడం అంటే అవి బ్రహ్మకు స్ఫురణకు రాకుండా మాయను ప్రయోగించడమని ఒక విజ్ఞుని వివరణ). ఆ స్ఫురణను తన నియంత్రణలో ఉంచుకుని సముద్రంలో దాగున్నాడు. బ్రహ్మ ఈ విషయాన్ని విష్ణువుకు వివరించగా ఆయన మత్స్య రూపం ధరించి సోమకాసురుణ్ని వధించాడు. ఆ సందర్భంలో చతుర్వేదాలు పురుష రూపాలు ధరించి ఆయన స్పర్శ చేత తమకు అమృతత్వం ఏర్పడిందని ఎల్లవేళలా తమను తరింపజేయడానికి భూమి మీద ఎక్కడైనా వెలవాలని ప్రార్థించాయి. వారి ప్రార్థనకు మెచ్చి, సమయం వచ్చినపుడు మీ కోరిక తప్పక నెరవేరుస్తానన్నాడు ముకుందుడు. హిరణ్య కశిపుని అంతమొందించేందుకు, ప్రహ్లాదుని రక్షించేందుకు వచ్చిన సందర్భంలో వేదాద్రిలో యోగానంద లక్ష్మీ నరసింహునిగా వచ్చే వరకూ మీరు కృష్ణా నదిలో పర్వత రూపంలో ఉండాలని వేద పురుషులను ఆదేశించాడు జగన్నాథుడు. హిరణ్యకశిపుని వధానంతరం ఆయన భక్తులను ఉద్ధరించడానికి వేర్వేరు ప్రాంతాల్లో సాలగ్రామ నరసింహుడిగా, జ్వాలా నరసింహుడిగా, యోగ నరసింహుడిగా, వీర నరసింహుడిగా, వేదాద్రిలో యోగానంద లక్ష్మీ నరిసింహుడిగా వెలిశాడు.

ఈ ఆలయ ప్రాకారాలు సుమారు 8, 9 వందల సంవత్సరాలకు పూర్వం రెడ్డి రాజుల చేత నిర్మింపబడ్డాయి. దైవ చింతన కలవారి పోషణలో ఈ ఆలయం అందంగా తీర్చిదిద్దబడింది. అరణ్యం మధ్యలో ఉన్న వేదాద్రి భక్త కోటికి ముక్తి మార్గం చూపుతుంది. ఈ పంచనారసింహ క్షేత్రాలలోని అన్ని నారసింహుల రూపాలు ఉగ్రతరమైనవే. వేదాద్రిలో వెలసినదే సాధు రూపం. అదొక ప్రత్యేకతగా చెప్పవచ్చు. శ్రీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ యోగానంద నరసింహ స్వామికి అక్కడ నిత్యం కుంకుమార్చన జరుగుతుంది. కొందరు భక్తులు వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి మండల దీక్షను కూడా చేపడతారు.

మంగళా శాసనం:

వేదాచల నివాసాయ,
వేదాంత జ్ఞేయమూర్తయే
రాజ్యలక్ష్మీ సమేతాయ
నారసింహాయ మంగళమ్

- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

దినఫలాలు

వేషరాశి: పనులలో శ్రమ తగ్గుతుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు మెల్లమెల్లగా పరిష్కరింపబడతాయి. శత్రుభీతి తగ్గుతుంది.

వృషభరాశి: అనుకూల పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల ద్వారా అనుకూలత ఉంటుంది. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథునరాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం తగ్గుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటకరాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహరాశి: ఆర్థిక ప్రయత్నాలు అనుకూలం. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యారాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చికరాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు తగ్గుతాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూరాశి: ఉద్యోగ వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రతికూలత ఉంటుంది. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. కుటుంబ వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

మకరరాశి: ఆరోగ్య రీత్యా అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆదాయానికి అనుకూల పరిస్థితులు ఉంటాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలం.

కుంభరాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య క్రమశిక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార అనుకూలత ఉంటుంది.


మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

తీర్థ ప్రసాదాలు



6-7-47

పూర్వం ఆశ్రమంలో జనం ఎక్కువగా లేని రోజుల్లో భోజన సమయమందు భగవాన్ సన్నిధి సేవకులలో ఎవరో ఒకరు కావలి నిమిత్తం ఉండి మొదటి పంక్తి లేచిన వెనుక వెళ్లి భగవాన్ విస్తట్లో వడ్డించుకొని తినేవారట. క్రమంగా ఆశ్రమవాసులు, చొరవగల భక్తులూ ఆ ఆకు కాశించటం, లభ్యంకావటం పరిపాటయింది. వంతులూ, వచ్చందాలూ, బయట పడనంత కాలం భగవాన్ చూచీ చూడనట్లూరుకున్నారు. చేయి కడుక్కునేందుకు విస్తరిముందొక పళ్లెం పెట్టటం కూడా మామూలు. వారు చెయ్యి కడుక్కొని వెళ్లగానే చాలామంది, ఆ తీర్థమున్నూ పుచ్చుకొనేవారు. ఈ రెండూ రాను రాను ఆశ్రమం ఆవరణ దాటి రమణపురంలోకి కూడా పాకినవి.

ఒకనాడొక ధనికుని తల్లి శ్రీవారి మధ్యాహ్న భోజన సమయంలో వచ్చి ఒక ప్రక్కన నిలుచున్నది. భగవాన్ చూచి "భోజనానికి కూర్చోరేమి?" అన్నారు. కూర్చోలేదు. అక్కడ వారితో "ఆకు వేసి, వడ్డించండయ్యా" అన్నారు భగవాన్. "ఇప్పుడు వద్దు. వెనక తింటా" నన్నదామె. భగవాన్ గ్రహించి తెలియనట్లు పలక్కుండానే ఉన్నారు. మరొక ప్రక్కన ఇంకొక భక్తురాలి మనుమరాలు ఏడెనిమిదేండ్ల పిల్ల గ్లాసొకటి పట్టుకొని నిలిచింది. శ్రీవారదీ గమనించి "నీవూ నిలుచున్నావేం? కూర్చొని అన్నం తిను?" అన్నారు. "ఊహూ, తినను" అన్నది. "మరెందుకొచ్చావు? ఆ గ్లాసెందుకు?" అన్నారు భగవాన్. పసిపిల్ల గదా? రహస్యగోపనం తెలియక "అమ్మమ్మ తీర్థం తెమ్మని పంపింది" అన్నది. భగవానిక సహించలేక "ఆ, అదీ సమాచారం. ఆ బిడ్డ తీర్థానికీ, ఆమె ఆకుకూ కాచుకొని ఉన్నారు, అంతేగదా? ఏం? నిజమేనా? అంటూ గద్దించి అడిగారు సమీపస్థులను. "ఔ"నన్నారు వారు. "చాలాకాలం నుంచి ఈ చేష్టలన్నీ చూస్తూనే ఉన్నాను. స్వామి కళ్లు మూసుకొని హాల్లో కూర్చుంటాడు. ఇవేవీ తెలియవనుకుంటారు. ఎందుకెందుకని చూస్తే, అంతులేకుండా ఉన్నది. ఉచ్ఛిష్టప్రసాదాలూ, తీర్థాలూ, వాటికోసం వంతులూ వచ్చందాలూను. ఇదుగో, నేనిక పళ్లెంలో కాదు గదా చుట్టు ప్రక్కల ఎక్కడా చెయ్యి కడుక్కోను. విస్తరి విడిచిపెట్టి వెళ్లను. నేనే ఎత్తి దూరంగా పారేస్తాను. తెలిసిందా? అందరూ కలిసే చేస్తారీ పనులు. దీనికి ఇదే శిక్ష" అంటూ ఇంకా ఏమేమో చాలాసేపు ఖండించి విస్తరి మడిచి చేత్తో పట్టుకొని లేచారు భగవాన్. ఎవరెంత బ్రతిమలాడినా ఇవ్వక కొండ ఎక్కి, మలుపు తిరిగిన వెనక పారేసి అక్కడే చేయి కడుక్కోటం ఆరంభించారు. ఆశ్రమవాసులంతా ఈ అభ్యాసం మానెదమని రెండుమూడు రోజులు ప్రార్థిస్తే "ఎవరి విస్తరి వారే తీసుకుంటుండగా నా విస్తరి నేనెందుకు వదలాలి?" అన్నారు భగవాన్.

అందరి విస్తళ్లూ మేమే తీస్తామనీ, అన్ని విస్తళ్ళతో పాటు భగవాన్ విస్తరి గూడా పారవేస్తామని అందరూ ప్రమాణ పూర్వకంగా అంగీకరించిన వెనుక ఎట్లాగో విస్తరి విడిచి పెడుతున్నారే గాని చెయ్యి మాత్రం ఇప్పటికీ బయటి గడపల వద్దనే కడుక్కుంటున్నారు. ఎవరైనా పళ్లెంలో కడుక్కోమని బ్రతిమలాడితే "అందరికీ పెడతారటయ్యా పళ్లాలు? అందరికీ లేనిది నాకెందుకు?" అంటారు. వారికేం సమాధానం చెప్పగలం.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



భగవద్గీత

నా లోకానికి చేరితే జన్మరాహిత్యమే

అధ్యాయం 8
శ్లోకం 16

ఆబ్రహ్మభువనాల్లోకాః
పునరావర్తినోర్జున।
మాముపేత్య తు కౌంతేయ
పునర్జన్మ న విద్యతే॥

తాత్పర్యం

భౌతిక జగమునందలి అత్యున్నతలోకము మొదలుకొని అధమ లోకము వరకు గల సర్వలోకములు జన్మమృత్యుభరితమైన దుఃఖ ప్రదేశములే. కాని ఓ కౌంతేయా! నా లోకమును చేరినవాడు తిరిగి జన్మమునొందడు.

భాష్యం

ఎటువంటి యోగి అయిన (కర్మ, జ్ఞాన లేదా హఠ) యోగి అయినా చివరకు భక్తి యోగం ద్వారా కృష్ణలోకమునకు చేరితే తిరిగి వచ్చే అవకాశం లేదు. భూలోకంలో పుణ్యం చేసిన వారు స్వర్గానికెడతారు.

ఆ పుణ్యము నశించిన తర్వాత తిరిగి వస్తారు. అలాగే ఇంద్ర చంద్రాది లోకములకే గాక బ్రహ్మలోకమునకు వెళ్ళినా తిరిగివచ్చే అవకాశం ఉంది. అనగా పునరపి జననం పునరపి మరణం కొనసాగుతూనే ఉంటుంది. అయితే ఉన్నతలోకములలో భక్తి కొనసాగించినవారు మాత్రమే ప్రళయా నంతరం భగవద్ధామానికి వెళ్లే అవకాశం పొందుతారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

వెదురు... వెలుగులు

ఓ ఆలోచన జీవితాన్నే మార్చేసింది!

ఓ సారి అయిష్టం మేలు చేస్తుంది. మరోసారి నష్టాన్ని కల్గిస్తుంది. అందుకే అంటారు పెద్దలు జీవితం అంటేనే ఇష్టాయిష్టాల కలయిక అని! కష్టం వచ్చినా....నష్టం వచ్చినా కుంగిపోకుండా..కష్టాలను ఇష్టాలుగా మార్చుకోగల్గితే....జీవితం హాయిగా సాగిపోతుంది. అంతే కాదు కొన్నిసార్లు అయిష్టం జీవితాన్ని అనూహ్యమైన మలుపు తిప్పుతుంది.. కప్పగంతుల అరుణ, ప్రశాంత్ లింగం దంపతుల జీవితంలో అదే జరిగింది. వారి బతుకుల్లో వెలుగులు నింపింది. దానికి తోడు ప్రపంచ పర్యావరణానికి దోహదం చేస్తోంది. ఇంతకు ఏమా కథ? వాళ్ళకు అంతగా అయిష్టమైన సంఘటన ఏం జరిగింది? అది ఎలా మేలుచేసిందనే కదా మీ డౌట్? అది తీర్చేందుకే ఈ కథనం!

అరుణ, ప్రశాంత్ దంపతులు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసం ఉంటున్నారు. వాస్తవానికి వీరిది పశ్చిమ బెంగాల్. దంపతులిద్దరు విద్యావంతులు.బతుకుతెరువుకోసం హైదరాబాద్ వచ్చారు. తమ చదువుకు తగ్గ ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగించడమే కాకుండా, వచ్చే జీతంలో కొంత పొదుపు చేసి ఓ ఇల్లు నిర్మించుకున్నారు. ఓ రోజు దంపతులు ఇంటిలోకి ఫర్నీచర్ కొందామని షాపునకు వెళ్లారు. అయితే వారికి ఆ ఫర్నీచర్ నచ్చలేదు. అంతే వెనుదిరిగారు. అయితే అప్పుడు వారికి ఓ ఆలోచన వచ్చింది. గతంలో తాము ఎక్కడో చూసిన ఫర్నీచర్ నమూనాను వెదురు బొంగులతో




చేస్తే ఎలా ఉంటుందని! ఆలోచన వచ్చిందే తడవుగా ఆచరణలో పెట్టారు. ఇంటిలోకి కావాల్సిన ఫర్నీచర్‌ను వెదురుతో నచ్చినట్లు చేసుకున్నారు. అంతటితో ఆగకుండా వెదురు బొంగులతో ఫర్నీచరే కాదు ఇళ్లు కూడా కట్టుకోవచ్చని నిరూపించారు. ప్రస్తుతం వారి ఇంటినే కార్ఖానాగా మార్చేశారు. బ్యాంబూ హౌస్ ఇండియా..అని పేరు పెట్టుకున్నారు.

బ్యాంబూ హౌస్!

ఈ దంపతులు వెదురు గడలు తీసుకుని వచ్చి, చాపలు తయారు చేస్తారు.అలా చేసిన చాపలను ఒకదానిపై ఒకటి పేర్చి..కంప్రెస్ చేసి, ఫ్లై ఉడ్ షీట్‌లా మార్చేసి, గోడలుగా తయారు చేస్తారు. ఇంకేముంది గోడలు రెడీ అయ్యాక..ఇచ్చిన నమూనా ప్రకారం వెదురింటిని నిర్మించేస్తారు. మొదట వెదురును సేకరించడంలో ఇబ్బందులు ఎదురైనా ఇప్పుడు ఆ సమస్య లేదంటున్నారు అరుణ దంపతులు. తమ బుర్రలో వెలిగిన చిన్న ఆలోచనతో వెదురు ఫర్నీచర్ చేసుకున్న అరుణ, ప్రశాంత్ దంపతులు.....ఇప్పటి వరకు 250 పైగా పెంట్ హౌస్‌లు,ఫామ్ హౌస్‌లతో సహా.. పార్కులు, రిసార్ట్‌లలో వెదురు ఇళ్లను నిర్మించారు. వెదురు గడలు కదా...వానకు తడిసి, ఎండకు ఎండితే..పాడవ్వవా అనే సందేహం కలగడం సహజం. కాని వెదురు ఇళ్లు దాదాపు 25 సంవత్సరాలు పాడుకాదని చెబుతున్నారు అరుణ, ప్రశాంత్ దంపతులు.

మనం పనికిరావని పారేస్తే..!

మనం వాడిన తర్వాత ప్లాస్టిక్ బాటిల్స్ ను, కవర్లను, టైర్లను పారేస్తుంటామ్. అయితే ఈ దంపతులు మాత్రం హైదరాబాద్ రోడ్లపైనా, రోడ్డు పక్కన మనం పారేసిన వాటిని సేకరించి..వాటితో రకరకాల పరికరాలు తయారు చేస్తున్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వేస్ట్‌తో పేవ్‌మెంట్స్ నిర్మాణంలో ఉపయోగించే....టైల్స్‌ను రూపొందిస్తున్నారు. వెదురు ఇళ్ల మూలంగా పర్యావరణానికి మేలు జరిగితే.. వీరు తయారు చేసే టైల్స్ వల్ల ప్రజాధనం వృధా కాదు. ఎందుకంటే..పేవ్ మెంట్స్ మీద వేసిన టైల్స్‌ను తరచు ఇతర అభివృద్ధి పనుల్లో భాగంగా పగులగొట్టడం మనకు తెలిసిందే. దీంతో మళ్లీ కొత్తవి కొని టైల్స్ పరవక తప్పదు. కాని వీరు వేస్ట్ ప్లాస్టిక్‌తో తయారు చేసిన టైల్స్ మాత్రం పగిలి పోవు. వాటిని ఒకసారి వేసిన తర్వాత తొలగించడం తేలిక. తిరిగి వాటినే వాడుకోవచ్చు. ఇలా ప్రజాధనం ఆదా అవుతుందన్నమాట. 2010లో ప్రారంభమైన వీరి వెదురింటి వ్యాపారం మంచి లాభాలను తెచ్చిపెడుతోంది. వారు స్వశక్తితో ఎదిగిన తీరు స్వయం ఉపాధి పొందే యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. అంతేకాదు వారిలోని ఈ సృజనాత్మకతే ప్రస్తుతం అరుణను లేడీ లెజెండ్స్ అక్లాడ్స్ కి నామినేట్ అయ్యేలా చేసింది.ఈ దంపతులు మరిన్ని వినూత్నమైన ప్రయోగాలు చేసి సక్సెస్ సాధించాలని ఆశిద్దాం!



మహిళా సాధికారిత కోసం ఎందరో కృషి చేస్తున్నారు. స్త్రీ ఆర్థిక స్వావలంబన కోసం పాటు పడుతున్నారు. కొందరు మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తూ.. సమాజంలో పురుషులతో సమానంగా ముందుకు సాగిపోతున్నారు. కారణాలు ఏవైనా....కొందరి ప్రతిభకు మాత్రమే గుర్తింపు లభిస్తోంది. సమాజం గుర్తించకున్నా...నిత్యక్రియాశీలంగా ఉంటూ....తమ వంతు సమాజానికి సేవచేస్తున్న ప్రతిభా వంతులైన స్త్రీలను ఇక్కడ పరిచయం చేస్తున్నాము.

లేడీ లెజెండ్స్



బొట్టు బొట్టు ఒడిసి పట్టి...

నీటి సమస్యకు కల్పనా దంపతుల పరిష్కారం



హక్కుల కోసం నినదిస్తాం....బాధ్యతలను మాత్రం విస్మరిస్తాం...సమాజంలో చాలావరకు ఇదే తంతుసాగుతోంది. సమాజం పట్ల, సాటి మనుషుల పట్ల, భావితరాల పట్ల నిర్వర్తించాల్సిన కనీస ధర్మం కూడా నేటి సమాజంలో మృగ్యం అనే చెప్పాలి. సొంత లాభం కొంత మానుకొని పొరుగువారికి తోడుపడవోయ్..అని పెద్దలు చెప్పినట్లు.. తమకోసం కాకుండా, ఇరుగు పొరుగు వారికోసం...భావితరాల బాగు కోసం తపిస్తున్నారు కల్పనారమేష్ దంపతులు. పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం మూలంగా ప్రకృతి ప్రకోపించి..ఏటేటా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మానవ తప్పిదాల వల్ల భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా కాంక్రీట్ జంగిల్స్‌గా మారిన నగరాల్లో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దీనంతటికి కారణం....నీటిని ఒడిసి పట్టుకోలేక పోవడమే. నగరాల్లో ఇళ్లు ,బజారులు అన్నీ కాంక్రీట్ మయం కావడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు ఛాన్సే లేదు. ఇదే పరిస్థితి ఇలాగే కొనసాగితే భావితరాలు చుక్క నీటికోసం అల్లల్లాడిపోవాల్సిందే. ఆ పరిస్థితిని ఊహించుకొని ప్రభుత్వం చేపట్టిన ఇంకుడు గుంతల కార్యక్రమానికి ఊతమిస్తూ ముందుకు సాగుతున్నారు రమేష్ లోకనాథం, కల్పనా రమేష్ దంపతులు. భూగర్భ జలాలకు, చెరువులకు ఆధారం వర్షపు నీరే. అందుకే వర్షపు నీటిని వృధా కాకుండా చేసేందుకు సరైన మార్గం....ఇళ్లల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవడమే ..అంటూ వీరు ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు వారు తమ ఇంట్లో 35వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ఇంకుడు (ట్యాంకు) గుంతను నిర్మించుకున్నారు. దీనిలో బొగ్గు,ఇసుక తో ఫిల్టర్ ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో కురిసిన వాననీటిని ఇందులోకి మళ్లించి..వాటినే ఇంటి అవసరాలకు వాడుకుంటూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. దీంతో నగరంలో ఎంతటి నీటి ఎద్దడి ఏర్పడినా వీరికి మాత్రం ఆ బాధ ఉండదు. గత నాలుగు సంవత్సరాలుగా మండు వేసవిలో సైతం ఒక్క ట్యాంకర్ నీటిని వారు కొనలేదు. తాము చేసి చూపించి, కమ్యూనిటీ మెంబర్స్ సాయంతో ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను కాలనీల్లో ప్రచారం చేస్తున్నారు. ఫలితాలు సాధిస్తున్నారు.

ప్రత్యేక సంస్థ ఏర్పాటు

ఈ విషయంలో వారు కాలనీకే పరిమితం కాలేదు. గ్రేటర్ హైదరాబాద్ మొత్తానికి విస్తృత పరిచేందుకు..SAHE: SOCIETY FOR ADVANCEMENT IN HUMAN ENDEAVOUR అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు.అందులో స్థానిక ప్రజలను భాగస్వాములను చేశారు. అటు ప్రభుత్వం,ఇటు జీహెచ్ఎంసీ సాయంతో నగరంలో పాడైపోయిన చెరువులను బాగుచేసేందుకు నడుం బిగించారు. సమాజం పట్ల బాధ్యత ఉన్న ప్రజలను కూడగట్టుకుని వారాంతపు రోజుల్లో చెరువుల్లో జనం పడేసిన చెత్త, ప్లాస్టిక్‌లాంటి వేస్టేజ్‌ని తొలగించి శుభ్రం చేస్తున్నారు. తిరిగి చెత్తాచెదారం వేయకుండా.. లివ్ ది లేక్...పేరుతో ప్రచారం చేస్తూ... స్థానిక ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట

సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తున్న కల్పన దంపతులకు మన సంస్కృతి సంప్రదాయాలంటే ఎనలేని గౌరవం. కల్పనా రమేష్ వృత్తి రీత్యా ఇంటీరియర్ డిజైనర్ / ఆర్కిటెక్. ఆమె భర్త రమేష్ లోకనాథం..ట్రిపుల్‌ఐటీలో రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ విభాగంలో ప్రొఫెసర్. ఉద్యోగ రీత్యా అమెరికా వెళ్లి..అక్కడే స్థిరపడే అవకాశాలు అందివచ్చిన సమయంలో హైదరాబాద్ తిరిగి వచ్చారు. కారణం వాళ్ల తల్లిదండ్రులు వృద్ధాప్యంలో హైదరాబాద్‌లో ఒంటరిగా ఉంచడం ఇష్టం లేక.తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో వేస్తున్న కొడుకులున్న ఈ రోజుల్లో..కన్నవారి కోసం మంచి ఫ్యూచర్‌ను అమెరికాలో వదిలేసి ఇక్కడికి వచ్చారంటే..కల్పనా దంపతులు ఎంతటి సంప్రదాయ వాదులో, సంస్కృతికి ఎంతటి గౌరవం ఇస్తారో తెలిసిపోతుంది.ఇంకో విశేషం ఏమిటంటే వారు ఇంటిలోనే ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు పండించుకుంటున్నారు. వారి గురించి తెలుసుకున్న రాజారత్న హెల్త్ కేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌వారి లేడీ లెజెండ్స్ అక్లాడ్స్ టీం వారిని కలిసి..నామినేష్ వేయాల్సిందిగా కోరింది.

త్రిగుణాల సంగమం సత్యవతి!

దాతృత్వం..దానగుణం..భారతీయం..



ప్రతి ఒక్కరికి దేశ భక్తి ఉంటుంది.సందర్భం వచ్చినప్పుడు దానిని ప్రదర్శిస్తుంటారు. కొందరికి మాత్రం అది నరనరాల్లో జీర్ణించుకు పోతుంది. దానిని వారు ఇంటిలోను, వంటిమీద ప్రదర్శిస్తుంటారు. అందులో కొందరు మాత్రం ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపించేందుకు యత్నిస్తుంటారు. మన జాతీయత, దేశ సంస్కృతి, సంప్రదాయాలను గురించి జనంలో ప్రచారం చేస్తుంటారు. వాటి పట్ల ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు..యత్నిస్తుంటారు. ఈ కోవకు చెందిన వారే భారతీయం సత్యవాణి. కృష్ణా జిల్లాలో పుట్టిన సత్యవాణి, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అనంత అన్నపూర్ణ సత్యవాణిగా మీడియా ద్వారా బహుళ ప్రచారం పొందారు. హైదరాబాద్ మియాపూర్‌లోని ధర్మపురిని కేంద్రంగా చేసుకొని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, ధార్మికతను ప్రచారం చేస్తున్నారు. తదనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి కొట్టుకుపోతున్న నేటి యువతరాన్ని సరైన దారిలో పెట్టేందుకు కృషి చేస్తున్నారు సత్యవతి. నేటి యువతే..భారత భవిత ....అందుకే సమాజ హితం కోసం.. భారతీయం అనే సంస్థను స్థాపించారు. దేశం,దైవ సమాజం, భారతీయ సంస్కృతి గురించి ప్రజలకు చాటి చెప్పేందుకు.. అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు సత్యవతి. ఒక సంస్థ లేదా ఒక వ్యక్తి శ్రమించినంత మాత్రాన ఆశించిన ఫలితం సాధించలేము. అందుకే ఇతర స్వచ్ఛంద సంస్థలు, మేధావులు కూడా ఆ దిశలో కృషిచేయాలంటారు సత్యవతి. పిల్లల ప్రవర్తన మంచిదైనా,చెడుదైనా అందుకు పెద్దలే బాధ్యులని, తమ బిడ్డలు తప్పుదారి పడుతున్నారని తెలిస్తే తల్లిదండ్రులు మందలించాలని అంటారు. ప్రస్తుత సినిమాలు, సీరియళ్లు యువతను పెడదారి పట్టించే విధంగా ఉంటున్నాయని, ఈవిషయంలో తల్లిదండ్రులతో పాటు, సమాజంలోని పెద్దలు కూడా తగిన శ్రద్ధ వహించాలని చెబుతారు సత్యవతి. సామాజిక కార్యక్రమాలల్లో పాల్గొన్నా..పాఠశాలల్లో నిర్వహించే సమావేశాల్లో మాట్లాడినా ఆమె ఈ విషయాలను మాత్రం నొక్కిచెబుతారు. సమాజపు పెడధోరణులకు కారణం పాఠశాల స్థాయి నుంచే నైతిక విలువలను పెంపొందించక పోవడమేనని, గతంలో పాఠ్యపుస్తకాలలో నీతికథలకు సంబంధించిన సబ్జెక్ట్ ఉండేదని, ప్రస్తుతం ఆ విషయంపై ఎందుకో శ్రద్ధ చూపడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తారు. మన సంస్కృతి,సంప్రదాయాల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత పెంపొందేలా విద్యాబోధన సాగేదని ఆమె అంటారు. ప్రస్తుతం అది లోపించిందని.. ర్యాంకుల మాయాజాలంలో పడిపోతున్నారని, పైగా నేటి యువతరం డబ్బుకు ఇచ్చే విలువను నైతికతకు ఇవ్వక పోవడం శోచనీయమంటారు సత్యవతి. నేటి యువత వింతపోకడలు పోతూ...మానవీయ విలువలకు తిలోదకాలిస్తున్నదని వాపోతారు. మనది ధర్మానికి శిరస్సు వంచే జాతి....ధనానికి పాదాభివందనం చేసే జాతి కాదన్న విషయం ప్రతి ఒక్కరూ...ముఖ్యంగా యువత గుర్తించాలని సత్యవతి ఉద్బోధిస్తారు. మనది పుణ్యభూమి,కర్మభూమి, జ్ఞాన భూమి, తపోభూమి అన్న సంగతి తన ప్రసంగాల్లో మరీ మరీ వినిపిస్తారు. నేటి యువతీ యువకుల్లోనూ..కొందరు సమాజ హితం కోరుకుంటూ.. సందేశాత్మక షార్ట్ ఫిల్మ్‌లు, మెసేజ్‌లు సామాజిక మాధ్యమాల్లో పెడుతున్నారని, వారిని చూస్తే ముచ్చటేస్తుందంటారు.

ధార్మికత్వమే కాదు దాన గుణం కూడా

భారతీయం సత్యవతిగా పేరుపొందిన ఆమెలో ధార్మికతత్వమే కాదు దానగుణం కూడా ఉంది. సమైక్యాంధ్రప్రదేశ్ విభజన తర్వాత ..నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి ఒంటిమీద ఉన్నదంతా ఊడ్చి ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు...ప్రజల నుంచి ఆర్థిక విరాళాలు సేకరిస్తున్న సమయంలో సత్యవతి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మెడలో ఉన్న తాళిబొట్టు మినహా.. చేతికున్న బంగారు గాజులతో సహా...ఇతర నగలన్నీ విరాళంగా ఇచ్చేశారు. నాటి నుంచి మువ్వన్నెల జెండా గుర్తుకు వచ్చి, దేశభక్తి ఉప్పొంగేలా.. చేతులకు మూడు రంగుల గాజులు ధరిస్తున్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా ఎన్నో సన్మానాలు జరిగాయి. కాని ఆమె ఎప్పుడూ పొంగిపోలేదు. పైగా తన ఒరవడిని మార్చుకోలేదు. అందుకే అది గమనించిన సంస్థ నిబంధనలు ప్రకారం ఆమెను లేడీ లెజెండ్స్ అక్లాడ్స్ ..కు నామినేషన్ పంపాలని నిర్వాహకులు కోరారు.

మీకు తెలిసిన.. ఆయారంగాలలో రాణిస్తూ..సమాజం గుర్తించని మహిళలు (UNSUNG WOMAN) ఉంటే మాకు తెలియజేయండి.

www.ladylegends.org

nominations@ladylegends.org

అడవులకు ఆమే రక్ష!



మహిళలు అన్ని రంగాలలో తమ నైపుణ్యాన్ని రుజువు చేసుకుంటున్నారు. కాని కొన్ని రంగాల్లో ఇప్పటికీ మహిళా ఉద్యోగులు సంఖ్య తక్కువగా ఉంటుంది. అలాంటి రంగమే అటవీ సంరక్షణ విభాగం. అటవీ సంరక్షణ విభాగం అంటే పగలే కాదు రాత్రిపూట విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఇది సాధారణ విషయం కాదు. అలాంటి అటవీ సంరక్షణ విభాగంలో ఎంతో క్లిష్ల పరిస్థితులు ఉన్న చందనపు అడవుల పరిరక్షణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు ఇద్దరు ధీర వనితలు. వారే అథిరా పి.విజయన్, పి.ఎస్.శ్రీదేవి.

చందనపు చెట్లు ఎక్కువగా ఉన్న కేరళలోని మరయూర్ ప్రాంతంలో ఇద్దరు మహిళలు తమ శక్తియుక్తులతో స్మగ్లింగ్ జరగకుండా అడవులను సంరక్షిస్తున్నారు. 600 హెక్టార్ల భూమిలో ఈ చెట్లు ఉన్నాయి. వీటన్నింటిని స్మగ్లింగ్ చేసే గ్యాంగులు ఈ అడవి చుట్టూ చాలానే ఉన్నాయి. కాని అథిరా పి. విజయన్, పి.ఎస్.శ్రీదేవి బీట్ ఫారెస్ట్ ఆఫీసర్లుగా అక్కడ నియామకమవడంతో వారి ఆటలకు అడ్డుకట్ట వేసినట్లయింది. ఈ రాష్ట్రంలో ఈవిధమైన పదవిలో బాధ్యతలు చేపట్టిన మొట్టమొదటి మహిళలు అథిరా, శ్రీదేవి. వీరు ఇద్దరూ ఇంజనీరింగ్ చదువుకున్నారు. జనవరి ఒకటవ తేదీన కేరళ ప్రభుత్వం నియమించిన బిఎఫ్ఓ మహిళ బ్యాచ్‌లో నలభైమంది మహిళలను ఎంపిక చేశారు. కడుక్కత్తరా డివిజన్ పరిధిలో ఉన్న నచివాయల్ ఫారెస్ట్ స్టేషన్‌ని పగలు, రాత్రి సంరక్షించే బాధ్యత ఈ బ్యాచ్‌కి అప్పగించారు. ఈ విధి నిర్వహణ చాలా ప్రమాదాలతో కూడుకున్నదైనా ఏ ఒక్కరూ వెనుకంజ వేయలేదు. ఆ టీమ్‌లో వీరిద్దరూ ఉండడం చెప్పుకోవలసిన విషయం.

చలిలో, పొగమంచు రాత్రుల్లో, వాళ్లు పెట్రోలింగ్ చేయడం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం వేయక మానదు. వీళ్లు ఈ ప్రాంతంలో చేస్తున్న పెట్రోలింగ్ వల్ల అడవుల్లో జరిగే చట్టవ్యతిరేక కార్యకలాపాలు, వేటగాళ్లు జింకలను, లేళ్లను వేటాడటం తగ్గాయనే చెప్పాలి.

అథిరా, శ్రీదేవి ఫ్లాష్‌లైట్లు, బాటన్స్, వాకీటాకీస్ పట్టుకొని సాయంత్రం 6గంటల నుండి పెట్రోలింగ్ చేయడం మొదలుపెడతారు. వీళ్లు మర్నాటి ఉదయం ఆరుగంటల వరకు ఇలా తిరుగుతూనే ఉంటారు. రాత్రంతా వారిద్దరూ ఆత్మస్థైర్యంతో అడవిలోనే జీవితాన్ని గడపడం నిజంగా అభినందించవల్సిన విషయమే. సాధారణంగా మరయూర్ అడవినంతా పెట్రోలింగ్ చేయడానికి దాదాపు 200మంది బీట్ ఆఫీసర్లు కావలసి ఉంటుంది. కాని వీరిద్దరి మధ్య కుదిరిన అవగాహన వల్ల వారి నైపుణ్యం, తెలివితేటలతో తక్కువమందితోనే ఈ అడవిలో ఎటువంటి స్మగ్లింగ్ జరుగకుండా కాపలా కాస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు కూడా జరగకుండా నియంత్రించగలుగుతున్నారు. ''మేము ఇళ్లలోనే సురక్షితంగా లేనప్పుడు ఇటువంటి అడవుల్లో ఎలా ఉంటాము. ఎక్కడ ఉన్నామని కాదు, ఎంత ఆత్మవిశ్వాసంతో ముందుకు వెడుతున్నామనేదే ముఖ్యం. మేము ఇక్కడకు వచ్చాక మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇప్పుడు మేము ఇక్కడ ఎటువంటి ప్రమాదాలనైనా ఎదుర్కోగలమనే మనోధైర్యం మాలో పెరిగింది. సవాళ్లు, సాహసాలు లేకుండా గడిపే జీవితమూ ఒక జీవితమేనా'' అని అథిరా ఎంతో ఆత్మవిశ్వాసంతో అంటుంది. వీరి మనోధైర్యానికి హేట్సాఫ్ చెప్పాల్సిందే.

అక్కడ అంతా మహిళలే!

ఈనాటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ధైర్యంగా ముందుకు సాగుతూ విజయాలను సాధిస్తున్నారు. కేవలం వాళ్లు మాత్రమే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగకుండా చుట్టూ ఉన్న మహిళలను కూడా చైతన్యపరిచే కార్యక్రమాలను చేపడుతున్నారు. వాళ్లు ఎంతో ఐక్యతతో కలిసిమెలిసి పనిచేస్తున్నారు. ఎటువంటి హెచ్చుతగ్గులు, మనస్పర్థలు లేకుండా అందరూ ఐక్యతతో పనిచేస్తూ అందరి మన్ననలను అందుకుంటున్నారు. ఆ వివరాల సమగ్ర సమాచారం...

రాజస్థాన్‌లోని జైపూర్ గాంధీనగర్ స్టేషన్‌లో మొట్టమొదటిగా మొత్తం మహిళా ఉద్యోగులే పనిచేయడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఈ స్టేషన్‌లో 40మంది మహిళలు అన్ని విభాగాల్లో పనిచేస్తున్నారు. 2017సం.రైల్వేలో జరిగిన మార్పుల దృష్ట్యా రాజస్థాన్‌లో ఒక వినూత్న ప్రక్రియ జరిగింది. 2017లో ముంబయి ముతుంగా స్టేషన్‌లో అందరూ మహిళలనే ఉద్యోగాలలో నియమించారు. కాని అక్కడ పనిచేసేవారి సంఖ్య తక్కువే. ఆ తరువాత జైపూర్‌లోని గాంధీ నగర్‌లోని ఈ స్టేషన్‌లో మొత్తం 40మంది మహిళలు అన్ని విధులను నిర్వహిస్తున్నారు.



ట్రాక్‌లను సరిగ్గా వేయించడం, రూట్‌లను ట్రైన్‌లకు నిర్దేశించడం, టికెట్లను అమ్మడం, టికెట్లను తీసుకోవడం వంటి పనులనన్నింటిని మహిళలే చేస్తున్నారని జైపూర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌమ్య మాథుర్ చెప్పారు. టికెట్ కలెక్టర్ నుండి స్టేషన్ సూపరింటెండెంట్ వరకు మహిళలనే ఎంపిక చేయడం చరిత్రలో లిఖించవలసిన విషయమని ఆమె అన్నారు. ఎంక్వయిరీ కౌంటర్‌లో, స్టేషన్ మాస్టర్‌గా, పాయింట్స్ మాన్‌గా ప్రతిచోటా మహిళలే పనిచేస్తున్నారు.

జైపూర్ నుండి ఢిల్లీకి వెళ్లే లైన్ ఇది. రోజూ 25 ట్రైన్లు వస్తూపోతుంటాయి. పెద్దపెద్ద ట్రైన్లు అయిన పాలెస్ ఆన్ వీల్స్, మహారాజా ఎక్స్‌ప్రెస్ వంటి ట్రైన్లు కూడా ఇక్కడ ఆగుతాయి. హైస్పీడ్‌తో వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్, శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లే కాకుండా రోజూ 50 ట్రైన్లు ఈ స్టేషన్ నుంచే వెళుతుంటాయి. ప్రతిరోజూ ఈ స్టేషన్ నుంచి కనీసం 7000మంది పాసింజర్లు ప్రయాణిస్తుంటారు. ఈ స్టేషన్‌కి స్టేషన్ మాస్టర్‌గా యాంజెలా స్టెల్లా పనిచేస్తున్నారు. ఆమె ఇండియన్ రైల్వేస్‌లో ఈ పదవిలో బాధ్యతాయు తంగా పనిచేస్తూ ఒక సంవత్సరం పూర్తిచేసుకుంది. ''నేనెప్పుడు ఒక స్టేషన్‌ను సమర్థవంతంగా నడపగలనని ఊహించలేదు. అది కూడా నా కింద ఇంతమంది మహిళలు నియామకం అవుతారని, వారిచేత పనిచేయించాలని నేనెప్పు డూ అనుకోలేదు. కాని మేమందరం కలిసి పనిచేయడం చూస్తుంటే అప్పుడే ఒక సంవత్సరం అయిపోయిందా అని అనిపిస్తుంది. ఈస్టేషన్‌లో పనిచేసే వారందరికీ కావలసిన భద్రతా చర్యలు నేను జాగ్రత్తగా తీసుకుంటున్నాను'' అని స్టేషన్ మాస్టర్ యాంజెలా స్టెల్లా చెప్పారు.

కాని ఈ మార్పు ఊహించలేనిది. మహిళా స్టాఫ్‌కి టాయిలెట్లు త్వరలోనే పూర్తిచేస్తామని చెప్పారు. ఈ స్టేషన్‌లో సానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మెషీన్‌ని నాన్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్ అరుషి సంస్థ వాళ్లు స్పాన్సర్ చేశారు. రైల్వే రంగంలో ఇన్ని అవకాశాలున్నా ఇంకా మహిళలు ముందుకు ఎందుకు రావటం లేదన్నది ఆలోచించవలసిన అవసరం ఉందని, మహిళా టికెట్ కలెక్టర్‌లు తక్కువగానే ఉన్నారని మహిళలందరూ చైతన్యవంతమై ఈ రంగంలో ఉన్న ఉద్యోగావకాశాలను ఉపయోగించుకోవాలని ఆమె కోరుతున్నారు.

ఎప్పటికీ అమ్మ మాట తప్పలేదు



చిన్నప్పుడు మా అమ్మ నాకు ఓ మాట చెప్పింది. ఒకసారి ప్రామిస్ చేసి ఆ మాట తపి ్పతే యు ఆర్ నాట్ కాల్డ్ ఎ మ్యాన్ అని. ఎప్పటికీ ఆ మాట తప్పలేదు, మరిచి పోలేదు. నా జీవితంలోనే అతి పెద్ద ప్రామిస్ చేయాల్సిన రోజు ఒకటి వచ్చింది. పెద్దదే కాదు కష్టమైంది కూడా. భరత్ అనే నేను.... అంటూ ప్రమాణం చేస్తున్నారు సూపర్ స్టార్ మహేష్‌బాబు. మహేష్‌బాబు కథానాయక ుడిగా నటిస్తున్న చిత్రం భరత్ అనే నేను. ఈ చిత్రం ట్రైలర్ మంగళవారం విడుదల చేశారు. శ్రీమంతుడు చిత్రం తర్వాత మహేష్, కొరటాల శివ కలయికలో వస్తున్న సినిమా ఇది. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. కైరా అద్వానీ నాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరరచన చేస్తున్నారు. ఏప్రిల్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఇందులో మహేష్ ముఖ్యమంత్రి పాత్రలో నటిస్తున్నారు.

యంగ్ ఎన్టీఆర్ పాత్రలో శర్వానంద్!



మహానటుడు ఎన్టీఆర్ జీవిత చరిత్రను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని నందమూరి బాలకృష్ణ నటిస్తూ, నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇదే నెలలో షూటింగ్ ప్రారంభించే అవకాశాలున్నాయి. నేనే రాజు - నేనే మంత్రి సినిమాతో ఫామ్‌లోకి వచ్చిన తేజ ఈ చిత్రానికి దర్శకుడు. టైటిల్ పాత్రలో బాలకృష్ణ నటిస్తారని స్పష్టమైంది. ఇతర పాత్రధారులు ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. అయితే యంగ్ ఎన్టీఆర్ పాత్రలో శర్వానంద్ నటిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఎన్టీఆర్ యువకునిగా ఉన్నప్పటి సన్నివేశాలను శర్వానంద్‌పై చిత్రీకరిస్తారని సమాచారం. అయితే దీనిపై ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటనరాలేదు.

ఎన్టీఆర్ బయోపిక్ చిత్రాన్ని బాలకృష్ణతో కలిసి వారాహి సంస్థ నిర్మిస్తోంది. సాంకేతిక నిపుణుల వివరాలు కూడా తెలియాల్సి ఉంది.

శర్వానంద్ కొత్త సినిమా పడి పడి లేచే మనసు

వరుస విజయాలు సాధిస్తున్న శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన కొత్త చిత్రం ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి పడి పడి లేచే మనసు అనే టైటిల్ నిర్ణయించారు. శ్రీ లక్ష్మి వెంకటేశ్వరా సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇదే చిత్రం సెట్లో శర్వానంద్ బర్త్‌డే జరిగింది. ప్రత్యేకంగా తయారు చేసిన కేక్‌ను కట్ చేశారు. పడి పడి లేచే మనసు షూటింగ్ కలకత్తాలో జరుగుతోంది. శర్వానంద్, సాయిపల్లవి, మురళీశర్మ కాంబి నేషన్‌లో సన్నివేశాల చిత్రీకరణ జరుగు తోందని నిర్మాతలు తెలిపారు.

అనుబంధం, తపనే కణం చిత్రకథ



ఛలో హీరో నాగశౌర్య, ఫిదా హీరోయిన్ సాయిపల్లవి కలిసి నటించిన చిత్రం కణం. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి విజయ్ దర్శకుడు. కణం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో బివిఎస్ఎన్. ప్రసాద్, జెమిని కిరణ్, శానం నాగఅశోక్‌కుమార్‌తో పాటుగా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. కణం ఆడియో సీడీలను నిర్మాత బివిఎస్ఎన్. ప్రసాద్ విడుదల చేశారు. తొలి సీడీని సాయిపల్లవికి అందజేశారు.

చిత్ర దర్శకుడు విజయ్ మాట్లాడుతూ మంచి సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. తమిళ కరు సినిమాను తెలుగులో కణం పేరుతో విడుదల చేస్తున్నాం. ఇది ద్విభాషా చిత్రం. ఎన్.వి.ప్రసాద్‌గారు ఈ సినిమాను విడుదల చేయడానికి ముందుకువచ్చారు. సాయిపల్లవి, వెరోనికా, నాగశౌర్య అద్భుతంగా నటించారు అని చెప్పారు.

సాయిపల్లవి మాట్లాడుతూ తల్లికి, బిడ్డకు ఉన్న అనుబంధం తపనే ఈ సినిమా కథ. ఈ సినిమాకు మంచి ఎమోషనల్‌గా కనెక్ట్ అయి చేశాను. ఈ సినిమా ద్వారా వెరోనికాతో మంచి అనుబంధం ఏర్పడింది. సినిమాను చూసిన ప్రేక్షకులు ఆనందంగా, మంచి ఫీలింగ్‌తో ఇంటికి వెళ్ళే విధంగా దర్శకుడు మలిచారు. కథను నమ్మి నిర్మించిన లైకా సంస్థకు థాంక్స్ అని చెప్పారు. ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ రజనీకాంత్ 2.0 చిత్రానికి కెమెరా విజువల్స్ అందించిన నిరవ్‌షా గారు ఈ సినిమాను గొప్పగా పిక్చరైజ్ చేశారు. వెరోనికా అనే చిన్న పాప అద్భుతమైన పాత్రలో నటించింది. దర్శకుడు ఓ మంచి ఉద్దేశంతో సినిమా తీశారు. ఈ సినిమా కేవలం 37 రోజుల్లో పూర్తికావడం విశేషం అన్నారు.

కిరాక్ పార్టీలో ఛాలెంజింగ్ పాత్ర

- నిఖిల్

స్వామిరారా, కార్తికేయ, సూర్య వర్సెస్ సూర్య, కేశవ వంటి చిత్రాలతో ఎనలేని గుర్తింపును సంపాదించుకున్న హీరో నిఖిల్ తాజాగా నటించిన చిత్రం కిరాక్ పార్టీ. సంయుక్త హెగ్డే, సిమ్రన్ పరీన్జ హీరోయిన్లు. శరన్ కొప్పిశెట్టి దర్శకుడు. ఏటీవీ సమర్పణలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని పాత్రికేయులతో నిఖిల్ కొద్దిసేపు ముచ్చటించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం టీజర్, పాటలకు విశేష స్పందన లభిస్తోంది. కాలేజ్ క్యాంపస్ డ్రామాగా వస్తోంది. హ్యాపీడేస్ తరహా మరో భారీ విజయాన్ని అందుకుంటుంది.



కిరాక్ పార్టీ కథాకమామీషు ఏంటి?

మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో చేరిన ఒక సాదాసీదా కుర్రాడు చివరి ఏడాదికి వచ్చేటప్పటికి విద్యార్థి నాయకుడు ఎలా అయ్యాడు? ఈ మధ్యలో...ఆ తర్వాత అతని ప్రయాణం ఎలా సాగిందన్న అంశం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

ఇంజనీరింగ్ విద్య అంటే చాలా సాధారణమైపోయిన ఈ రోజుల్లో నిరుద్యోగ సమస్య ఎలా ఉంది. దాంతో పాటే ఒక అమ్మాయి గురించి చేసే చెడు కామెంట్స్ భవిష్యత్‌లో ఆమెపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయి వంటి అంశాలను ఇందులో చూపడం జరిగింది.

మీ పాత్ర ఎలా ఉంటుంది?

ఇందులో కృష్ణ అనే కాలేజీ విద్యార్థిగా నటించాను. ఆ తర్వాత విద్యార్థి నాయకుడిగా ఎలా మారాడన్నది చిత్రం చూసి తెలుసుకోవాల్సిందే. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలన్నింటిలోకి ఛాలెంజింగ్ పాత్ర. కామెడీ, ఎమోషన్స్‌కు అత్యంత ప్రాధాన్యం ఉండే పాత్ర. వాస్తవానికి ఈ రెండు అంశాలను పండించడం అంత తేలికైన విషయం కాదు. మిగిలిన అంశాలతో పోల్చుకుంటే కామెడీ మోతాదు ఎక్కువగా ఉంటుంది. అందుకే కామెడీ టైమింగ్‌ను పాటిస్తూ, ఎమోషన్స్‌కు తగ్గ హావభావాలను ప్రదర్శిస్తూ పాత్రలో ఇమిడిపోవడం నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. హ్యాపీడేస్ తర్వాత నేను చేసిన పూర్తిస్థాయి కాలేజీ నేపథ్య కథాచిత్రమిది. ఇంకా చెప్పాలంటే...నాకిది ప్రత్యేక సినిమాగా భావిస్తున్నాను. ఇక కెరీర్ పరంగా కూడా నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమవుతుందన్న నమ్మకం ఉంది.

కన్నడ మాతృకకు, ఈ తెలుగు రీమేక్‌కు ఏవైనా మార్పులు చేశారా?

పెద్దగా మార్పులేవీ లేవు. కాకపోతే కన్నడ వెర్షన్ నిడివి టైమింగ్ మూడు గంటలు ఉంటే...తెలుగులో రెండు గంటల 25 నిమిషాలు ఉంటుంది. మనకు అవసరం లేని కొన్ని కామెడీ సీన్లు, ఐటమ్ సాంగ్స్‌ను తొలగించాం. మరో విశేషం ఏమిటంటే...దర్శకుడు సుధీర్‌వర్మ ఈ సినిమాకు అందించిన స్క్రీన్‌ప్లేని ఓ హైలైట్ కాగా...చందూ మొండేటి సంభాషణలు మరో హైలైట్ అవుతాయి. వాళ్లిద్దరూ నాకు, శరన్ కొప్పిశెట్టికి మంచి మిత్రులు. బాగా సపోర్ట్ చేశారు. ఒకవైపు వాళ్ల సినిమాలతో బిజీగా ఉంటూనే మా సినిమాకు కూడా టైమ్ కేటాయించడం నిజంగా గొప్ప విషయం.

సినిమా విడుదలకు సమీపించడంతో ఏదైనా కంగారు పడుతున్నారా?

ఇది నా 15వ సినిమా. నేను నటించిన ప్రతీ సినిమా విడుదల దగ్గరపడే కొద్దీ సహజంగానే నాలో కొంత కంగారు మొదలవుతుంది. ప్రతి సినిమా విడుదల నాకు మొదటి సినిమా విడుదలలానే ఉంటుంది.

దర్శకత్వంలో మీ నిర్మాత జోక్యం చేసుకున్నారన్న వార్తలొచ్చాయి...?

అలాంటిదేమీ లేదు. నాకు తెలిసినంతవరకు సినిమా కొబ్బరికాయ కొట్టిన మొదటిరోజు, ఆ తర్వాత మధ్యలో ఒకసారి మాత్రమే మా నిర్మాత సెట్స్‌కు వచ్చారు. ఆయనకు, దర్శకుడికి మధ్య విబేధాలు వచ్చాయన్నది వదంతులే తప్ప నిజం కాదు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సినిమాను సమష్టిగా, ఆహ్లాదభరితంగా పూర్తిచేసుకున్నాం అంటూ ముగించారు.



అలా చెప్పడం అబద్ధమే అవుతుంది

కేవలం కథ నచ్చి సినిమాలు చేస్తున్నానని చెప్పడం అబద్ధమే అవుతుంది, కాంబినేషన్, నిర్మాణ సంస్థ ఇవన్నీ చూసుకుంటాం అని చెబుతోంది పంజాబీ భామ రకుల్ ప్రీత్‌సింగ్. నిన్న మొన్నటి దాకా ఈ సుందరి తెలుగు తెరపై అగ్ర నాయికగా వెలిగింది. తన నట ప్రయాణంలో అద్భుతమైన దశను చూసింది. వరుసగా అగ్ర కథానాయకులతో నటించే అవకాశాలు దక్కాయి. వీటిలో ఆమె కలల కథానాయకులూ ఉన్నారు. ఈ నేపథ్యంలో విరామం లేకుండా నాలుగేళ్లు గడిచాయి. ప్రస్తుతం తెలుగులో అవకాశాలూ తగ్గిపోయాయి. అయితే తమిళం, బాలీవుడ్‌లో మాత్రం ఆమె గాలి వీస్తూనే ఉంది. తమిళంలో కార్తీతో మరో కొత్త చిత్రాన్ని, సూర్య, శివ కార్తికేయన్‌లతో సినిమాలు చేస్తోంది. ఇక హిందీలో ఆమె నటించిన అయ్యారే మంచి విజయాన్ని అందుకుంది. ఇంతలోనే అజయ్ దేవగణ్‌తో మరో చిత్రంలో ఎంపికైంది.

ఇలా తమిళం, హిందీలో రకుల్ జోరు తగ్గలేదు. అయితే తనకు బాగా పేరు తీసుకొచ్చిన టాలీవుడ్‌లో సినిమాలు తగ్గడమే ఈ భామకు మింగుడుపడటం లేదు. అయితే ఈ పరిస్థితిని ముందే ఊహించానని చెబుతోంది రకుల్. ఎన్ని చిత్రాలు చేసిన...అవకాశాలు లేని రోజు రానే వస్తుందని తెలుసని అంటోంది. రకుల్ మాట్లాడుతూ....తెలుగులో అగ్ర కథానాయకుల సరసన వరుస సినిమాలు దక్కుతున్న సమయంలో హిందీలోనూ అవకాశాలు వచ్చాయి. ప్రాంతీయ భాషల్లో ఎన్నేళ్లు నటించినా...మళ్లీ బాలీవుడ్ చేరే రోజు వస్తుందని ముందే ఊహించాను. అనుకున్నట్లే ఇప్పుడు హిందీ చిత్రాలు చేస్తున్నాను. కేవలం కథ నచ్చి సినిమాలు చేస్తున్నానని చెప్పడం అబద్ధమే అవుతుంది. కాంబినేషన్, నిర్మాణ సంస్థ ఇవన్నీ చూసుకుంటాం. అని చెప్పింది.

చర్చల్లో పురోగతి... ముగింపు దిశగా బంద్!

☆ ఐదు రోజులుగా తెరుచుకోని థియేటర్లు

☆ దిగివచ్చిన డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు ☆ శుక్రవారం నుండి బంద్ విరమణ

రెండు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న సినీ థియేటర్ల బంద్ ముగింపు చర్చల్లో పురోగతి కనిపిస్తోంది. డిజిటల్ ప్రొవైడర్‌ల అధిక ఛార్జీలకు వ్యతిరేకంగా ఈ నెల 2 నుంచి జరుగుతున్న బంద్‌కు దక్షిణాది ఇతర రాష్ట్రాలు కూడా తమ మద్దతును ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు చిత్ర పరిశ్రమ తరపున ఏర్పాటైన జాయింట్ యాక్షన్ కమిటీ ఎప్పటికప్పుడు డిజిటల్ ప్రొవైడర్లతో చర్చలు జరుపుతూనే ఉంది. 25 శాతం ఛార్జీలను తగ్గించమంటూ నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు డిమాండ్ చేస్తుండగా...16 శాతం ఛార్జీలను మాత్రమే తగ్గించగలమంటూ ప్రొవైడర్లు భీష్మించుకోవడంతో చర్చలలో ప్రతిష్టంభన నెలకొంది. అయితే మంగళవారం జరిగిన చర్చల్లో పురోగతి కనిపించిందని, దాదాపు 20 శాతం తగ్గించేందుకు ప్రొవైడర్లు దిగివచ్చారని, మధ్యేమార్గంగా దానికి జె.ఎ.సి. కూడా అంగీకరించిందని అంటున్నారు.

ఆ మేరకు అగ్రిమెంట్ ప్రక్రియ జరుగుతున్నట్లు, అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. శుక్రవారం లోపే బంద్ ముగియవచ్చునని, శుక్రవారం విడుదల కాబోయే సినిమాలకు ఆటంకం ఉండకపోవచ్చునని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. తాను నిర్మించిన ఏ మంత్రం వేసావె చిత్రం శుక్రవారం విడుదలకానున్న నేపథ్యంలో ఆలోపే బంద్ ముగుస్తుందన్న అభిప్రాయాన్ని నిర్మాత మల్కాపురం శివకుమార్ వ్యక్తంచేశారు.

అనగనగా ఒక ఊళ్ళో పాటలు

అశోక్‌కుమార్, ప్రియాంక శర్మ జంటగా నటిస్తున్న చిత్రం అనగనగా ఒక ఊళ్లో. పల్లెటూరికి వినోద యాత్ర అనేది ఉప శీర్షిక. చంద్రబాలాజీ ఫిలిమ్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి సాయికృష్ణకె.వి. దర్శకుడు. కె.చంద్రరావు నిర్మాత. ఈ చిత్రం పాటలను హీరో శ్రీకాంత్ ఇటీవల విడుదల చేశారు. థియేట్రికల్ ట్రైలర్‌లను మరో నటుడు నవీన్ చంద్ర ఆవిష్కరించారు.



అశోక్‌కుమార్, ప్రియాంక శర్మ

సినిమా టైటిల్ బావుందంటూ శ్రీకాంత్ ప్రశంసించారు. ఈ చిత్రం పాటలు బావుంటాయని నమ్ముతున్నాను.. సినిమా విజయం సాధించి అందరికీ మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

నటుడు సుమన్ మాట్లాడుతూ రాజమౌళి గారి శిష్యుడు సాయి మంచి దర్శకుడు. సినిమా బాగా తీశాడు. ఓ మంచి పాత్రని నేను ధరించాను. కేవలం విలేజ్ వారినే కాకుండా అందరికీ నచ్చే చిత్రం అవుతుందని అన్నారు.

నిర్మాత చంద్రరావు మాట్లాడుతూ మా సినిమాకు మంచి ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ కుదిరారు. చిత్రీకరణ రాజోలు ప్రాంతాల్లో జరిగింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ చిత్ర నిర్మాతలకు కథ నచ్చడంతో ఈ చిత్రం తెరకెక్కింది. నలభై రోజుల్లో చిత్రీకరణ జరిపాం. సినిమా బాగా వచ్చింది. పాటలను మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో నిర్మాత కె.చంద్రరావు, బాలాజీ, శ్రీతేజ్, మనోజ్, బెనర్జీ, సంగీత దర్శకుడు యాజమాన్య, దేవిప్రసాద్, హేమ, రచయిత రాంబాబు, హీరో హీరోయిన్లు, గాయకులు పాల్గొన్నారు.

ఏ మంత్రం వేసావె

అలరిస్తుంది...ఆలోచింపజేస్తుంది



- మల్కాపురం శివకుమార్

ఏ మంత్రం వేసావె చిత్రంలో హీరోగా నటించిన విజయ్ దేవరకొండ పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది. నేటి యువత అందరూ అతని పాత్రలో తమను తాము చూసుకుంటారు అని నిర్మాత మల్కాపురం శివకుమార్ వెల్లడించారు. విజయ్ దేవరకొండ, శివానీసింగ్ నాయకానాయికలుగా గోలీసోడా ఫిల్మ్ పతాకంపై సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా సంస్థ అధినేత మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని పాత్రికేయులతో మల్కాపురం శివకుమార్ ఈ చిత్రం గురించి కొద్దిసేపు ముచ్చటించారు. ఆ వివరాలేమిటో ఆయన మాటల్లో...

ఏ మంత్రం వేసావె చిత్ర కథ, కథనాల్లోని కొత్తదనం ప్రతీ ఒక్కరినీ మెప్పిస్తుంది. ఈ తరం మనోభావాల్ని ప్రతిబింబించే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. థ్రిల్లర్ అంశాల సమ్మేళనంతో ఆద్యంతం ఆసక్తిదాయకంగా ఉంటుంది. ప్రతి యువకుడికి ఏదో ఒక బలహీనత ఉంటుంది. ఈ సినిమాలోని కథానాయకుడికి కంప్యూటర్ గేమ్స్ అంటే చాలా ఇష్టం. ఆ గేమింగ్‌ను సర్వస్వంగా బతుకుతున్న అతనికి ఆన్‌లైన్‌లో ఓ అమ్మాయి పరిచయమవుతుంది. ఒక మాయా ప్రపంచంలో జీవిస్తున్న అతనికి మానవీయ విలువలు ఏమిటో పరిచయం చేస్తుంది. ప్రేమతో అతని జీవితాన్ని తీర్చిదిద్దుతుంది. ఈ క్రమంలో చోటుచేసుకునే ఆసక్తికరమైన సంఘటనలతో సాగే చిత్రమిది. రొమాంటిక్ థ్రిల్లర్‌గాఅందరినీ ఆలోచింపజేస్తుంది. ఇందులో విజయ్ దేవరకొండ పాత్ర భిన్న కోణాల్లో...నవ్య పంథాలో సాగుతుంది. పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి చిత్రాలతో విజయ్ తనకంటూ ఓ ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్నారు. ఈ చిత్రంలోని అతని పాత్రకు యూత్ బాగా కనెక్ట్ అవుతారు. అయితే అర్జున్‌రెడ్డి లాంటి సంచలన విజయం తర్వాత అతను నటించిన ఈ చిత్రంపై అదే స్థాయి అంచనాలు పెట్టుకోవడం కరెక్ట్ కాదు. ప్రస్తుతం మా సంస్థలో మూడు చిత్రాలు ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్నాయి. ద్రోణ ఫేమ్ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా, రవిచంద్ర దర్శకత్వంలో ఓ వినూత్న కథాచిత్రాన్ని తీయబోతున్నాం. ఇక తెలుగు, తమిళ, హిందీ భాషలలో హీరోయిన్ ఓరియెంటెడ్ కథాంశంతో వేరొక చిత్రాన్ని నిర్మించబోతున్నాం. ఇతర వ్యాపారాలు ఎన్ని ఉన్నా సినిమాను అమితంగా ప్రేమిస్తాను. అలాగే రాజకీయ రంగంలో సమర్థులైన కేసీఆర్‌గారి అడుగుజాడల్లో మేమంతా నడుస్తున్నాం అని చెప్పారు.